UNIVERSAL
LIBRARY
OU_206259
UNIVERSAL
LIBRARY

శ్రీరస్తు.

శ్రీ జగన్నాథాయ నమః.

# శ్రీమహాభక్తవిజయము

ప్రథమకథ

# జయదేవుల చరిత్రము.

గద్యపద్యకావ్యము.

ఇయ్యది

శ్రీ గ్రంధి - రామలింగస్వాములవారిచే

రచియింపఁబడినది.

నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాలెము జమీన్దారు
కోటింరెడ్డి పట్టాభిరామిరెడ్డిగారి ధర్మపత్నియును
సదరు గ్రంథకర్తగారి ప్రియశిష్యురాలును యగు
శ్రీమతి సీతమ్మగారి ద్రవ్యసహాయముచే

చెన్నపురి:
పరికర్ డైమండు ముద్రాక్షరశాలయందు
ముద్రింపఁబడినది.

1926.

Registered Copy-Right.

T
234.5
RL16J

Price Re. 1.

ఇతరులమందులను మా మందులగుణమును నొకసారి పరీక్షింపఁగోరుదుము.

మా యౌషధములు అనేక సిద్ధమూలికారాజములచేతను, పరిశుద్ధమైన లోహరాజ భస్మసిందూరములచేతను, విలువకలిగిన వస్తువులచేతను చేయఁబడి లోకోపకారార్థము స్వల్పక్రయమునకు విక్రయింపఁబడుచు నుపయోగించు జనసమూహమునకు వుపకారవాదము లయి యుండి అనేకయోగ్యతాపత్రికలును, సన్మానములును బడసి లోకప్రసిద్ధి కెంగి యున్నవి.

# (1) దృఢ ధాతు కరణి.

ఇది దేహమునందలి సడలిన నరములకు సమబలము నిచ్చి సంభోగశక్తిని పుట్టించి సత్పుత్రుని బడయఁజేయు శక్తిని కలిగించునది.

ఈ సిద్ధరసాయనయౌషధము; నీరుగా నుండు వీర్యమును ఘట్టిపఱచును. రతియందు శీఘ్రముగా వచ్చు వీర్యస్ఖలనమును, స్వప్నమునందు పోవు శుక్లమును నిలుపును మూత్రము నందు తెలియక స్వల్పముగా పోవు వీర్యమును నిలిపి అందువలన కలుగు బలహీనతను, ఇంద్రియమునందు కలిగిన సమస్తరోగములను పోఁగొట్టును. సకలమేహసుఖరోగములు, నపుంసకత్వము, శరీరమునందు బలము లేక కలుగు సోమరితనము, చేతులు కాళ్లు నడుము మొదలగు దేహనొప్పులను నిశ్శేషముగా ఖండించును పైదుర్గుణములు స్త్రీల కుండినను పోఁగొట్టునదిం గాక, పుట్టినబిడ్డలు జీవించకపోవడమును, గొడ్డురాలితనమును, ఋతుదోషమును మొదలైనవి పోఁగొట్టును అన్నకోశమునకు బలమును కలిగించి మిక్కిలి జీర్ణశక్తిని కలిగించును. మంచిబలమును జ్ఞాపకశక్తిని కావలసిన పురుషులును, బాలురును, బాలికలును మొదలగువారు దీనిని సేవించిన మంచి శరీరసౌందర్యమును ఆయురారోగ్యములును పొందవచ్చును. ఈ రసాయనలేహ్యము మంచిసువాసన కలిగి భుజించుటకు మధురముగా నుండునది గాక దీనిగుణము 4-5 దినములలో తెలియును దీనికి దేశకాలభేదమును పథ్యమును లేదు దీనిని అందఱు ప్రకటించియుండు లేహ్యములవలె కెంచక సిద్ధయౌషధ మని గ్రహింపవలయును వారివారి దేహప్రమాణ బలాబలమును అనుసరించి 1-2-3 డబ్బిలవంగు వఱకు సేవించి పూర్ణబలమును మంచి వీర్యవృద్ధిని శాశ్వతసుఖానందమును పొందవచ్చును.

20 తులములు గల డబ్బి 1-కి క్రయము రు. 2-8-0.

వలయువారు, దీనితోడ $\frac{1}{2}$ తులము మకరధ్వజము గాని, పరకతులము పూర్ణచంద్రోదయము, వసంతకుసుమాకరము గాని, ఒకతులము స్వచ్ఛమైన కాంతసిందూరము, అభ్రకసిందూరము గాని కలిపి సేవించిన స్త్రీలపాలిటి మన్మథునివలె దేహకాంతి గలిగి అనేక స్త్రీలతో రమింపఁజేయుశక్తి కలుగును. మఱియు వృద్ధుఁడును, నపుంసకుఁడును, కామోద్రేకము గలవార లగుదురు

ఇదిఁగాక, అన్ని వ్యాధులకుఁ దగిన అత్యద్భుత ఆయుర్వేద దివ్యౌషధములును దొరకును. వలయువారు క్రిందివిలాసమునకు వ్రాసి పొందవచ్చును.—


## శ్రీ రామకృష్ణ నిలయము.

16. ఏగప్పనాయకర్ వీథి, చాకలపేట పోష్టు, మదరాసు

# విషయసూచిక.


| విషయసంఖ్య. | పుటసంఖ్య. |
| --- | --- |
| 1. విజ్ఞప్తి. | |
| 2. గ్రంథసమర్పణము. | |
| 3. విజ్ఞాపనము. | 1 |
| 4. పీఠిక. | 2 |
| 5, ధ్యానశ్లోకములు. | 4 |
| 6. అవతారిక. | 8 |
| 7. గ్రంథవివరణము. | 15 |
| 8. పండరీపురమాహాత్మ్యము. | 17 |
| 9. పుండరీకభక్తునిచరిత్రము. | 18 |
| 10. కాంతాబాయికథ. | 25 |
| 11. మొదటిఅధ్యాయము. | 30 |
| 12. జయదేవులచరిత్రము. | ,, |
| 13. గోవ్యాఘ్రసంవాదము. | 35 |
| 14. రెండవఅధ్యాయము. | 40 |
| 15. జయదేవులు విరక్తి నొందుట. | ,, |
| 16. శ్రీగీతాగోవిందాష్టపదులు. | 41 |
| 17. శ్రీభగవద్దశావతారవర్ణనము. | 43 |
| 18. మూడవఅధ్యాయము. | 53 |
| 19. చోరులు జయదేవుల కాలుసేతులను ఖండించుట | ,, |
| 20. జగన్నాథాష్టకము. | 61 |
| 21. నాలుగవఅధ్యాయము. | 64 |
| 22. జయదేవులు క్రౌంచదేశంబున కరుగుట. | ,, |
| 23. శివతాండవము. | 65 |

| | | |
|---|---|---|
| 24. | ఐదవయధ్యాయము. | 74 |
| 25. | పద్మావతి జయదేవులను దర్శించుట. | ,, |
| 26. | ఆఱవయధ్యాయము. | 80 |
| 27. | జయదేవులు చోరులకు శివపదం బిప్పించుట | ,, |
| 28. | చోరులు పాతాళంబున గ్రుంగుట. | 85 |
| 29 | శివాష్టకము. | 88 |
| 30. | ఏడవయధ్యాయము. | 93 |
| 31. | పద్మావతి మరణించుట. | , |
| 32. | ఎనిమిదవయధ్యాయము. | 100 |
| 33. | జయదేవులు పద్మావతిని బ్రతికించుట. | ,, |
| 34 | జగన్నాథుని స్తుతించుట. | 103 |
| 35. | అష్టపదీతరంగములు. | 105 |
| 36. | తొమ్మిదవయధ్యాయము. | 125 |
| 37. | జయదేవులు పాడిన నూతనభాగవతంబును భగవంతుఁడు బ్రాహ్మణరూపంబున వచ్చి సంతకంబు జేయుట. | ,, |
| 38. | పదియవఅధ్యాయము. | 134 |
| 39. | శ్రీ జయదేవులు పాడిన అష్టపదులను గంగలో విడిచి పరీక్షించుట. | ,, |
| 40. | పదునొకండవయధ్యాయము. | 142 |
| 41. | క్రౌంచరాజుకు జయదేవులు బ్రహ్మోపదేశంబు జేయుట. | ,, |



గ్రంధి - రామలింగస్వాములు.

# వి జ్ఞ ప్తి.

మహాశయులారా ?

గురునాజ్ఞ సర్వజనంబుల కలంఘనీయముగదా ? నాకు ప్రప్రథమమున త్రిపురసుందరీ మహా మంత్రము నుపదేశించి నన్నుద్ధరించిన ప్రాథమిక గురువర్యుండు రత్నదీక్షితులు. వేదాంత శాస్త్రార్థబోధితు లగు ద్వితీయ గురుకుంజరులు బెంగుళూరు బోధనాథస్వాములవారు. తత్త్వమసీత్యాది మహావాక్య తత్పద లక్ష్యార్థబోధితు లగు తృతీయ దేశికుండు తిరుమలరాయని పట్టణమున సాక్షాత్కరించిన అతి వర్ణాశ్రమ నిరతులు శ్రీ రోట్ స్వాములు. వానప్రస్థాశ్రమంబున నుండ నియమించి పరిపూర్ణాచల పరతత్త్వ మౌన వ్యాఖ్యానోపదేశికులై తనరిన చతుర్థ గురుండు కంచి నిశ్చల రామానందస్వాములవారు.

నేతద్గురు నాజ్ఞానువర్తనుండనై (25-2-1917) తారీఖున నెల్లూరు పట్టణంబునకు 50 మైళ్ల దూరమున పశ్చిమ దిక్కున మహారణ్యంబున కణ్వానదీ తీరంబున కణ్వమహాముని యాశ్రమంబొండు గలదు. తత్ప్రాంతమున మహోన్నతం బగు గుహలచే నొప్పుచున్న పెనుశిల కోనయందలి యాలయంబునందవతరించిన సర్వజనాభీష్టప్రదుం డగు శ్రీ లక్ష్మీనృసింహస్వామి యందు నెలకొన్న భక్తిచే శుష్కాహారుండనై తత్సాన్నిధ్యంబున వానప్రస్థాశ్రమవిధుల నిర్వర్తింపుచు తపంబాచరింపుచుండ కొంతకాలమునకు తత్తపః ప్రభావంబున యదృచ్ఛాప్రకారంబున దివ్యవాణి నా జిహ్వాగ్రమున నావిర్భవించె. నవ్విషయంబును మచ్చతుర్థ గురునకు విన్నవింప వారు తనంతట నుద్భవించిన వాణిని లోకోపకారార్థ మొనర్పు మని యాజ్ఞాపించిరి. తదాజ్ఞానుసారంబున భక్తిరసప్రధానం బగు షడ్చక్రవిజయం బను నీ గ్రంథంబును రచించి యచ్చొత్తింప నూహింపుచున్న సమయంబున నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెము జమీన్‌దారు. మ-రా-రా-శ్రీ కోట రెడ్డి పట్టాభిరామిరెడ్డిగారి ప్రియపత్ని యగు శ్రీమతి సీతమ్మగారు నను గాంచి యేతద్గ్రంథమును చదివిచూచి ముద్రించుట కగు ద్రవ్యమును నే నొసంగెద నని వాగ్దానముచేసెను. పిమ్మట ఆమె ద్రవ్యసహాయమును

నని యీ జయదేవచరిత్రంబు సచ్చిత్రించి ప్రచురింపబడినది. ఉదార గుణకలాపయగు శ్రీమతి సీతమ్మగారికి అస్మన్మిత్రులు స్తుతించిన విధము.

సీ. పంటకాపుల కులోద్భవుండునై ధర్మజీ
వనుడునై సుజనపోషణుడు నైన
దొడ్లవంశాంబోధి మహిమాంశుమాలియై
పరగె సత్కీర్తి భూభాగమునను
ప్రియుడు వెంకట్రామిరెడ్డి తృతీయ సత్
పుత్రరత్నంబన భువిని వెలసి
ధన్యతముండు భూధన సమృద్ధియుతుండు
ప్రముఖుడు పట్టాభి రామిరెడ్డి

గీ. అతని వరధర్మపత్ని సీతమ్మ యనగ
సుగుణమహిమయా రాశియై సుభగచరిత
యై పతివ్రతయై సదాహర్షచిత్త
యై విదీన దయామతియై చెలంగు. 1

సీ. అన్నదానము జేయునట్టి ప్రతిభయందు
నన్నపూర్ణకు నుద్దియై తనరు
సాపత్కరంబుచే పెంపొంది సచ్ఛాంత
గుణయుక్తి లక్ష్మియగుచు సతంబు
సుజ్ఞానమున భారతీ జ్ఞానమున నల
భారతీ సామ్యయై వరలుచుండు
పతిభక్తి ధవునడ బాయక సామేన
దనరి పార్వతికి యీడన నెసంగు

గీ. సమ్మహాసాధ్వి పరతత్త్వ మరయు పొంకె
గ్రంధి వంశపయోరాశి చంద్రు డగుచు
తనరు శ్రీరామలింగస్వామిని తదీయ
పరమ పరతత్త్వగురునిగా నెఱిగి భక్తి
నమ్రయై శిష్యురాలునై నయమెసంగు. 2

తే. శీలమును ధర్మవృత్తియు శిష్టరక్ష
ణంబు గురుదైవభక్తి భావ్యంబు తనక
టంగు దలపోసి తాజరియించు నితఁ
డూర్గ మరసి సువిజ్ఞానమూర్తి యనఁగ. 3

కం. తన గురుఁడు రచించినదై
చను షడ్భక్తవిజయమున జయదేవ చరి
త్రను నచ్చొత్తించుటకై
ధనసాయము జేసి కీర్తి ధనమై గొప్పెఁ. 4

కం. ఆసతి కీర్తిజగంబుల
భాసిల్లెడు గాత యుఁబలె పడతులు భువిలో
వాసియగు పుణ్యకర్మవి
భాసితలయ్యెదరు గాత భవముక్తలునై. 5

## గ్రంథసమర్పణము.

సీ. ఒప్పారు శేషాద్రి కుత్తరదిక్కున
ముప్పదిక్రోసులు పొసఁగుదూరఁ
మునను నెల్లూరు పత్తనమునకునుపశ్చి
మాశ నిర్వది మైదుక్రోసులందు
సకలదేవర్షి రాజర్షిబ్రహ్మర్ష్యాశ్ర
మాళి శిష్యాళి వేదాధ్యయనము
లెసగు మనోహరంబ సదృశపరమపా
వనము తపోవనం బనగ నదియు

గీ. శారికా కీర పిక కేకి సారసఖగ
కులకలకలస్వనాళి సంకులముగాన
నందు కణ్వానదీతీరమందు మహిత
కణ్వమునియాశ్రమంబు ప్రకాశిందనరు. 6

ఉ. తన్మహాదాశ్రమావని బుధప్రకరంబులు భక్తకోటులున్
నెన్మునివర్యులు న్నతుల సల్పుచు గొల్వవరప్రదుండునై
చిన్మయతేజుడై భువనసేవ్యపదాబ్జలతాంతుడై జగ
జ్జన్మలయస్థితిత్రయ విశారదుడై సురవైరి హర్తయు
ద్యన్మహిమన్ రమాకలితుడై దగు పెన్ శిలకోనయందునన్. 7

షష్ఠ్యంతములు.

క. అలలక్ష్మీ నరసింహున
కలఘుమతికి భూతరక్షణాత్మునకు దహాన్
కలిసంఘున కహితహునకు
విలసిత పరమాత్మునకును విశ్వాత్మునకున్. 8

క. నవరసముల భక్తిరసం
బప్రాధాన్యంబు నద్ది యలరెడు షడ్భ
క్తవిజయము మద్విరచితం
బవుటను నర్పణముసేతు నంచితభక్తిన్. 9

ఇట్లు, షడ్భక్తవిజయ ప్రబంధప్రణేత,

గ్రంది, రామలింగస్వామి.

ముత్యాలుపేట, కంచి

చెంగల్పట్టు జిల్లా

శ్రీ ర స్తు.

శ్రీజగన్నాథాయ నమః.

---

# వి జ్ఞా ప న ము.

సజ్జనసోదరులారా! భరతఖండంబున సర్వభాషలయందును భక్తిసామ్రాజ్యంబు మించి భక్తిమార్గమును బోధించు గ్రంథంబులు పెంపొంది గ్రంథమూలంబుగా భక్త్యామృతపానపరితృప్తులై భజనానందస్వరూపులై దేవాలయసేవాదిసత్కర్మలయందు నిరంతరతృప్తులై యుండుటను గాంచి ఆంధ్రదేశంబున భక్తసామాన్యంబునకు భక్తిచరిత్రంబులు లేమికారణం బని గ్రహించి శైవ వైష్ణవ వేదాంత సిద్ధాంతంబు లెల్ల సమన్వయసహితం బై యుండెడు శ్రీమహాభక్తవిజయం బను నార్గురుభక్తులచరిత్రంబులను వారివారిజీవితకాలంబున వారువారొనర్చిన లీలలను సాంగోపాంగముగా వ్రాయఁ బూనితిని. ఈ గ్రంథ భక్తజను లెల్లరును చదివి యానందించి భగవద్భక్తి సలిపి భగవంతుని కృపకు పాత్రులగుదు రని ప్రార్థించుచున్నాఁడను.

ఇట్లు,

గ్రంధి-రామలింగస్వాములు.

# పీఠిక.

గీ॥ శ్రీయుమాపుత్రుఁడై ధర వెలుఁగుచుండు
సర్వకార్యంబు లొనగూర్పశక్తి గల్గు
సిద్ధివిఘ్నేశ్వరుని మదిఁ జింత సేతు
భక్తవిజయంబు నిర్విఘ్నఫణితి వ్రాయ॥

సర్వవిఘ్నంబులను నిర్విఘ్నంబుగా నొనర్చు శుక్లాంబరధరుండైన విఘ్నేశ్వరుని మూలాధారచక్రంబునను, సర్వసాధనాంతరులైన జీవన్ముక్తుల జిహ్వాస్థానంబున సంచరించెడు సరస్వతీదేవిని నాలుకయందు ధరించియుండెడు చతుర్ముఖుని స్వాధిష్ఠానచక్రంబునను, బహిర్దృష్టి లేక సర్వదా అంతర్ముఖులై యుండెడువారి వాసస్థానంబులను విడువక యుండెడు సముద్రతనయను వక్షఃస్థలంబున ధరించి యుండెడు శ్రీమహావిష్ణువును మణిపూరకచక్రంబునను, మోక్షార్థులకు ఘోరాన్నంబు గైకొని వారి నాశ్రయించి తిరిగెడు అన్నపూర్ణ నర్ధదేహంబొసంగిన యీశ్వరుని అనాహతచక్రంబునను, బ్రహ్మానందవారిధిలో మునిఁగి త్రికరణచేష్టలణఁగి యున్మనియవస్థలో నుండువారి కిహబంధంబుల జేర నియ్యక పోషించెడు మహేశ్వరుని విశుద్ధచక్రంబునను, జాగ్రత్స్వప్నసుషుప్తితురీయములు గడచి తురీయాతీతులై సంకల్పవికల్పము లనెడు రోగంబు లేక నిర్వికల్పులైనవారికి సేవ నొనర్చెడు భక్తుల కిష్టాభీష్టంబు లొసంగెడు సదాశివుని ఆజ్ఞాచక్రంబునను దర్శించిన యుత్తమసిద్ధులను జూచి, హృదృశ్యులై వేయునొక్క రేకులు గల పద్మసౌధమున నివసించి వీణ మీటుచు దశవిధనాదంబుల వినుచు సుఖామృతంబును చవి జూచుచు షట్చక్రేశ్వరుల నొక్కరూపంబు గావింపును కోటిసూర్యప్రకాశంబులం గాంచుచు షణ్ముఖుండగు సుబ్రహ్మణ్యుని భ్రూమధ్యంబున సేవించుచు త్రిమూర్తులు దేవతలు

తెలుఁగెఱుఁగలేని వారెల్లరకు అవాఙ్మానసగోచరంబై తెలియ శక్యము గానిదై పరమై అపరోక్షమై అద్వైతమై సాక్షాత్కారమై తన్మయ చిన్మయమై సిద్ధపురుషాకారమై విరాజిల్లుచుండెడు చతుర్ముఖుఁడే తానై అవతరించిన నాభాజీసిద్ధులు సంస్కృతభాషయందు జెప్పి యున్న మార్గరుభక్తులచరిత్రంబులను వారువారు అనేక భాషలయందును రచియించుకొని తద్గ్రంథపఠనంబులన భక్తిసామ్రాజ్యపట్టభద్రులై యుండుటను గాంచి నేనును దాని ననుసరించి యాంధ్రభాషయందు నీ భక్తచరిత్రంబును విపులంబుగా రచించితిని అయినను, కేవల గ్రామ్యభాషయందు రచించితిని గాన ఆంధ్రమహాకవులు పరిహాసంపఁ దగినదిగానే యుండు నగును. అటు లున్నను, భక్తజనాగ్రగణ్యులకు సహకారిగా నుండవచ్చు నని మాత్రము దలంచుచున్నాను. కావున, నిప్రబంధంబున తప్పులు పాటించక తనయునిపలుకులు నిచాఁబై యున్నను తల్లిదండ్రులు ముద్దుగా భావించి యుల్లాసము మించు నుత్యపురాను లని దలంచి గ్రహించు విధంబుగా పరిగ్రహింతు రని సుకవిసార్వభౌములకు దాసానుదాసుఁడ నగు రామలింగదాసుఁడను నేను విద్వద్వరేణ్యులపాదారవిందంబులను శిరంబునధరించి ధూపార్చనంబులనుగావించి భగవద్దాసపాదారవిందంబుల హృత్పద్మంబుననిలిపి అష్టాక్షరీమంత్రంబును నాజపమ్మాయుంచు నెలకొల్పి భక్తవిజయం బను గ్రంథంబునకు షష్ఠభక్తివిజయం బని నామం బిడితిని గాన నా వాక్యంబులను సద్వాక్యంబులుగా గైకొని కించిద్జ్ఞుఁడ నగు న న్నాశీర్వదించి యుందలి చరిత్రంబుల భక్తప్రవృత్తు లెల్లో పరించువారికి జయదేవుఁడు మున్నగు భక్తాగ్రగణ్యులు ప్రసన్నులై పరబ్రహ్మవిలాసంబును జూపి యెల్లప్పుడు ఆనందసాగరంబున మునుఁగింజేసి బ్రహ్మానందస్వరూపసాక్షాత్కారస్వయంప్రకాశచిన్మయ తేజోమయచిద్విలాసపరబ్రహ్మంబున జొక్కింపఁ జేయుదురు గాత.

శ్రీ రస్తు

శ్రీ గణేశ శారదా గురుభ్యో నమః.

# ధ్యాన శ్లోకములు.



వినాయకస్తుతి.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే॥ ౧

గజాననం భూతగణాదిసేవితం
కపిత్థజంబూఫలసారభక్షితమ్ ।
ఉమాసుతం శోకవినాశకారణం
నమామి విఘ్నేశ్వరపాదపంకజమ్॥ ౨



## అంబాస్తుతిః.

ఓంకారపంజరశుకీం, ఉపనిషదుద్యానకేళికలకంఠిమ్ ।
ఆగమవిపినమయూరీ, మార్యా మంతర్విభావయే గౌరీమ్॥ ౩

మాణిక్యవీణా ముపలాలయంతీం
మదాలసా మంజులవాగ్విలాసామ్ ।
మాహేంద్రనీలద్యుతికోమలాంగి
మాతంగకన్యాం మనసా స్మరామి॥ ౪

చతుర్భుజే చంద్రకళావతంసే, కుచోన్నతే కుంకుమరాగశోణే ।
పుండ్రేక్షుపాశాంకుశపుష్పబాణ, హస్తే నమస్తే జగదేకమాతః॥ ౫

మాతా మరకతశ్యామ, మాతంగీ మధుశాలినీ ।
కుర్యా త్కటాక్షం కల్యాణీ, కదంబవనవాసినీ॥ ౬

జయ మాతంగతనయే, జయ నీలోత్పలద్యుతే ।
జయ సంగీతరసికే, జయ లీలాశుకప్రియే॥ ౭



## గురుస్తుతి

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
విశ్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాది లక్ష్యమ్ ।
ఏకం నిత్యం విమల మచలం సర్వధీ సాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం తం నమామి॥ ౮

ధ్యానమూలం గురో ర్మూర్తిం, పూజామూలం గురోః పదమ్ ।
మంత్రమూలం గురో ర్వాక్యం, ముక్తిమూలం గురోః కృపా॥ ౯

గురు ర్బ్రహ్మా గురో ర్విష్ణు, ర్గురు ర్దేవ మహేశ్వరః ।
గురు స్సాక్షా త్పరబ్రహ్మం, తస్మై శ్రీ గురవే నమః॥ ౧౦

మన్నాథో శ్రీజగన్నాథో, మద్గురు శ్శ్రీజగద్గురుః ।
మమాత్మా సర్వభూతాత్మా, తస్మై శ్రీగురవే నమః॥ ౧౧

చైతన్యం శాశ్వతం శాంతం, వ్యోమాతీతం నిరంజనమ్ ।
నాదబిందుకళాతీతం, తస్మై శ్రీగురవే నమః॥ ౧౨

అజ్ఞానతిమిరాంధస్య, జ్ఞానాంజనశలాకయా ।
చక్షురున్మీలితం యేన, తస్మై శ్రీగురవే నమః॥ ౧౩

సర్వాత్మకం సర్వశాంతం, సచ్చిదానందవిగ్రహమ్ ।
సర్వాధారం సర్వపూర్ణం, సదా శ్రీసద్గురుం భజే॥ ౧౪
అఖండమండలాకారం, వ్యాప్తం యేన చరాచరమ్ ।
తత్పదం దర్శితం యేన, తస్మై శ్రీగురవే నమః॥ ౧౫

## శ్రీ వైష్ణవ గురుపరంపరా స్తుతి

శ్రీశైలేశదయాపాత్రం, ధీభక్త్యాదిగుణార్ణవమ్ ।
యతీంద్రప్రవణం వందే, రమ్యజామాతరంమునిమ్॥ ౧౬
లక్ష్మీనాథసమారంభాం, నాథయామునమధ్యమామ్ ।
అస్మదాచార్యపర్యంతాం, వందే గురుపరంపరామ్॥ ౧౭
యో నిత్యమచ్యుతపదాంబుజయుగ్మరుక్మ
వ్యామోహతస్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురోర్భగవతో ఽస్య దయైకసింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే॥ ౧౮
మాతా పితా యువతయస్తనయా విభూతిః
స్సర్వం యదేవ నియమేన మదన్వయానామ్ ।
ఆద్యస్య నః కులపతేర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా॥ ౧౯
భూతం సరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసారకులశేఖరయోగివాహాన్ ।
భక్తాంఘ్రిరేణు పరకాలయతీంద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతో ఽస్మి నిత్యమ్॥ ౨౦

# అవతారిక.

శ్రీమదఖిలాండకోటిబ్రహ్మాండనాయకుం డగు శ్రీమన్నారాయణున కునికిపట్టైనదియును, భూలోకవైకుంఠ మనందగినదియును, బ్రహ్మానందంబుచే దన్ను మఱచిన జీవన్ముక్తులు నివసింపుచుండెడు పట్టణంబును, అష్టాంగయోగానుష్ఠానపరులగు మహాసిద్ధులు సంచరించెడు స్థలంబును, ద్వారకానాథ్ రామనాథ్ జగన్నాథ్ బదరీనాథ్ యను నాలుగుత్రాళ్లచే కట్టంబడిన ధ్వజస్తంభంబువలె మధ్యభాగంబున వెలయుచుండు పండరీనాథ్ యని చెప్పందగిన గోపురంబున నెందు జూచినను నాదబ్రహ్మసమానంబై భజనగోష్ఠులచే సేవింపఁదగిన పండరీపురంబున కలియుగాది ౪౭౩౦-వ సంవత్సరమునందు సర్వజనులను వైకుంఠమునకు విచ్చేయుం డని యేడుదివసంబు లుద్ఘోషించియు నెవరు



ఉత్తమసిద్ధులు. నాబాజీసిద్ధుఁడు.

రానందులకు వగచి స్థిరకీర్తిని నెలకొలిపి జయవిఠల్ జయవిఠల్ యను ఘోషతోఁ గొందరు శిష్యగణంబులు పరివేష్టింప ఆకాశంబున జనుచున్న తుక్కారాం అను దాసాగ్రగణ్యుని దిండీరవనవాసు లగు ఉత్తమసిద్ధులు మున్నగువారు గాంచి యచ్చెరువంది నాబాజీసిద్ధుల సన్నిధి కేతెంచి ప్రదక్షిణనమస్కారంబులు సలిపి గగనంబున జనుచున్న మహాత్ము లెవరైనది సాదరంబుగా సెలవొసంగుము స్వామీ యని ప్రార్థించిరి. అంత, నాబాజీసిద్ధులు నాయనా యీదినమే మనకు సుదినము, మన మొనర్చిన భాగ్యంబున కంతంబు లేదు, అంబరంబున జనుచున్న భక్తాగ్రేసరుని మహిమలను కొనియాడుట కాదిశేషున కైనను నసాధ్యంబే, గావున కించిద్జ్ఞుండ నగు నే నెంతవాఁడ నైనను నే నెఱింగినచందం బెఱింగించెద నాకర్ణింపుఁ డని చెప్పం దొడంగె. గుప్తమగు దానము సప్తలోకము లెఱుంగు నన్నట్లు అతిగుప్తంబైన పండరీపురంబునకు సమీపంబున నున్న వాఁడును, బ్రహ్మజ్ఞానము పురాణముగా నెఱింగినవాఁడును, పండరీనాథుని సేవ జేయఁదగిన తపోబలము గలవాఁడును, తుక్కారాం యను నామంబుచే జెన్నొందినవాఁడును, వైరాగ్యంబున సమర్థుండును, జీవకారుణ్యవ్రతము గలవాఁడును, మనస్సును బ్రహ్మానందమున మునుఁగఁ జేసినవాఁడును, వాక్కు నెల్లప్పు డిష్టదైవమును స్తుతించుచున ట్లొనర్చినవాఁడును, జీవత్వమును ధ్వంసము జేసినవాఁడును, మృతి నొందినపుత్త్రుని బ్రతికించినవాఁడును, రెండుకుక్కలను శిష్యులుగా నుంచుకొన్నవాఁడును, గాడిదను గరుడునిఁగా జేసినవాఁడును, సంసారంబున నుండినవాఁడును, సమస్తధర్మంబు లెఱింగినవాఁడును, అభిమానమును జయించినవాఁడును, ఆకాశమున జనుచున్నవాఁ డని చెప్పఁగా విని, యుత్తమసిద్ధులు గురువర్యా! శుకబ్రహ్మర్షివలె నాకాశంబున జనుచున్న యీమహాత్మునకు నింతటితపోబలం బీజన్మంబునం దొనర్చినదా? లేక, పూర్వజన్మసంస్కార మైనదియా? నెఱుఁగఁజాల కున్నాము. దయతో సెలవొసంగుఁ డని ప్రార్థింపఁగా, నాబాజీసిద్ధులు చెప్పుచున్నారు. సిద్ధులారా! ఆకాశంబున జనుచున్న తుక్కారాం పూర్వజన్మంబున బాల్యంబుననుండి పాండురంగని కన్నంబు గుడిపిన పరమభక్తుండును, అయోనిసంభూతుండును, నామదేవు లను నామాంకితుండు నని చెప్పఁగా విని, మూఁడవజన్మంబున నీమహాత్ముం డేమునీశ్వరుండుగా నవ

2

తరించి యుండెను నదియును సెలవొసంగఁ డని ప్రార్థింపఁగా, మూఁడవ జన్మంబున శ్రీకృష్ణభగవానులయొద్ద బ్రహ్మోపదేశంబు నొందిన ఉద్ధవుం డగును. ఆతని దేహావసానసమయంబున శిశురూపంబు ధరించి చంద్రభాగానది వెల్లువలోఁ దేలుచు వచ్చుచుండ పండరీపురంబున నుండెడు దాంశెట్టి యను నాతని చేయి జిక్కి నామదేవు లను నామంబు వడసి స్వర్గంబుననుండి వచ్చినధ్వజంబులను నాగేశ్వరుని కోవెలలోఁ స్థాపించి మృతి నొందిన లేఁగదూడను బ్రతికించి అక్బర్ పాదుషాను భంగపఱచి అం దున్న నాగేశ్వరగుడికోవెలను పడమరముఖంబుగా ద్రిప్పి శతకోటి కీర్తనంబులచే రామాయణంబు వ్రాయ యత్నించి సగము వ్రాసి వృద్ధావస్థవలన వ్రాయుట కసాధ్యమై శరీరవియోగం బాది పిదప తుకారామై యవతరించి పూర్వము కొఱత యున్న రామాయణంబు వ్రాసి అంకితంబు జేసి తా వచ్చినతీరుననే వైకుంఠంబున కేగుచున్నా డని నుడివెను. అంత ఉత్తమసిద్ధులు నాబాజీ సిద్ధులను జూచి, గురువరా! పూర్వము కృష్ణభగవానులయొద్ద బ్రహ్మోపదేశం బందిన యుద్ధవుఁడు మరల భూలోకంబున జన్మించుటకు కారణం బేమి? బ్రహ్మైక్యసిద్ధి నొందినవారికి జననమరణంబులు లేవనెడువిషయ మిప్పుడు సందియంబునకు చోటిచ్చుచున్నది కావున మాసందియంబు నివర్తింపఁ జేయుమని ప్రార్థించిరి. వారలకు నాబాజీసిద్ధులు, వినుడీ సిద్ధులారా! భూలోకంబున యవతారపురుషులై జన్మించినది ఉద్ధవుం డొక్కఁడే గాదు. వాల్మీకి, వేదవ్యాసుఁడు, శుకుఁడు, అక్రూరుఁడు, అరుణుఁడు, తారకుఁడు, బ్రహ్మ, విష్ణువు, రుద్రుఁడు, ఆదిశక్తి మున్నగువారు భూలోకంబున కులాచారధర్మంబులు చెడి లోకభ్రష్టత్వ మొందియుండెడు సమయం బెఱింగి పుడమియందు బుట్టి జీవులకు విహితకర్మానుష్ఠానంబులను గఱపి భక్తిజ్ఞానవైరాగ్యంబుల బోధించి లోకోద్ధారణార్థము పునరావృత్తిని జెందుదురే గాని కర్మజీవులవలె కర్మబద్ధులై జన్మించువారు గా రని యెఱుంగు మని జెప్పగా విని, ఉత్తమసిద్ధులు గురువరా! ప్రపంచంబున వారలట్లవతరించుటకు కారణం బేమి? దయతో ననుగ్రహింపుఁ డని ప్రార్థింపఁగా విని, సిద్ధులారా! భూలోకంబున కలి బుట్టిన వెనుక పరీక్షిత్తు స్వల్పకాలము చక్కఁగా పాలింపఁబడి పిదప కలికాలమహిమవలన జీవులకు విభక్తగుణంబు లతిశయించి దుర్గుణవిశిష్టులై పుణ్యతీర్థస్నానరహితులై త్రిమూర్తిస్వరూపంబు లగు విగ్రహారాధనం

బులను పరిత్యజించి శాస్త్రపరిజ్ఞానశూన్యులై వేదాధ్యయన వేదాంత శ్రవణ అతిథిసత్కారంబులు మున్నగునవి కలనైన దలంపనివారలై, ఆర్యులు మున్నగువారిని సత్కరించుటయు, వారికి శుశ్రూష లొనర్చుటయు, స్నాన శయన భోజన ధూప దీప పుష్ప చందనాలంకారంబుల జేయుట మున్నగు సద్గుణరహితులై దుర్వ్యాపారంబు లంతకంతకు పెంపొంది పాపోత్కర్షంబువలన సువృష్టి లేక అగ్నికి సమానం బగు వాయువు యెల్లదిక్కులను వ్యాపించి అరణ్యంబులు పట్టణంబులు మున్నగునవి దహింపంబడు చుండుటకు కారణభూతు లగు విశ్వామిత్రుని ఘోర కోపాగ్నినుండి వెడలినవారు నగు కొందఱు అసురాంశ సంభూతులు రాజ్యాధిపత్యము వహించి సర్వదేశములయందును మదగజంబులవలె సంచరింపుచు సత్పురుషుల నవమానింపుచు మధుమాంసంబుల భుజించుచు లు యుక్తంబని మంగలింపుచు ఖడ్గంబులచే బూని రైతులను బెదరింపుచు నెదిరించువారిని హింసజేయుచు క్షత్రియులను దనుమాడి కాశీ మున్నగు పుణ్యస్థలంబులయందు గోవధ జేయుచు లాంహిరివస్తువులచే మానందింపుచు అట్టహాసంబు జేయుచు శూన్యముఖులై హరివారపిగ్రహంబుల బెట్టిక పాలుమైయుచు గ్రామంబులపై దారివెడలి దోపుడోయుచు రాజధర్మంబు చెడి దేశం బెల్ల అధర్మాభివృద్ధి జెంది మంత్రంబులు ఫలించక సూర్యాతపంబువలన అరణ్యంబులు గ్రామంబులు దహింపంబడుచు ఋషీశ్వరులు తపం బాచరింప ననాధ్యమై యుండగా, ఆహా యిట్టి దుర్ఘటం బేమూలంబున గలిగ, నొకవేళ మృతి నొందిన రావణుండు పునర్జీవితుం డాయెనా, లేక హిరణ్యుడు జనించినవాడు గాబోలు? లేకున్న నిట్టి దురవగాహంబున కావిత్యుండు బూనుకొన్నందులకు కారణం బేదేని యుండక పోదు, అని వారణాసి మొదలగు స్థలంబులయం దున్న వేదవ్యాసమహర్షి మున్నగు మునీశ్వరు లెల్ల రొక్కచో సభ జేరి ప్రపంచస్థితిని విచారించి యుండుకు మన మొనర్చున దేదియు గాన్పించకున్నయెడ, మన మెల్లరము గూడి వైకుంఠంబున కేగి శ్రీమహాలక్ష్మీపతికి విన్నవింపకొంటిమేని శ్రీమన్నారాయణుండు మనదురవస్థను నివృత్తి జేయును. కావున విడువు సేయక యేగుదము రండు అని యొకరికొకరు పర్యాలోచన జేసి యందరు గూడి వైకుంఠంబు జొచ్చి హరిసంకీర్తనంబుల ఘోషింపుచు మహోన్నతం బగు రత్నసౌధంబున మరివిరాజితంబై కోటి

సూర్యప్రకాశమానంబుగా వెలుఁగొందుచుండు సింహాసనంబున విరాజిల్లుచుండెడు శ్రీమన్నారాయణునిపాదంబులకు మునీశ్వరులు శిరంబులను గీలించి, ఓం అఖిలాండకోటిబ్రహ్మాండనాయకా! ఆదిమధ్యాంతరహితా! అనాథరక్షకా! గోపికాలోలా! గోపాలా! శంఖచక్రావతారా! చతుర్భుజా! తులసీధరా! దామోదరా! మత్స్యకూర్మవరాహావతారా! రాక్షససంహారా! మాపాలిదైవమా! దీనులమగు మమ్ము రక్షింపుము అని మొఱలిడినంతనే శ్రీమహావిష్ణువు కరుణాయత్తచిత్తుండై యతుల కుచితాసనంబు లొసంగి కూర్చుండ నియోగించి, యతివర్యులారా! మీ కిపుడు గల్గిన కష్టంబు లేవి? దుఃఖంబు నూని నుడివిన రక్షించెద వెఱవ వలదని దయతో సెలవొసంగెను. అంత వారును ముకుళితకరకమలులై దీనస్వరంబుతో లక్ష్మీపతీ! భూలోకంబున కలి బుట్టిన కొంతకాలమునకు కాశీ గయా హస్తినాపురి మున్నగు దివ్యక్షేత్రంబులయందు గోహత్య శిశుహత్య స్త్రీహత్య బ్రహ్మహత్య మున్నగు మహాపాతకంబుల జేయుచు వర్ణాశ్రమధర్మంబులు విడనాడి ద్రవ్యాశచే హీనకులుల నాశ్రయించి వారికి సేవ జేయుచు బ్రహ్మకులధర్మంబు జెడి దుష్ప్రవర్తనులై చరింపుచున్నారు. అట్టి అధర్మప్రవర్తనంబువలన దేశం బెల్లయు పాపపీడితంబై సకాలవృష్టి లేక అరణ్యంబులు పట్టణంబులు సూర్యాతపంబువలన దహింపంబడుచు వనంబులయం దెందును నీరు లేక మే మొనర్చుతపంబులకు భంగంబు వాటిల్లె. ఇందుల కేదియు నుపాయంబు గానక ఆపన్నరక్షకుండ వగు మీయొద్దఁ జేరితిమి. కావున దీనబంధూ! మమ్ము రక్షింపుము యని ప్రార్థించిరి. అంత లక్ష్మీపతి లోకరక్షకుఁడు గావున తనంతట తానె చింతింపందొడంగె. ఎట్లనిన, రాజనీతి చెడి పతివ్రతాభంగంబు వాటిల్లెనేని యప్పుడే దేశంబునకు దుర్గతి వాటిల్లు, దానివలన సువృష్టి లేక యతులకు తపోభంగంబు గలుగు, తన్మూలంబున లోకంబున పంచమహాపాతకంబు లతిశయించి ప్రజలకు దుర్వ్యాధులు మున్నగుపీడలు గల్గి ఆయుఃక్షీణంబై ప్రపంచంబు నాస్తి యగుం గావున నిందుకు దగు నుపాయంబు చింతించు విషయము నాకు ముఖ్యకర్తవ్యమే కదా యని శంకరుని స్మరించెను. అది యెఱింగి యుమాపతి పార్వతీసమేతంబుగా వృషభవాహనారూఢుఁడై దేవగణ భూతగణ పరివేష్టితుండై వైకుంఠంబున కేతెంచి శ్రీమహావిష్ణువు సన్నిధిం జేరగా

నంత పురుషోత్తముడు పులకాంకిత శరీరుండై సింహాసనంబు డిగ్గి శంకరున కుచితాసనం బొసంగి తానును యాసనం బధిరోహించి బ్రహ్మ సరస్వతి మొదలుగా గల సురులెల్లర నుచితాసనంబులపైఁ గూర్చుండ నియోగించి కుశలప్రశ్నలు జేయు చుండెడు సమయంబున పరాశర వ్యాస శుక శౌనక వాల్మీకాదు లెల్లరు శంకరునకు ప్రదక్షిణ నమస్కారంబులు సల్పి, ఓం హరహర! జటాధరా! పంచముఖా! నీలకంఠా! నిటలాక్షా! భూతగణనాథా! సర్పాభరణా! త్రిశూలధరా! సదాశివా! మహాదేవా! ఆర్తుల మగు మమ్ము రక్షింపుము. మహేశా యని ప్రార్థించి మఱియు నందున్న సురులందరిని స్తుతించి దీనాననులై నిలు చుండెడుసమయంబున ఉమాపతి మునులం గాంచి, యతులారా! మీ కిపుడు కలిగిన యపాయం బేమి? మీ రిట్లు గుందుటకు కారణం బెద్దియో నెఱింగింపుడు, వెఱవవలదు మే ముండ నపుడు మీకు గలిగెడు భయం బెద్దియు లేదు, మీయుద్దేశంబు వచింపుఁడు యని దయార్ద్రహృదయుఁడై పలుకఁగా ఋషులు సంతస హృదయులై, మహేశా! పూర్వము పంరఃఖ్యాదు కొన్ని శాస్త్రంబులను స్వకపోలకల్పనంబు జేసికొని సురలు మున్నగువారు తినయాజ్ఞా బద్ధులై యుండున ట్లొనర్చికొని తానే త్రిమూర్త్యాదికర్తవ్యంబు లెల్ల వహించికొని తుదకు లక్ష్మీపతిచే నాశం బందినట్లు భూలోకంబున కలి బుట్టినపిదప మానవులయందు కొందఱు కొన్ని యుక్తులను జేర్చి శాస్త్రంబులుగా రచించినదానిని దేవప్రోక్తం బగు వేదం బని పలుకుచు పంచములై చతుర్వేదంబులు మొదలగువానిని పరిత్యజించి గోవధ మొదలగు హింసాదులం జేయుచు వరుసదప్పి స్త్రీలతో భోగింపుచు అధఃపతనులై యుండుటవలన పాపపుంజంబుచే లోకంబున వర్షంబు లేక వనంబులయం దెందును నీరు గానక మాతపంబులు వికలత్వంబు నందగా దమయుండఁ జేరితిమి. ఇంతియ గాక, మాతలం పెఱింగించెదము వినుండు, భూలోకంబున మానవు లెల్లను స్వధర్మానుష్ఠానపరులై అహింసా సాస్తేయ బ్రహ్మచర్యార్జవసత్యక్షమ దయ ఈశ్వరారాధకులై సంతతము సత్కర్మాచరణులై యుండునట్లును, తమ దివ్యలీలావిగ్రహంబుల శ్రద్ధాభక్తులతో నారాధించునట్లును, అట్టివారికి త్రిమూర్త్యాదు లగు మీరు నిత్యసేవ యొసంగుచు ప్రతి నెలకు మూడు వర్షంబులు గురియింపించుచు సమస్తసంపదలతో మానవు లెల్లరు సుఖ

ప్రసన్నులై యుండునట్లును అనుగ్రహింపుము దేవా యని ప్రార్థించి నిలుచుండిరి. అంత త్రిమూర్తు లాలోచించి, ఓయి ఋషివర్యులారా! ఇక మీరు వెఱవ వలదు. మేము కాశీ గయ హస్తినాపురి మున్నగు స్థళంబులయం దవతరించెదము, మీరున్ను అచ్చటచ్చట యవతరించుచు మనము మూర్ఖులకు యుక్తాయుక్తపరిజ్ఞానంబులను బోధించి బ్రహ్మజ్ఞానమును సగుణధ్యానమును పూజాచారంబులను జేయునట్లొనర్చెదము. మీ రిక విశేష సేయక పుడమిం బ్రవేశింపుడు మా సహాయంబుచే సర్వత్ర విజయం బాదుదు రని యాశీర్వదించి శ్రీమహాలక్ష్మిని సరస్వతిని గాంచి మీ రిరువురు వీరికి సహాయులై యుండి లోకోద్ధారణం బొనర్పుడని యాజ్ఞాపించు సభ లేచి వారివారివాసస్థానంబులం జేరిరి. పిదప వేదవ్యాసమహర్షి జగన్నాథంబున జయదేవస్వామిగను, వాల్మీకి ఢిల్లీనగరంబున తులసీదాసుగను, ఉద్ధవుండు పండరీపురంబున నామదేవుగను, శుకబ్రహ్మర్షి కాశీపట్టణంబున కబీరుదాసుగను, త్రిమూర్తులు పండరీపురసమీపంబున నుండు ఆపేగాం యను గ్రామంబున కరణిక బ్రాహ్మణుండైన విఠోబా యను మహాత్మునకును రుక్మాబాయి యను పతివ్రతారత్నమునకును పుత్త్రులై జ్ఞానేశ్వరులు, నివృత్తిసాధు, సోపానదేవు లను నామంబులం జెన్నొందిన పుత్త్రులైరి. ఆదిశక్తి ముక్తాబాయి యను నామంబునం బ్రసిద్ధి గాంచి పుత్త్రిక యయ్యె. వీరల వృత్తాంతంబులు వారివారిచరిత్రంబునందు విపులంబుగా జెప్పెదను.

# గ్రంథవివరణము.

అండపిండబ్రహ్మాండంబు లన్నియు సృజించిన బ్రహ్మదేవుని యంశంబైన నాభాజీసిద్ధులు లోకోద్ధారణార్థము అవతరించి భక్తచరిత్రంబులను హిందూస్థానిభాషయందు రచించి భక్తులను రక్షించి ప్రస్తుతము ప్రపంచంబుననే తిరుగుచున్నా రని చెప్పగా నింకేమి మాహాత్మ్యంబు గల మహానుభావులు చెప్పిన వాక్యంబులను మెంతని వర్ణింప నగును. భక్తసారం బను యీభక్తవిజయం బైనది బ్రహ్మానందరసంగాసంగి సత్యజ్ఞానానందస్వరూపమై యుండునట్లు జేయునది గావున దేవామృతం బనియు, జీవహింస జేయుట కల్లుద్రాగుట పరధనాపహరణము జేయుట అసత్యము బలుకుట పరస్త్రీల గవయుట మున్నగు పంచమహాపాతకంబుల నివర్తించెడు భాగీరథీకి సమానం బగు యనేకచరిత్రంబు లణగియుండుటవలన నితిహాసం బనియు, శ్రీమన్నారాయణునిదివ్యలీలావిభూతులుండుటవలన విష్ణుపురాణం బనియు, సాక్షాత్ శంకరునిలీలావిభూతు లణగియుండుటవలన శివపురాణం బనియు, ప్రపంచోత్పత్తిస్థితిలయ విధి నిషేధాదులు మున్నగు ననేకసాధనంబులు జేరి యుండుటవలన వేద మనియు, వేదాంతమహావాక్యరహస్యార్థంబు లణగియుండుటవలన వేదాంతశాస్త్రం బనియు చెప్పంబడును. ఇంతియగాక, మతభేదంబులను ఖండించి మానాభిమానములను వర్జించి హరిహరాదుల సమత్వంబుగా స్తుతించి కాదనువారిని నిందించి కామ్యక్రియలను నిషేధించి బ్రహ్మజ్ఞానంబును నిండించి ఆనందంబున నుండుమని బోధించి జ్ఞానవాక్యంబుల ననేకంబుగా విస్తరించి చెప్పుటవలన వేదాంతసిద్ధాంతబోధిని యని చెప్పం దగియున్నది. ఇంతటి మహిమ గల మోక్షప్రదమైన గ్రంథంబునకు భక్తవిజయం బని నామం బిడియుండుటకు కారణమేమనగా, గ్రంథంబున జెప్పియుండెడు జ్ఞానులెల్లరును భగవద్భక్తివల్లనే వైరాగ్యబోధోపరతులను పొంది కామక్రోధలోభమోహమదమాత్సర్యంబు లను శత్రువర్గంబును దునుమాడి నిజజ్ఞానకైవల్యప్రాప్తులైరి, కావున కాబట్టి భక్తియే శ్రేష్ఠంబుగా దెలుపుటవలన నీగ్రంథమునకు భక్తవిజయం బని పేరొందఁదగినది. ఇట్టి పుణ్యప్రదం బైన గ్రంథంబును బ్రహ్మరుద్రాదులకైనను బొగడ తరముగాదు, కావున భక్తితో పఠించువారికి సమస్తసుఖంబులు స్వాధీనంబై యుండును.

శ్రీమహాభారతము రామాయణము బ్రహ్మాండపురాణము మున్నగుగ్రంథంబులలో ప్రాముఖ్యం బైన యీప్రబంధంబును కలియుగాది ౪౭౩౭ సం॥ విరించ్యవతారు లైన నాభాజీసిద్ధులు హిందూస్థాని భాషలో ౭౦ మంది భక్తులచరిత్రంబులను రచించి భక్తిసారం బని పేరిడి వృత్తమసిద్ధులు మున్నగువారికి బోధింపఁగా, ఉత్తమసిద్ధులు సంగ్రహంబుగా క్వాలీలభాషయందు రచించి భక్తమాల యని పేరిడిరి. మైపతిబావాజీ యను మహాత్ముఁడు ౪౮౬౩ సం॥ జ్ఞానవాక్యంబు లన్నియు త్రోసివేసి కొన్ని వాక్యంబులనుమాత్రము జేర్చి పందొమ్మిది చరిత్రంబు లొక్కటిగా గూర్చి మహారాష్ట్రభాషయందు రచించి భక్తవిజయం బని నామం బిడి తక్కినచరిత్రంబులకు సంతవిజయ మనియు, సంతవిజయలీలామృత మనియు పేరు బెట్టెను. మఱియు, ద్వీపదేవను మహాత్ముండు జ్ఞానవాక్యంబు లన్నియు జేర్చి మహారాష్ట్రభాషయందు రచించి దీపరత్నాకరమని పేరు బెట్టెను. పిమ్మట, ౪౯౬౬ సంవత్సరము చిత్తూరు వేంకటదాసులవారిచే ద్రావిడభాషయందు విపులంబుగా రచించి భక్తవిజయం బని పేరిడిరి. తరువాత, ౫౦౦౭ సంవత్సరము బెంగుళూరునఁగు పరవస్తు జియ్యరుసూరిగారిచే నాంధ్రభాషయందు తత్త్వజ్ఞానమును బోధించునట్లును గ్రంథబాహుళ్యంబుగా నుండు నట్లును శ్రీమహాభక్తవిజయంబును రచియించిరి. ఇదిం గాక, నాంధ్ర భాషయందు కోవిల్ ధనాల దేవరాజస్వాములవారు ఆదిభక్తవిజయం బను గ్రంథమును, మఱికొందఱు కొన్ని భక్తవిజయంబులును రచియించిరి. ఇట్లనేకగ్రంథంబు లున్నను పరవస్తు జియ్యరుగారిచే రచియించినది గ్రంథబాహుళ్యంబుగా నుండుటవలనను, మిగతగ్రంథకర్తలచే రచియించినవి యతి సంగ్రహంబులుగా నుండుటవలనను జూచి నీ షడ్భక్తవిజయంబును రచియింపఁబూనితిని. ఇది జనసామాన్యమునకు సుబోధకం బగునట్లు రచించి ఒక్కొక్క భక్తచరిత్రంబును ముద్రించి వెలువడునట్లు చేసి స్వల్పక్రయమునకు విక్రయింపఁదగి యున్నవి. కాఁబట్టి భగవద్భక్తు లగు బీదజను లెల్లరు దీనిని చదివి యానందించి భగవంతునికృపకు బాత్రు లగుదు రని ప్రార్థించుచున్నాను.

ఇట్లు భక్తజనవిధేయుఁడు,

గ్రెంది - రామలింగస్వాములు.

శ్రీ ర స్తు.

శ్రీమన్నారాయణాయ నమః.



# పండరీపుర మాహాత్మ్యము.

పరమతపోనిధి యగు నాబాజీసిద్ధులు దింశిరవనవాసు లగు ఉత్తమసిద్ధులను గాంచి, సిద్ధులారా! వినుఁడు. శ్రీమన్నారాయణుఁడు భక్తపరిపాలనార్థము నివసించియుండెడు పండరీపురంబునందు సమస్త వస్తువు లమ్మెడు అంగళ్లును, మిక్కిలి యున్నతములైన సౌధములును, షడ్రసోపేతం బగు మృష్టాన్నంబు లొసంగెడు అన్నదానసమాజంబులును, యెందు జూచినను నాదానందకర మగు భజనగోష్ఠులును స్వధర్మానుష్ఠాన చతుర్వర్ణాశ్రమ పరులును, పతిభక్తి యొనర్చెడు పతివ్రతాశిరోమణులును గలిగి యచ్చటచ్చట సత్పురుషసంగములచే విరాజితంబునై భూలోకవైకుంఠ మనందగినదై మాలాలంకారంబుగా వెలయుచుండు చంద్రభాగానది వలన యలంకరింపఁబడి యున్నది. ఆ నదీతీరంబున కనకధ్వజాలంకృతంబు నతివిశాలంబు నగు దేవాలయంబున సిద్ధసేవ్యమానుండుచు, భక్తజనపరివేష్టితుం డగు పాండురంగఁడు పుండరీకభక్తునికొఱకు యిటికరాలిపై సేవ యొసంగి తన కటాక్షవీక్షణంబులు వ్యాపింపఁజేయుటవలన పూర్వ మొకసమయంబున నా పురంబునందు కనకధారావర్షంబు వర్షించె. ఇట్టి మహామహిమ గల పండరీపురంబును కొనియాడుట కమరేంద్రాదులకైనను నసాధ్యంబై యుండును గాన నేనింతటితో పురవర్ణనంబు విరమించుకొంటి నని నాబాజీసిద్ధులు నుడువగా వుత్తమసిద్ధులు గురువరా పుండరీకభక్తుని తపంబునకు మెచ్చి లక్ష్మీపతి యిటుకరాతిపై సేవ యొసగిన ట్లానతిచ్చితిరి. ఆతని చరిత్రంబు వినదలంచితిమి గాన దయతో సెలవొసంగుం డని ప్రార్థించగా విని నాబాజీసిద్ధులు పుండరీకభక్తుని చరిత్రంబు జెప్పం దొడంగె.

ఓం

శ్రీ పాండురంగాయ నమః



# పుండరీకభక్తుని చరిత్రము.

సిద్ధులారా! ఆలకింపుడు. సర్వసంవత్సరంబుల కునికిపట్టైన పండరీపురంబున పుండరీకుండను విప్రసుతుం డుండెను. అతడు మాతృపితృభక్తియుతుండును సర్వశాస్త్రకోవిదుండును సద్గుణశీలుండు నై యున్న పుత్రుని తలిదండ్రు లమితగారాబంబుతో పోషింపుచుండిరి. పిదప తనయునకు వివాహంబు జేయ యవ్వనంబు తటస్థించినందున యాపురంబున నొక విప్రోత్తముని కూతురిని నిశ్చయించి శుభముహూర్తంబున వివాహమహోత్సవంబు జేసి తలిదండ్రులు పుత్రుని కోడలిని గాంచి వారిదాంపత్యంబునకు సంతసింపుచు కాలము గడపుచుండిరి. కొన్నాళ్లు గడచిన పిదప పుండరీకునిసతి పతినిగాంచి ప్రాణేశా తమ తలిదండ్రులు నాయందు తీరనిమత్సరంబునే జాటుచున్నారు గాన నే నిక వారితో నేకీభవించి యుండుటకు సమ్మతించుదానను గాను వారి నెందేని ప్రత్యేకంబుగా నునిచి మనమిరువురము స్వగృహంబున నుండిన ట్లొనర్చితిరేని తమకు ప్రియురాలనై యుండుననుటకు సందియంబు లేదు, లేకున్న యిపుడే నాతల్లిగారి గృహంబున కేగెద నని జెప్పుచున్న సతి వాక్యంబులను విని పుండరీకుడు తనకు సతిపై నుండెడు మోహాసక్తి వల్లను తాను యవ్వనుడై నందునను ప్రియునాయకీ నే నీ యిష్టంబున కనువర్తించువాడ నని నమ్ముము. ఇదో క్షణంబులో నీయభీష్టం బీడేర్చెద నని తలిదండ్రులను అన్యగృహంబున నుండున ట్లొనర్చి స్వగృహంబునం సతిపతులిద్దరు అన్యోన్య ప్రియమోదంబులతో వర్తింపుచుండిరి. ఆసమయంబున పుండరీకునకు దుర్గుణంబులు ప్రబలి వేశ్యాగృహంబుల

జరింపుచు సత్పురుషుల దూఱుచు ధర్మమార్గంబు సున్నైనను దలంపక మర్జనసంగంబునందే కాలము గడపుచుండె. అప్పుడు అగ్రహారంబునం దొక పౌరాణికుండు కాశీఖండం బుపన్యాసంబు జేయుచుండెను. అది తెలిసి పుండరీకునిపతి పతినిగాంచి ప్రాణేశా యగ్రహారంబున భాగీరథీమాహాత్మ్యం బుపన్యసింపుచున్నారు గావున పురాణశ్రవణంబున కేగవలయు నని దలంచెదను, తాము దయచేయుదు రని ప్రార్థింపుచున్నా ననెను. అందు కావిప్రుడు ప్రియనాయకీ నిన్నుజూడ వెఱ్ఱిదానవలె గాన్పించుచున్నావు, రేయెల్ల నిమురమేల్కొని పురాణంబు విన్నమాత్రంబున నేమి సుఖ మందగలము. సుఖముగా బరుండి సురతక్రీడలాడుచు నిమురింబిళిమేని మితిలేని యానంద మనుభవించగలము. పురాణంబు వినువారు శాస్త్రోక్తముగా ననుష్ఠించని యెడల నరకమే ప్రాప్తం బగును గాన మన మట్లనుష్ఠించుటకు దగినవారము గాము, శ్రవణంబును అనవసరమే నని మందలించెను.

అందు కాసుదతి నాథా తాము వచించుట జూడ నాకు మిక్కిలి చోద్యముగా గాన్పించుచున్నయది పురాణంబు వినువారిలో కొందరు మననవిదిధ్యానంబులం జేసి కృతకృత్యులగుటయు గలదు. మఱికొందరు క్రమముగా విహితకర్మాచరణు లగుటయు మరి కొందరు శ్రవణకాలమందైనను యఘంబు లొనర్పకుందురుగదా అట్టివారికి పునర్జన్మములైనను శ్రవణఫలం బగు పుణ్యంబు సంప్రాప్తంబు గాక మానదని శాస్త్రంబు లుద్ఘోషింపుచున్నవి. శ్రద్ధావిహీనులై పురాణంబు వినువారికైనను స్వర్గప్రాప్తిం బగునని మహాత్ములు వచింపుదురు. ధర్మమార్గం బట్లుండగా తాము అనుష్ఠానహీనులు శ్రవణార్హులుగా రని వచింపనగునా? నేను నా వివాహంబునకు పూర్వము పురాణశ్రవణమందే కాలము గడపుచుంటిని వివాహానంతరము పతిభక్తి సలుపుటే స్త్రీలకు ముఖ్యకర్తవ్యంబని దలంచి తమకు శుశ్రూష లొనర్చుట యందే కాలము గడపుచున్నదాన. నాకు తమసేవ కన్యంబుగా మఱేదియు నవసరము లేదు. మోక్షమందుటకు నాకిదియే సూక్ష్మమార్గమైయున్నది. పురాణశ్రవణంబును తదనుష్ఠానంబును తమకు మోక్షమార్గంబుగావున అన్నాదులు భుజించి పురాణశ్రవణంబున కేగుదము నా వాక్యంబు నురల్పకుము యని ఇంకయు కొన్ని హితోక్తులు గఱపి నాథుని సమ్మతింపజేసెను. పిదప యా రేయి భుక్తభోజ్యాదు లయినవెంటనే సతిపతు

లిద్దరుగూడి ప్రసంగంబుజేయుచోటికి కరుదెంచి అందొకపార్శ్వంబున గూర్చుండిరి. అందు సభ్యులెల్లరు గూడిన పిదప పౌరాణికుండు భాగీరథీమాహాత్మ్యంబు జెప్పనారంభించి భగీరథుడు శంభునుద్దేశించి తపంబాచరించుటయు శంకరు ననుగ్రహంబున గంగను గొని వచ్చుటయు ప్రవాహంబు వచ్చుచున్నమార్గంబున కాశీపురవాసియగు సగరచక్రవర్తి పుత్త్రులు కపిలమహర్షి శాపంబున దగ్ధమై యున్న భస్మంబుపై గంగప్రవహించినంతనే సగరుని సుతులు దివ్యరూపంబులం బొంది విమానారూఢులై స్వర్గంబున కేగుటయు భగీరథునకు గంగ ప్రసన్నంబై శ్రద్ధతో నాయందు స్నానంబొనర్చువారిని సర్వపాపంబుల నుండి పవిత్రులం జేయుదునని వరం బొసంగుటయు వారణాసిపురంబున మృతినొందువారికి శ్రీ కాశీవిశ్వనాథుడు తారకమంత్రం బుపదేశించుననియు తద్వారా మోక్షార్హులగుదురనియు గంగాతీరంబున నెల్లప్పుడు మునివర్యులు తపం బాచరింపుచుందురనియు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ప్రచ్ఛన్నరూపంబులతో నందు తపం బాచరింపుచుందురనియు వ్రతశీలురగువారి కెల్లప్పుడు ప్రసన్నులై యుందురనియు ఇంకయు ననేక మాహాత్మ్యంబు లుపన్యసించిన పౌరాణికుని వాక్యంబుల వినుచున్న పుండరీకునకు జ్ఞానోదయంబై పౌరాణికునకు ప్రదక్షిణనమస్కారంబులు సలిపి కాశీయాత్ర జేయుట కనుజ్ఞబొంది క్షణంబైనను నిలువక దారిబట్టి చనుచుండెను. అప్పుడు యాతనిసతి వెంబడించి నాథా తమ దాసురాలినగు నన్నును తమవెంట దీసుకజనునట్లనుజ్ఞ యొసంగుము యని ప్రార్థించి సతిపతులిరువురు జనుచుండుట నెరింగి పుండరీకుని తలిదండ్రులు కొన్నిభోజనపదార్థంబుల దీసుకొని పుత్త్రుని కోడలిని వెంటనంటి భుజములపై భారంబు నిడుకొని జనుచుండగా పుండరీకుడు తన సతి మార్గాయాసంబునొంది నందులకు వగచి సతిని భుజములపై నిడుకొని తలిదండ్రులను సడ్డచేయక వారు గొనితెచ్చెడి పదార్థంబులచ్చటచ్చట పాకంబొనర్చి భుజింపుచు కాశీపట్టణంబుజేరి యందొక సత్రంబున మజిలిజేసి యుండగా అందు అసియనుస్థళంబున కుక్కుటమహర్షి యను మహాత్ముం డున్నవాడని విని పుండరీకుం డాతని సందర్శింపంగోరి అందేగి యాశ్రమంబున మునింద్రునింగానక అందుకొందరు సుందరాంగు లుండుటంగాంచి అచ్చెరువంది ఆహా వీరలు అమానుషత్వంబుగా గాన్పించుచున్నవారు మానవులకిట్టి యసమానసౌందర్యం

బెందును గాన్పింపఁబోను. వాస్తవమును బట్టి జూచినచో వీరు దేవస్త్రీలనుటకు సుంతైనను సందియంబు లేదు యని మనంబున నూహించి కరంబులు మోడ్చి రిచ్చవడి నేదియు దోచక వారి యసమానసౌందర్యముఖవిలాసంబులును వారలు ధరించియుండెడు ఆభరణ అలంకారంబులును వారుగట్టియుండెడు చేలంబుల సొగసును గాంచి సంశయచిత్తుఁడై వీరలెవరైయుందురు. అహల్యా ద్రౌపతి జానకి తార మండోదరి మున్నగు వారలై యుండవలయును. లేకున్న భూదేవి, శ్రీదేవి, భవాని, భగీరధి, భారతి, రేణుక, ఇంద్రాణి, అరుంధతి మొదలగువారునైన నుండవలయు నని పెక్కుభంగుల వారిని స్తుతించి వారి సౌందర్యగాత్రంబులు మిక్కిలి శ్రమనొందునట్లు కుక్కుటమహర్షి గృహకృత్యంబులెల్ల జేయుచుండుటకు పుండరీకుండు సహింపజాలక అందున్న మాతృలకు ప్రణమిల్లి మాతృలారా మిమ్ముజూడగా సురకన్యలవలె గాన్పించుచున్నవారు లేక రాజస్త్రీలవలెను దెలియుచున్నారు, మీరు పరిచారికలు లేనట్లు దోచుచున్నయది, ఎవరికై మీరీ పాకంబులోనర్చెదరు, మీవాసస్థానంబు లెవ్వి, మీనామంబు లేమిటో సర్వంబును దయతో సెలవొసంగుండని ప్రార్థించెను. అందు కాపంచగంగలు ఓరీ నరాధమా బహుకాలము తపం బాచరించెడు మునివర్యులకు సహా మా దర్శనంబమూల్యంబై యుండ మాతృపితృద్రోహివగు పరమచండాలుని దృశ్యంబుల కెట్లు గోచరించితిమి. ఓరీదురాత్మా! క్షణంబైన నీ విట నిలుచుటకర్హుండవు గావు దొలంగుము యని పీరావేశంబుతో నుడివిరి. అంత పుండరీకుడు వెరగంది వారలకు ప్రదక్షిణనమస్కారంబులు సల్పి నా నేరంబును క్షమింపుడు, మీ నామంబులను యెవరికై మీరీపాకంబులొనర్చెదరో యీ తెరంగెరింగించితిరేని నే నిపుడే యిచ్చోటు బాసెదనని సవినయముగా ప్రార్థించెను. అంత పంచగంగలు ఓరీ మూర్ఖా మా నామంబులు గంగా, యమునా, సరస్వతి, గౌతమి, నర్మద యని నుడువుదురు. మే మొనర్చెడు పాకంబులు కుక్కుటమహర్షికని దెలియుము ఇక నీవిచ్చట నిలువకుము వెళ్ళిపొమ్ము, మరల వితండంబుగా నీ విందుండెదవేని నీ శిరంబును బట్టి యిందున్న గంగాప్రవాహంబున బడవైచుట నిక్కంబుగా నెఱుంగుమని ఆందోళనంబుగా నుడివిరి. వారి వాక్యంబులకు పుండరీకుండు సంతసహృదయుండై మాతృలారా పుండరీపురంబున నుండి మిగుల దేహపరిశ్రమంబుతో గంగాస్నానంబున

కింగువచ్చితిని, స్నానంబొనర్పక గంగాదర్శనమాత్రంబున పంచగంగ లగు మీ దివ్యస్వరూపంబులం గాంచి మీతో సంభాషించునంతటి భాగ్యం బొందితిని. ఇక మీ కరంబులతో ప్రవాహంబుననే ప్రాణ వియోగం బందితినేని నా పవిత్రత కంతంబు గాన్పింపఁబోదు, గావున మీ రానతిచ్చిన ట్లొనర్పుఁడు, మీరిక పాకంబు లొనర్చుట చాలింపుఁడు, నాసతిచే జేయించెద నని తనసతిని బిలిచెను. అందుకు పంచగంగలు ఓరీ మూర్ఖుడా నీవెఱింగినదే గాక నీ సతికిన్ని మా మర్మంబు లెఱింగించె దవు గాబోలు, ఇందుకై మమ్మింపుగా పూజించి కుక్కుటమహర్షికి మే మొనర్చెడు పాకాదికార్యంబులకు విఘ్నం బొనర్పఁజూచితివి. ఇక నీవింపుండితివేని మునీశ్వరునివలన శాపగ్రస్తుండవగుట నిక్కము తడవు సేయక పొమ్ము, వ్యర్థంబుగా నేందుకు కష్టంబుల పాల్పడియెదవు యని మందలించిరి. అంత పుండరీకుఁడు కుక్కుటమహర్షి యిపు డెం దేగియున్నవాఁ డని యడుగ అందుకు పంచగంగలు తలిదండ్రుల సేవ కేతెంచియున్నవాడని నుడివిరి. అంత పుండరీకుఁడు మాతలారా తన్నెరిగిన మహర్షులు తలిదండ్రుల పూజించుట కవసరం బేమి. మాతృ పితృక్షేత్రపుత్రధనాదులయందు వాంఛలుడిగినవారు గదా మహాత్ము లని నుడువుదురు కుక్కుటమహర్షి తలిదండ్రులయెడ భ్రాంతుఁడై యుండుటకు కారణంబును సుంత యెఱింగింపుఁడని ప్రార్థించెను. అందుకు గంగలు ఓరీ మాతృపితృగురుదైవంబులను నల్వురిలో మొదటి దైవము తల్లి యని నుడువుదురు. ఎట్లంటివేని దశమాసంబులు గర్భంబున ధరించి నానాశ్రమలకోర్చి సుతునిం గని క్షీరంబొసంగి రక్షించునది గావున ప్రథమదైవం బని పూజింపవలయును. తండ్రి సుతునకు సర్వసుఖంబు లొసంగి పోషించువాఁడు గావున ద్వితీయదైవం బని నుడువుదురు. గురువు అక్షరాభ్యాసంబు మొదలు మహావాక్యోపదేశం బాదిగా సమస్తవిద్యలు నేర్పుటవలన తృతీయదైవం బనియు సర్వలోకశరణ్యుం డగు దైవము తనుకరణభువనభోగంబు లొసంగి వారి వారి కర్మానుగుణ్యంబుగా సుఖదుఃఖంబు లొసంగుచు సర్వంబును రక్షించుచు మోక్ష మిచ్చెడువాఁడు గావున చతుర్థదైవంబని శాస్త్రంబు లుద్ఘోషింపుచున్నయవి. మొదటిసోపానంబు లంఘించనేరనివాఁడు ఆవల మూఁడుసోపానంబు లెట్లు గడువగలఁడు. తద్వత్తుగా దశమాసంబులు గర్భంబున ధరించి నానాయిడుములం బడి ప్రసవించి రక్షించిన

మాతయున్ను దయతో పోషించిన పితృవున్ను వృద్ధప్రాయులై పుత్ర వాత్సల్యంబువలన దారిమార్గంబున కాహారపదార్థంబుల భుజంబులపై నిడుకొని దేహపరిశ్రమంబుతో నడువజాలక వచ్చుచున్న తలిదండ్రుల శ్రమంబునకోర్చి నీసతి మార్గాయాసంబున నడువజాలకున్నదియని నీభుజంబులపై నిడుకొని గంగాస్నానంబున కిందు వచ్చిన దురాత్ముండ వగు నీవు తలిదండ్రుల పూజామాహాత్మ్యం బెట్లు తెలియగలవు. సతి వాక్యంబునకు బద్ధుడ వగు నీవు తలిదండ్రుల పాదార్చనఫలం బెటుల నెఱుంగజాలుదువు.

ఓరీ హరిహరభక్తులకును జీవన్ముక్తులకున్ను గురుపుత్త్రుం డను నామంబు సిద్ధించుట దుస్తరము మాతాపితృల భక్తి సలుపువారిని గురుపుత్త్రుండని సర్వజనులును కొనియాడుదురు. ఇందుకు సాదృశ్యం బుజెప్పెద వినుము. పూర్వము శ్రీరామచంద్రుడు గురువగు వసిష్ఠుల వాక్యంబును పితృవగు దశరథవాక్యంబును మరల్చి మాతృవాక్యపరి పాలనార్థము అరణ్యంబులకేగెనని నీవును వినియుందువు. దశరథుడు సభాసదుల సహితుడై యుండెడు సమయంబున శ్రీరామచంద్రుం డం దరిగి కులగురువగు వసిష్ఠులును ఇంక ననేకమహర్షు లందుండ వారికి ప్రణామంబు లాచరించక పితృడగు దశరథుపాదంబులకు నమస్కరించె నని పురాణంబులు నుడువుచున్నవి. ఇందువలన పితృభక్తి ముఖ్యకర్త వ్యంబని జాటుచున్నది. పరనారీగమనము పాతకంబని దెలిసియుండియు కుంతివాక్యపాలనార్థము పాండవులు ద్రౌపదిని గలిసియుండిరి. పరసతి గమనము పంచమహాపాతకంబని శ్రుతులయందు జాటియున్న వ్యాసులు మాతృవాక్యంబును మీఱలేక సోదరుని భార్యను గలసెను. మాతా పితృలవాక్యంబులు మంత్రంబు లని యనుష్ఠించిన వ్యాసాదులు మున్నగువారు ప్రసిద్ధి నొందినవారుగాదా? దురాత్ముండ వగు నీవు పూజార్హు లగు తలిదండ్రుల దూలనాడి కాశీయాత్ర జేసి గంగాస్నానం బొనర్చి నంతనే పవిత్రుండ వెల్లుకాగలవు. గురువు దైవము సతి మున్నగువారిని వేర్వేరుగా సంపాదించనగును గాని మాతాపితృవుల సంపాదించు వారు గలరా? ఓరీ దురాత్మా! మాతృగర్భంబున నీవు నివసించియున్న ప్పుడు యాశ్రమకోర్చి యొక్క అడుగెత్తిపెట్టి నడచినందుకు నీమాం సంబును ఖండతుండంబులుగా ఖండించి యిచ్చినను మాతృఋణంబు

నకు సరిరాదుగదా ఇక నీవు మాతాపితృవులవాక్యంబులే వేదవాక్యం బు లని పాలింపుచుంటివేని సద్గతినొందగలవు. ఇందుకు సందియంబు లేదు. ఇపుడు మేము కుక్కుటమహర్షి మాతాపితృవుల సేవజేయుచుండెడు మహాత్వంబునకు బద్ధులమై శుశ్రూష లొనర్చుచున్న వారము. ఎందుకంటివేని ప్రపంచంబున నుండువారెల్లరు మాయందు స్నానం బొనర్చుటవలన వారిపాపత్వంబెల్ల మమ్ముజెందుచున్నది మేమాపాపత్వంబెల్ల కుక్కుటమహర్షికి సేవయొనర్చి బాపుకొనచున్నారము. ఇంతటి పవిత్రతకు కారణము మాతాపితృవుపూజావిశేషంబై యున్నది. ఇదిగాక మేమీ మహాత్ముని యాశ్రమంబున కరుదెంచనప్పుడు పాపవిశిష్టులమై వికారస్వరూపంబులం బొంది ఇందువచ్చి ఈ మహాత్ముని సేవానంతరము మాయొక్క స్వస్వరూపంబులం జెంది సౌందర్యముఖవిలాసంబులతో జనియెదము. క్రమముగా నిత్యంబీతీరున మేము పవిత్రులగుచున్నవారమనుట నీవిపుడు ప్రత్యక్షంబుగా జూచితివి గదా ఇక సంశయింపక మాతృపితృలభక్తి ననుష్ఠింపుము యని హితోపదేశంబు జేసి అంతర్ధానమైరి. అనంతరము పుండరీకుడు ఆహా నేనెంతమూర్ఖుడనై ప్రవర్తించితి ఇంతటి మహాత్వంబు గల మాతృపితృల నానావిధంబుల హింసించి మహాపాపుడనైతిని యని తన్ను నిందించుకొని తత్క్షణమే తలిదండ్రులు నివసించియున్న సత్రంబునకేగి వారిని కావడిలో నుంచుకొని గంగానదికిం గొంపోయి అందు వారికి స్నానంబు జేయించి పాదార్చనంబు మున్నగు సత్క్రియలెల్ల దీర్చుకొని మరల కావడిలో నుంచి బసకు గొనివచ్చి షడ్రసోపేతంబగు భోజనపదార్థంబుల పాకంబొనర్చి వారికి గుడిపి పిదప తానును తనసతియు భుజించి భుక్తాయాసంబు దీర్చుకొని తలిదండ్రుల యనుజ్ఞబొంది కుక్కుటమహర్షి యాశ్రమంబునకేగి యామహాత్మునకు ప్రదక్షిణనమస్కారంబులు సలిపి మహాత్మా! జన్మరాహిత్యంబున కుచితంబైన మార్గం బుపదేశించి నన్ను కృతార్థునింజేయుదురని తమసన్నిధికేతెంచితి ననుగ్రహింపుడని ప్రార్థించెను. అంత కుక్కుటమహర్షి పుండరీకభక్తుని కరుణారసదృష్టిం గాంచి తలిదండ్రుల సేవామాహాత్మ్యం బుపన్యసించి మహావాక్యోపదేశంబు జేసి పుత్రా నివిక వెఱవవలదు. మాతృపితృల భక్తిప్రపత్తులతో పూజింపుచు మహావాక్యానుసంధానంబు జేయుచుంటివేని కృతార్థుండవగుటకు సుంతైనను సందియంబులేదు. ఇక నీయాశ్రమంబు కేగు

చుని సెలవొసంగెను. అంత పుండరీకభక్తుండు వారి నివాసంబున కేగి మాతాపితలను కావడిలో నుంచుకొని సతిని వెంటదీసుకొని పండరీపురంబునకు జేరి నిత్యంబును తలిదండ్రుల కావడిలో నుంచి చంద్రభాగా నదిలో స్నానంబు జేయించి నదీతీరంబున వారికి పాదార్చనాది కృత్యంబులం దీర్చి గృహంబునకు గొంపోయి శుశ్రూష లొనర్చుచు కాలము గడపుచుండెను. ఇట్లుండగా, అవంతినగరంబునకు సమీపంబున నొకగ్రామం బుండెను. యాపురంబున కాంతాబాయి యను నొక విప్రకన్యక బాల్యంబున అయిదేండ్లప్రాయమునుండి శ్రీకృష్ణవిగ్రహమును భక్తిప్రపత్తులతో బూజింపుచుండెను. ఇంతియే గాక రేయింబవళ్ళు శ్రీహరిసంకీర్తనంబులం బాడుచు భక్తిగ్రంథంబుల పఠించుచు కాలము గడపుచుండెను. ఇట్లుండగా యామెకు యౌవనప్రాయం బతిశయించుట తల్లిదండ్రులు గాంచి నామెకు వివాహంబు జేయ యత్నించి తగు వరుని విచారింపుచుండిరి అది యెఱింగి కాంతాబాయి తల్లినిం జూచి అమ్మా నాకొఱకు మీరలు వరుని విచారించ నక్కఱలేదు. నేను శ్రీహరిని వరునిగా నిశ్చయించి యున్నదానను, యెట్లైనను మాధవుని వరునిగా బడయుదును గాని బ్రహ్మరుద్రాదులు వచ్చినను నేను సమ్మతించుదానను గాను, ఇది నానిశ్చయం బని పలికెను. అది విని యామెతల్లి దురంతచింతాక్రాంతయై పుత్త్రినింగాంచి కుమారీ నీకోరిక మిగుల దుర్ఘటంబైనది. వైకుంఠవాసు డగు కృష్ణుం డెక్కడ మానవవనితవగు నీ వెక్కడ? నీవుగోరుట నిరర్థకంబేగాని సఫలంబుగాదు, ఈ దుస్సహం బగు యత్నంబును జాలించి నీకు దగిన యొక విప్రసుతుని పెండ్లియాడి సుఖం బనుభవింపుము. మాతృవాక్యంబు నుల్లంఘించకుమని హితోక్తులు గఱపి తన పనులకు వెళ్ళిపోయెను. అనంతర మా కాంతాబాయి యౌవనోద్రేకంబువలన అంతకంతకు మాధవునియందు మోహం బతిశయించి తాను బూజింపుచున్న కృష్ణవిగ్రహంబును అప్పుడప్పుడు ముద్దిడుచు ఆలింగనంబు జేయుచు మాధవా నీ వెప్పుడు నా యెదుట ప్రసన్నంబై క్రీడాదులం దృప్తి గావింతువు, నే నెవ్వరిని వరించుట లేదనియు నిన్నే వరునిగా నిశ్చయించియున్న నాదు తీర్మానంబు నీ వెఱింగియుందువు గదా యిక తడవుసేయక ప్రసన్నుండవై నామనోరథం బీడేర్పు మని ప్రతిదినంబును మనంబున గుందుచుండెను. ఇట్లుండ

యొక్కనాడు కాంతాబాయి తన బృందావనంబునం బ్రవేశించి సంధ్యా కాలంబున శ్రీహరిసంకీర్తనంబులం బాడుచు మదనశారిచే నొక తరు మూలంబునం బరుండి ప్రలాపించుచుండెను. యామొఱమైనని వైకుంఠాధిపుని వీనులు సోకినంతనే భక్తాభీష్టప్రదుండు కాంతాబాయి మనోనిశ్చయం బెఱుంగవలె నని యొక గంధర్వనాయకుండునుం బోలె యతిసుందరాకారంబైన రూపం బాశ్రయించి విమానారూఢుండై కాంతాబాయి యుండెడు వనంబునం దిగెను. అంత నావనం బెల్ల దివ్య పురుషుని తేజఃపుంజంబులచే నావరింపంబడి కాంతాబాయి కనులకు మిరుమిట్లు గొల్పించుచుండెను. అది గాంచి యామె మనంబునం దచ్చెరు వంది చెలులం గాంచి సఖులారా వనంబెల్ల మహాద్భుతతేజం బొక్కటి యావరించియున్నది గాంచితిరా? ఇయ్యది యేమైనది నే నెఱుంగజాల కున్నాను, మీరైనం దెలుపుం డని బలికెను. అంత నా చెలికత్తెలు అమ్మా మాకును యేదియు దోచలేదు అయినను జూచివత్తు మని వనంబెల్ల నలుప్రక్కల పాఱజూచి అందొక పార్శ్వంబున విమానంబును తేజఃపుంజంబులచే భాసిల్లుచున్న పురుషశ్రేష్ఠునింగని వా రొంటబలు కక కాంతాబాయి కెఱింగించిరి. అంత కాంతాబాయి ఓహో శ్రీహరి నాగమనస్థంబు బాపుటకై విచ్చేసెనో గాబోలు నని మనంబున నూహింపు చుండెను. అప్పు డాపురుషశ్రేష్ఠుడు కాంతాబాయి యెదుట నిలిచి నీవేజాతిం జెందియున్నావు, నీవు భగవంతుని పరదేవతారూపిణి యగు మాయ వగుట నిక్కము, నీ భ్రూతల లనెడు రెండువిల్లను దాల్చి యుండుట నీస్నేహితుడ నగు నా కార్యంబును నెఱవేర్చుటకు గాబోలు, లేక స్వీయకార్యము నెఱవేర్చుటకా ఆవింటిచే నీకేమి ప్రయోజనము ఆలోచింప నింద్రియాధీనుల మగు మాబోటివారిని జయించు నీచాపద్వ యంబు నవలంబించియున్నావా యేమి? నీవనమందు నా బాణముల నెవ్వ రిపై ప్రయోగింతువో తెలియలేకున్నాను. వనజనేత్రీ! తాపసుల తపస్సు నపహరించెడు యీరూపము నేతపంబు జేసి సంపాదించితివో నెఱుగజాలకున్నాను యని స్త్రీలను స్వాధీనులనుగా జేయదగినంత నేర్పు విశద మగునట్లు భాషించెను. యీ వాక్యంబుల వినినంతనే కాంతా బాయి మండిపడి, ఓయీ నీవెవ్వడవు, స్త్రీ లుండెడు స్థలంబునకు రా గతం బేమి, వచ్చినవాడవు వచ్చినట్లో వను వెళ్లక నీనోటవచ్చినట్లు వదరు

చున్నావు, పరస్త్రీలను మోహముతో జూచువారికి నరకము దప్ప దను మాట నీ వెఱుగవు గాబోలు? ఇక క్షణకాలమైనను నీ విందుండ తగదు వెళ్ళిపొమ్ము, లేకున్న శాపంబు ఘటించు నని ఖండితంబుగా బలికెను. అంత నాగంధర్వుండు మందగామిని నేను మేరుప్రాంతంబున నొక గంధర్వనగరాధిపతిని, నేనిటు విహారార్థంబుగా విమానారూఢుండనై జనుచుండి నీదు ప్రలాపంబు విని యిందు వచ్చి నిన్ను గాంచినది మొదలు మోహం బగ్గలంబై కాముబారి కోర్వజాల కున్నవాడ దదయక నావ్యథను బాపి రక్షింపుము. ఇక సైరింప నావశము గా దని యామెను బట్టుకొనంబోయెను.

అంత నామె సుంతదొలగి, ఓరీ దురాత్మా నీ వెంత జెప్పినను వినువాడవుగా నుండ లేవు, వృథాకష్టంబులకు పాల్పడజూచుచున్నావు. నేను శ్రీహరిని వరునిగా తీర్మానించి యాతనిగాక వెనుకచూచుచున్నదానను గావున నాయం దాశ గోసి నీవు వచ్చినత్రోవంబట్టి వెళ్లుము యని అదలించి బలికెను. అంత నారమావిభుండు గంధర్వరూపంబువీడి స్వస్వరూపంబుతో నాభక్తాగ్రేసరికి సేవ యొసగి మానినిమణీ నీతపంబునకు మెచ్చితి, నీదు నిశ్చయం బెఱుంగుటకు గంధర్వుండనై వచ్చితిని, పిదప నా సేవనిచ్చితిని నీకు వలయువరంబుల వేడుకొనుము యని జెప్పచున్నంతలో భూలోకవైకుంఠంబైన జగన్నాథంబునందు రాధ కృష్ణుడు లేడని యెఱింగి యెందుబోయెనని దివ్యదృష్టిచే పరికించి కాంతాబాయి యొద్ద యుండుట యెఱింగి అచటికి కేతెంచి క్రోధమనస్కయై యేదియు బలుకక యూరకె నిలుచుండెను. అంత కాంతాబాయి రాధరాకం జేసి తనయభీష్టంబు స్వామికి నెఱింగించుటకు సమయము గాకుండెను. భగవానులు ఏదియు బలుకక నిలుచుండిరి. రాధ వారిర్వురు నేకాంతంబుగా వనంబున నుండుటవల్లను తనతో నొక్కమాటయైన బలుకకుండుటకును వీరిని జూడ తప్పు జేసినయట్లు గాన్పించుచున్నారు. ఇక వీరి మోమైనం జూడరా దని చివాలున దిరిగి దిండిరవనంబున కేగి తపం బాచరించుట యుక్తం బని వెళ్లిపోయెను. అది యెఱింగి కృష్ణభగవానులు కాంతాబాయీ ! రాధ మహాగ్రంబుగా వెళ్లినది గాన సమాధానపరచివచ్చి నీమనోరథంబీడేర్చెద సుంతనిదానింపు

మని రాధను వెదకుచు బోవుచుండగా చంద్రభాగాతీరంబున పుండరీక భక్తుడు తల్లిదండ్రులకు సేవ జేయుటనుగాంచి అచ్చెరువంది ఆహా ఇట్టి మహాత్ముం డిలలో నెందును గాన్పింపబోడు, తలిదండ్రుల పూజించు వారిలో నితఁ డగ్రగణ్యుం డని నెన్నదగియున్న వాడు యని దలపోయుచు కొంతదడవు యచట బురదలో నిలు చుండెను. అంత పుండరీకభక్తుం డతనిం గాంచి యెవరయా మీరు చాలాసేపునుండి బురదలో నిలిచియున్నవా రని యడిగెను. అంత వాసుదేవుడు అయ్యా భక్తాగ్రగణ్యుడా నేను వసుదేవునకు దేవకీదేవికి నందనుండను కృష్ణుం డను నామధేయంబు గలవాడను నిన్నిందుగాంచి నీవొనర్చెడు మాతాపితరులభక్తికి నచ్చెరువంది ఆనందావేశంబువలన నిలిచియున్నవాడ నీభక్తికి మెచ్చితి నీకు వలయు వరంబులు వేడుము యనుగ్రహించెద నని దయతో సెలవొసంగెను. అంత నాపుండరీకభక్తుండు దేవదేవోత్తమా తాము దాసుని కొఱకు చాలాకాలమునుంచి బురదలో నిలుచుండినను దురాత్ముడనగు నేను మెఱుగజాల కున్నందులకు నాదు నేరమును క్షమింపవలయు నని ప్రదక్షిణనమస్కారంబులు సల్పి అం దొక యిటుకరాతిపై దేవుని నిలుచుండున ట్లొనర్చి, పుండరీకాక్షా! నాతలిదండ్రులకు సేవ యొనర్చి వచ్చుదనుక తా మిందు విచ్చేయుము, సేవానంతరము నేవచ్చి వరంబులు వేడికొనియెద దయతో ననుగ్రహింపుమని ప్రార్థించెను. అంత లక్ష్మీపతి సమ్మతించి యనుజ్ఞ యొసంగెను. పుండరీకభక్తుండు భగవదాజ్ఞానంతరము తలిదండ్రుల పూజావిధానంబు లెల్లయు దీర్చుకొని వారిని కావడిలో నుంచి గృహంబునకు గొంపోయి భుక్తంబొనంగినపిదప భీమానదీతీరంబున పుండరీకాక్షుని సందర్శించి వరంబులు వేడుటకుం దేగవలసిన విధంబును తలిదండ్రుల కెఱింగించెను. అందు కాతనితండ్రి పుండరీక భక్తాగ్రగణ్యునిం గాంచి పుత్త్రా! లక్ష్మీపతి నీకొఱకై భీమానదీతీరంబున చాలాసేపునుంచి బురదలో నిలిచియున్నవాడుగదా, కుమారా! నీభాగ్యంబు నేమనివర్ణింతు మహాతపంబు లాచరించువారికిసహితము దామోదరునిసందర్శనం బతిదుర్ఘటంబై యున్నది. అట్టి నిమహానై పుణ్యంబు సర్వజీవు లుజ్జీవించునట్లు వరంబుల వేడుకొనుము. నీవొక్కనినిమిత్తము వరంబులు వేడు టుచితంబుగాదు వేగ మేపొమ్ము యని యాజ్ఞాపించెను. అంత తలిదండ్రుల యనుజ్ఞ బొంది భీమానదీతీరంబున కేగి పురుషోత్త

మునిగాంచి నేసమీపంబునకేగి వరంబులు వేడితినేని నాపితృవాక్యాను సారము యనుజ్ఞయొసంగునో యొసంగడో అట్లనుగ్రహించడేని నాపితృ వాక్యంబునకు విఘ్నంబు వాటిల్లు, ఇందుకేమి జేయుదు నని నిశ్చేష్టితుడై గోపాలుని ఆపాదమస్తకపర్యంతము దృష్టుల నిలిపి నిర్వికల్పుడై చిత్ర లిఖితంబుగూడ్క నిలు మండెను. పిదప కొంతదడవునకు స్మృతి గల్గి పుండరీకాక్షా నీకు వందనము. తా మిప్పు డుండునట్లుగనే సర్వజనులకు సేవయొసంగుచుండునట్లు అనుగ్రహింపుము దేవా యుని ప్రార్థించినంతనే లక్ష్మీపతి సమ్మతించి దివ్యమంగళవిగ్రహంబుతో సర్వజనులకు సేవ యొసంగుచు శిలారూపంబుతో ప్రకాశింపుచున్నవాడు గావున పండరీ పురంబున విరాజిల్లుచున్నందున పండరీనాథు డనియు పుండరీకభక్తుని కొఱకు నెలకొనినందున పుండరీకవరదు డనియు ఇంకయు ననేకపర్యా యనామంబు లేర్పడినవి.

పుండరీకభక్తునిచరిత్రము ముగిసెను.

శ్రీ ర స్తు.

శ్రీకృష్ణపరబ్రహ్మణే నమః.

# గు రు స్తు తి.

ఓం పరబ్రహ్మణే నమః, గణేశాయ నమః, కార్తికేయాయ నమః, శివాయ నమః, విష్ణవే నమః, భార్గవ్యై నమః, గౌర్యై నమః, భారత్యై నమః, చతుర్ముఖాయ నమః, నారదాయ నమః, దక్షిణామూర్తయే నమః, దత్తాత్రేయయోగీశ్వరాయ నమః, శ్రీమత్పరమహంసపరివ్రాజకాచార్యవర్య శ్రీమచ్ఛంకరాచార్య పదాంబుజాభ్యాం నమః, సచ్చిదానందస్వరూప మమ సిద్ధగురు రోడ్స్వామినే నమః అని సద్గురు పరంపరాభివర్ణనము జేసి జయదేవులచరిత్రంబు జెప్పుచున్నాను.



# జ య దే వు ల చ రి త్ర ము.

సదసద్వివేకము గల యుత్తమసిద్ధులకు నాభాజిసిద్ధుండు జయదేవులచరిత్రంబును జెప్ప నారంభించి, సిద్ధులారా! వినుఁడు. భరతఖండంబున సమస్తదివ్యక్షేత్రములందు నుత్తమక్షేత్రం బని స్తవనీయంబై యుండెడు జగన్నాథంబునకు సమీపమున నొక కుగ్రామము గలదు.

అయ్యది సామాన్యగ్రామం బైనను స్వవర్ణాశ్రమోచితధర్మనిలయంబై నదులచేతను వనంబులచేతను తటాకంబులచేతను శృంగారంబుగా నుండుచుండెను. యాగ్రామమున నారాయణశాస్త్రి యను నొకసద్బ్రాహ్మణుం డుండెను. అతను వేదశాస్త్రపురాణంబు లెఱింగినవాఁడై యెప్పుడును సత్పురుషుల సేవింపుచు కామక్రోధాదిదుర్గుణంబుల జయించి ఆత్మజ్ఞాననిష్ఠుఁడై సుఖదుఃఖసమానుఁడై నిత్యానందమును బొంది సర్వదా అష్టాక్షరిమంత్రంబును జపించుచు అజ్ఞాన మను చీకటిని సుజ్ఞాన మను వెలుఁగుచే ధ్వంసము జేసి సర్వజనులవలన కొనియాడబడు చుండెను. అతనికి విమలానందమే నొక్కరూపంబై కమలాబాయి యను నుత్తమచిత్తురా లగు భార్య యుండెను యామె శాస్త్రజ్ఞానము గలిగి సదసద్వివేకసంపన్నురా లయి యసమానసౌందర్యరూపరేఖావిలాసంబులం బ్రకాశింపుచుండెను. తన యింటికి వచ్చెడు అతిథి అభ్యాగతులకు అన్నవస్త్రాదు లిచ్చి సంతుష్టిపఱచి పంపునే గాని వారి మనస్సు నొప్పింపదు, ఇటువంటి అపూర్వ మైన సుగుణములు గలిగి ప్రవర్తింపు చున్నందున సర్వజనులు యామెను స్తవము జేయుచుందురు. వారికి సమస్తైశ్వర్యంబు లున్నను పుత్త్రులు లేనందున కమలాబాయి మనంబున జింతింపుచు జగన్నాథునికి నెప్పుడపుడు తన కొఱతను జెప్పుకొను చుండును. భగవాను లేమో కరుణించిన వారు కాదు. కమలాబాయికి నంతకంతకు భక్తి పెంపొంది దురంత చింతాక్రాంతయై స్తుతింపుచు, భక్తవత్సలా! దీనశరణ్యా! పురుషోత్తమా! పుండరీకాక్షా! పద్మనాభా! కమలనయనా! కరుణాసముద్రా! యీ దీనురాల నగు నాయందు పరిపూర్ణానుగ్రహ ముంచి మేము సద్గతి నొందునట్లు సద్గుణశీలుం డైన నొకపుత్త్రుని బ్రసాదింపుము. పరమేశ్వరా! యని మొఱలిడు చుండెను. యామొఱ విని జగన్నాథమూర్తి దయగలవాఁడై యొకరేయి నారాయణశాస్త్రి స్వప్నంబున బొడగాంచి, ఓయి నీభార్య నన్ను నుద్దేశించి జేయుచున్న తపంబునకు మెచ్చి కోర్కె యీడేరునట్లు వరం బిచ్చితి. ఇక చింతింప నవసరము లేదు యని అంతర్ధానం బాయెను. అంత నారాయణశాస్త్రి యాక్షణమే మేల్కాని అం దెవ్వరిని గానక అచ్చెరు వంది చెంతనున్న సతిని మేల్కొలిపి తాను కలగన్నవర్తమానం బెఱింగించి, కోమలీ! నీవు గోరియున్న కోర్కె యేమి? శీఘ్రముగా జెప్పుము వినవలె నని

నామనం బతి తొందర పెట్టుచున్నది యని బలికెను. అందు కాసుదతి సంతుష్టహృదయయై లేచి మనోహరా! మనము కృతార్థుల మగునట్లు సద్గుణశీలుం డైన యొకపుత్త్రుని గోరుచుంటిని యని నుడివెను. అది విని నారాయణశాస్త్రి దురంతచింతాక్రాంతుడై, ఓసీ! నీ వెంతజ్ఞానహీన వైతివి. స్త్రీలకు బుద్ధిచాపల్య మెక్కు డన్నవిషయము నీవల్ల నిజమైనది. మోక్షసామ్రాజ్యము నొసంగ శక్తు డగు పరమేశ్వరుని ఆత్మసాక్షాత్కార మనుగ్రహింపు మని గోరక ఐహికాపేక్ష లన్నిటిలో అతితుచ్ఛంబుగా నెన్నదగిన పుత్త్రివాంఛను గోరితివి. అక్కటా! చాలాకాలమునుండి శ్రద్ధాభక్తులతో పరమేశ్వరు నారాధించు చున్న నీకు పుత్త్రేషణయందు కాంక్ష గలిగినది జూడగా కొండత్రవ్వి యెలుకను బట్టినట్టు శాశ్వతసుఖప్రదం బైన భగవదారాధనము జేసి కర్మఫలమును సంపాదించితివి. బుద్ధి కర్మాధీనంబై యుండగా నీ వొనర్చునదేదియు లేదు. గడచినకార్యమున కిక చింతించిన లాభ మేమి? యని మిగుల చింతాక్రాంతుండై సతితో భాషింపక యూర కుండెను. ఈ మాటలు విన్నంతనే కమలాబాయి రిచ్చవడి పతియెదుట నిలుచుటకు భయ మొంది గదిలోనికి బోయి అహా పుత్త్రులు లేనివారికి పున్నామ నరకంబు లున్న వని జెప్పెడు పురాణవాక్యమును నమ్మి పతికి విముఖురాల నైతిని. ఇక నాకెవ్వరు దిక్కు. యని బహువిధముల తన్ను నిందించుకొని యేకమనస్సుతో జగన్నాథుని గూర్చి చింతింపు చుండెను. యీ విధంబుగా సతిపతు లిద్దరు యీ దినం బెల్లయు ఆహారంబు లేక రేయి నిదురరాక పరుండియుండు సమయంబున ఆపన్నరక్షకుం డగు లక్ష్మీపతి నారాయణశాస్త్రి యెదుట బ్రాహ్మణరూపంబుతో గనబడి ఓయి మీ రెందు కీలాగున గుందుచున్నారు మీకు గలుగబోవు పుత్త్రునివలన మీవంశము వారును విరక్తివలన మీరును కృతార్థులగుదురు ఇందుకు సుంతైనను సందియంబు లేదు లేచి ఆహారంబుల భుజింపుడు లెండు యని జెప్పి మరగిపోయెను. అంత నారాయణశాస్త్రి దివాలునలేచి తాను వినినసంగతు లెల్లయు భార్యతో జెప్పి సంతసహృదయారవిందుడై భార్యయందు మునుపటికన్నను అతిశయించిన ప్రేమ గలవాడై యుండెను. అంత కొన్నాళ్లకు పిదప శ్రీవైకుంఠంబున లక్ష్మీ మొదలగు అష్టభార్యాసమేతుండై నారదాదిభక్తవరులు తన్ను పరివేష్టించి యుండగా శ్రీమహావిష్ణువు తన సన్నిధినున్న వేదవ్యాసులను

జూచి, ఓయి మునికులసార్వభౌమా! పూర్వము మనము భూలోక సంరక్షణార్థము తీర్మానించిన ప్రకారము జగన్నాథసమీపమున నుండెడు బిల్వగ్రాం యను పల్లెయందుండు నారాయణశాస్త్రి భార్యయగు కమలాబాయి గర్భంబున నవతరింపుము, లోకము నుద్ధరింపుము, బొమ్ము యని యాజ్ఞాపించెను. అంత వ్యాసులు మహాప్రసాదం బని కమలాబాయి గర్భమున ప్రవేశించగా నవమాసంబులు గడచిన పిదప నొక శుభముహూర్తంబున మహనీయం బైన విజితమారునిం బోలె కమలాబాయి కొమరునిం గనెను. సిద్ధులారా! సమస్తజన్మంబులయందు మానవజన్మ ముత్తము మైనది. అందు సాక్షాత్ నారాయణాంశసంభూతుఁడైన వ్యాసమునీంద్రుఁడే యవతరించి నపుడు యేమని జెప్పనగును. అతను వేదంబుల చిక్కులన్నియు విడదీసినవాడును, పదునెనిమిదిపురాణంబులను రచించినవాఁడును, తపోధనుఁడును, ఆచారహేతువును, ఆత్మజ్ఞానసంపన్నుఁడును, హరిభక్తుఁడును అయిన మహానుభావుని యెవరు బొగడదగియుందురు. అంత కమలాబాయి నారాయణశాస్త్రి తేజోనిధియగు పుత్రుని గాంచి పరమాహ్లాదమునొంది భగవదాజ్ఞప్రకారము కృతార్థుల మైతి మని యుప్పొంగి జాతకము వ్రాయించి జయదేవుఁడని నామ మిడి అక్షరాభ్యాసము వుపనయనము మున్నగునవి యథాక్రమముగఁ జేసి పుత్రునికి దినులు వచ్చినట్లుగా ఆనందభరితాంతఃకరణులై యుండిరి. అంత జయదేవుఁడు శుక్లపక్షచంద్రునివలె దినదినప్రవర్ధమానుఁడై సర్వవిద్యలయందతి తీవ్రకుశలప్రతిభ గలవాఁడై నక్షత్రములలో చంద్రునివలె బ్రాహ్మణులలో జయదేవుఁ డత్యంతప్రసంశనీయుఁడై యుండెను. ఇట్లుండఁగా, జగన్నాథంబున నొక బ్రాహ్మణోత్తమునికి పద్మావతి యను కూతురుండెను. యామె రూపరేఖావిలాసంబులలో యసమానరూపిణియై యున్నందున జూచువారెల్లరు యీమె రతీదేవి యని మెచ్చుకొనుచుండిరి. యామె తలిదండ్రులు యీ యసమానసౌందర్యవతికి దగిన వరుడీ భూమండలంబున నెచట గాన్పించునో యని చింతింపుచుండిరి.

ఇట్లు కొన్నాళ్ళు గడచినపిదప యాకన్యకు ప్రౌఢప్రాయము రాగా నామె తలిదండ్రులు నీమె నిక నుంచుకొనరా దని దలంచి వారికులంబున నామెకు దగినవరుని విచారించగా కొందరు జయదేవుం డను నాతఁడు సర్వశాస్త్రకోవిదుండై యఖిలలావణ్యంబు గలిగ

యున్న వాఁడు నీకూఁతునకు యతఁడుదప్ప యిందు మఱెవ్వఁడును గాన్పింప రాఁ డనిరి. అది విని యామెతండ్రి వారికులంబున పెద్దమనుష్యుల బిలిపించి జయదేవునకు తనపుత్త్రి నిచ్చి సాలంకృతకన్యాదానముగా వివాహము తానే జేయునట్లు నారాయణశాస్త్రికి వర్తమానము బంపెను. వారు జయదేవుల తల్లిదండ్రులకు యావృత్తాంతము జెప్పి వారిసమ్మతి నెఱింగి పద్మావతితండ్రి కెఱిగించిరి. అంత జయదేవులకు పద్మావతి నిచ్చి వివాహము జేయుటకు నొకశుభదినము నిశ్చయించి బంధుజనులను రావించి పచ్చతోరణాలంకారంబులు జేసి రంగవల్లి ముగ్గులుబెట్టి పెండ్లిపీటలపై వధూవరుల గూర్చుండ నియోగించి నలుగులుబెట్టి స్నానంబులు జేయించి పట్టుపుట్టంబుల దొడగి రత్నమయాభరణంబులచే నలంకరించి చందనాదు లలంది బ్రాహ్మణాచారప్రకారము వివాహమహోత్సవము జరిగించి విందులు బెట్టి బంధుజనులకు వారివారికి దగు మర్యాదలు జేసి అల్లుని కూతుని తనయింట కొన్ని దినంబు లుంచుకొని పిదప జయదేవునకు పద్మావతికి భూషణాంబరము లిచ్చి తగు మర్యాదతో బిల్వగ్రామునకు దీసుకవచ్చి వదలిపోయిరి. తర్వాత జయదేవులు అన్యోన్యభోగరాగములతో ఆమెయందు సుఖమనుభవింపుచుండెను. యాదంపతులసానుకూల్య మిట్టిదట్టిదని జెప్పనలవిగాక యుండెను. ఇదిగాక, గృహస్థాశ్రమంబున యుండవలసిన మేరకు స్నాననియమజపాదిసత్కర్మములను తప్పక యనుష్ఠించుచు సత్పురుషులసేవయందు మఱింత ఆసక్తిపరుండై సురులు మెచ్చునట్లు గృహధర్మంబు నిర్వహింపుచుండెను. ఇట్లుండగా నారాయణశాస్త్రి జయదేవులను చెంత నుంచుకొని నాయనా నాకున్ను నీతల్లికిని వృద్ధావస్థ మీఱుచున్నది, పూర్వము జగన్నాథమూర్తి నీవలన మన వంశస్థులను, వైరాగ్యంబువలన మనుష్యులను కృతార్థులనుగా జేయునట్లు వరంబిచ్చియున్నాఁడు గావున అరణ్యంబున కేగి తపం బాచరించి నిత్యానందకైవల్యసామ్రాజ్యం బనుభవించెదము. నీవు గృహస్థాశ్రమంబున సత్యవ్రతానుష్ఠానపరుండవై సమస్తసుఖంబు లనుభవింపుము పుత్త్రా! సమస్తవ్రతంబులయందు సత్యమె ప్రసిద్ధి గాంచినది. ఇందుకు దృష్టాంతంబుగా గోవ్యాఘ్రసంవాదం బను నితిహాస మొక్కటి జెప్పెద నాకర్ణింపుమని జెప్పఁదొడంగె.

## గోవ్యాఘ్రసంవాదము.

పూర్వము యమునానదీతీరంబున గోపాలాశ్రమం బను నొక పుణ్యాశ్రమంబు గలదు. అందొక విప్రోత్తముండు దారపుత్రాది సహితుండై శిష్యబృందంబులతో వానప్రస్థాశ్రమంబున పర్ణకుటీరంబు గావించుకొనియుండెను. ఆవనంబు తరులతాగుల్మమృగపక్షిజాలంబులచే అతిమనోజ్ఞంబై యొప్పుచున్నది. అందు వసించుచున్న విప్రోత్తమునిసతి పతివ్రతానుష్ఠానయై నిర్దోషంబైన శుశ్రూషలు జేయుటయే తనకు ముఖ్యకర్తవ్యం బని తలంచి పతిభక్తియందే కాలము గడపుచుండెను. ఆమె పతి దేవదత్త సోమయాజులు ప్రతిదినంబును నియతితో అగ్నులను బూజింపుచుండుచు, ఆయజ్ఞకర్మంబునకు వలయు క్షీరంబు నొకధేనువు యరణ్యంబున నుండి వచ్చి ప్రతిదినంబును పిదికి పోవుచుండుచు ఇట్లు కొంతకాలము గడచిన పిదప యరణ్యంబున నొకనాడు పొదచెంత పూరి మేయుచుండగా, చెంతనున్న పొదలో నొక వ్యాఘ్రము యాహారంబు లేక క్షుత్తుచే మిగుల బాధంపడుచు పొదచెంత మేయుచున్న గోవృషం గాంచి సంతసచిత్తమై ధేనువుపై లంఘించెను. అపు డాధేనువు నా యాపదనుండి తప్పించుకొనుటకు పరువిడసాగిన నది యెరింగి వ్యాఘ్రము గోవు వెన్నంటి పరువిడి బట్టుకొని భూమిపై ద్రొబ్బి జంప నుంకించె. అంత నాగోవు మనంబున సుస్థైనను శంకించక పులినింగాంచి, ఓయి మృగరాజమా! నిరపరాధి నగు న న్నెందుకు హింసించబూనెదవు, నీకు నే నేమియు యపకృతి యొనర్చినదానను గాను, నాకు బుద్ధి దెలిసినది మొదలు యెవ్వరికి నే నపకృతి యొనర్చినదానను గాను, అరణ్యంబున మేయుచు ప్రతిదినంబును యజ్ఞంబునకు క్షీరంబు బితుకుచు శుష్కదేహంబుతో శల్యవిశిష్టంబై యున్నదానను, ఇట్టి పుణ్యకార్యంబునకు సహకారిగా నుండెడు నన్ను వధించుట నీకు ధర్మము గాదు, శుష్కదేహంబుతో నున్న నన్ను వధించుటవలన నీకు క్షుత్తు జల్లారనేరదు, నన్ను వదలి వేయుము యని ధేనువు వచించెను. అంత నా వ్యాఘ్రము ధేనువు శాంతివాక్యంబులను విని, తానును శాంతితో జెప్పుచున్నది, ధేనుసత్తమా! నీవు వచించుచెల్లయు సత్యమే. అయినను ప్రస్తుతము జఠరానలజ్వాలచే తపించుచున్నందున నిన్ను వదలి వేసితినేని యితరమాంసంబు లేవియు గాన్పింపదు, యెటులైనను

నీదు మాంసంబునే భుజించి నాదుక్షుద్బాధ మాన్పుకొనవలసియున్నది, పరులను హింసించియైనను మహాపాతకముల జేసియైనను సర్వప్రాణులు ఆత్మసంరక్షణ జేసుకొనవలసినది ముఖ్యధర్మముగా నున్నది యని వ్యాఘ్రము బలికినంతనే ధేనువు, వ్యాఘ్రపుంగవా! పరులను పీడించుటే పాపంబు, అట్టుల పీడించి మలమూత్రరక్తకఫవాతపైత్యసంకులంబై యుండెడు శరీరంబును పోషించుటవలన సుంతైనను సుఖము గలుగనేరదు, అయినను ప్రతిదినంబును యజ్ఞంబునకు ప్రతిఫలంబు గోరక క్షీరం బొసంగెదు నిష్కామి నగు నన్ను వధించి భుజించుటచే నీకు మిక్కుటమగు పాపంబు గలుగుననే పశ్చాత్తాపంబువలన నింత జెప్పితినే గాని శరీరాభిమానంబు గలిగి కాదు, "పరోపకారార్థ మిదంశరీరమ్" అనునట్లు నాదు శరీరము నిష్ప్రయోజనముగా మృతినొందుటకన్నను నీ కాహారం బగునట్లు పుండరీకాక్షుడే నాకీ సత్కార్యంబు తటస్థింప జేసినాడుగాకని మిక్కిలి సంతసింపుచున్నాను. అయినను నే నొక మనవి జేయవలసియున్నది. యెట్లనగా, నేనొకసారి యాగ్నికుడైన దేవదత్తసోమయాజుల దర్శించి వచ్చునట్లు యాజ్ఞ నొసంగితి వేని నే నాతనిం గని వెంటనే వచ్చెద నని ప్రార్థించెను. అది విని వ్యాఘ్రము, ధేనుసత్తమా! నీవు వచించుట నాకు మిగుల చోద్యముగా గన్పట్టుచున్నది. అరణ్యంబున నొంటరినై ప్రాణంబుల గోల్పోవ సిద్ధంబైయున్న నీవు విప్రుని జూడవలసిన పని యేమి తటస్థించినదో సుంత తెలియజేయుము యనగా, ధేనువు ఓయి శార్దూలసార్వభౌమా! నేను ప్రతిదినంబును యజ్ఞంబునకు క్షీరం బొసంగుచున్నదానను గావున నే నిక్కువము నీకాహారంబైతినేని రేపటియజ్ఞకృత్యంబునకు క్షీరంబు లేక భంగంబువాటిల్లు విప్రుండు కోపంబుచే శాపం బిడు, దాన నిందుచే నే నింత ప్రతిఫలరహితంబుగా యజ్ఞంబునకు క్షీరం బొసంగుచుండిన పుణ్యం బెల్లయు విఫలం బగుటయే గాక విప్రశాపంబువలన నరకప్రాప్తంబు గలుగు, నిందుకై యా సోమయాజులం గని యిదిమొదలు క్షీరంబునకు వేఱొక ధేనువును సంపాదించుకొనుం డని జెప్పివచ్చుటకై ప్రార్థించితినే గాని మఱేమియు గాదు, నీవు సంశయింప బనిలేదు, నా మాట సత్యమని నమ్ముము, యని నిష్కపటంబుగా బలికెను. అందు కాపులి, గోరాజమా! నీవు జెప్పుట ధర్మముగానే దోచుచున్నది. అయినను నీ వచటికి బోయిన పిదప దేహాభిమానంబు గలిగి

వంచనమతివై తివేని నేనేమి జేయుదును. మఱొక జీవంబునైనం బట్టి తినుటకు నాకు శక్తి గాన్పింపలేదు. ఇఁక నేదేని యొక నమ్మకము జెప్పి వెళ్లి రమ్మనెను. అందు కాధేనువు నేనొక ప్రమాణము జేసి యిచ్చెదను నమ్ము మని జెప్పి, అయ్యా శార్దూలసార్వభౌమా! నే జెప్పి నట్లు జేయక తప్పితినేని నేనంతకాలము ప్రతిఫలాపేక్ష లేక యజ్ఞంబునకు క్షీరం బొసంగుచు గనినట్టి పుణ్యంబులెల్లయు పాపపుంజంబై నరకప్రాప్త నగుదాను. ఇక నీవు నాకుం గొంతవడికి సెలవొసంగుము నే బోయివచ్చెదను యని బలికెను. అంత నా పులి ధేనుసత్తమా! క్షుత్తు వలన బాధింపంబడుచున్న నన్ను రక్షించుము, వేగమే బోయిరమ్ము యని బంపివేసెను. పిదప యాధేనువు గోశాలాగ్రంబునకుబోయి విప్రునిం గాంచి కనులనీరు ధారధారలుగా విడుచుచు నిలుచుండెను. అదెఱింగి విప్రుడు గోవునకు సంభవించిన యాపద యెట్టి దని దెలి యక దురంతచింతాక్రాంతుండై యజ్ఞశాలకుం జని యజ్ఞమూర్తి యగు చతుర్ముఖుని ధ్యానించి ధేనువు భాషించునట్లు అనుగ్ర హింపు మని వేడికొనెను. అంత నా ధేనువు బైటనుండి అయ్యా విప్రోత్తమా! యని బిలిచెను. అది విని నా సోమయాజి గోవు చెంతకు వచ్చి ధేనుసత్తమా! నీ విప్పుడు దుఃఖించుటకు గతంబేమి, దుఃఖంబు మాని వచింపు మనెను. అంత నా ధేనువు దేవా! నేనరణ్యంబున నొక వ్యాఘ్రంబుచే జిక్కి మరల వచ్చి నీ కాహారంబు నయ్యెద నని ప్రమాణవాక్యంబులచే నమ్మకపఱచి మిమ్ము దర్శించి వెళ్లుటకు వచ్చితిని. నేనింకయు కొంతకాలం బుండి నీదు యజ్ఞంబునకు క్షీరం బొసంగి పుణ్యపదం బందుటకు దలంచి యున్న నా కిట్టి యుప మృత్యువు సంభవించినందులకు చింతిల్లుటగాని దేహాభిమానంబుచే గాదు, తాము ఇక క్షీరంబునకు మఱొక గోవును నేకకొనుదు రని ప్రార్థింపుచున్నాను, నేనీ వార్త తమతో జెప్పుటకై పులియొద్ద సెలవు బొందివచ్చితిని ఇక దడయుట ధర్మముగాదు వ్యాఘ్రము క్షుత్తువలన బాధింపంబడుచు నన్నెదురుచూచుచుండును, నే సద్గతి నొందునట్లు నన్నాశీర్వదించి యనుజ్ఞ యొసంగుండని ప్రార్థించెను. అంత నా విప్రుడు ఓ శ్వోత్తమా! నీవు సామాన్యజన్మంబు నెత్తినను అత్యుత్కృష్టంబైన సత్యవ్రతంబు నీయందుమాత్రము గాన్పించుచున్నది. అయినను నీ జీవితంబెల్లయు సత్కార్యంబునకే యుపయోగింపుమండి యిప్పు

డున్న నీ ప్రాణమునందు దృష్టియుంచక వ్యాఘ్రిము: క్షుత్తువలన
బాధింపంబడుచున్నదనియు, అందుకై నీ శరీరంబు నాహారంబుగా
నియ్యవలె ననియు, సత్యము దప్పరా దనియు వేగిరపడుచున్న
దానవు. అయారె యిట్టి సద్ధర్మంబులయందు ప్రవర్తించుట ప్రశస్తమైన
మానవజన్మంబునందు కూడ నగోరమై యున్నది, జూతము యని గోరా
జముపై కరుణారసదృష్టిని వీక్షించి కొన్ని వేదాంతవాక్యంబులను
బోధింపందొడంగెను. ఎట్లనగా, ధేనుసత్తమా! వినుము. శ్రుతి
స్మృతులయందు త్రిగుణాత్మక మగు మాయకంటెను జీవునికంటెను
బరుడయి జ్ఞానాదిషడ్గుణములు గలిగి యున్న వాసుదేవుడు ధర్మాను
ష్ఠానపరులకు ప్రియుడు అట్టి భగవంతునకు భగద్భక్తులను మించిన
ప్రియు లుండరు. కావున, నీకు యీ పరమేశ్వరతత్త్వమును బోధించె
దను. అందుచే నీవు పరమపురుషార్థంబు నొందుదువు ఆ తత్త్వము
సాంకర్యరహితమై ప్రకృతిపురుషులకంటె విలక్షణమై యుండు కారణ
ముచే పవిత్రమై మంగళమై ధర్మార్థకామమోక్షముల సాధించునదియై
ముక్తిసాధనమై యుండును. అని కృపాహృదయయుక్తుండై నారాయ
ణుడే ప్రాప్యుడనియు ప్రాపకు డనియు మనంబునందు భావించి ముం
దుగా సర్వాంతరాత్మ యగు భగవంతున కిట్లని నమస్కరింపుము. జ్ఞాన
వంతులను రక్షించు నో పరమేశ్వరా నీ సర్వోత్కర్షమాత్మవిదుల సుఖ
మునిమిత్తమగు గాక, సర్వజ్ఞా నిన్ను నుపాసించుచున్న నాకు బ్రహ్మాను
భవము గలుగుగాత, సిద్ధరూపుడ వయిన నీచే సంపాదితమైన యీ
సౌఖ్యమును నాకును నిఖిలప్రపంచమునకును నొసగుచున్న నీకు నమ
స్కారము, దేవా! నీవు లోకాత్మకమగు పద్మము నాభియందు గలవా
డవు, నీవు భూతసూక్ష్మేంద్రియస్వరూపుడవు, నీవు సమస్తలోకములకు
నధికరణమవై వాసుదేవనామంబున బిలువబడుచున్నావు, నీవు యశనా
పిపాసాదిషడూర్ములు లేనివాడవు కావుననే నీవు నిర్వికారుడవై
యున్నావు, నీవు నిత్యమును సంకోచము లేని జ్ఞానము గలవాడవు అట్టి
నీకు నమస్కారము, నీవు పురాణపురుషుడవు, వర్షప్రదుడవైన సూర్యు
డవై ప్రకాశింపుచున్నావు, నీవహంకారతత్త్వమవయి విలసిల్లుచున్నా
డవు, నీవు వాక్సంబంధరూపమున పొలుపొందుచున్నాడవు అట్టి నీకు
ననంతనమస్కారంబులు, ఓ పరమాత్మా భక్తులచే నారాధింపంబడుచు
గంటికి గానరాక వరలునట్టి నీస్వరూపమును నాకు గనబరపుము

యని ప్రార్థింపుచుంటివేని తప్పక భగవత్కృపకు ప్రాప్త మగుదువు గోసత్తమా వేగమే బొమ్ము, వ్యాఘ్రంబునకు జెప్పినప్రకారము సత్యముగా బ్రవర్తింపుము మరువవలదు యని హితోపదేశంబు జేసి బంపివేసెను.

అంత నాగోవు మహాప్రసాదం బని యరణ్యంబున బోవుచు సత్కర్మానుష్ఠానఫలంబును సత్యవ్రతప్రభావంబును సుంత ఆలోచింపుచున్నది యెట్లనగా, నేను యజ్ఞంబునకు నియతితో క్షీరం బొసంగుచుండినందునగదా సత్యంబునందు నిచ్ఛ గలిగినది, తద్వారా విప్రోత్తముని యనుగ్రహంబున భాషించునంతటి భాగ్యంబు గలిగెను, నింక నేమి జరుగునో తెలియజాల కున్నాను, సత్యవ్రతంబునకు ప్రభావం బింత యని పొగడుట కమరేంద్రాదులకైనను అసాధ్యంబుగానే యుండును. ఇంక నేమేమి జరుగనున్నదో జూతము గుని వడివడిగా పులిచెంతకేగి, మృగరాజమా! ఇదో నాశరీరంబును భుజింపుము, క్షుత్తుచే డస్సియున్నదానవు, తడవు సేయకుము యని సంభ్రమంబుతో బలికెను. అంత నావ్యాఘ్రము గోవును బట్టుకొని మాంసంబును బెరికి తినుచుండెను. ధేనువును విప్రునివలన బోధింపంబడిన విష్ణుస్తవంబును ధ్యానింపుచుండెను, అంత శ్రీమహావిష్ణువు గోవుకార్యంబునకు ఆశ్చర్యహృదయుండై సురమునిగరుడ సమేతుండై వైకుంఠంబును విడిచి యరణ్యంబున కేతెంచి నభంబున నిలిచి గోరాజమా సత్యవ్రతంబునకు మెచ్చితి, దేవాసురమానవులయందు సత్యప్రతిజ్ఞను నీవలె సాధించువారిని నేనిదివరకు విని కని యెఱుగను ఇటువంటి అసాధ్యంబైన కార్యంబును పూనికతో నెరవేర్చుటకు నీబోటిధీరులకే సాధ్యము గావున నాలోకపదం బిచ్చితి, సమస్తదివ్యభోగంబు లనుభవించుట కనుగ్రహించితి, ఇదో వచ్చెడివిమానంబున నెక్కు మని జెప్పుచుండెడు వాక్యంబులను విని, ధేను వాకాశం బుపలక్షించి శ్రీహరికి నమస్కరించి, దేవదేవా! నేనుమాత్రము తమదివ్యలోకంబు జేరుట ధర్మము గాదు, నన్ననుగ్రహించి వాక్సిద్ధి నొసంగి తమదివ్యనామస్మరణంబు నుపదేశించిన నాగురుస్వాములకున్ను సత్యంబునందు నన్ను పురికొల్పిన వ్యాఘ్రంబునకున్ను తమ లోకపదం బనుగ్రహించుం డని ప్రార్థించుకొనెను. అంత లక్ష్మీపతి గోవాక్యంబులకు సమ్మతించి యా మువ్వురిని విమానంబుపై దన లోకంబునకు దీసుకొనిపోయెను. అచట వారు సమస్త

దివ్యభోగంబు లనుభవించుచుండిరి. వింటివా పుత్త్రీ! సత్యప్రభావం బిట్టివంటిది గావున నీవు సర్వకాల సర్వావస్థలయందును సత్యంబును మరువకుము యని జెప్పి యరణ్యంబునకు ప్రయాణోన్ముఖుఁడై యుండెను. అప్పుడు కమలాబాయి పుత్త్రికి కొన్ని హితోక్తులు గఱపి కోడలిని జేరంబిలిచి అమ్మా పద్మావతీ నేనును మీమామయును భగవదాజ్ఞ ప్రకారము విరక్తులమై యరణ్యంబున తపం బాచరించి జన్మసార్థకంబు బడయవలెను గాన నీవు చింతిల్లవలదు, నీపతి పరమభాగవతుఁడు, నీకు యేవిధమైన దుఃఖములును గలుగ నేరవు. నీవు నిరంతరము మనోవాక్కాయములను పతి కర్పించి పతివ్రత మనుష్ఠింపుచుండుము, యెటువంటి సమయమందైనను పతిమాటను మీరాడకుము. అణకువ భక్తి గలిగి ప్రవర్తింపుము, పతివ్రతలకు జపతపోవ్రతనియమాదు లక్కఱ లేదు. పతిభక్తిచేతనే సతులకు సద్గతి సిద్ధించవలెను యని కోడలిని సమ్మతిపెట్టి భర్తవెంట నరణ్యంబున కేగి యందొక పర్ణకుటీరం బేర్పరచుకొని ఇంద్రియనిగ్రహులై తపం బాచరింపుచు నిత్యానందసామ్రాజ్య మనుభవింపుచుండిరి. అనంతరము జయదేవులు తలిదండ్రులు పోయినందులకు కొన్నాళ్లు చింతింపుచుండి దినములకు దేరి సత్కర్మాచరణేచ్ఛగలవాఁడై తనతండ్రివలన యుపదేశం బడసిన యధ్యాత్మవిద్యానుష్ఠానంబుచే ముక్తికి సాధనంబైన విజ్ఞాన మంతకంతకు నభివృద్ధి నొందసాగెను. అట్లుండెను సమయంబున తన్ను యాచించువారి కేది యడిగినను లేదనక యిచ్చుచున్న వస్తువులెల్ల కొన్ని దినములలో దానము జేసి తానుండెడు గృహంబునుకూడా అమ్మి భాగవతారాధనము జేసి వేసెను. పిదప తాను గట్టుటకు వస్త్రమును కూడా లేక కౌపీనమాత్రావశిష్టుఁడై మిథ్యాభూత మింతటితో వదలిపోయెనుగదా యని సంతుష్టాంతరంగుఁడై చాండి సప్రేమంబుతో భార్యయు తానును నివసింపుచుండిరి. ఇట్లు ప్రతిదినము భిక్షాటనము జేసి తెచ్చుకొన్న తండుల వస్తువులను పద్మావతి చేతికిచ్చి స్నానసంధ్యాద్యనుష్ఠానంబులెల్ల సాంగముగా దీర్చుకొని భగవత్కథాసుధారసాస్వాదనము జేయుచు, ఓపరమేశ్వరా! సృష్టిస్థితిసంహారములకు కారణభూతుండవు నీ వొక్కఁడవే గదా నీయాజ్ఞ లేక అణుమాత్రమైనను గదలనేరదు నాకు దిక్కేదియు గానక నిన్నే పరమగతియని యున్నాను, దుస్తరమగు సంసారమునుండి నన్ను రక్షింపుము. నీవు మహాత్మ్యస్వరూపుఁడవు, నేను కించిద్జ్ఞుఁడను గాన అఖం

డవగు నీరూపమును నాహృదయమున నిలుపుకొని పూజించుటకు శక్తిహీనుడనుగా నున్నాను, దయాసముద్రుడ వగు నీవు కటాక్షించవేని నేనెన్నటికిని దరిజేరజాలను, అని సంతతము ప్రార్థింపుచు శ్రద్ధతో నతిథులను అర్ఘ్యపాద్యాదివిధుల పూజించి పద్మావతి పాకంబొనర్చిన షడ్రసోపేతంబైన యన్నాదులు అతిథులకువడ్డించి భుజించిన పిదప తానును తనభార్యయు భుజించి అతిథిసన్నిధిని దర్భాసనంబుపై గూర్చొని పరమభాగవతులతో నిష్టకథాకాలక్షేపము జేయుచు జ్యోతిని దర్శించెడు సూచనలును, మనస్సును జంపు మర్మంబును శ్వాసం బణగెడు సూక్ష్మంబును చలనశ్వాస మణగెడు ద్వాదశమార్గంబులును అందున్నవారికి తేటతెల్లంబుగా జెప్పి వారు వెళ్లిన పిదప యేకాంతంబున జేరి చలనరహితుడై చిత్సమాధియందు నివాతస్థలదీపంబువలెను నిస్తరంగసముద్రంబు మాడ్కి సంతతసుఖస్వరూప మగు తుర్యమే తానై కన్నుల నానందాశ్రువులు రాల యోగనిద్రాపరాయణుండై నిష్కళంక మగు బ్రహ్మానంద మనుభవింపుచు మౌనమువలంబించి యుండును, తా నిట్లుండగా పద్మావతి పతియుండెడుస్థితిని జూచి పతిసేవయందతి యాసక్తి గలిగి పతియేదైవము, పతియేగురువు, పతియేబంధువు పతియేసంపద, పతియే సమస్తశుభంబు లొసంగెడు కర్త యని నిశ్చయించి పరమభక్తితో పతికి శుశ్రూషలు జేయుచు తల్లిదండ్రుల సహితము దలంపక పతియనుమతిప్రకారము ప్రవర్తింపుచుండెను. ఆమె యట్లుండగా జయదేవులు కొన్నిసమయములందు భగవత్ లీలాభివర్ణనంబులను కృతులుగా బాడుచు ఆనందనృత్యము జేయుచు యావ్వారిజను లెల్లరను భజనానందంబున ముంపు చుండును. ఇట్లుండగా, ప్రజలెల్లరు జయదేవులు బాడుచున్నకృతు లన్నిటిని యొక్కప్రబంధంబుగా రచించుకొని పారాయణము జేయుచు గీతగోవింద మని పేరిడిరి. పిదప కొన్నాళ్ళకు జగన్నాథదేవాలయంబున మహోత్సవము జరిగెడు సమయంబున భక్తజను లెల్లరు గూడి జయదేవులు బాడియున్న కృతుల నిక్రిందివిధమున బాడనారంభించిరి.

### శ్రీ గీతాగోవిందాష్టపదులు ప్రారంభము.

౧-శ్లో. మేఘై ర్మేదురమంబరం వనభువః శ్యామా స్తమాలద్రుమై
ర్నక్తం భీరురయం త్వమేవ తదిమం రాధే గృహం ప్రాపయ

ఇత్థం నందనిదేశతశ్చలితయోః ప్రత్యధ్వకుంజద్రుమం
రాధామాధవయో ర్జయంతి యమునా కూలే రహః కేళయః.

తా. ఓ రాధా! ఆకాశము మేఘములచేత దట్టముగా నున్నట్లును, వనభూములు కానుగ చెట్లచే నల్లనైనట్లును శ్రీకృష్ణుడు నీయందుండెడు మోహముచే దారిదప్పియున్నవాడు కావున నీవే యాకృష్ణుని గృహమునకు దీసుకరమ్మని యని నందుం డాజ్ఞాపించగా రాధామాధవులు వచ్చెడు మార్గంబునం గల పొదరిండ్లయందును వృక్షములక్రిందను యేకాంతమందు వారొనర్చెడు క్రీడలు యమునానదీతీరంబున సర్వోత్కర్షములుగా నున్నవి.

౨-శ్లో. వాగ్దేవతాచరిత చిత్రిత చిత్తసద్మా, పద్మావతీ చరణ చారణ
చక్రవర్తీ। శ్రీవాసుదేవరతికేళి కథాసమేత మేతం కరోతి జయ
దేవ కవిః ప్రబన్ధమ్.

తా. సరస్వతీదేవియొక్క చరిత్రములచే యలంకరింపంబడిన హృదయము గలవాడును, పద్మావతి యనెడు ప్రియురాలిపాదములచే నాట్య మాడించినవాడును అగు జయదేవకవీశ్వరుడు శ్రీకృష్ణస్వామి యొక్క సురతక్రీడలను యీ ప్రబంధంబుగా చేసియున్నాడు.

3-శ్లో. యది హరిస్మరణే సరసం మనో యది విలాసకథా సుకుతూహలం
మధురకోమల కాంతపదావళిం శృణుతదా జయదేవసరస్వతీమ్.

తా. శ్రీకృష్ణస్మరణయందు మనస్సు భక్తిరసముతో గూడిన వారలై అతి కుతూహలమైనవియు, శ్రావ్యములైనవియు రమణీయములైన పదములయొక్క పంక్తిగల జయదేవకవిగానవాక్యములను వినుము.

౪-శ్లో. వాచఃపల్లవ యత్యుమాపతిధర స్సందర్భ శుద్ధింగిరాం
జానితే జయదేవయేవశరణః శ్లాఘ్యోదురూహద్రుతే
శృంగారోత్తర సత్ప్రమేయరచనై రాచార్య గోవర్ధనః
స్పర్ధీకోపి నవిశ్రుతః శ్రుతిధరో ధోయీ కవిక్ష్మాపతిః.

తా. ఈ జయదేవకవీశ్వరుండు ఉమాపతికవి మున్నగువారిలో ప్రథమగణ్యుడు, సందర్భరచనావిశేషములయొక్క సర్వగుణసంపత్తిని యెఱిగినవాడు, యీజయదేవకవికి శత్రువైనవాడు యెందును ప్రసిద్ధుడైనవాడు కాడు.

## శ్రీభగవద్దశావతారవర్ణనము.

౧-శ్లో. ప్రళయపయోధిజలే-ధృతవానసి వేదం-విహితవహిత్ర చరిత్రమ
ఖేదం - కేశవధృత మీనశరీర జయజగదీశహరే.

తా. ధరింపఁబడిన మత్స్యమువంటి దేహము గలిగిన ఓ కృష్ణ స్వామీ! మహాప్రళయమునాఁడు సముద్రోదకమున గలిసియున్న వేదములను అనాయాసముగా దెచ్చియిచ్చిన ఓ జగదీశ్వరా! సర్వోత్కృష్టుడవు గమ్మా.

౨. క్షితిరతివిపులతరే తవ తిష్ఠతి పృష్ఠే - ధరణిధరణకిణచక్రగరిష్ఠే-
కేశవధృతకచ్ఛపరూప జయజగదీశహరే.

తా. తాబేటి రూపముధరించి అతివిశాలమై మందరపర్వతమును మ్రోచియున్న ఓ కృష్ణా

౩. వసతిదశనశిఖరే - ధరణీతవలగ్నా - శశినికళంక కళేవనిమగ్నా-
కేశవధృతసూకరరూప జయ.

తా. ధరింపబడిన వరాహమువంటి ఆకారము గల ఓ కృష్ణా, నీయొక్క దంతాగ్రమందు అంటినభూమి చంద్రునియందు కళంకమువలె వుండుచున్నది.

౪. తవకరకమలవరే - నఖమద్భుతశృంగం - దళితహిరణ్యకశిపు
తను భృంగం - కేశవధృత నరహరిరూప జయ.

తా. నరసింహాకృతిని బూనిన యోకృష్ణస్వామీ! హిరణ్యకశిపునొక తుమ్మెదవలె చీల్చి నీగోటియందుంచుకొన్నావు గదా.

౫. ఛలయసి విక్రమణే - బలిమద్భుత వామన - పద నఖ నీరజనిత-
జనపావన కేశవధృత - వామనరూప జయజగదీశహరే.

తా. ఓకృష్ణస్వామి ఆశ్చర్యమైనట్టిపాదములు వుదరము గోరులు గలిగి లోకపవిత్రతకొఱకు వామనావతారంబు ధరించి బలిచక్రవర్తిని చలింపజేయుచున్నావు.

౬. క్షత్త్రియ రుధిరమయే - జగదపగతపాపం - స్నపయసి శమిత
భవ తాపం - కేశవధృత భృగుపతిరూప- జయజగదీశహరే.

తా. ఓ కృష్ణస్వామి పరశురామావతారము ధరించి రాజులయొక్క రుధిరమయమైన వుదకమునందు స్నానముజేసి దుష్కృతంబు

తెల్లయు దీప్తి శాంతిబొందినవాడవై సంసారతాపత్రయంబులయందు లోకములను స్నానము చేయింపుచున్నావు.

౭. వితరసిదిక్షురణే - దిక్పతికమనీయం - దశముఖమౌళి బలిం రమణీయం - కేశవధృత రఘుపతిరూప - జయజగదీశహరే.

తా. శ్రీరాముడవై యవతరించిన ఓకృష్ణస్వామి యుద్ధమునందు యింద్రాదిదిక్పతులచే కోరదగిన రమణీయమైనట్టి రావణాసురుని దశ శిరంబులను పూజగా నిచ్చుచున్నావు.

౮. వహసివపుషివిశదేవసనం జలదాభం-హలహతి భీతిమిళితయమునాభం - కేశవధృతహలధరరూప - జయజగదీశహరే.

తా. ధరింపబడిన బలరామరూపంబు గల యో కృష్ణస్వామి మేఘమువంటి శరీరకాంతి గల నీవు బలరాముని నాగేటిదెబ్బకు భయపడి యమునానదివంటి కాంతిగల వస్త్రమును వహింపుచున్నావు.

౯. నిందసియజ్ఞవిధే రహహ శ్రుతిజాతం - సదయహృదయ దర్శిత పశుఘాతం - కేశవధృతబుద్ధశరీర - జయజగదీశహరే.

తా. ధరింపఁబడిన బుద్ధశరీరము గలిగినట్టి ఓకృష్ణస్వామి వేద సమూహము యాగకర్మముచే పశుహింసను సూచించుటవలన కటకటా యని నిందింపుచున్నావు

౧౦. మ్లేచ్ఛనివహనిధనేకలయసికరవాలం- ధూమకేతుమివ కిమపికరాళం - కేశవధృతకల్కిశరీర - జయజగదీశహరే.

తా. కలికిదేహము గలిగిన ఓకృష్ణస్వామి యవనులయొక్క సమూహమును నశింపఁజేయుటకు భయంకరమైన అగ్నివలె మండుచు వాకానోక ప్రకారము ఖడ్గమును గూడా చేత బట్టుచున్నావు.

౧౧. శ్రీజయదేవకవే రిద ముదితముదారం-శృణుశుభదం సుఖదం భవసారం- కేశవ ధృతదశ విధరూప-జయజగదీశహరే.

తా. దశావతారంబులెత్తిన యోకృష్ణస్వామి గంభీరమైనట్టిన్ని, మంగళప్రదమైనట్టిన్ని, సుఖప్రద మైనట్టిన్ని, సంసారమునందు సారభూతమైనట్టిన్ని శ్రీజయదేవకవివలన చెప్పబడిన యీగీతమును వినుము నమస్కారము.

ద్వితీయాష్టపదీ ప్రారంభము-మూర్జరి రాగము.

౧-పల్లవి॥ శ్రితకమలాకుచమండల-ధృతకుండల - కలితలలితవనమాలి॥ జయజయదేవహరే హరేకృష్ణా జయజయదేవహరే॥

తా. ఆశ్రయింపఁబడిన లక్ష్మీదేవియొక్క స్తనమండలము గలిగినవాడవును, సుందరమైన వనమాల ధరించి ప్రకాశస్వరూపుడవై వెలయుచున్న ఓ జగదీశ్వరా! సర్వోత్కృష్టుడవై వర్తించుమా.

౨-౩ చ॥ దినమణి మండల మండనాభవ ఖండన-మునిజన మానసహంస॥ కాళీయవిషధర భంజన-జనరంజన యదుకుల నళినదినేశ॥

తా. సూర్యబింబమువంటి కాంతి పుంజంబులచే భాసిల్లుచు సంసారభేదమును ఛేదించువాడవయి ఋషిపుంగవులయొక్క హృదయమనెడి సరస్సునందు హంసవై జరింపుచున్న హే హరే! కాళీయుడనెడి విషధరుని మర్దించి సర్వజనులను సంతోషపెట్టి యాదవకులంబను కమలంబునకు సూర్యునివలె ప్రకాశింపుచున్న హే హరే.

౪-చ. మధుముర నరకవినాశన-గరుడాసన సురకులకేళి నిదాన॥ జ॥

తా. ఓకృష్ణా! మధుమురనరకాసురులను వధించినవాడవు, గరుడాసనముగలవాడవు, దేవకులముయొక్క క్రీడలకు ఆదికారణభూతుడవై యున్నావు.

౫-చ॥ అమల కమలదళలోచన - భవమోచన- త్రిభువనభవన నిధానా॥ జ॥ ౬॥ జనకసుతాకుచభూషణ-జిత దూషణ సమరశమిత దశకంఠ॥జయ॥ ౭॥ అభినవజలధర సుందర-ధృతమందర- శ్రీముఖచంద్ర చకోర॥జయ॥ ౮॥ శ్రీ జయదేవక వేరిదం-కురుతే ముద- ముజ్జ్వలమంగళ గీతం॥ జయజయ దేవహరే॥

తా. తామరరేకులవంటి కన్నులు గల ఓకృష్ణా! జన్మమరణాది సంసారమునుండి రక్షించువాడవును, ముల్లోకముల కుత్పత్తి స్థితిలయ కారణభూతుండవును, సీతాదేవియొక్క స్తనములకు ఆభరణమైనట్టివాడవును, దూషణుడను రాక్షసుని బరిమార్చి రావణుని దశశిరంబుల దునిమినట్టి దేవా నూతనమైన మేఘమువలె మందరపర్వతము ధరించిన వాడవై లక్ష్మీదేవియొక్క ముఖపద్మ మనెడు చంద్రునకు చకోర పక్షివలె నున్నట్టి ఓకృష్ణా! జయజయ శుభప్రదమై ప్రకాశింపుచున్న జయదేవకవియొక్క యీ గానము శ్రీకృష్ణునకు అమితానందమును గలిగింపుచున్నది.

శ్లో॥ పద్మాపయోధరతటీ పరిరంభలగ్న, కాశ్మీరముద్రితమురో మధుసూదనస్య। వ్యక్తానురాగమివఖేలదనంగ ఖేద, స్వేదాంబుపూర మనుపూరయతుశ్రియంవః.

తా. ఓ కృష్ణా! నీవు లక్ష్మీదేవియొక్క ఆలింగనాదులచే యామె స్తనములయందుండు కుంకుమచిహ్నముగలవాడై ప్రకాశము బొంది యనురాగముతో మన్మథకేళి సలుపుచున్న శ్రమచేత స్వేదోదకప్రవాహము గలిగినట్టి నీ వక్షఃస్థలము మాకు యెల్లప్పుడు సంపదను నిండించు జేయుగాక.

శ్లో॥ వసంతేవాసంతీ కుసుమ సుకుమారై రవయవై, ర్భ్రమంతీం కాంతారే బహువిహిత కృష్ణానుసరణామ్। అమందం కందర్పజ్వరజనిత చింతాకులతయా, వలద్బాధాం రాధాం సరస మిదమూచే సహచరీ॥

తా. ఓ కృష్ణా! రాధ వసంతరుతువునందు పొందబడిన కామ బారి గలదై గురుగింజపువ్వులవంటి కోమలము లగు అంగములచేత చేరగూడని అడవియందు అనగా, మన్మథతాపముచేత అనేక ప్రకారములుగా వెదకుచున్న రాధనుగూర్చి నొక చెలికత్తె అనురాగయుక్త మగునట్లు బలికెను.

వసంతరాగము॥ లలితలవంగలతాపరిశీలన - కోమల మలయసమీరే - మధుకరనికరకరంబితకోకిలకూజితకుంజకుటీరే - విహరతి హరిరిహ సరస వసంతే నృత్యతియువతిజనేనసమం - సఖివిరహిజనస్యదురంతే విహరతి హరిరిహ సరసవసంతే॥

తా. ఓ రాధా! వియోగిజనములకు తరింప నశక్యమైన రసముతో గూడినట్టి ఈ వసంతరుతువునందు శ్రీ కృష్ణస్వామి స్త్రీ జనముతో నాట్యము జేయుచు క్రీడింపుచున్నాడు ఇదిగాక లవంగతీగెలయొక్క తాకుడువలని లేత మలయమారుతము వీచుచున్నట్టియు తుమ్మెదలసమూహము గలవియు కోకిలస్వరంబుతో నిండియున్న పొదరిండ్లనెడు గృహములయందు శ్రీ కృష్ణస్వామి స్త్రీజనంబులతో క్రీడార్థంబుల దేలుచున్నాడు.

౨-చ॥ ఉన్మద మదన మనోరథ పథిక వధూజన జనితవిలాపే - అళికులసంకుల కుసుమసమూహ నిరాకుల వకుళ కలాపే॥ విహ॥ 3॥ మదనమహీపతి కనకదండరుచి కేసరకుసుమ వికాసే - మిళితశిలీముఖ పాటలపటల కృతస్మరతూణవిలాసే॥ విహ॥ ౪॥ మృగమద సౌరభరభస వశంవదనవదళమాలతమాలే - యువజన హృదయ విదారణ మనసిజ నఖరుచి కింశుకజాలే॥ విహరతి॥ ౫॥ విగళిత లజ్జిత జగదవలోకన తరుణ కరుణ కృతహాసే-విరహినికృంతనకుంతముఖాకృతి కేతకిదంతురితాసే॥

విహా॥౬॥ మాధవికా పరిమళ మిళితే నవమల్లికయాతి సుగంధౌ-ముని మనసా మపి మోహనకారిణి తరుణా కారణబంధౌ॥విహా॥ ౭॥ స్ఫురదతి ముక్తలతా పరిరంభణ ముకుళిత పులకితచూతే-బృందావన విపినేపరి సరపరిగతయమునా జలపూతే॥విహా॥౮॥శ్రీ జయదేవ భణితమిద ముద యతి హరిచరణ స్మృతిసారం - సరస వసంతసమయ వనవర్ణన మను గత మదన వికారం-విహరతి హరిరిహ సరసవసంతే నృత్యతి యువతి జనేనసమం॥

తా. వసంతరుతువునందు అధికగర్వముతో గూడిన మన్మథుని యొక్క చేష్టలైన కోరికెలు గలిగినవాడై స్త్రీజనములచేబుట్టిన దుఃఖమువల్ల తుమ్మెదలచే జుట్టుకొనబడిన కుసుమములచే నిండియున్న పొగడచెట్లసమూహమునందు విహరతి మన్మథుడను రాజు స్వర్ణదండముగల ఛత్రముధరించి కాంతిగల నాగకేసరపుష్పముల విలసనము గలవాడై తుమ్మెదలనెడు బాణములు కలిగొట్ల సమూహముచే జేయబడిన అంబులపొది గలిగినట్టిన్ని, కస్తూరియొక్క పరిమళవేగమునకు స్వాధీనమైన చిగురుటాకులపంక్తులుగల కానుగచెట్లు గలిగి యౌవనుల హృదయము బగులగొట్టునట్టి మన్మథుని గోళ్లవంటి కాంతి గలిగిన మోదుగపువ్వులసమూహము గలిగినట్టిన్ని పోగొట్టబడిన సిగ్గు గలిగి కరుణపుష్ప మను చిగురు నవ్వుగలదై వియోగిజనులను ఛేదించుటకు యీటెయొక్క ఆకారముగా మొగలిపువ్వుల సమూహముచే, వ్యాప్తమైన దిక్కులు గలిగినట్టిన్ని బండిగురిగింజ పూవులయొక్క వాసనలతో గూడినదియు క్రొత్త మల్లెలచేత పరిమళించుచున్నట్టిన్ని మునీశ్వరుల హృదయముల సహా వలపు బుట్టించుచు పయోవంతులకు నిష్కారణబంధు వైనదియు బండిగురిగింజతీగెలచే అల్లబడిన మామిడిచెట్లచే యమునానదీ తీరంబున విరాజిల్లుచున్న అడవివంటి బృందావనమందు హరి విహరించు శృంగారయుక్తమైన వసంతఋతువుయొక్క వర్ణనముతో గూడిన శ్రీ కృష్ణస్వామి చరణ కమల ధ్యానమునందు మదనరసము ననుసరించి శ్రీ జయదేవ కవిచేత చెప్పబడిన ఈ గానము నవరసాలంకారయుక్తమై శ్రీ కృష్ణదేవుని క్రీడాదులయందు ప్రకాశింపుచున్నది. ఓ రాధా యువతి జనులతో నాట్యమాడుచున్నాడు యని అందున్న భక్తులెల్లరు బాడుచుండునపుడు నానాదేశములవారును కుసుమములరసమునకు ప్రేమా

తమ్మో బరువిడు తేనెటీగెలచందంబుగా భజించెడువారిచుట్టును వాకరిపై నొకరు ద్రోసికొనుచు నిలుచుందురు, ఆ గీతములయందు నేమి రసము పూరించియున్నదో గాని జగన్నాథుని నొక్కనిమేషములో జొక్కింపజేసెను. అంత లక్ష్మీపతి ఆనందాతిశయుండై యుప్పొంగి ఆనందించితి ఆనందించితి ఆనందించితి అంగీకరించితి అంగీకరించితి అంగీకరించితి యని అందున్న ప్రజలెల్లరు వినునట్లుగా బిగ్గర అఱచి చెప్పెను. అంత ప్రజలెల్లరు యాపుస్తకంబును వేదతుల్యం బని పొగడి పారాయణంబు జేయుచుండిరి.

అంత జయదేవులవాక్యంబు లెల్లదిక్కుల వ్యాపించి పాడువారికి వినువారికి ఆనందంబు నింపుచు, ఆ బాలవృద్ధులపర్యంతము నెవరి నోట జూచినను తాండవమాడుచుండెను. ఇట్లుండగా నోఢ్రదేశపురాజు జయదేవులమహిమలను విని కీర్తిప్రతిష్ఠల బొందవలెనన్న కోరికతో తాను గొప్పపండితుండు గావున రసవంతము లగు గీతములను కొన్ని జేసి అందున్న యెల్లవారికి నిచ్చి పాడవలసిన దని బలాత్కారము జేసెను. వా రందరు నుపేక్షతో పాడుటకు యిష్టములేక యుండిరి. అందుకు రాజు క్రోధచిత్తుడై అందున్నపండితులనెల్ల రావించి నే నొనర్చిన గీతముల మీ రెందు కుల్లంఘించుచున్నారు, జయదేవులు పాడిన వానియం దధికత్వ మేమున్నది, నేనును వారివలెనే గదా జగన్నాథమూర్తి మహిమలను వర్ణించియున్నాను. ఇందు భేద మేమిటో సుంత నెఱింగింపుండనెను. అది విని విప్రులు అయ్యా భూపతి జయదేవులు పాడిన గీతంబులను జగన్నాథుడే విని యానందం బుప్పొంగి యంగీకరించితి నని ముమ్మాఱు సర్వజనులు వినునట్లుగా ఘోషించి చెప్పిన విషయము నీవును యెఱింగినవాడవే, అట్లెఱిగియుండియు నీ స్మృతులను జయదేవస్మృతులతో సాటిజేయుటకు యుక్తాయుక్తవిహీనంబైన నీ దురభిమానమే కారణమైనది, తన్నుతా బొగడుకొనుటకన్న అనుచితము మఱొండు లేదు, నీవు బలాత్కారముగా నిచ్చుటవలన గదా ప్రజలు నిరాదరణ జేయుచున్నారు, వుత్తమవస్తువులను వారలు బొగడిన ప్రశస్తం బగునేగాని తానే బొగడరాదు. గురుసేవ, దైవభక్తి, కవిత్వము, బ్రహ్మజ్ఞానము మున్నగునవి వారలు బొగడవలసినదే గాని తనను తానే బొగడుటవల్ల హీనత్వమే ప్రాప్తించును యనిరి. అంత రాజు అయ్యా మీ రెందుకు యాతురపడెదరు, యీ రెండుగ్రంథములను సరి

చూచి తర్వాత సరిగా యుండిన వొప్పుకొనుందు లేకున్న నిషేధింపుదు, అట్లొనర్పక తొందరపడుటవలన నేమి లాభము యని వచించెను, అందుకు విప్రులు నరేంద్రా మేము వొప్పుకొనుటవలన ప్రయోజనం బేమి, జయదేవులగ్రంథము జగన్నాథమూర్తి యొప్పుకొనినట్లు నీగ్రంథమును యొప్పుకొననేని మే మెల్లరము పఠించుటకు సందియము లేదు, అందుకొక యుక్తి జేయుదము, యెట్లనగా జయదేవుల గ్రంథమును నీగ్రంథమును జగన్నాథమూర్తి పాదంబులవద్ద నుంచుదము, యెవరిపుస్తకము అంగీకరించితి నని గ్రంథముపై సంతకము జేసియుండునో యది సర్వజనసమ్మతం బని తీర్మానించిరి. అంత రాజును సమ్మతచిత్తుడై యందరునుగూడి రెండుగ్రంథంబులను జగన్నాథు నాలయంబుననుంచి కవాటంబులు బంధించి రాజముద్ర నిడి వారివారి గృహంబులకు వెళ్లిపోయి వుదయమున వారువారు నిత్యకృత్యంబులు దీర్చుకొని అందరునుగూడి యాలయమునకు జనుచుండగా రాజు యొనర్చిన గ్రంథము గోపురద్వారంబుబైట బడి యుండెను. అది తీసుకొని రాజు తన ముద్రను వీడదీసి లోపలికిం బోయి చూడగా జయదేవుల గ్రంథముపై అంగీకరించితి నని జగన్నాథమూర్తి సంతకము జేసియుండెను. అదిగాంచి వోఢ్రరాజు దీనాననుడై యేమియుందోచక నిలుచుండెను. పండితులు యేమయ్యా క్షీరమునుండి నీరము వేఱుపఱచినట్లు పండితునికిని ప్రభువునకునుగల తారతమ్యమును జగన్నాథమూర్తి వినుర్పించి చూపినాడు, రాజహంసకు కాకమునకును బ్రాహ్మణునకు చండాలునకును యెంత తారతమ్య ముండునో అట్టివలె నీగ్రంథమునకును జయదేవకవి గ్రంథమునకును తారతమ్య మున్నది యని పలికి చివాలున లేచిపోయిరి. అంత రాజు మిగుల విచారగ్రస్తుడై పాలకినెక్కి మేడకుంజని పరుండి నిద్రాహారములులేక మిగుల చింతాక్రాంతుండై భగవంతుని స్తుతింపదొడంగెను. ఓ జగన్నాయకా! నీవు సర్వసముడ వని సర్వభూతదయాపరుడ వని శాస్త్రంబులయందు జెప్పియుండుట నేను కల్లలైనవి. పరమేశ్వరా! నీవు సర్వసముడ వనుమాట నిక్కమాయెనేని జయదేవులయం దంత దయయు, నాయం దింత నిర్దయయు గనబఱచితివా? నీవు దూషణభూషణలయందు కోపానుగ్రహములు లేక ప్రియముగా వర్తింపుదు వని శ్రుతిస్మృతీతిహాసపురాణములయందు జెప్పగా విని యిదివరకు నిజమనుకొంటిని, నీకింత పక్షపాత ముండునని

కేనెట్టుగనైన హిరణ్యాక్ష హిరణ్యకశిపులు రావణకుంభకర్ణాదులు శిశుపాలుడ దంతవక్త్రులు మున్నగువారు నిర్గళముగా ద్వేషించుచు దూషించుచున్నను కోపము లేకయైనను లేక శాంతితో వర్తించుచుంటి వని శాస్త్రంబులయందు వ్రాసియున్నది యెల్లయు కల్పనాకథ లని యిపుడు గానవచ్చెను. ఓకృష్ణా! పరదారగమనము పాతక మని దెలిసియు రాధను భోగించితివి, జారత్వ మతిహేయ మని యెఱిగియుండియు గోపికలతో క్రీడ సల్పితివి, చోరత్వము దూషితం బని దెలిసియు గొల్లల యిండ్ల పాలు పెరుగు ముచ్చిలిడితివి. పరమేశ్వరా! నీవు జేసిన పనులలో యే వేని కొన్ని మంచికను లుండునేమో గాని దుర్ణయములకుమాత్రము జన్మస్థానముగా గనబడుచున్నావు, అయినను పూర్వము మునివృద్ధులు నిన్ను మిక్కుటముగా స్తుతించియుండుటను జూడగా నీవు కఠినహృదయుడ వనియు శంకలేక వారిని బాధింతు వను భయముచే నుండవచ్చును. అబ్బబ్బా యెంత మోసగాడవు, పురుషోత్తమా నీవు సర్వజ్ఞుడవు నేను అల్పజ్ఞుడను గావున నే నొందిన యవమానమునకు నోర్వజాలక దూరితిని. నే నపరాధిని నీవు క్షమాపకుడవు, దుష్టశిష్టలగు పుత్త్రులను తల్లి సమత్వముగా భావించునట్లు పరమేశ్వరా నీవు సర్వజీవులను సమత్వంబుగా జూతువు, పంచదార నొకవైపున చేదుగను నొకవైపున మధురముగా నుండునా? జయదేవకవిత్వమును నా కవిత్వమును భేదంబుగా జూచుట ధర్మమా, నీ దయ కపాత్రుడనై జీవించియున్న ప్రయోజన మేమి యని ప్రాణత్యాగంబునకు నిశ్చయించి ఓ హరిపరంధామా, రఘురామా, గోపాలా, వాసుదేవా, దేవాదిదేవా, శేషశయనా, వసుదేవపుత్త్రా, ఓ దీనబంధో యీ దీనునియెడ కరుణించి రక్షించుటకు యింతకన్న మఱొక సమయము గాన్పింపబోదు. కమలనయనా! కరుణాసాగరా! యని ప్రలాపించుచు నిద్రించెను. అంత భగవానులు నృపతిస్వప్నంబున గనబడి ఓయి రాజా జయదేవకవిని సామాన్యు డని దలపకుము. యీమహాత్ముడు జితేంద్రియుడు సత్యసంధుడు బ్రహ్మవేత్త నే నాతనికృతులను అతిప్రియముతో నంగీకరించితిని, నీవు పండితోత్తముడ వయ్యును జయదేవకవిసార్వభౌమునియందు యీర్ష్యచేత అపరాధి వయితివి గావున నీ కృతి నంగీకరించుటకు నాకు మనసొప్పక వెలుపల బాఱవైచితిని, ఇకనైనను నీ మనస్సున మాత్సర్యమువదలి జయదేవులు బాడి

యుండెడు గీతగోవిందమును భక్తితో పఠించితివేని నీ వొనర్చిన కృతులలో పదుమూడుగీతంబు లంగీకరించెద నని జెప్పి యంతర్ధాన మాయెను. వెంటనే రాజు మేల్కని భాగవతోపచారంబు లెంతటి వారికైనను అవమానింపక మాన దనుమాట నావలననే నిక్కమైనది. జయదేవులు సాక్షాత్ భగవదంశమే నని తీర్మానించి కేయెల్లయు స్తుతింపుచుండి వుదయమున లేచి దేవాలయంబున కేగి అందు స్నానాద్యనుష్ఠానంబులెల్లయు దీర్చుకొని బ్రాహ్మణులంగూడి అత్యంత భక్తితో జయదేవకృతులను పారాయణాబు జేయు చుండెను. అంత యచ్యుతుండు అశరీరియై యుండి ఓయి విప్రోత్తములారా! యీ రాజు వ్రాసియుండెడు గీతంబులలో పదుమూడుగీతంబులు నే నంగీకరించితినని ప్రజలెల్లరు వినునట్లుగా మృదుమధుర భాషణంబులతో సెలవిచ్చి యంతర్ధానం బాదెను. అందున్న విప్రులందరు రాజుయొక్క కృతులలో పదుమూడుకృతులను జయదేవకృతులలో జేర్చి వేదతుల్యం బని పారాయణంబు జేయుచుండిరి. ఇంత మహిమ గల జయదేవస్వామి యెచట నున్నను అచట అష్టైశ్వర్యంబులును శిష్యసమాజంబులును నిండియుండుటను గాంచి సర్వజనులును బొగడు చుండిరి. వీరివర్తమానంబు పద్మావతితండ్రి యెఱింగి దురంతచింతాక్రాంతుండై అచటికి వచ్చి అల్లుని కూతుని జూచి వారి కం దుండెడు ఐశ్వర్యమహిమాదుల కచ్చెరువంది దుఃఖం బుడిగి ఆహా నేనొనర్చిన భాగ్యంబున కంతం బుండ నేరదు. యీతడు నాకు అల్లుడగుటకు నే నెంతభాగ్యం బొనర్చితిని, యీమె నా కూతురై బుట్టుటకు నెంతపుణ్యంబు జేసితినో గదా యని అనేకవిధంబుల స్తుతించి ఆనందహృదయాంతరంగుండై యల్లునివలన నియమింపబడిన యాసనంబుపై గూర్చుండెను. అంత పద్మావతి తండ్రికి ప్రదక్షిణనమస్కారంబులు సలిపి నాయనా నన్నింతకాలముదనుక యెట్లు మఱచియుంటిరి. మీ రొనర్చిన తపోవిశేషంబువలన నా కిట్టి సర్వసంపద్యుక్తు డగు పతి లభించెను యని నమస్కరించి నిలుచుండెను. అంత జయదేవులు మామకు నమస్కరించి, అయ్యా నీపుత్రివలన సమస్తైశ్వర్యంబులు గాంచితి, తమ ఆశీర్వాదబలంబున సమస్తసుఖంబు లనుభవింపుచున్న వాడను యని మామగారి మనస్సును సంతోషపఱచి తాను యేకాంతంబున జేరి సమాధినిష్ఠాపరుండై

నెమళ్లను గాంచి ఓ మయూరంబులారా నా ప్రాణేశుని జూచితిరా ఓ కోకిలంబులారా నా విభుని గంటిరా జంబూకంబులారా నా జీవితేశుని యెందేని పొడగాంచితిరా? అని వృక్షంబులను మృగంబులనుజూచి విలపించుచుండెను. అపు డం దొక గొప్పకొండయందు గుహయుండుటను గాంచి గుహలోనికిం జని యచట పద్మాసనాసీనుండై దేహస్మృతి చెడి పరిపూర్ణ సమాధియం దుండెను. తన పతిని గాంచి ప్రదక్షిణనమస్కారంబులు జేసి పాదంబులపై బడి యుండెను. అంత జయదేవులు సమాధినుండి బహిర్ముఖులై పద్మావతిని జూచి మిక్కిలి ప్రేమనొంది వచ్చిన దని యెఱింగి దయగలవాడై ఓ నా ప్రియురాలా యికె దుఃఖించకుము నీకు నాయందు గల భక్తిని చేయుటకై మెచ్చితిని ఇక పురంబున కేగుదము రమ్మని యని సతిని సమాశ్వాసించి గ్రామంబున కరుదెంచిరి

## మూడవ అధ్యాయము.

జయదేవుల కాళ్లు చేతులను పొందిన విధము.

ప్రియులారా వినుండు, జయదేవులు కొంతకాలము నిష్ఠతోనుండి మొంగకొని మఠము వాకిట గూర్చుండియున్న సమయమున భక్తవత్సలుం డను నొక ధనికుడు బిడ్డలు లేనివాడై నారాధించుటకు వచ్చి జయదేవుల మహిమలంతయు నొక్కొక్కటే వినియున్నవాడు గావున అపుడు జయదేవుల దర్శించెను. ఈ భక్తుడు గ్రహ్యపురుషుని భక్తుడగుచు, సత్సంగాభిలాషియు గావున నా మహాత్ముని పాదములకే నొనర్చిన భాగ్యమే భాగ్యము గాని దేవుల సభక్తపూర్వముగా ప్రదక్షిణనమస్కారంబులు జేసి దేవా నామీదనము దాసుని గృహంబునకు వచ్చి దీవెనలను నన్ను కృతార్థునిం జేయుదు రని ప్రార్థించుచున్నా ననెను. అందుకు జయదేవులు సమ్మతించెను. పిదప నా భక్తుడు జయదేవులను తన రథంబుపై నెక్కించుకొని యింటికి దీసుకపోయి జయదేవులను అత్యంతభక్తిశ్రద్ధలతో సతీసుతులు లిద్దఱు స్నానము చేయించి మకూలవస్త్రంబులిచ్చి పాదసేవ మున్నగునవి జేసి షడ్రసోపేతంబులగు దివ్యాన్నంబులు గుడిపి గురుసంకీర్తనంబు లుద్ఘోషించి, మహాత్మా మా

నెమళ్లనుం గాంచి ఓ మయూరంబులారా నా ప్రాణేశుని జూచితిరా ఓ కోకిలంబులారా నా విభుని గంటిరా జంబూకంబులారా నా జీవితేశుని యెందేని పొడగాంచితిరా? అని వృక్షంబులను మృగంబులనుజూచి విలపించుచుండెను. అపుడం దొక గొప్పకొండయందు గుహయుండుటను గాంచి గుహలోనికిం జని యచట పద్మాసనాసీనుండై దేహస్మృతి చెడి పరిపూర్ణసమాధియుం దుండెను తనపతిని గాంచి ప్రదక్షిణనమస్కారంబులుజేసి పాదంబులపై బడి యుండెను. అంత జయదేవులు సమాధినుండి బహిర్ముఖుండై పద్మావతిని జూచి మిక్కిలి శ్రమనొంది వచ్చిన దని యెఱింగి దయగలవాడై ఓ నా ప్రియనాయకీ దుఃఖించకుము నీకు నాయం గుండెడు భక్తిని దెలియుటకై యిట్లొనర్చితి ఇక పురంబున కేగుదము రమ్ము యని సతిని నూరార్చి నిజాశ్రమంబున కరుదెంచిరి

---

# మూడవ అధ్యాయము.

## జయదేవుల కాళ్లు చేతులను ఖండించుట.

సిద్ధులారా వినుండు, జయదేవులు కొంతకాలము నిష్ఠలోనుండి మేలుకొని మఠము వాకిట గూర్చుండియున్న సమయంబున భక్తవత్సలుం డన్ను యొక ధనికుడు బిల్వగ్రామునుండి జగన్నాథంబునకు వచ్చి జయ[illegible]ల మహిమలంతయు తత్పూర్వమే వినియున్నవాడు గావున అపు[illegible]డెను జయ[illegible]ల దర్శించెను. యావత్తరుడు ద్రవ్యపరుండును [illegible]తుండును, [illegible]త్సంగాభిలాషియు గావున నేడీ మహాత్ముని సంద[illegible]కే నొనర్చిన భాగ్యమే భాగ్య మని జయదేవుల సభక్తిపూర్వ[illegible]గా ప్రదక్షిణనమస్కారంబులుజేసి దేవా తామీాదినము దాసుని గృహంబునకు వచ్చి దీనుండనగు నన్ను కృతార్థునిం జేయుదు రని ప్రార్థింపుచున్నా ననెను. అందుకు జయదేవులు సమ్మతించెను. పిదప వర్తకుడు జయదేవులను తన రథంబుపై నిడుకొని యింటికి దీసుకపోయి జయదేవులను అత్యంతభక్తిశ్రద్ధలతో సతిపతు లిద్దరు స్నానము జేయించి దుకూలవస్త్రంబులిచ్చి పాదసేవ మున్నగునవి జేసి షడ్రసోపేతంబులగు దివ్యాన్నంబులు గుడిపి గురుసంకీర్తనంబు లుద్ఘోషించి, మహాత్మా మా

రాకవలన మేమును మామయ్యేతరములవారును కృతార్థుల మైతి మని అనేకవిధంబుల గొనియాడి పిరికాకకై పద్మావతీదేవి యెదురుచూచుచు చింతింపుచుండు నని మనంబునం దలంచి యిపుడే పురంబునకు జేర్పవలె నని నతిపతు లిద్దఱు నాలోచించి రథంబును సిద్ధపఱచి రథసారథి కద్దకొన్ని వస్త్రాభరణంబులను వేయువరహాలును నిచ్చి పద్మావతిదేవి కర్పగించి జయదేవుని నాకు వదలిరమ్ము శీఘ్రముగా బొమ్ము యని నుడివిరి. అంత జయదేవులు అత్యా ప్రాణఘాతకి యగు యీద్రవ్యాభరణంబు లేల నొసంగెదవు వలదు వలదని మరలించెను. అంత వర్తకుండు దేనా మాతల్లి యగు పద్మావతీదేవిగారికి కానుకగా నర్పించితిమి గాన తను కేమి భయ మింతవలదు యని రథికుని జూచి, ఓరీ స్వాములను జాగరూకతగా దీసుక వెళ్లి వదలిరమ్ము యని యాజ్ఞాపించగా నంత సారథి జయదేవులను రథంబుపై గూర్చుండబెట్టికొని యతివేగంబుగా రథంబును నడుపుచు అరణ్యంబునకు బోవుచుండెను. ఇంతలో చోరు లడ్డంబుగా వచ్చి రథంబు నిలిపి యున్న వస్త్రాభరణంబుల నెల్లయు దీసుకొని సారథిని హింసింపఁ జూచిరి గాని, యింతలో వా డొక త్రోవను తప్పించుకొని వెళ్ళిపోయెను. అంత జయదేవుఁడు ప్రాణఘాతకి యగు ద్రవ్యంబువలన గదా యింత విపత్తు వాటిల్లె నని యల్లగా రథంబు డిగ్గి దారిబట్టి పోవుట కుద్యమించెను. అంత చోరులు యీమహాత్ముని మహిమను దెలియని మూర్ఖులు గావున జయదేవుల కెదురుగా బోయి, ఓరి యెందే గుచున్నావు, నీ ప్రకారము చూచుచున్న దెలియవచ్చును, నీ బ్రాహ్మణయుక్తి మాపవ్వ జెల్లునని దలంచితివి, మేము నీ కపటోక్తసామర్థ్యంబులయం దేరందియున్నవార మని దెలియవుగా బోలు ఇక నిన్నెంకు బోనీయము యని జయదేవుల చేతులుబట్టి యీడ్చి యరణ్యమధ్యంబునకు దీసుకవెళ్లిరి. అంత జయదేవులు చోరులకు నమస్కరించి మీ రేల నన్ను నిందించెదరు నేను మీ కేమి నపకరించినవాడను గాను, మీ కపకృతి యొనర్ప బూనుకొన్నవాడనుగాను, నేనొక బీదబ్రాహ్మణుండను, అదో యుండెను ద్రవ్యాభరణంబులును రథంబును మీరు నిశ్చయముగా దీసుక వెళ్లుడు నన్ను హింసించకుఁ డని సవినయపూర్వకంబుగా నమస్కరించి మనవిచేసుకొనెను. అంత నాచోరులు జయదేవకవిసార్వభౌముని మహిమ దెలియని క్రూరు లగుటవలన జయదేవులు ధరించియుండెడు చేలంబును విడదీసికొని కౌపీనమాత్రావశిష్టునిగా జేసి ఓరి ఎవరికైనను

నమ్మనగునుగాని జంధ్యము వేసిన విప్రుని నమ్మినవారికి తక్షక మోసము వచ్చుననుటకు సంశయము గలదా, అబ్బబ్బా ఇపుడు నిన్ను వదలితి మేని మా కంఠంబున కురిగల్లుట దప్పదు, నిన్నుజూడ ద్రవ్యాశవీడని వాడవుగా నున్నావు, బీదవాడవని జెప్పి మమ్ముల వంచించుటకు జూచుచున్నావు యని క్రోధానలమనస్కులై ఖడ్గంబు చేబూని జయదేవుల చేతులు కాళ్లు ఖండించి అందున్న కూపంబున బడవేసి రథంబును దీసుకొని వారివారి స్థానంబునకు వెళ్లిపోయిరి. అంతి జయదేవులు ప్రారబ్ధకర్మఫలం బెట్టివారి కైన విడువదుగదా యని యాభక్తశిఖామణి పరబ్రహ్మజ్ఞాని పరమసాధువు బీదలకనేకద్రవ్యమొసంగిన దానకరుడు అనేకముముక్షుజనోపకారుడు క్రోధమను అరణ్యంబును ధ్వంసము జేసినవాడు నగు నమ్మహాత్ముండు బావిలో బడి ప్రారబ్ధాధీనంబుగదా యీదేహేంద్రియాది సుఖదుఃఖంబులెల్ల యని ధీరత్వంబుగా నుండెను. పిదప అంతకంతకు కరపాదంబులు ఛేదింపంబడిన బాధవల్లను దేహమెల్ల రాళ్లు ముండ్లు బొడుచుకున్న ఉపద్రవమువల్లను చీములు దోమలు గఱచుచున్న బాధ వీరు కరపాదంబులు ముడుచుటకు చాచుటకు యసాధ్యమైనందులకును మనోవ్యథ సహింపజాలక స్మృతి దప్పి మరణమూర్ఛితుండాయెను, పిదప కొంతదడవునకు మూర్ఛదెలిసి మిక్కుటమగు దుఃఖవ్యాప్తిజెంది ఓసారి నాకిక శరీరవియోగము తటస్థించునట్లున్నది. ఇట్టి ఆపత్సమయంబునగదా పరమేశ్వరుని భజించి ఆతనిజాయమానకటాక్షంబువలన మోక్షసామ్రాజ్యం బందవలయునని భక్తవత్సలుండగు శ్రీమన్నారాయణుని భజింపందొడంగెను సృష్టి స్థితి సంహారంబులకు కారణభూతుండవైన జగన్నాథా నీకువందనము, పరమపురుషా పద్మనాభా నీకు వందనము, శంఖచక్రకోదండపాణీ నీకు వందనము, సురులు బొగడెడు స్వయంజ్యోతిస్వరూపా నీకు వందనము, భక్తులపాలిటి మిత్రుడా నీకువందనము, భవబంధవిమోచనా నీకు వందనము, మత్స్యావతారా నీకు వందనము, గోపికాలోలా శ్రీకృష్ణా నీకు వందనము, సురులు నరులు బొగడెడు మురహారీ నీకు నమస్కారము, హరిహరి నరహరి నీకు వందనము, భక్తవత్సలా వేణుగోపాలా నీకువందనము, ముక్తినొసంగు ముకుందభూపాలా నీకు వందనము, తన్మయానందదామోదరా నీకువందనము, మధుసూదనా కృష్ణా వామనా నీకువందనము, పాండురంగా పుండరీకవరదా నీకువందనము, పతితపావ

నా లోకపాలనా నీకువందనము, కరివరద గోవింద నీకువందనము, శ్రమ దీర్చి రక్షించెడు స్వప్రకాశా నీకు వందనము, ఇది మంచిసమయము న న్నాదరించుటకు నీకు అనంతవందనములు, ద్రౌపది సభలో భంగ మొందిన నిన్ను వేడినంతనే వలువ లిచ్చి రక్షించిన వాసుదేవా నీకువందనము, దీనుడనై దిక్కెవరు గానక మొరలిడుచున్న నాయెడ పరాకేల, ప్రసన్నుండవై నన్నురక్షింపుము. వేంకటేశ్వరా, వేణుగానప్రియా నీకు వందనము. ఇట్టి ఆపత్సమయమున నాకష్టంబుల దీర్చి నాదరింపుము. సదానందస్వరూపా నీకు వందనము, సుజ్ఞానజ్యోతిస్వరూపుడా నీకు వందనము, సర్వలోకనియామకుడవైన నీతిస్వరూపా నీకు వందనము, జగపతి వేంకటాచలపతీ నీకు వందనము, పరమసుఖస్వరూపుడవై విరాజిల్లుచున్న పరశురామా నీకు వందనము, ఆదిశేషునిపై పరుండి యున్న ఆర్తశరణ్యా నీకు వందనము, సర్వలోకశరణ్యుడవై సర్వాత్మకుండవై వెలుంగుచుండు నీకు వందనము, కంసునిసంహరించిన కరుణాకరా నీకు వందనము, హా బ్రహ్మానారాయణుండైన చతుర్ముఖునికి పితయగు నీకు నమస్కారము, శిభ [illegible] మర్దించిన కృష్ణా నీకు వందనము, దశగ్రీవుని శిరంబులను ఛేదించి విభీషణుని కభయప్రదానం బొసంగిన శ్రీరామచంద్రా నీకు వందనము, నారాయణా నందనందనా నీకు వందనము, నిన్నుద్దేశించి పారాయణము జేసెడు భక్తులకు స్వతంత్రుడవై యుండు నీకు వందనము, పీతాంబరము ధరించి భక్తులయెడ అతిప్రియమోదంబులు గలిగియుండు నీకు వందనము, నాకు మాతాపితాగురుదైవంబై యెన్నంగనుండు నీకు వందనము, బాలుడైన ప్రహ్లాదుని పరమప్రీతితో రక్షించిన నీకు వందనము, కర్మసంహారుడవై యిష్టావిభూతితో వెలయుచున్న నీకు వందనము, సనకాదిమును లెల్ల భజింపుచుండెడు శాంతస్వరూపంబునకు వందనము, పుణ్యస్వరూపుడవై దశరథాత్మజుండ వగు నీకు వందనము, నన్ను రక్షించుటకు యింతకన్న నెక్కుడు నీకు సమయము గాన్పింపబోదు. ఓ పరమేశ్వరా నీభక్తుల మొఱను యత్యాదరముతో విందు వనియు నిన్నే పరమగతి యని యున్నవారి ననుగ్రహించునిమిత్తము నీచప్రదేశములకైనను జనుదు వనియు భక్తులు ప్రేమతో బిలిచిన నత్యాతురతతో ప్రత్యుత్తర మిత్తు వనియు నిత్యము అతిజాగరూకతతో సర్వంబును పాలింపుచుందు వనియు అనుభవజ్ఞానసంపన్ను లెప్పుడును జెప్పుకొనుచుందురు గాని

యావిషయమున సత్యమెంతవఱకున్నదో నేనెఱుగఁజాలకున్నాను. పర
మేశ్వరా జూడుము యిదో తెగియుండెడి వ్రణములకు చీములు దోమలు
ముసురుచున్నందున బాధ హెచ్చగుచున్నయది, తీవ్రవేదనకు సహింప
జాలక ప్రాణములు వీడిపోవున ట్లున్నవి, ఇట్టి ఆపత్సమయమునకన్నను
నన్ను రక్షించుటకు మఱొకకాల మెపుడు లటస్థించును, నీవు దయా
పరుండవైనచో యిట్టి దురవస్థాపీడితుడ నగు నా ప్రార్థన నంగీకరించి
ప్రసన్నుండవై నాహృదయమును యావరించుకొనియున్న అజ్ఞానాంధ
కారంబును బాపి నీ దివ్యమంగళస్వరూపమును ప్రసాదించి నన్ను నీ
పదారవిందములయందు జేర్చుకొనుము, జన్మసంబంధ మగు దుఃఖము
నింతటితో దొలగింపుము, జననమరణరూప మగుసంసారచక్రంబున నేను
భ్రమింపనియట్లు సార్థకుని జేయుము, లక్ష్మీపతీ దీనదయాళో దీనుడనై నే
నెంత వేడినను నామొఱ్ఱయైనది నీ వీనులకు వినకున్నదిగా జోలు యని
ప్రలాపించుచుండగా ద్వాదశాదిత్యప్రకాశమానంబై వెలయుచుండు
వైకుంఠంబున గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధసేవ్యమానుండై
మణిమయఖచిత సింహాసనంబున విరాజిల్లుచుండెడు శ్రీమన్నారా
యణుని దివ్యకర్ణంబులయందు జయదేవులరోదనశబ్దం బతి ఘోరంబుగా
విన్నంతనే నీలమేఘశ్యాముం డులికిపడి సంతప్తమానసుండై కన్నీరు
మున్నీరుగా గారుచుండ కరంబుల విదుముకొనుచు ఆహా నా భక్తుని కిట్టి
దురవస్థ సంభవించినందుల కేమి జేయుదు నిపుడేమియు దోచకున్న దే,
జయదేవకవిసార్వభౌమా చోరులు నీ కరపాదంబుల ఛేదించునపుడు
నీవు వోదార్చుకొన్న విషయము బహుచోద్యముగా గాన్పించుచున్నది,
ఆహా కూపంబునబడునపుడు నీ వేవిధంబుగానుంటివో యని దుఃఖమంత
కంతకు హెచ్చొంది దుఃఖావేశంబువలన మూర్ఛితుండై కొంతదడవునకు
మేల్కని గరుడ గంధర్వాది పరివారంబుల బిలువక తా నొంటరియై
వైకుంఠంబునుండి వెడలెను. అపుడు వైకుంఠవాసుం డతివేగంబుగా
పరువిడి మార్గంబునవచ్చెడి సమయంబున మెడనున్నహారంబులు వీడి
మార్గంబున జారిపోవుచు పీతాంబరము కొంగులుజారి భూమిపై బొర
లుచు దేహం బెఱుంగక వాయువేగంబును మించి భూలోకంబున జగ
న్నాథసమీపంబున నుండెడు యరణ్యంబున జయదేవులు బడియుం
డెడు కూపసమీపంబునకు వచ్చి అంతర్యామియై జయదేవుల హృత్ప
ద్మంబున ఆనందస్వరూపుడై జ్ఞాననేత్రంబునకు గోచరం బాయెను.

అంత జయదేవులు దివ్యమంగళ విగ్రహంబును అంతరంబున జూచి నంతనే ఆనందాతిశయుండై దుఃఖం బణుమాత్రమైనను దోపక ఆహా మార్గంబునకును బైలునకును సమీపంబున పూర్ణచంద్రకిరణ సమానంబై మితిలేనియానందము నన్నావరించుకొని యున్నది గదా యొద్దాని నిట్టి దట్టి దని దలంచుట కశక్యంబై గదా యున్నది. ఇట్టి మహత్స్వరూపమును నాయం దుండుటను గానక పరికించిజూడ నైతిని, ఇయ్యదియే గదా వేదవేదాంతంబు లుద్ఘోషింపుచున్న నిత్యానంద స్వరూపము, ఇట్టి నానిజస్వరూపంబును మరచి అనిత్యంబులైనవియు దుఃఖపరంపరలకు ప్రధాన మయినవి యగు గేహేంద్రియాదులే నేనని దురభిమానమును జెంది మతిహీనుం డైతిని, యెల్లప్పుడు పాపకృత్యంబులే జేయుచుండెడు కరపాదచ్ఛేదనంబునకు రోదనంబు జేసితిని. ఆహా లక్ష్మీపతి నా హృత్పద్మంబున నివసించి భక్తులు పూజించెడు రూపంబును యోగులు ధ్యానించెడు స్వరూపంబును జ్ఞానుల కైక్యంబై యుండెడు నిరూపంబును ప్రసాదింపు చున్న ప్రభావంబు నెంతని బొగడ శక్యమగును. ఇట్టి అసమాన తేజోరూపుం డగు తాను శ్రోత్రాది పంచతంత్రులు జీవరూపంబున మానసాదిమంత్రిచతుష్టయమును కామక్రోధాదివీరులును ప్రాణాదికావలివారలును వచనాదిసేనాధిపతులును పరివేష్టించి తన్ను గొలుచుచుండుట గాననైతిని. పెనుదుఃఖంబులను రూపుమాపెడు పరిపూర్ణానందము నాయందే యుండుట దెలియనైతినిగదా దుర్గుణవతియగు వనిత తనపతిని విడనాడి సర్వకష్టంబుల పాల్పడునట్లు దేహంబునందు వాంఛితుండనై సర్వదుఃఖంబులకు బద్ధుండనైతిని యని బహువిధంబుల తన్ను నిందించుకొన్నవాడై తనహృత్పద్మమధ్యంబున విరాజిల్లు చుండెడు బాలకృష్ణ తేజోవిగ్రహంబును గాంచిన మందహాసంబువలన నయనంబుల ఆనందాశ్రువు లొలుకుచుండెను ఇతడేగదా గోవర్ధనగిరి నెత్తినవాడు, గోపాలుం డని భక్తులెల్ల భజింపుచుండెడు దివ్యమంగళస్వరూపుం డితడే గాబోలు యని ఆపాదమస్తక పర్యంతము చక్కగా జూచి వర్ణింపదొడంగెను. కోటిసూర్యప్రకాశమానంబుగా విరాజిల్లుచుండెడు కిరీటము గలవాడా నీకువందనము, నవరత్నంబులచే నొప్పుచున్న కవచకుండలములు గల కృష్ణా నీకువందనము, దివ్యపుండ్రంబులు ధరించిన దామోదరా నీకువందనము, పద్మదళాకారముఖవశీకరా నీకువందనము, శ్రీ మహాలక్ష్మి వసించు వక్షః,

స్థలంబు గలవాడా నీకు వందనము, వనమాలికాభరణా నీకు వందనము, దివ్యపరిమళాలంకృతభూషణా నీకు వందనము, భుజబలపరాక్రమా నీకు వందనము, రాధామనోహరా నీకు వందనము, రుక్మిణీలీలావిలాసా నీకు వందనము, అండపిండబ్రహ్మాండంబు లన్నియు సృజించెడు పద్మనాభా నీకు వందనము, పదునాలుగు భువనంబులను కుక్షియందు ధరించి రక్షింపుచున్న పరాక్రమవంతుడ వగు నీకు నమస్కారము, శివుని జటాభరంబున నివసించెడు గంగాభవానిని పాదంబులయందుత్పత్తి జేసినపరమపావనమూర్తివగు నీకునమస్కారము, నిజజ్ఞానబోధస్వరూపుడా వేణుగానలోలా లీలావినోదా భక్తపరాధీనా అవిరోధా నిర్భేదా నిశ్చేదా నిష్క్రోధా యని అనంతవిధంబుల స్తుతించినను తనివిదీరక యింకయు పరమేశ్వరునిగుణాభివర్ణనములను వర్ణింపదొడంగెను. మెల్లనగా, ఓ పరమేశ్వరా! నీ వఖండశక్తిమంతుండవు, నీ దివ్యమంగళవిగ్రహంబును నుతింపలేక యున్న నాకు నీసంకల్పరూపజ్ఞానముచే నుతింపదగినంత శక్తిని గలుగ జేసినావు, అఘటితము లగు నవెల్లయు ఘటింపజేయు సామర్థ్యము నీకే దగియున్నది, హస్తచరణాదు లగు కర్మేంద్రియములును చక్షురాదిజ్ఞానేంద్రియములును మానసాదియంతఃకరణచతుష్టయమును ప్రాణాదివాయుపంచకమును సర్వాధిష్ఠాన దేవతలను కల్పించి జడరూపం బగు శరీరమును జీవము గల దానినిగా జేయుచున్నావు. అట్టి జీవునకు అంతరాత్మవై జ్ఞానాదిషడ్గుణములు గలవాడవై ప్రకాశింపుచుండెడు నీకు నమస్కారము ఓ దేవదేవా! యీ కానవచ్చుచున్న సమస్తజగంబును వివిధరూపములుగా మార్చుటకు సామర్థ్యము గలదై సత్త్వాదిగుణరూపమై సమస్తకార్యముల నొనరింప నుపయోగ మైనదై నిన్నాశ్రయించియుండెడు ప్రకృతిచేత సృజించి కార్యకారణాత్మకము లగు సత్త్వరజస్తమోగుణసంబంధంబు లగు సమస్తవస్తువులందును జీవస్వరూపంబున వెలుగొందుచున్నావు. పరమేశ్వరా! అట్లు నీ వొక్కడవె సర్వశరీరములందు యున్నను పొడవైనవియు చిన్ననివియు వంకరయయినవియు నగు యింధనంబులయందు అగ్ని వుపాధిసంబంధంబునం జేసి నానారూపంబులుగా గన్పడునట్లు నీవును అనేకవిధములుగా గన్పట్టుచున్నావు. అట్టి శబళబ్రహ్మ మగు నీకు అనేకవందనము లర్పించుచున్నాను. ఓ పురాణపురుషా! బ్రహ్మ తొలుదొలుత నీవలన సృజింపంబడి తాను విశ్వమును మొదట సృజిం

చుట కసమర్థుడై నిన్ను శరణుబొంది నీవలన తన్మయాకారసిద్ధుండై నిద్రజెందినవాడు జాగ్రత నొందినట్లు ప్రసిద్ధం బగు జ్ఞానము గలవాడై సమస్తచరాచరలోకంబులెల్లయు సృజించెను. అంతటి మహామహిమ గలవియు తాపత్రయబాధితు లైనవారికి మోక్షప్రద మైనవియు నగు నీపాదమూలంబునకు పదేపదే వందనం బర్పించుచున్నాను. ఓ జగన్నాయకా! నీవు కల్పవృక్షమువలె నాశ్రితుల యిష్టముల నెఱవేర్చువాడవు. ఇంతియేగాదు జననమరణాది సంసారబాధంబును వదలించి పరమకైవల్య మిచ్చువాడవు నీ వయ్యేయున్నావు. అట్టి మోక్షము ననుగ్రహించెడు నీదుకృపకు పాత్రుడు గాక మోక్షము నపేక్షింపక నరకప్రాయ మైన సంసారమందును శవప్రాయ మైన శరీరేంద్రియాదు లందును మోహితుడనై సుఖము లనుభవింప గోరుచున్నాను, ఆలోచింపగా దాటుట కసాధ్యమైన నీమాయవలన మోహితులై అజ్ఞానతములై యుండుట నిక్కువము. దేవా నీ పాదకమలధ్యానపరాయణులకును నీ భక్తుల చరిత్రంబులు వినువారికిని గలిగెడు సుఖమునకు స్వభావసిద్ధమై అణిమాద్యష్టైశ్వర్యరూపమై యున్న మోక్షముగూడా సరిరా దని జెప్పవలసి యున్నది. అట్టి మోక్షసామ్రాజ్యలక్ష్మీ నీపాదకమలసేవానందము లభించనప్పుడు "క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి" యనుచొప్పున పుణ్యకర్మానుభవానంతరమున విమానముల నుండి జాఱిపడెడు దేవతలకు సహితము లభించనేరదు. కావున నిరతిశయ మగు నానందసుఖ మనుగ్రహించెడు నిన్ను నశ్వరము లగు నిహపరసుఖంబుల గోరువారు మందభాగ్యు లనుటకు సందియంబు లేదు. ఇదిగాక మహాత్ముల సంగమువలన నీ గుణకథామృతమును ద్రావి తాపత్రయమును దొలంగించుకొని దుఃఖరూపమైన సంసారంబును దాటగలను. అయినను వుదారగుణములు గల నీయందు నిరంతరము భక్తి జూపుచున్న మహాత్ముల స్నేహము నాకు గలుగున ట్లనుగ్రహింపుము. దేవదేవోత్తమా! నీపాదకమలభక్త్యామృతము చవిచూచినవారిలో నొక్కడైనను తనదు ప్రాణావసానకాలమందుసహితము దేహమును గాని ధనదారాపుత్త్రాదులనుగాని సంస్మరింపడు, కావున అట్టి నీ పాదమూలంబునకు నమస్కరింపుచున్నాను యని యింకయు జగన్నాథునింగూర్చి స్తుతింపుచున్నాడు.

## జగన్నాథాష్టకము.

1. యథా సంరక్షితం బ్రహ్మ సర్వాపత్స్వేవనం కులమ్।
తథా రక్షాం కురు పునర్దావాగ్నే మధుసూదన॥
2. త్వమిష్ట దేవతాస్మాకం త్వమేవ కులదేవతా।
స్రష్టా పాతాచ సంహర్తా జగతాంచ జగత్పతే॥
3. వహ్నిర్వా వరుణోవాపి చంద్రోవా సూర్యయేవచ।
యమః కుబేరః పవన ఈశానా ద్యాశ్చదేవతాః॥
4. బ్రహ్మేశ శేష ధర్మేంద్రా మునీంద్రా మనవస్మృతాః।
మానవాశ్చ తథా దైత్యా యక్షరాక్షసకిన్నరాః॥
5. యేయే చరాచరాశ్చైవ సర్వే తవ విభూతయః।
ఆవిర్భావ తిరోభావః సర్వేషాంచ త వేచ్ఛయా॥
6 అభయం దేహి గోవిందా వహ్నిసంహరణం కురు।
వయం త్వాం శరణం యామో రక్షత్వం శరణాగతమ్॥
7. ఇత్యేవ ముక్త్వా తే సర్వే తస్తు ర్ధ్యాత్వా పదాంబుజమ్।
దూరీభూతస్తు దావాగ్నే శ్రీకృష్ణామృతదృష్టితః।
సర్వాపదప్రణశ్యంతి హరిస్మరణమాత్రతః॥
8. ఇదం స్తోత్ర మహాపుణ్యం ప్రాతరుత్థాయ యః పఠేత్।
వహ్నిజో న భవేత్తస్య భయం జన్మనిజన్మని॥
9. శత్రుగ్రస్తేచ దావాగ్నౌ విపత్తౌ ప్రాణసంకటే।
స్తోత్ర మేతత్పరిత్వాతు ముచ్యతే నాత్ర సంశయః॥
10. శత్రుసైన్యం క్షయం యాతి సర్వత్ర విజయీ భవేత్।
ఇహలోకే హరే ర్భక్తిం అంతే దాస్యం లభేద్ధ్రువమ్॥

అని శ్రీకృష్ణాభివర్ణనముజేసి సంకల్పంబు లన్నియుబాసి అంతర్ముఖుండై వుచ్ఛ్వాసనిశ్వాసంబులను కుంభించి త్రివేణీసంగంబున నిలిచి చిణీనాదము చిణిచిణీనాదము వీణనాదము శంఖనాదము మృదంగనాదము మేఘనాదము తాళంబులశబ్దంబులును తంబురనాదము వేణునాదము మున్నగు దశవిధనాదంబులను వినుచు ద్వాదశాంతబయలునందున వేయిన్నియొక్కరేకులు గల పద్మసౌధమునందు కోటిసూర్యప్రకాశమానంబుగా విరాజిల్లు చుండెడు పరిపూర్ణబ్రహ్మస్వరూపంబును గాంచి ఆనందంబున మునింగి చిదాకాశమం దైక్యమై నిర్వాతస్థల దీపంబువలెను నిస్తరంగసముద్రంబుమాడ్కి కొంత

దడవు సమాధినిష్ఠుండై యుండి పిదప అవాఙ్మానసగోచరంబై యున్న నిర్గుణబ్రహ్మంబును వర్ణింపందొడంగెను. సృష్టిస్థితిసంహారంబులకు కారణభూతుండవై బ్రహ్మవిష్ణుశివాత్మక స్వరూపుండవై ప్రకాశింపుచున్న నీకు వందనము, దేవాదిదేవా! గరుడ గంధర్వ కిన్నర కింపురుష సిద్ధ సాధ్య పన్నగ యక్ష రాక్షస పిశాచ మనుష్య పశు పక్షి క్రిమి కీటక పిపీలికాదులున్ను పృథివ్యప్తేజవాయ్వాకాశాదులున్ను శబ్ద స్పర్శ రూప రస గంధంబులున్ను నీవే, మనోబుద్ధిచిత్తాహంకార కాలదేశాత్మక స్వరూపుడవు నీవే, విద్యావిద్యలు సత్యాసత్యంబులు వేదోక్తసకలకర్మంబులున్ను నీవయ్యేయున్నావు, కర్మయోగంబులను భవించువాడువు, తత్సాధనంబులును సాధనద్రవ్యంబులును సర్వంబును నీకన్యంబుగా నేదియు గాన్పింపలేదు. సమస్తలోకంబునకు నిమిత్తోపదానకారణభూతుండ వగు నిన్ను ఇంద్రియనిగ్రహులగు పరమయోగీంద్రులు భజింపుచున్నారు, సోమయాజులు నిన్నుద్దేశించియే గదా యజ్ఞంబు లొనర్చుచున్నారు, పితృరూపమును దైవరూపమును బొంది హవ్యకవ్యంబుల భుజించువాడ వీవొక్కడవే గదా, మహదహంకారములకు సూక్ష్మంబును సూక్ష్మంబునకు సూక్ష్మమును నీయొక్క అప్రాకృత పరంజ్యోతిస్వరూప మొక్కటే గాన్పించుచున్నది. ఇత్యాది మహాద్భుతశక్తులు గల విశ్వరూపుండ వగు నీకు అనంతవందనములు, సర్వభూతంబులయందు శాంతాదిగుణంబులతో గూడియున్న జీవత్వంబునకు వందనము, కర్మాధీనంబు లగు కేవలనామరూపంబులకు విలక్షణస్వరూపుడ వగు నీకు నమస్కరించెదను, సురాసురులెల్లరు నీయొక్క పరంజ్యోతిస్వరూపమును జూడ నసాధ్యమై కేశవ వరాహాది విగ్రహంబుల బూజింపుచున్నారో అట్టి దేవదేవుండ వగు నీకు వందనము. జగదీశ్వరా యని పెక్కుభంగుల స్తుతించి పరబయలునందైక్యమై అద్వైతమై అఖండానందమై అవాఙ్మానసగోచరమై తనువు మఱచి సదానందవారిధిలో మునింగి చిత్రలిఖితంబుమాడ్కి జయదేవస్వాములు కూపంబునందే యుండెను. ఇతఁ డిట్లుండగా జగన్నాథంబున పతిరాక యెదురుజూచు చున్న పద్మావతి అస్తమానంబువఱకు పతిరానందులకు వెఱగంది నానాథు డెచట నిష్ఠలోనుండి తనుమఱచియున్న వాడో లేక భక్తులవలన పూజితుండై యున్నాడో, లేకున్న సంసారంబు దుఃఖం బని సన్న్యసించెనేమొ యని పలుదెఱంగుల దలంచుచు

నచ్చటచ్చట దిరిగిదిరిగి యెందును గాన్పింపక నంతకంతకు దుఃఖం బతిశయించి అకటా యిక నేమి చేయుదాన పూర్వ మెకపరి పడ రాని యిడుములు బడి యుండియు బుద్ధిహీనతనై పతిని విడచి యుం టిని గదా నాపతి యిక నెందు గాన్పింపగలడు. ఆహా దైవమా నేను పుడమియందు బుట్టినది మొదలు దురవస్థాపీడితనై దుఃఖము లకే నా జీవితము సరిపోవుచున్నదే, దైవమా నీవును నాయం దింత దుర్ఘటం బగు కృత్యంబునకు బూనుకొనవలయునా? ఇందుకు నా పూర్వజన్మకర్మఫలంబు కారణంబు గాబోలు? ఇక నే జేయున దేమి యున్నది నీయిష్టము వచ్చినట్లు జేసికొనుము. అని యేదియు దోచక దుఃఖసాగరంబున మునింగి నిదురాహారంబులు లేక పతిని ధ్యానింపు చుండెను. తద్వర్తమానం బెల్లయు పద్మావతితండ్రి కెవ్వరో జెప్పగా విని పద్మావతి యుండెడు మరంబునకు వచ్చి, పుత్త్రీ! నీవు వెరువవలదు. నీనాథు డెచటనున్నను నే వెదకి గొనివచ్చెద దుఃఖంబు మానుము యని కూతు నూరార్చి తన గృహంబునకు దీసుక వెళ్లి యామె నం దుంచి తాను యరణ్యంబుల కేగి కొండ గుహాలయందును పొదరుల యందును వెదకి వెదకి వేసారి జయదేవుల నెందును గానక మరలి గృహంబునకు వచ్చి పద్మావతిని జూచి, దేవీ! నీపతి కొండగుహాలయం దెచటనో బ్రహ్మరసామృతపానమత్తుడై దేహంబు మఱచియున్నవాడు. స్వల్పకాలంబుననే వచ్చివేయును నీ విందులకై చింతింప నవసరము లేదు, నేనును యచ్చటచ్చట విచారించి దెలిసికొనెదను యని కూతు నకు హితోక్తులు జెప్పి జయదేవుల విషయమై విచారింపు చుండెను. పిమ్మట పద్మావతి పురుష దుఃఖంబునకు సహింపజాలక పగలెల్లయు నరణ్యంబులయందును రేయిగృహంబునను నివసింపుచు పతిని వెదకుచు స్నానాదులొనర్పక చేలంబు పరిత్యజింపక యాహారంబులనుగొనక దుః ఖానలజ్వాలలవలన మనోపీడితయై పతిని ధ్యానింపుచు కాలము గడపు చుండెను. అని నాభాజిసిద్ధులు జెప్పగా నుత్తమసిద్ధులు మహాత్మా! వీరి దురవస్థలను వినునప్పుడు నెట్టివారికైనను జాలిబుట్టక మానదని దలం చుచున్నాము. మాకును మిక్కుటముగు సంతాపమునే బుట్టించుచు న్నది, ఆకూపంబున బడియుండెడు జయదేవకవిసార్వభౌముని స్థితి యే మాయెనో సుంత సెలవొసంగుడు యని ప్రార్థించగా, నాభాజిసిద్ధులు వినండి సిద్ధులారా! జయదేవులు బడియుండెడు కూపంబునకు సమీ

షంబున క్రౌంచదేశం బని యొక పట్టణంబు గలదు. యా దేశాధిపతి యగు సుగుణభూషణుం డనురాజు మిక్కిలి శాస్త్రపరిశీలుండును సంపద్గుణవిశిష్టుండును దయాపాలుండును నై రాజ్యం బేలుచుండెను. ఆ కాలంబున నరణ్యంబున క్రూరమృగంబు లభివృద్ధియై గ్రామంబుల లోనికిం బ్రవేశించి గోమహిషంబుల ధ్వంసంబు చేయు చుండుట వెఱంగి పౌరులు భీతిల్లి నృపతిపాలికిం జని రాజా మనదేశంబున ఘోరమృగబాధ మిక్కుటంబై యున్నది గావున భయమంది యుండెము మమ్ము రక్షింపు డని ప్రార్థించుకొనిరి. అంత నా రాజు వల్లె యని యరణ్యంబునకు వేటాడ బోవ నిశ్చయించి సైనికుల కాజ్ఞాపించెను.

# నాలుగవ అధ్యాయము.

## జయదేవులు క్రౌంచదేశంబున కరుగుట.

వినండి సిద్ధులారా! రాజాజ్ఞానుసారముగా సైనికులు పరివారం బెల్లయు సిద్ధపడి రాజున కెఱింగించిరి. అంత రాజు సైన్యంబును వెంట దీసుకొని తాను రథారూఢుండై యరణ్యంబున కేగి యందున్న పెక్కుమృగంబుల దునుమాడి యలసి తానును తనసైనికులును క్షుత్పిపాసాదులవలన డస్సి యుం దెచ్చటను ద్రావుటకు నీరు గానక పట్టణాభిముఖులై వచ్చుచుండెను మార్గంబున జయదేవులు బడియుండెడు కూపంబు గాన్పించెను. ఆ కూపంబున నీరు ముంచి త్రావుట కుద్యమించి కూపంబున జూడ కూపం బెల్లయు బ్రహ్మతేజంబున దేదీప్యమానముగా ప్రకాశింపు చుండుట కచ్చెరువంది కొంతదడవు పరికించి జూచి యెవడో యొకమానవుం డున్నవా డని నిశ్చయించి రాజు యాతని బైట దీయుం డని సైనికుల కాజ్ఞాపించెను. వెంటనే సైనికు లట్లొనర్చగా నంత రాజు బ్రహ్మతేజోనిధి యగు జయదేవులదురవస్థకు మిక్కిలి పశ్చాత్తప్తుండై తా నెవ్వ రని యడిగెను. అందుకు జయదేవు లేమియు బలుకక మౌనముగానే యుండెను. అంత నృపతి యెవరయా మీరు? మీ కిట్టి దురవస్థ సంభవించినందులకు కారణం బేమి? తమ కరపాదంబులను ఖండించిన దురాత్ము లెవరు? అంతయు సవిస్తరంబుగా సెలవీసంగు డని ప్రార్థించెను. అంత జయదేవులు సమాధి విడిచి బహి

ర్ముఖుండై, నరేంద్రా! నీకు మంగళములు గలుగు గాక. అవశ్య మనుభవించవలసిన శుభాశుభకర్మంబు లనుభవింపక యెంతటివారి నైనను విడువవు, నాప్రారబ్ధవశంబున నా కిట్టి దురవస్థ సంభవించెనేగాని మఱియెవ్వరివల్లను గాదు. పూర్వము లోకశరణ్యుండైన మహావిష్ణువు దశరథాత్మజుండై పుట్టి సీతాసమేతుండై యరణ్యంబున నానా బాధ లనుభవించెను. శంకరుండు బ్రహ్మహత్యవలన జగం బెల్లయు దిరిగి కపాలపాత్రంబున భిక్షాటనంబు జేయువలసివచ్చెను. బ్రహ్మదేవుండు తనశిరంబొక్కటి గోల్పోయెను. ఎంతవారికైన కర్మానుభవ మలంఘ్యనియము భూపతీ! ప్రారబ్ధవశంబున నేనును గాసినొందితి. అవినాశం బైన చిత్సమాధియం దుండితి, సర్వజ్ఞపీఠంబున నన్ను నెలకొలిపిన మహానుభావు లెవ్వరో గానకున్నాను, నన్ను దృక్కున జేర్చిన మహానుభావు లెవరేని యొకరుగానే యుండవలయును. అని బలుకుచున్న వాక్యంబులను నృపతి కర్ణంబులకు రసవంతంబులుగా దోచుచున్నందున నట్టి యనుభవవాక్యంబులను విని నరేంద్రుండు ఆనందపరవశుండై తన యిష్టదైవం బగు శంకరుం డీతీరున వచ్చి తన్ను కృతార్థునిం జేయం బూనియున్నా డని మిక్కిలి మందహాసంబుతో దలంచి మంత్రులం గాంచి, సుమంత్రులారా! మనదేశంబున నిట్టి దుర్ఘటం బైన పాతకంబులు జరుగుచున్నవి. ఇంకయు మనదేశంబున యెంతటి మహాపాపంబులు జరుగుచున్నవో దెలిసినవిగావు, జూచితిరా "రాజా రాష్ట్రకృతం పాపమ్" యనునట్లు ఇంతటిమహానుభావుల కిట్టి దురవస్థలు సంభవించిన పాతకంబులు నన్ను సామాన్యంబుగా వదలిపెట్టునవిగావు గదా యని పాపంబునకు వెఱచి దురంతచింతాక్రాంతుండై అకటా ఇందు కేమి జేయువాడ నా కేదియు దోచకున్నయదియని జయదేవులకు ప్రదక్షిణ నమస్కారంబులు జేసి తన ఱొమ్మున జేర్చి మహాత్మా తమ కిట్టి దురవస్థ సంభవించెను గదా యని కన్నీరుచే యామహాత్ముని దేహంబెల్ల దడపి నేలంబడి పెనురోదనంబు జేయుచు తన యిష్టదైవం బగు శంకరుని స్తుతింపం దొడంగెను.

1. జటా కటాహ సంభ్రమ భ్రమ న్నిలింప నిర్ఝరీ
విలోల వీదివల్లరీ విరాజమాన మూర్ధని ।
ధగద్ధగద్ధగజ్వలల్లలాటపట్టపావకే
కిశోరచంద్రశేఖరే రతిప్రతిక్షణం మమ॥

2. ధరాధరేంద్రనందినీ విలాసబంధుబంధుర
స్ఫురదృగంతసంతతి ప్రమోదమానమానసే ।
కృపాకటాక్షధోరణీ నిరుద్ధదుర్ధరాపది
క్వచిద్దిగంబరే మనోవినోదమేతు వస్తుని॥
3. జటాభుజంగపింగళస్ఫురత్ఫణామణిప్రభా
కదంబకుంకుమద్రవప్రలిప్తదిగ్వధూముఖే ।
మదాంధసింధురస్ఫురత్త్వగుత్తరీయమేదురే
మనోవినోద మద్భుతం బిభర్తు భూతభర్తరి॥
4. సహస్రలోచనప్రభృత్యశేషలేఖశేఖర
ప్రసూనధూళిధోరణీ విధూసరాంఘ్రిపీఠభూ ।
భుజంగరాజమాలయా నిబద్ధజాటజూటక
శ్రియై చిరాయజాయతాం చకోరబంధుశేఖరః॥
5. లలాటచత్వరజ్వలద్ధనంజయస్ఫులింగభా
న్నిపీతపంచసాయకం నమన్నిలింపనాయకమ్ ।
సుధామయూఖలేఖయా విరాజమానశేఖరం
మహాకపాలిసంపదే శిరోజటాలమస్తునః॥

6. కరాళజాలపట్టికా ధ్ధగద్ధగద్ధగజ్వల
ధ్ధనంజయాదరీకృతా ప్రచండపంచసాయకే ।
ధరాధరేంద్రనందినీ కుచాగ్రచిత్రపత్రకా
ప్రకల్పనైకశిల్పినీ త్రిలోచనే మతిర్మమ॥
7. నవీనమేఘమండలీ నిరుద్ధదుర్ధరస్ఫుర
త్కుహూనిశీథిని తమఃప్రబంధబాధకంధరా ।
నిలింపనిర్ఝరీ ధర స్తనోతు కృత్తిసింధురః
కళానిధానబంధుర శ్శ్రియం జగద్ధురంధరః॥
8. ప్రఫుల్లనిలపంకజ ప్రపంచకాలిమచ్ఛటా
విడంబికంఠకంధరా రుచిప్రబంధకంధరమ్ ।
స్మరచ్ఛిదం పురచ్ఛిదం భవచ్ఛిదం మఖచ్ఛిదం
గజచ్ఛిదాంధకాచ్ఛిదం తమంతకచ్ఛిదం భజే॥
9. అగర్వసర్వమంగళా కళాకదంబమంజరీ
రసప్రవాహమాధురీ విజృంభణామధువ్రతమ్ ।

స్మరాంతకం పురాంతకం భవాంతకం మఖాంతకం
గజాంధకాంతకాంతకం తమంతకాంతకం భజే॥

10. జయత్వదభ్రవిభ్రమద్భ్రమద్భుజంగమస్ఫుర
ద్ధగద్ధగద్వినిర్గమత్కరాళఫాలహవ్యవాట్।
ధిమిద్ధిమిద్ధిమిధ్వన న్మృదంగతుంగమంగళ
ధ్వనిక్రమప్రవర్తిత ప్రచండతాండవశ్శివః॥

11. దృషద్విచిత్రతల్పయో ర్భుజంగమౌక్తికస్రజో
ర్గరిష్ఠరత్నలోష్ఠయో స్సుహృద్విపక్షపక్షయోః।
తృణారవిందచక్షుషోః ప్రజామహీమహేంద్రయో
స్సమం ప్రవర్తయన్మనః కదా సదా శివం భజే॥

12. కదా నిలింపనిర్ఝరీ నికుంజకోటరేవసన్
విముక్తదుర్మతి స్సదా శిరస్థమంజలిం వహన్।
విముక్తలోలలోచనో లలామఫాలలగ్నక
శ్శివేతి మంత్రముచ్చరన్ కదా సుఖీ భవామ్యహమ్॥

13. ఇమంహి నిత్యమేవముక్త ముత్తమోత్తమం స్తవం
పఠన్స్మరన్ బ్రువన్నరో విశుద్ధమేతి సంతతమ్।
హరే గురౌచ భక్తి మాశు యాతి నాన్యథాగతిం
విమోహనం విదేహినాం సుశంకరస్య చింతనమ్।

14. పూజావసానసమయే దశవక్త్రగీతం
య శ్శంభుపూజన మిదం పఠతి ప్రదోషే।
తస్య స్థిరాం రథగజేంద్రతురంగయుక్తాం
లక్ష్మీం సదైవ సుముఖీం శ్చ దదాతి శంభుః॥

అని యీవిధంబుగా దనయిష్టదైవం బగు శంకరుని ధ్యానించి అనంతరము నృపతి మంత్రులంగాంచి యీమహాత్ముని పల్లకిలోనునిచి మననగరునకు గొంపోవుద మని పలికెను. మంత్రులు మహాభాగ్యం బని జయదేవులను పాలకిలోఁగూర్చుండ బెట్టి పరివారసహితంబుగా రాజమేకరుందీసికొనిపోయి ప్రణచికిత్సకులరావించి జయదేవుల కాలుచేతుల ప్రణంబులు మాన్పి అత్యంతభక్తిప్రపత్తులతో రాజపూజింపుచుండెను. ఇట్లుండెడు సమయంబున నరపతికి గురుసేవావిశేషంబున అంతకంతకు విరాగం బతిశయించి యిహభోగంబులయందలి

తుచ్ఛదృష్టి గలవాఁడై జయదేవులసన్నిధి కేగి, ఓసద్గురుపరాత్పరా! ఇహసుఖంబులెల్ల దుఃఖంబులుగా దోఁచుచున్నయవి, మోక్షసాధనం బగు తపంబాచరింప నభిలషించితిఁ గాన తదుక్తం బగు మార్గంబు నుప దేశించి కృతార్థునింజేయుం డని సవినయముగా ప్రార్థించి కిరీటము మున్నగు రాజచిహ్నముల బరిత్యజించి యేకాంగియై నిలుచుండెను. అంత జయదేవులు కరుణారసదృష్టిం జూచి ఓయి నరేంద్రా! గృహస్థా శ్రమపరిత్యాగమాత్రంబున మోక్షంబు సిద్ధించదు. నాది నే నను అహంకార మమకారంబులు వీడకున్న నిజానంద మనుభవింపనేరఁడు. గార్హస్థ్యంబుననుండి భక్తిప్రపత్తులతో సాధుసంగంబు జేయుచు ఫలాపేక్షరహితుఁడై సత్కర్మంబు లనుష్ఠింపుచుండెనేని యట్టివానికి హృదయస్థితంబై యుండెడు కామక్రోధ లోభమోహమదమాత్సర్యం బులను పాపగుణంబులెల్ల నశించి శాంతాదిగుణములు గలిగి స్వకులా చారధర్మంబులం దప్పక నెఱపుచుండెనేని యట్టి ధన్యాత్ముఁడు శీఘ్ర కాలముననే ముక్తుండై మోక్షం బందుచున్నాఁడు యని జయదేవులు జప్పగా విని, రాజు గురువరా! ప్రపంచంబున జీవులు కొందఱు దుష్క ర్మాచరణులును, కొందఱు సత్కర్మేచ్ఛగలవారును యింక ననేకభేదం బులుగా వర్తించుటకు కారణం బేదో విశదంబుగా నెఱింగింపు డని ప్రార్థించెను. అందుకు జయదేవులు భూపతీ! లోకంబున జీవులు పుణ్య పాపమిశ్రకర్మంబు లను త్రివిధకర్మంబులచే బద్ధులై సుఖదుఃఖంబు లనుభవింపుచున్నవారు, ఎట్లంటివేని, మనోవాక్కాయంబు లను త్రివిధ కరణంబులచేత త్రివిధకర్మంబుల జేయుచున్నారు. ఆ త్రివిధకర్మంబు లును ఉత్కృష్ట మధ్యమ సామాన్యభేదంబులచే తొమ్మిదివిధంబులు. అందు సర్వదా భగవంతుని చింతించుటయు, పరులకు మేలుజేయ వలెనను తలంపును, మహాత్ముల స్మరింపుచుండుటయు, యజ్ఞయాగా దులు జేయ దలంచుట మున్నగునవి మనస్సుచే జేయబడు పుణ్యకర్మం బులని చెప్పంబడును. సర్వదా పరులను పీడించుట, నిత్యమగు పరమేశ్వ రుని అనిత్యంబుగా భావించుట, స్వార్థసుఖాభిలాషియై యుండుట, వేద వాక్యంబుల నప్రమాణంబుగా దలంచుట మున్నగునవి మనస్సు వలన జేసెడు పాపకర్మంబులు. దేవాలయంబుల మాన్యంబులు బ్రాహ్మ ణులు అపహరించియుండిరేని వానిని దీసి యాలయంబులకు వదలుట, పరులను యాచించి చలిపందిళ్లు కూపతటాకాదులు సత్రములు గుడి

గోపురప్రాకారమంటపాదులు గట్టించవలె నని దలంచుట, మున్నగు నవి మనస్సుచే జేయబడు మిశ్రకర్మంబు లని జెప్పంబడును. వేదాధ్య యనము జేయుట, వేదాంతశాస్త్రంబుల పఠించుట, భగవన్నామంబుల భజించుట, మహాత్ముల స్తుతించుట, పరులకు మేలుగలుగుటకు మాట లాడుట, సత్యము బలుకుట మున్నగునవి వాక్కుచే జేయబడు పుణ్య కర్మంబులు. పరులను దూషించుట, మతభేదంబులచే నైనను మమతచే నైనను దైవదూషణంబు జేయుట, కొండెములు జెప్పుట, దుర్జనుల బొగడుట, అన్యాయపుమాటలాడుట మొదలగునవి వాక్కుచే జేయ బడు పాపకర్మంబులు. ఒరులమేలుకొఱకు కల్లలాడుట, పంచాక్షరి తారకమంత్రజపాదికాలములయందు లౌకిక వార్తలు బలుకుట, మున్న గునవి వాక్కుచే చేయబడు మిశ్రకర్మ లనబడును. పుణ్యతీర్థయాత్రలు సలుపుట, అందు స్నానాదు లొనర్చుట, హరిహరాలయంబుల కేగుట, అందు ప్రదక్షిణనమస్కారంబులు జేయుట, హరిహరవిగ్రహంబుల నష్టోత్తరశతనామాదిమంత్రంబులచే యర్చించుట, తన్నెఱింగిన జీవ న్ముక్తులపాదసేవ మున్నగునవి జేయుట, అతిథులకు అన్నవస్త్రాదు లిచ్చుట, వాపీకూపతటాకాది సద్ధర్మంబులయందు శరీరము కష్టించుట మున్నగున వెల్లయు కాయముచే జేయబడు పుణ్యకర్మంబులు. పరు లను గొట్టుట, జీవహింస జేయుట, మధుమాంసంబులు స్వేచ్ఛగా మెక్కి వాడ తెఱుంగకుండుట, దొంగిలిడుట, పరస్త్రీల గవయుట మున్నగునవి కాయముచే జేసెడు పాపకర్మంబులు. పరుల మేలుకొఱకు నొకరిని హింసించుట, దేవాలయంబుల ద్రవ్యంబును బ్రాహ్మలు మున్న గువారు యుపహరించియుండిరేని వారిని హింసించియైనను వస్తువులను దీసి దేవాలయంబుల కొసంగుట మున్నగునవి కాయముచే జేసెడు మిశ్రకర్మంబులు. ఓయి రాజా! యీకర్మంబులకు ఫలంబు జెప్పుచున్నాను వినుము. పుణ్యకర్మంబునకు దేవతాశరీరప్రాప్తియు, పాపకర్మంబునకు పశుపక్షిమృగక్రిమికీటకతరులతాగుల్మ స్థావరాది శరీరప్రాప్తియు మిశ్ర కర్మంబునకు మనుష్యశరీరప్రాప్తియు గలుగుచున్నవి. ఇందు పుణ్యో త్కర్షంబునకు హిరణ్యగర్భాది శరీరప్రాప్తి, పుణ్యమధ్యమంబునకు ఇంద్రాది శరీరప్రాప్తి, పుణ్యసామాన్యంబునకు యక్షరాక్షసపిశా చాది శరీరప్రాప్తి, పాపోత్కర్షంబునకు స్థావరవృక్షక్రూరమృగ శరీర ప్రాప్తి, పాపమధ్యంబునకు శ్వానవరాహగార్దభాది శరీరప్రాప్తి, పాప

సామాన్యంబునకు గోమహిషాశ్వత్థాది శరీరప్రాప్తి, మిశ్రోత్కర్షంబునకు మనుష్యజన్మంబును అందు స్వధర్మానుష్ఠానపయంబై సాధనచతుష్టయ సంపత్తిగలిగి తద్వారా సద్గురులాభంబును తన్మూలంబున ఆత్మసాక్షాత్కారముగలిగి మోక్షమందుట కుచితంబగు శరీరప్రాప్తి, మిశ్రమధ్యమంబునకు స్వవర్ణాశ్రమధర్మోచితం బైన శరీరప్రాప్తి, మిశ్రసామాన్యంబునకు చండాలవ్యాధాది శరీరప్రాప్తి, ఈవిధంబుగా కర్మానుగుణ్యంబై సర్వజీవులు ఆగామి సంచిత ప్రారబ్ధరూపంబున తెంపులేక జననమరణరూప సంసారసాగరంబున నిమలాడుచు గట్టెక్కుటకు దరిగానక కల్పాంతంబులయందును జన్మాదులొందుచున్నవారు, ఇట్టి దుర్ఘటం బైన జన్మభవంబునకు సత్సంగత్యమే నాశరూపం బైయున్నది గావున ఇందుకు దృష్టాంతంబుగా నొక్క యితిహాసంబు జెప్పెద నాకర్ణింపు మని దీర్ఘబాహునిచరిత్రంబు జెప్పుచున్నాడు.

పూర్వము ఋష్యశృంగం బను నొక పర్వతప్రాంతంబున దీర్ఘబాహుం డను నొకబోయవా డుండెను. అతడు కొంతమంది దుర్జనపరివారంబును జేర్చుకొని గ్రామంబులయందును అరణ్యంబులయందును దారిదోపుదోయుచు పరులను హింసించుచు తళతళ మెఱయుచుండెడి ఖడ్గంబులను చేబూని జూచువారి యుల్లము తల్లడిల్లునట్లు మహాపాతకంబులకు జన్మస్థానమై యుండిరి. పిదప యాదేశంబున క్షామంబు గల్గి యాచోరులకు జీవనోపాయంబు గానక యచ్చోటు బాసి మఱొక పర్వతప్రాంతంబునం జేరిరి. అందు తనసహచరులను వెంటబెట్టుకొని యెందైనను దోపుదోయుటకు యత్నించి పోవుచుండెడు మార్గంబున నతివైశాల్యం బగు నొక శివాలయంబు గన్పట్టెను. ఆ యాలయగోపురశృంగంబులు బంగారుమయంబులై గన్పట్టుటను జూచి దీర్ఘబాహుండు తనసహచరులతో మిత్రులారా! అదో గన్పట్టెడు దేవాలయగోపురశృంగింబులం గాంచితిరా కలశంబు లెల్లయు స్వర్ణమయంబులై రంగారుచున్నవి. ఆలయంబులో ప్రవేశించి జూచిన నింకయు నెంత విలువ గల యాభరణంబు లుండునో జూతము రండు. ఈ ఘోరారణ్యంబున మన మెంతపని జేసినను యడ్డగించువా రెవ్వరును లేరు యని ధైర్యోక్తులాడుచు నాలయంబులోనికిం బ్రవేశించిరి. అందు రత్నఖచితం బైన ద్వారంబుల శృంగారంబును విగ్రహంబులకు ధరించి యుండెడు యాభరణంబుల యలంకారంబును జూచి అయారె

మిత్రులారా! మనదారిద్ర్యం బింతటితో దగ్ధం బైనది, ఇందున్న స్వర్ణంబును రత్నంబులను యపహరించితిమేని మన జీవితకాల మంతయు జీవనార్థచింత లేశం బైనను యుండనేరదు గదా యని యెల్లరు సంతసహృదయులై ఖడ్గంబుల చేబూని దేవాలయంబులో నలుప్రక్కల నెవ్వరేని యుందురా యని పారజూచిరి. అం దెవ్వరును గాన్పింపలేదు గావున వా రొకరికొకరు సంభ్రమంబుగా సంభాషింపుకొనుచు ఆలయం బెల్లయు దిరుగుచు నచ్చటచ్చటనుండెడు వైభవంబులం గాంచుచుండిరి. ఇంతలో బత్రిఫలపుష్పంబులకు వనంబున కరిగియున్న మునీశ్వరుండుపూజాద్రవ్యంబులం గైకొని యాలయంబులోనికి వచ్చెను. అతనిం గాంచి యాచోరులు ఓహో మోసము వచ్చినది, ఇక నేట్లు చేయుదము యని దురంతచింతాక్రాంతులై మరల ధైర్యం బవలంబించి చోరాగ్రగణ్యుం డైన దీర్ఘబాహుండు ఖడ్గంబు ఝళిపించి తాపసిని వధింప గమకించెను. అంత యతిపుంగవుడు దీర్ఘబాహునిం గాంచి, మిత్రమా! నిరర్థకంబుగా నన్నేల వధించబూనెదవు. మీకు నే నొనర్చిన యపరాధం బేమి సూత శాంతింపుడు. నిర్నిమిత్తముగా నన్ను హింసించుట ధర్మము గాదు. ఏపురుషుడు తన్ను నితరులు బాధింపుచున్నను శాంతచిత్తుడై ద్వేషింపక యుండునో యట్టి పుణ్యాత్ముడే వృత్తము దనియు నాహారాదుల కతిప్రియుం డనియు మహర్షులు వచింతురు. ఇంతియ గాక, మాయ యనునది జీవసమూహమును వారివారి పూర్వకర్మానుసారము రజస్సత్త్వతమోగుణంబులచే శుభాశుభకర్మలయందు దృష్టిని గలిగించి పురుషార్థత్రయమునందు నాసక్తమై ప్రారబ్ధం బనుభవింపజేయుచు ఆగామ్యం బను నవీన కర్మంబును సంపాదింపజేయుచున్నది. యొక కుటుంబీకుడు తన పిత్రార్జితం బైన పదియేకరముల పొలము ననుభవింపుచు మరల కొంత పొలము సంపాదింప దలంచునట్లు జీవులు కర్మకలాపమును గొని సంసారాటవియందు భ్రమ్మరుచున్నవారు. మిత్రమా! నుంతైనను సుఖంబు లేదు, వనమందు జరించుచున్న వర్తకుని ధనము చోరు లపహరించినట్లు దేహభ్రాంతితో జరించెడు జీవుల వివేక మను ధనమును ఇంద్రియాదులను చోరులు బలాత్కారముగా నపహరించి మోహ మనెడు అంధకారకూపంబున బడవేయుచున్నారు. ఘోరారణ్యమందు క్రూరజంతువులు మేకను హింసించువిధంబుగా దారాపుత్రాదులు నీవు నా

భర్తవు నీవు మాతండ్రివి అని విశ్వసించి ప్రమత్తునిగా జేసి హింసించుచుందురు. గంధర్వపురమువంటి మనుష్యసంసారంబును నిత్యమని దలంచి వాఁ డొక్కొక్కప్పుడు పరులధనాదులను స్వర్ణాదులను జూచి తన కుపకారము గలిగించు నని దలంచి స్వీకరించి వారిచే నుపహతుడగుచుండును. జీవుఁడు ధనమం దాత్మబుద్ధి గల్గియుండుటను జూడగా దప్పిగొన్నవాడు మృగతృష్ణలో నుండి జలమును సంపాదింప బర్విడి బడలినట్లు సంసారమందు ద్రిమ్మరుచుండును. సోదరా! పెనుగాలిలో జిక్కువడిన పురుషుఁడు వాయువేగముచే దిక్కులుగప్పి యంధకారబంధురుండై గ్రుడ్డివానివలె దనమార్గము గానలేనివా డగుచున్నాడు. అట్లే జీవుడును సంసారమందు జిక్కి భార్యయందలి యనురాగమువలన రజోగుణముచే నపహృతజ్ఞానము గలవాడై ధర్మమార్గంబు నెఱుంగజాలడు గావున ప్రతిమానవుఁడును ధర్మాధర్మంబు లెఱింగి జ్ఞానము గలవాడై యెంతమట్టుకు తాను ధనార్జనుండై యుండునో యంతమట్టుకే సతి సుత బాంధవ్యాదరణంబు గోచరించును. బలధనధైర్యవిహీనుండైనచో నిరాదరంబు ప్రత్యక్షంబే గదా యని యెఱింగి ధనాదిపదార్థంబులు లభించినప్పుడు లేనప్పుడు సమచిత్తుడై యుండువాని శోకనికే దుఃఖం బణుమాత్రమైనను దోచనేరదు. మమకారంబను వలలో జిక్కువడి పరులను పీడించియైనను తనవారిని సంభ్రమింప జేయుచుండును. అట్లొనర్పుటవలన తనవారు సంతుష్టిగా యనుభవింతురే గాని దానంజేసి సంభవించెడు పాపంబును తానుమాత్రమే యనుభవించి తీరవలెను.

ఈ కష్టంబు లెఱుంగక మూర్ఖులగువారు జీవనార్థంబులకు దుర్మార్గప్రవర్తనులై పరులను హింసించి పాపంబులకు పాల్పడుచున్నారు. అని తాపసి వచింపగా నట్టి జ్ఞానవాక్యంబు లెల్లయు దీర్ఘబాహుని కర్ణంబుల సోకినంతనే జ్ఞానోదయుండై చేతనున్న ఖడ్గంబును భూమిపై బడవైచి ముకుళితకరకమలుండై మునిచంద్రమా! తమధర్మోపన్యాసంబువలన నామనంబున నున్న దుశ్చింతలెల్ల వీడినవి. నాదు నేరంబును క్షమింపుదురని పదేపదే వందనం బాచరించుచున్నాను యని దీనస్వరంబుతో దేవా! నాకేదేని యొక్కమార్గంబును దెలిపి సంసారార్ణవంబు తరించునట్లు యనుగ్రహింపు మని ప్రార్థించెను. అందు కా మహా నీంద్రుండు నాయనా జూచితివా సత్పురుషసందర్శనంబువల్లను భగ

పదాలయప్రవేశంబువల్లను నీయఘం బెల్లయు నణుమాత్రంబై యంతరించి పోయినది. ఇక సుంతేనియు వెఱువవలదు, కృతార్థుండ వైతివి యని యనుగ్రహించెను. అంత నాదీర్ఘబాహుడు మందహాసంబుతో మహాత్మా తమకరుణాప్రసాదంబువలన నాయఘంబులెల్లయు విధ్వంసం బాయె. పూర్వజన్మార్జితకర్మవిశేషంబువలననే బాల్యంబుననుండి జేయుచున్న పాపకృత్యంబు లసంఖ్యాకంబులు, వాని స్మృతదలంచితినేని గుండె లవియుచున్నవి. ఇక నే కృతార్థుడగుటకు యేది చేయవలె నని యెఱుంగజాల కున్నాను. తమ్ము వినా దాసుని రక్షించుటకు వేఱెవ్వరును లేరు. తమకరుణాప్రసాదమే నాజన్మబంధంబును ద్రుంచుటకు చంద్రాయుధం బని నమ్ముచున్నాను యని దీర్ఘబాహుడు వినయముగా బ్రార్థించెను. అంత నాయతివరుండు వాని మొరాలకించి కరుణారసదృష్టిని వీక్షించి శిరంబున జలంబు ప్రోక్షించి హస్తమస్తకసంయోగంబు జేసి శివపంచాక్షరిమంత్రం బుపదేశించి వొడలెల్లయు భస్మంబు బూసి తనచేత నున్న రుద్రాక్షమాలిక కంఠంబున వైచినంతనే దీర్ఘబాహుండు మూర్ఛితుండై కొంతదడవునకు మేలుకొని గురువరా తమయనుగ్రహంబువలన శివానుగ్రహంబు పడసితి, అదిగో వుమామహేశ్వరులు వృషభవాహనారూఢులై గన్పట్టుచున్నారు, నాకు నిదిగో విమానంబు వచ్చియున్నది, శివగణంబులు నిలుచుచున్నారు, నే బోయెద సెలవొసంగు డని ప్రార్థించెను. అంత మునీంద్రుండు ఆకాశంబు పరికించి యందలి విమానంబును శివగణంబులు నుండుటను గాంచి యచ్చెరువంది ఆహా వీనిపుణ్యంబు నెంతని పొగడ నగును, చాలాకాలంబుగా దపం బాచరించుచున్న నాయెడ వుమాపతి కింత నిరాదరంబు గలుగుటకు నే నేమినేరం బొనర్చితి యని దురంతచింతాక్రాంతుండై శంకరుని స్తుతింపబూని, ఓ పరమేశ్వరా! సర్వకాలంబులయందును నిన్నే నమ్మి పూజింపుచున్న నాయందింత నిరాదరత్వమును జూపుటకు కారణం బేమి, నే నేమియు నేరము జేసినవాడను గానే, కరుణానిధే దీనబంధో యిపుడు నా మొరాలకించి నీసాయుజ్యం బొసంగుము యని పలువిధంబులుగా మొరలిడినంతనే శంకరుడు తనదూతలను గాంచి, మునీంద్రుని తనశిష్యసహితంబుగా విమానంబున దీసుకొని రండు యని యాజ్ఞాపించెను. దూతలు గురుశిష్యు లిరువురిని కైలాసంబునకు విమానంబుపై దీసుక

వెళ్ళిపోయి, అందు వారు సమస్తసుఖంబు లనుభవించుచుండిరి. కావున, ఓయి నరేంద్రా నీవును సాధుసేవ జేయుచు ధర్మంబువలన పాపక్షీణంబు గావించి నేనుండునట్లు సంసారంబున నుంటివేని మోక్షాప్తం డగుటకు సుంతైనను సందియంబు లేదు, గావున కిరీటము మున్నగునవి ధరించి యథాస్థితి నుండు మని సెలవొసంగి తాను సమాధియం దుండెను

నాలుగవయధ్యాయము ముగిసెను.

---

# ఐదవ అధ్యాయము.

## పద్మావతి జయదేవులను దర్శించుట.

అనంతరము జయదేవులు నిష్ఠలోనుండి మేలుకొనినపిదప రాజు గాంచి, స్వామీ తమకును సతిమున్నగు సంసారంబున్నట్లు సెలవొసంగితిరి. వా రెందున్నవారని యడుగ బిల్వగాం యను గ్రామంబున తనసతి యగు పద్మావతి యున్నదని నుడువగా, నృపతి మహాత్మా తాము సతిని విడనాడుటకు కారణం బేమన, స్వాములు తనకు వివాహం బైన నాదిగా కూకంబున నృపతి తన్ను దర్శించుపర్యంతము జరిగినదెల్లయు నవిస్తరంబుగా జెప్పెను, అందకు నృపతి అకటా యిదంతయు పూర్వమే నేదెలియని మూర్ఖుండ నైతిగదా యని తత్క్షణమే పరిచారకులం గాంచి దివ్యభూషణాంబరంబు లొసంగి పల్లకిసహితముగా బిల్వగాంకు బంపి పద్మావతీదేవిని వినయభయభక్తులతో తోడ్కొనిరండు యని యాజ్ఞాపించెను. పిదప నరేంద్రుండు జయదేవులం గాంచి, దేవా! భక్తులు, సిద్ధులు, జ్ఞానులు మున్నగువారిని బాధించువారికి నరకప్రాప్తం బగు నని పెద్దలు నుడువుదురు. అట్లుండ తమ కరపాదంబులను ఖండించిన క్రూరులగు యాచోరులు భస్మంబు గాకుండిన కారణం బేమి? దేవత్వంబు నొందిన తమ కిట్టి దురవస్థ యేమూలంబునం గల్గె. మీరు దలంచినమాత్రంబున వీరు లగు యాచోరులు శిలారూపంబులు గాక యుందురా? నా కీసంశయంబు లెల్ల నివర్తింపుం డని ప్రార్థింకగా, జయదేవులు నాయనా ప్రారబ్ధం బనునది త్రిమూర్తులు దేవతలు తక్కుంగలవారెల్లరకును అవిలంఘ్యనియము కావున నేనును ప్రారబ్ధవశంబున యిట్టి దురవస్థపాలైతిని, ఇందు కొక దృష్టాంతంబు జెప్పెద

నాకర్థింపు మని చెప్పందొడంగె. యమునాతీరంబున చిదానందు
డను యొక యోగీశ్వరుం డుండెను. అమ్మహాత్ముండు భూతభవిష్య
ద్వర్తమానంబు లెఱింగినవాఁడును, అణిమ గరిమ లఘిమ మహిమ
ప్రాప్తి ప్రాకామ్యము ఈశత్వము వశిత్వము మున్నగు అష్టసిద్ధులు
పొందినవారును, జీవన్ముక్తిని జెందినవారు నైన మునీశ్వరుని సాన్ని
ధ్యంబున మోక్షాపేక్ష గల నొక శిష్యుడు చతుర్విధ శుశ్రూష
లొనర్చుచుండెను. ఎట్లనగా, ఆర్యుడు నిష్ఠలో నుండి బహిర్ముఖు
డగునంతలో యాహారపదార్థంబులు దెచ్చి యిచ్చుచు స్నానా
దులు మున్నగునవి చేయింపుచు నతివినయభయభక్తులతో సేవ జేయు
చుండెను ఇట్టి శ్రద్ధ గల శిష్యుని పరిశోధింపం దలంచి మాసి యొక
దినము నిష్ఠనుండి బహిర్ముఖుండుగాక యస్తమయంబువఱకు పద్మాసనా
సీనుఁడై యుండెను. అంత నా గురుపుత్రుండు దురంతచింతాక్రాంతుఁడై
గురునకు నే నేమి యపరాధం బొనర్చితినో లేకున్న విముఖుం డగుటకు
కారణం బేమి గురునకువిముఖుండనై యిక నే జీవించియుండుట వ్యర్థమే
గదా యని ఖడ్గంబు చేబూని తనశిరంబును ఛేదించుకొనుట కుద్యమిం
చెను. అది గాంచి మునీంద్రుండు కనులు తెరచి జూచి, పుత్రా! శాంతిం
పుము. గురుసేవయం దింత ప్రాముఖ్యం బైన శిష్యుం డిలలో గాన్పింప
డని దలంచుచున్నాను. ఇక నికనుగ్రహించెద సంశయింపకుము యని
వానిమస్తకంబుపై తనహస్తం బుంచి, పుత్రా! నీ వికభవంబును గూర్చి
వెరువకుము రక్షించితి నని జెప్పి, ఇక వాని కాయుష్యం బెంతయున్నది
యని దివ్యదృష్టి నవలోకించి డెబ్బదిరెండుగడియ లున్నదియని యెఱింగి
యచ్చెరువంది తానును శిష్యుండును గగనగమన గుళికల ప్రభావం
బుచే నభంబున కెగసి భూలోక భువర్లోక స్సువర్లోక జనలోక తపో
లోక మహాలోకంబు లారును గడచి సత్యలోకంబున కేగి చతుర్ముఖుని
గాంచి నాశిష్యునకు అల్పాయుష్యం బొసంగిన కారణం బేమని నుడువ
బ్రహ్మ వీని కిక నిరువదియారుఘడియ లే యాయుష్యంబున్నది. గాన నే
జేయునదేమియు గాన కున్నా ననెను అంత తాపస వైకుంఠంబున కేగి
విష్ణుమూర్తిని దర్శించి నాశిష్యున కల్పాయుష్యంబు గాన నిందు కేమి
జేయుదు నన నారాయణుండు యిక వాని కాయుష్యంబు పదియారు
ఘడియలేయున్నందున నే జేయున దేమియు గాన్పింపకున్న దనెను.
అంత వాని కైలాసంబున కేగి ఉమాపతిని వేడగా నాతం డిక వీని

కాయుష్యంబు యూరుగడియలే యున్నది గావున నే నొనర్చునదేదియు గాన్పింపలే దన యోగి వేగంబుగా యమపురంబున కేగుచుండగా నందు శిష్యునకు కవాటంబు దగిలి భూమిపైబడి మృతినొందెను. శిష్యునివియోగంబు గాంచి మునీంద్రుండు క్రోధానలమనస్కుండై యమధర్మరాజును శపింప నుంకించెను. అంత నాక్రోధజ్వాలలు యమపురం బెల్లయు దహింపసాగెను. అ దెటింగి యమధర్మరాజు వెఱగంది మునిపాలికి పరువిడి జని యతీంద్రా నిరర్థకంబుగా నన్నేల శపింప దలంచెదరు నే నొనర్చిన నేరం బేమి శాంతింపుడు యని నమస్కరించి, మునికులసార్వభౌమా! తమశిష్యుండు మరణించుటకు తామే కారణభూతులు గావున నే నొనర్చిన దేదియు లేదు. ఎట్లంటిరేని తను యాశ్రమంబున దీర్ఘాయుష్యవంతుం డగునట్లు తా మనుగ్రహించి యుంటిరేని వానిని మృత్యు వాశ్రయించ నేరదు, లేక త్రిమూర్త్యాదు లైన నాశీర్వదించిన వారు కారు. అట్లైనను మృతుండం గానేరడు. గురుపుత్రాగ్రగణ్యుండు గావున త్రిమూర్తులం గాంచి పాపులకు దర్శనీయుండ నగు నన్ను దర్శించకమునుపే నాద్వారంబున మృతుండాయెను. వాని విధికృతి యిట్లున్నందున మిమ్ములను త్రిమూర్తులను ఆశీర్వదించనియక అస్తగించినదని తెలియును. మిమ్ముల నింతదూరము వెతపెట్టినది. తమప్రారబ్ధం బని యెఱుంగక నిరర్థకంబుగా నాపై కోపించి శపింప జూచితిరి తమకు వానియం దతివిశ్వాస మున్న యెడ వానిమస్తకంబున తమహస్తం బుంచి సజీవుండవు గమ్మని యాశీర్వదించితిరేని వా డిపుడే పునర్జీవితుం డగుటకు సుంతైనను సంశయంబు లేదు, అట్లొనర్పుము యని యమధర్మరాజ మందలించెను. అంత మునిపుంగవుండు శాంతహృదయుండై ఓంకారంబు నుచ్చరించి కుశజలంబు ప్రోక్షించి నంతనే శిష్యుండు పునర్జీవితుం డాయెను. అనంతరము గురుశిష్యులిరువురు భూలోకంబున కేతెంచి నిజాశ్రమంబు జేరి శిష్యునకు యెల్ల విద్యలు గఱపి తానును సుఖముగా సమాధినిష్ఠాపరుండై యుండెను. వింటివా రాజేంద్రా ప్రారబ్ధం బెట్టివారైనను యనుభవించకమానదు. అయినను భగవదనుగ్రహంబును మహాత్ములకరుణాప్రసాదంబును బడయువారికి మిక్కుట మగు దుర్ఘటంబులు ప్రాప్తించినను సూర్యునిగన్న మంచువలె బోవు ననుటకు సంశయంబు లేదు. ఇందుకు దృష్టాం

తంబుగా పూర్వము నాకరపాదంబులు ఖండించినప్పుడు ఇంచుకైనను దుఃఖంబు దోచక నానందమాత్రుడనై యున్నందుకు పరమేశ్వరుని కరుణాప్రసాదమే కారణమైయుండెనని ప్రత్యక్షానుభవంబుగా దెలియుచున్నది. ప్రతినిమేషంబునందును సుఖదుఃఖంబు లెట్టివలె అనుభవించవలసియున్నవో ఆయాతీరున ననుభవించియే తీరవలెను. దుర్ఘటంబు లగు దుఃఖంబులు వాటిల్లినను సత్సాంగత్యమువలన సామాన్యముగా నివృత్తియగును. త్రిమూర్తులకసాధ్యంబైన కర్మంబులు సత్పురుషుల కవలీలగా వర్తింపుచుండును. ఇందుకు దృష్టాంతం బొక్కటి గలదు జెప్పెద నాకర్ణింపుము. పూర్వము మాంధాతకు సమస్తైశ్వర్యంబు లుండియు పుత్త్రులు లేనందున డెందంబున గుందుచు సతిపతు లిద్దరు మిక్కుట మగు దానధర్మపరోపకారంబులు జేయుచు తీర్థయాత్రలు సలుపుచు వాపీకూపతటాకాదులు నిర్మించినను వారి కోర్కె సఫలము గానందులకు దురంతచింతాక్రాంతులై మాంధాత తనసతిని గాంచి, నారీరత్నమా! మనజీవితంబెల్ల వ్యర్థముగానే గడచిపోవుచున్నది. ఇక నే నరణ్యంబున కేగి శంకరు నారాధించి పుత్త్రులు గలుగునట్లు వరంబులుబడసివచ్చెద నని సతికి విన్నవించి తానుతాపసవేషంబు బూని తపోవనంబున కరిగి వుమాపతి నుద్దేశించి యతిఘోరంబగు తపం బాచరింపుచుండెను, ఇట్లు కొన్నిదివ్యసంవత్సరంబులు గడవగా పరమేశ్వరుం డాతనితపంబునకు మెచ్చి ప్రత్యక్షంబై రాజా నీయుత్తమతపంబునకు మెచ్చితిని. అయినను నీవుగోరియున్న పుత్త్రవాంఛితంబు దీర్పుటకు విధి గాన్పింపకున్నది. మఱేదేని యొండు గోరితివేని వరం బిచ్చెద వేడికొను మనెను. అంత మాంధాత జగదీశ్వరా నాకు సమస్తభాగ్యంబు లున్నను పుత్త్రభాగ్యంబు లేమికి గుందిమిమ్మింతగా ప్రార్థించితి, ఆ విషయంబున తామనుగ్రహింపక వేఱువరంబు లిచ్చెద నని నుడువుచున్నారు, నేను వేఱొద్దియు గోరుట లే దనెను. అందుకు వుమాపతి నీప్రాప్తం బీతీరున పుత్త్రవిహీనంబై యున్నది గావున నే జేయున దెద్దియు లేదు. అయినను యిందుకొక్క యుపాయంబు జెప్పెద నట్లొనర్పుము, సంతతము సత్పురుషుల సేవింపుచుంటివేని వారియనుగ్రహ వీక్షణ్యంబువలన నొకవేళ గలిగినను గలుగవచ్చును. వెఱవవలదు, నీగృహంబున కేగు మని సెలవిచ్చి యంతర్ధాన మాయెను. పిదప మాంధాత యింటికి వచ్చునంతలో యొకదినము మాంధాతగృహంబున

కొకయతిథివచ్చి భిక్ష యడుగగా మాంధాతసతి యామహాత్ముని
యర్ఘ్యపాద్యాదు లిచ్చి పాదసేవ మున్నగునవి సభక్తిపూర్వకంబుగా
నొనర్చి షడ్రసోపేతంబు లగు నాలుగు ఫలహారంబులు జేసియిచ్చెను.
అంత మునీశ్వరుండు యామెభక్తికిమెచ్చి, అమ్మా నీవునల్వురుపుత్త్రుల
బడయుదువుగాక యని వరంబిచ్చి తననిజాశ్రమంబునకు వెళ్లిపోయెను.
మఱునాడు తనపతి గృహంబునకు వచ్చిన పిదప యతీశ్వరుని యను
గ్రహంబును పతి కెఱింగించినంతనే మాంధాత శంకరుని వాక్యంబు సరి
పోయిన దని సంతసహృదయుడై సతిపతు లన్యోన్యభోగరాగము లను
భవింపుచు కాలము గడపుచుండిరి. పిదప కొంతకాలంబునకు క్రమక్ర
మముగానల్వురుపుత్త్రులం బడసి వారియాప్తితంబులు నెఱవేర్చుకొనిరి.
అయ్యా భూపతీ! మహాత్ములసేవావిశేషం బీతీరున నుండును గావున
నీవును తద్విధంబుగా సత్పురుషుల సేవింపుచుంటివేని దుర్గతులు
గలుగుట కవకాశ ముండనేరదు. సత్సాంగత్యంబువలన సుప్రసిద్ధం బగు
లాభం బందుదు వని జెప్పి తాను సమాధినిష్ఠాగరిష్ఠుండై యుండెను.
అనంతర మారాజు గురుని యాజ్ఞానుసారము యతిథుల సత్క
రింపుచు తన పురంబున కేతెంచు భక్తులు సన్న్యాసులు మొదలగువా
రెచట గాన్పించినను తననగరునకు దీసుకవచ్చునట్లు కొంతమంది
భటులను నియమించి ప్రతిదినంబును భటులు గొనివచ్చెడు అతిథు
లకు స్నానాదులు జేయించి వస్త్రంబు లిచ్చి షడ్రసోపేతంబు లగు
అన్నాదులు వడ్డించి యింకయు వారికి వలయు ద్రవ్యంబులును గోదా
నంబులు మున్నగునవి యొసంగి సంతుష్టిపఱచి పంపుచుండును.
అని నాబాజీసిద్ధుడు జెప్పగా నుత్తమసిద్ధులు గురువరా పద్మావతీ
దేవిని దీసుకవచ్చుట కేతెంచిన భటులు యేమయినది యెఱిం
గింపు దని వేడగా, వినండి సిద్ధులారా! రాజాజ్ఞచే బంపబడిన
భటులు జగన్నాథంబున కేగి పద్మావతీదేవి యెందున్న దని విచా
రించి యామెతల్లిగారిగృహంబున నున్న దని దెలిసి యచట కే
తెంచి పద్మావతిని గాంచి ప్రదక్షిణనమస్కారంబులు జేసి, అమ్మా!
నీ పతి యగు జయదేవస్వాములు క్రౌంచదేశంబున మా రాజుగారివద్ద
సుఖముగా నున్నారు. మిమ్ములను దీసుకవచ్చుటకు జయదేవస్వాముల
యాజ్ఞానుసారము మా రాజు బంపగా వచ్చితిమి. తాము తడవుసేయక
ప్రయాణం బగుదు రని ప్రార్థింపుచున్నా మనిరి. అంత పద్మావతి యా

వాక్యంబులు వినినంతనే అమందానందకందళిత హృదయారవిందయై ఓ భటులారా! శ్రీరామచంద్రుని వియోగంబునకు సహింపఁజాలక యశోకవనంబున సీతాదేవి ప్రాణత్యాగంబున కుద్యమించియున్న సమయంబున రామకుశలంబు జెప్పి ముద్రిక నొసంగి ప్రాణములు రక్షించిన యాంజనేయునివలె గదా మీరు నాపతివ్రతమానం బెఱింగించి నా ప్రాణంబును రక్షించితిరి. ఇట్టి ఆపన్నరక్షకు లగు మీకు నేనేమి ప్రత్యుపకారము జేయఁగలను, అయినను స్వాముల యనుగ్రహంబున మీరు సమస్తసుఖంబుల బడయుదురు గాక యని యాశీర్వదించి తత్క్షణమే ప్రయాణమై నడవసాగెను. అప్పుడు భటులు అమ్మా ఇదో మేము దెచ్చియుండెడు వస్త్రాభరణంబులను ధరించుకొని పాలకి నెక్కి రండు యని ప్రార్థించిరి. అందు కామె సమ్మతింపక తననాథు నెపుడు జూతునా యని మిక్కిలి వేగముగా నడువ నారంభించెను. అంత భటులు యామె కడ్డంబుగా బోయి పాదంబులపై బడి తల్లీ మమ్ముల రక్షింపుము, పల్లకిలో గూర్చుండుము, లేకున్న మీరు పాదచారులై వచ్చితి రని మా రాజునకు సుంత దెలిసినేని మమ్ములను శిక్షింపక మానడు, కావున తాము భూతదయాపరు లైనందున మా ప్రార్థన మంగీకరించి పాలకి నెక్కి మమ్ముద్ధరింపుము. తల్లీ అని యామెను సమ్మతింపఁ జేసి పల్లకి నెక్కించి కూర్చున్న పిదప యతివేగంబుగా క్రౌంచదేశంబునకు బోయి పద్మావతీదేవిని జయదేవులసన్నిధిని జేర్చిరి. పిదప యామె తనపతి వికలాంగుఁడై యుండుటం గాంచి ప్రదక్షిణనమస్కారంబులు జేసి గురంతచింతాక్రాంతయై దుఃఖం బడపజాలక భూమిపై బడి రోదనంబు జేయుచు, అక్కటా యే దురాత్ము లీగతి యొనర్చిరో, నాథా తా మిట్టి దుర్గతిపా లగుట కారణం బేదో, కటకటా నామనంబు తల్లడిల్లుచున్నదే నవమోహనాకారు లగు తమరి నిట్లు జేయుటకు నాపాపిష్ఠుల కెట్లు కరంబు లాడెనో, దైవమా మమ్ముల నిట్టి దురవస్థలపాలు జేయుటకు నీవును బిరుదు బూనియున్నావు గాబోలు, మాయెడ యింత కఠినచిత్తుఁడవై యుండుటకు మే మొనర్చిన నేరం బేమొ యని విలపించుచు రోదనంబు జేయుచుండెడు తనసతిని గాంచి, జయదేవులు నారీరత్నమా! ప్రారబ్ధం బెంతటివారి కైన ననుభవింపక మానదు, ఒరుల నిందించుటవలన నేమి లాభము, దుఃఖంబు మానుము. మన మొనర్చిన పాపంబుల మఱెవ్వ రనుభవింతురు. ప్రారబ్ధవశంబునకు భగ

వంతుం జేసి జేయును. దుష్కృతంబు లొనర్చువారికి రోగాదిబాధ లును దారిద్ర్యదుఃఖంబును, దారాపుత్త్రులు మున్నగువారి కెడబాట్లు గలుగుట యివన్నియు పాపఫలంబు లని యెఱుంగుము రాజభోగంబు లును, జ్ఞానయోగంబులును పుణ్యానుభవంబు లని గ్రహింపుము. భూ మండలాధిపతులుసహితము ప్రారబ్ధం బనుభవింపక మానరు. నల చక్రవర్తి, పురూరవుడు, హరిశ్చంద్రుడు, శ్రీరాముడు, పాండవులు మున్నగువారి చరిత్రంబులు నీ వెఱింగినదానవే గదా యని ధర్మోపన్యా సంబు జేసి సతిని యూరార్చి తాను మౌనియై అంతర్ముఖనిష్ఠాపరుండై యుండెను. పద్మావతి పతి బోధించిన నీతివాక్యంబులచే మనంబున దుఃఖంబు మాని పతియే దైవము, పతియే గురువు, పతి వాక్యంబులే వేదవాక్యంబులు, పతిమతి బాయకుండుటే మోక్షము యని నిశ్చ యించి పతిసేవయందే కాలము గడుపుచుండెను. నరేంద్రుండును ప్రతి దిన ముదయంబున లేచి పద్మావతీదేవికిని జయదేవస్వాములకును పాద సేవ జేయుచు శ్రీ లక్ష్మీనారాయణు లని భక్తి సలుపుచుండెను.

ఐదవ యధ్యాయము ముగిసెను.

---

# ఆఱవ అధ్యాయము.

## జయదేవులు చోరులకు శివపదం బిప్పించుట.

జయదేవులకరపాదంబులు ఖండించిన క్రూరులగు చోరులు క్రౌంచాధిపతి సాధుసేవాతత్పరుండై యుండుటను విని దండకమండల రుద్రాక్షకాషాయంబుల ధరించి ద్రవ్యాసక్తులై క్రౌంచదేశంబున కేతెంచిరి. అంత రాజభటులు రాజాజ్ఞానుసారముగ యీ కపటసాధు లను రాజసభకు గొనిపోవుచు నచ్చటచ్చట విశేషంబుల జూపెట్టుచు నంటున్న జయదేవకవిసార్వభౌముని మేడ నగుపఱచి, అయ్యా మహా త్ములారా! అదిగో గనుపించుచున్న మేడయందు మారాజగురు వగు జయదేవస్వాములు యున్నవారు వారిని సందర్శింప గోరిక యున్న యెడల యందు దిగిరండు యని మందలించిరి. అంత ప్రచ్ఛన్నసాధులు ఓహో యిది కోరిక యుక్తిగానే గానిపించుచున్నయది. మనము ముందీ మహాత్ముని సలహా గాంచి రాజసముఖంబున కేగితిమేని రాజుగారు మనయందు మిక్కిలి గౌరవంబుగా నుండుటే గాక యమితద్రవ్యంబు

గూడ బడయగలందులకు వారిసందర్శన మత్యావశ్యక మని దలంచి జయదేవుల సన్నిధి కేతెంచిరి. వారిరాక నెఱింగి జయదేవులు తన వికలాంగములతో నమస్కరించి వినయముగా రండు మహాత్ములారా యనెను. అంత నా చోరులు పూర్వము కరపాదములు ఖండించినవారు గావున సంశయచిత్తులై భయపడి మెల్లమెల్లగా నాచోటువిడిచి వెళ్లుట కుద్యమించగా జయదేవులు వారి యుద్యమము నెఱింగి అయ్యా! సత్పురుషాగ్రగణ్యులగు మీకు వెఱపేల? తమ యిష్టానుసారము రాజునుంగాంచి మీకువలయుపదార్థములం గొనిపోవుడు అని నమస్కరించినను సాధులు మిక్కిలి భయంకరులై ఓహో మోసము వచ్చినది యిక మనప్రాణంబులు గోల్పోవుట నిశ్చయము, ఎటులైనను తప్పివెళ్లుట యుక్తంబై తోచుచున్నయది. పూర్వ మితని నరణ్యంబున కాలుసేతులు ఖండించి కూపంబునం బడవైచితిమి అందుల కిపుడీ విప్రుండు రాజున కెఱిగించి ప్రతీకారం బొనర్పక మానడు యని పరుగిడనారంభించిరి. అంత జయదేవులు పరమసాధులగు మీకు వందనము, పరబ్రహ్మజ్ఞానులగు మీకు వందనము, దురాత్ముఁడ నగు నామోముజూచుట హేయంబని వెళ్లెదరు గాబోలు నిలునిలుండు, తమ దివ్యపాదారవిందంబుల సేవఁగొనుఁగుడు, వందనము వందనము యని ప్రియోక్తు లాడినను చోరులు మిక్కిలి వెఱపొంది పరుగిడుచుండిరే గాని జయదేవుల వాక్యంబులను సరకుగొన్నవారు గారు. పిదప జయదేవులు వీరు పూర్వము నా కరపాదంబులను ఖండించిన వీరులు గాబోలు! అకటా! కీవి కేదియో ఆసక్తివలన నిందువచ్చి పాపి నగు నన్నుగాంచి భీతిచే వెళ్లుచున్నవారు, ఇందు కేమి యొనర్చువాడ నని దురంతచింతాక్రాంతుండై యనుచరులం గాంచి, భటులారా! అదోచనుచున్న సత్పురుషులను బలవంతంబుగా నైనను గొనిరండు వేగమెపొండు యని సెలవొసంగెను. అంత నాభటులు కపటసాధుల వెంటనంటి వారిచెంతం జేరి వినయంబుగా జయదేవుల యనుజ్ఞ నెఱింగించిరి. అంత నా చోరులు భటులచే జిక్కువడినందున నెటుబోవుట కుపాయంబు గానక జయదేవులసన్నిధి కేతెంచిరి. అంత నకలంకచిత్తుం డగు జయదేవులు యాచోరులకు స్నానంబు లొనర్పించి దుకూలంబు లొసంగి షడ్రసోపేతం బగు నన్నాదులు గుడిపించి వారి రాక రాజున కెఱింగించెను. రాజు మహాత్ముల రాక నెఱింగి సంతస హృదయుడై జయదేవుల మేడ కరుదెంచి గురునకు ప్రదక్షిణ నమ

స్కారంబులు జేసి అందున్న యతులకు నమస్కరించి నిలుచుండగా జయదేవులు రాజు నుచితాసనంబున గూర్చుండ సెలవొసంగి, నరేంద్రా! యీదినమే సుదినము, ఇట నున్న మహాత్ములను గాంచితివా? ఆపన్నరక్షకులు, అజ్ఞానంబను చీకటిని సుజ్ఞానమను వెలుగుచే ధ్వంసము జేసినవారు, అరణ్యాదులయందే నివసించువారు, ఆశారహితులు, అమలజ్ఞానసంపన్నులు, యతివరేణ్యులగు వీరిని భక్తిప్రపత్తులతో బూజింపుచుండుము. వారిపాదసేవ పరమపావనం బని యెరుగుము. ఆహా? వీరు నీగృహంబున కేతెంచుట కెంతభాగ్యం బొనర్చియుంటివో వీరికి సాటియగు మేటిసాధువులు ఇలలో గాన్పింపరని దోచుచున్నది అని మిక్కిలి కొనియాడి రాజసౌధంబునకు బోవ యాజ్ఞ నొసంగెను రాజు మహాప్రసాదం బని వారిని పాలకి నెక్కించి తననగరునకుం గొంపోయి మిక్కిలి శ్రద్ధతో బూజింపుచుండెను. అంత చోరులు మిక్కిలి భయకంపితులై వురిదీయువానికి సర్వభోగంబు లొసంగునట్లు గదా యీనృపతి మనల నొనర్చుచున్నాడు ఇక నేమిజేయుదము. దారిబట్టి వెళ్లుదమన్నను భటులు యెవేళను యేమరక గాచియున్నవారు అని యంతకంతకు భయానలంబుచే దహింపంబడినవారై ముఖంబులు కమలిమాటలు తడబడుచు కృశీభూతులై బ్రహ్మహత్య యొనర్చినవారి వలెను, సర్పయాగంబు జేయునపుడు ఋషులమంత్రప్రభావంబుచే ఇంద్రుండేదియుదోచక స్తంభించియున్నచందంబునను యాచోరులుండుట నెరింగి నృపాలుడు జయదేవుల సన్నిధికేతెంచి సాధులచర్య లెల్ల సవిస్తరంబుగానుడివెను. అందుకు జయదేవులు నరేంద్రా! మహనీయుల లక్షణంబు లెరుంగుట యెట్టివారికైన నసాధ్యంబైయుండును నేనును యెఱుగదగినంతవాడను గాను, అయినను సుంత వక్కాణించెద నాకర్ణింపుము. వీరలు పరమభాగవతులు, శబ్దాదివిషయంబులయం దత్యంత విరక్తులు గాన వారి కంతకంతకు శరీరకృశత్వము మిక్కుటమగు చున్నట్లున్నది. బ్రహ్మసాక్షాత్కారంబును గోరి సమాధిసాధనంబు లొనర్చువారు మితభాషణులై వర్తించుదరు, దేహేంద్రియాదులయం దభిలషింపరు, మనోసంకల్పంబుల నుపరతము జేయుచుందురు. ఒకవేళ మనోవికారంబులు జనించెనేని వానిపై నెదుర్కొని పిచ్చి వానివలె గూయుచుందురు. అట్టి వాక్యంబులను వినువారలకు పరుల నిందించునట్లు గోచరింపుచుండును. మనోలీనంబై ఆనందావేశం

బున బాడుచుందురు. నృత్యంబును జేయుచుందురు. బ్రహ్మానందమగ్నులై యుందురు. మనస్సు బహిర్ముఖం బైనప్పుడు శోకముఖులై యుందురు. అట్టివారు నియతస్థానరహితులై ద్రిమ్మరుచుందురు. స్వర్గాది భోగంబు లతితుచ్ఛంబుగా దలంపుచుందురు. వనితాది భోగంబుల యందు జిక్కువడక సంసారంబున నున్నను సన్న్యాసిమైయున్నను క్షుద్బాధకు నన్నంబును శీతంబునకు చేలంబును గోరుదురు. గృహస్థాశ్రమంబున నున్నను నిజజ్ఞానంబును నష్టదిక్కుల వ్యాపింపజేయుదురు, భక్తులశ్రమనివారణార్థము ద్రవ్యార్జనంబు జేసినను జేయుదురు. ప్రపంచంబును జూచి మాయామయం బని నగుచుందురు. ఇంక ననేకచర్యలు గలిగియుందురు గాన నట్టివారిని దెలియుట త్రిమూర్త్యాదులకును దుస్తరము, అట్లుండ కేవలమానవమాత్రుం డగు నేను దెలియుట యెంతమాత్రము. భూపాలా! ఇపుడు నీ మందిరంబున నున్న మహాత్ములు పరమపావనమూర్తు లని దెలియుము. సర్వదా సంచార సమాధిలో నుండువారి నొక్కచో నిర్బంధంబుగా నుంచినందున వారికి మిగుల శ్రమగానే యుండును. తత్క్షణమే వారికి వలయునంత ద్రవ్యం బొసంగి వారి నిజాశ్రమంబులకు బంపివేయుము యని సెల వొసంగెను. అంత రాజు గురువరా! తన్మయత్వంబు నొంది దేహాభిమానము మున్నగునవి వీడి భోగవిరక్తులైన మహాత్ములు ప్రాణఘాతుక మగు ద్రవ్యం బభిలషింతురా? అట్టి ద్రవ్యాసక్తులను మహాత్ము లని జెప్పు టెట్లు? యని ప్రశ్నించెను. అంత జయదేవులు, ఓయి రాజా! పాషాణంబులెల్ల పసిడిగా జేయు సమర్థుండును, సముద్రజలం బెల్ల తన యఱచేతియం దిమిడ్చినవాడును, "వాతాపి జీర్ణోభవ" యని శపించినవాడు నగు అగస్త్యమునీంద్రుం డొకసమయంబున స్త్రీభోగాసక్తుండై నృపతులపాలికిం జని ద్రవ్యార్జనంబు జేసె. జనకుండు యాగసమయంబున స్వర్ణంబును గోవులను దానం బొసంగ నుద్యమించి ఋషిపుంగవుందును జీవన్ముక్తుండు నగు మహాత్మున కొసంగెద నని దేశం బెల్లయు సాటింప నది యెఱింగి యాజ్ఞవల్క్యుం డాసభ కేతెంచి, రాజోత్తమా! సంపూర్ణజ్ఞానం బెఱింగినవాడను, ఋషిశ్రేష్ఠుండ నగు నా యెడ విశ్వాసం బుంచి నీ వొసంగెడు దానంబును నా కర్పింపు మని మందలించి సహస్రగోగణంబులను స్వర్ణంబును గైకొనె. నింతియగాక జనకుడు యాజ్ఞవల్క్యుని గురుస్థానంబున నియమించెను. వారి కట్టి

యాసక్తి యున్నందున మహాత్ములు గారని జెప్ప నెట్లు? వారి వారి ప్రారబ్ధం బెటువలె నుండునో మన మెఱుంగజాలము. అన్యు లేది గోరినను తనయొద్ద నావస్తువు లున్నచో తత్క్షణమే కొంకులేక నొసంగువాఁడు గదా ఉత్తమపురుషుం డని వచింతురు. ఇందుకు దృష్టాంతము దధీచి కర్ణుడు హరిశ్చంద్రుడు రఘురాజు మున్నగువార లని దెలియుము. యాచించెడువారికి లే దనక నొసంగుటే ఐశ్వర్యంబు గల వివేకపురుషునకు లక్షణము, అట్లొనర్పక జ్ఞాను లర్థం బపేక్షింతురా యని ఉత్తమపురుషుడ వగు నీవు శంకించుట ధర్మంబు గాదు, కావున నాసత్పురుషుల కిచ్ఛానుసారము ద్రవ్యంబొసంగి పంపుము. ఇంతేకాక బ్రాహ్మణులు యాచకులు కవీశ్వరులు వికలాంగులు యాత్రవాసులు మున్నగు వారికి దానం బొసంగుట ఉత్తమము. అంతకన్నను బ్రహ్మధ్యాననిరతులై యుండువారి కన్నపానీయాది పోషణంబులు జేయుచు వారి సాధనంబునకు విఘ్నంబు వాటిల్లక బ్రోచుట వృత్తిమోత్తమదానం బని వేదంబులు పల్కుచున్నవి. ఈ సాధులకు ద్రవ్యం బొసంగుట మిక్కిలి శ్రేయస్కరం బని సెల వొసంగెను. అంత భూపతి వారలం గాంచి నమస్కరించి మహాత్ములారా! ఇన్నాళ్లు నానిర్బంధముచే నిందు వసించితిరి. ఇక స్వేచ్ఛం జనుం డని సవినయముగా ప్రార్థించి వారి యిచ్ఛానుసారముగా రెండురథంబుల సిద్ధపఱచి యం దపరిమితవస్త్రాభరణ ధనరాసు లునిచి వారిని రథంబులపై నెక్కించి కొంత పరివారంబును వెంట నంపెను. అంత రథంబులను అరణ్యమార్గంబున నడుపుచు జయదేవులను హింసించిన స్థలంబునకేగి భటులను గాంచి, ఓరీ! మీ రిక పట్టణంబున కేగుఁడు. మా వాసస్థానంబులకు మేము జనిదము యని ఆడంబరముగా బల్కిన యా దౌర్జన్యంబును జూచి, భటులు అయ్యా మహాత్ములారా! మీ రింతకాలంబుదనుక మౌనముగా నుండి జయదేవుల సత్కారంబు బడసినందులకు కారణం బేమి? ఇంతకు మున్ను అసంఖ్యాకంబుగా భాగవతులు మా రాజమందిరంబునకు వచ్చియుండియు వారియెడ నింతటి విశ్వాసం బుంచక తమయట్ల జయదేవు లత్యంతానురాగుండై వర్తించినందులకు కారణంబును సెల వొసంగుఁ డని ప్రార్థించిరి. అందు కా కుటిలచిత్తులు, ఓరీ భటులారా మును పొకకాలంబున అవంతీదేశపురాజువద్ద యీజయదేవులు గురుస్థానమును బొందియుండెను. మేమచట వీరభటులుగా నున్నసమయంబున

యీజయదేవులుమహాపరాధంబు జేసినందున నవంతీపతి మాకప్పగించి చంపున ట్లాజ్ఞనొసంగెను, పిదప మేము భూతదయాపరులము గావున వధించక కాలుసేతులు ఖండించి యొకపాడునూతిలో బడవేసి రాజు పాలికిం జనుటకు వెరగంది విరక్తిగలవారమై దేశాటనంబు జేయుచురాగా మీపట్టణంబున నాతని సంధించితిమి. తన్నురక్షించిన మహోపకారకుల నెడి యుపకారస్మృతిచే మాకిట్టిసన్మానంబు జేసె నని యాదురాత్ములు జెప్పుచుండగా యాయనృతమునకు భూదేవి సహింపజాలక బ్రద్దలుగా బగిలి దురాత్ములకు మనఃకంపంబు గలిగించి రథంబులతో భూమిలోనికిం గ్రుంగున ట్లొనరించె. సంతియుగాక దీర్ఘక్రోధమున సత్పురుషులను హింసించుటయును పాపకార్యంబులకు సంతసించుటయును జ్ఞానులను నిందించుటయును లుబ్ధులను భూషించుటయును మున్నగు కార్యకరణచణులగు మహాపాపులు బొందెను రౌరవాది నరకంబులకు వీరలు ప్రవేశించిరి.

## చోరులు పాతాళంబున గ్రుంగుట.

జీవకారుణ్యము సత్యము అపరిగ్రహము ఇంద్రియనిగ్రహము మున్నగు యమనియమాద్యనుష్ఠానసత్కర్మనిరతులగు సిద్ధులారా! భూమి పెటపెటజీలి దురాత్ములందు గ్రుంగిపోయినపిదప రాజభటులు నా యాశ్చర్యకృత్యంబును గాంచి వెరగంది పరుగిడి రాజసమ్ముఖంబున కేగి దేహంబులు వణకుచు మాటజెప్పుటకు తడబడుచు యాదురాత్ములు వచించిన నిందితవాక్యంబుల జెప్పుటకు భయంబందుచు కన్నీరు విడిచి దుఃఖింపుచు నిలుచుండెడి భటులనుగాంచి నృపతి ఓహో! మహాత్ముల కేమికీడు మూడెనో! శీఘ్రముగా నెరిగింపు డని యాదలించి పలుకగా, భటులు నరేంద్రా! యాచోరులు అరణ్యంబున కేగిన పిదప మన ఆర్యోత్తములగు జయదేవస్వాములను నిందించి పరుషవాక్యంబులు బలికిరి. ఆయనృతంబునకు భూమి సహింపంజాలక బ్రద్దలుగా బగిలి యందు కపటసాధులు గ్రుంగిపోయిరి యని చెప్పగా విని రాజు యతివేగంబుగా జయదేవులచెంతి కేతెంచి నమస్కరించి గురువర్యా! మన నగరున సత్కరింపంబడిన కపటసాధులు పాతాళంబున గ్రుంగిరని భటులు విన్నవించిరి. ఈ యాశ్చర్యంబును జూడ చోద్యంబుగా నున్నది. పూర్వము మిమ్ముల అంగవిహీనులుగా జేసిన యాదుర్మార్గులను

తా మెఱిగియుండియు వారిని సన్మానింపుచుంటిరి గదా! ఆహా యాదుర్మ
తులవిషయము మునుపే దెలిసియుండెనేని తప్పక యురిదీయింతును.
అయినను సర్వేశ్వరుండు వారికి సంపూర్ణశిక్ష విధించె. ఇక వగవ
బనియేటికి యని పరుషవాక్యంబులు బలుకుచున్న విని జయదేవస్వా
ములు రాజుపై మునుకొని రామరామ హరిహరి సజ్జనుల నిందించు
వారుగలరా? పరనింద జేయువారికి పాపంబు విడుచునా? వారు జెప్పిన
దెల్లయు సత్యమేగాని యనృతంబు గాదు. నరేంద్రా సత్పురుషులు
గాకున్న భూమి చోటిచ్చునది గాదు, మహాపతివ్రతాశిరోమణి యగు
సీతాదేవికి గదా భూమి చోటిచ్చినది, వారును యంతటి మహానుభావు
లని యెరుంగుము. నిజ మాలోచింపగా వారు నా అపన్నరక్షకులే
యని జెప్పగలను. పరులను ద్వేషించువాడు పాపులలో ఉత్కృష్టుం
డని పెద్దలు జెప్పుదురు. తాను దుర్గతిపాలైనను పరులను నిందింపరా
దని శాస్త్రంబు లుద్ఘోషింపుచున్నయవి. పూజార్హులైన మహాత్ములను
నిందితంబుగా నుడువుట నీ కుచితముగాదు, అకటా! నా రక్షకులు ధరా
తలంబున గ్రుంగిపోయిరా, ఇక నేనేమి జేయువాడ నని ప్రలాపించు
చుండెను. అంత రాజు జయదేవుల జీవకారుణ్యమునకు భయంబును
యాశ్చర్యంబును గలవాడై, గురువరా! సాధులు భూమిలోని కేగిన
స్థలంబును జూచుటకు కోరుచున్నవాడ దాసుని మనవి చిత్తగించి
దేవరవారున్ను అందు వచ్చెదు రని ప్రార్థింపుచున్నా ననెను. అంత
స్వాములు, భూపతీ! మహనీయుల సమాధిస్థానంబు పరమపదసమానం
బని పెద్దలు వక్కాణింతురు గాన తడయక సంసిద్ధుడవు గమ్ము, అరు
గుదము అన విని రాజు కొంతసైన్యంబును వెంట దీసుకొని రథారూ
ఢులై యరణ్యంబున కేగి యందు భూమి అగాధంబుగా బగిలియుండు
టను గాంచి యచ్చెరువంది జయదేవులు విలపింపసాగిరి. జగదీశా! పర
మపురుషులను పాతాళంబున ద్రొక్కుట కెట్లోర్చియుంటివి, ఇట్టి అప
వాక్యంబును నే విని జీవితుండనై యుండు టెట్లు? బహుకాలంబునుండి
నే నొనర్చిన తపంబెల్ల వికలత్వంబునొంద తటస్థించినది. ఆచం
ద్రార్కస్థాయిగా నగుబాట్ల కునికిపట్టైతిని. ఇక నాజీవితము వ్యర్థము
యని రథమునుండి దిగునబడి దొర్లుచు రోదనంబు జేయ మొదలు
పెట్టెను. అంత దేహంబంతయు రాళ్లు ముండ్లు దగిలి రక్తమయంబై
దుఃఖావేశంబువలన మూర్ఛితుండై కొంతతడవునకు స్మృతి గలిగి,

ఓ సత్పురుషాగ్రగణ్యులరా! మీ రేగినచోటికిదో నేనును వచ్చెద నని భూమిపై దీర్ఘము నగాధంబైన బిలమును సమీపించెను. అది గాంచి రాజు పరుగిడివచ్చి యార్యులను కౌగిలించుకొని దేవా! తామిట్టి విపరీత కార్యంబునకు బూనుకొన్న దాసుండనగు నాగతి యెట్లు? ఇందులకేమి జేయుదు. అకటా దైవవియోగం బింకయు నేమేమి జరుగనున్నదో గానకున్నానని జయదేవుల కుక్షిలో తనమస్తకం బునిచి కన్నీరుమున్నీరుగా రోదనంబు జేయుచుండెను. అంత జయదేవులు రాజోత్తమా! నీ వీసమయంబున నన్ను మరలింపకుము యని తనశిరంబును భూమిపై బాదుకొనసాగెను. అంత మస్తకంబంతయు రాళ్లు గ్రుచ్చుకొని రక్తప్రవాహంబయ్యె. రాజు శరీరంబెల్ల రక్తమయంబై రోదనంబు జేయుచు మంత్రులంగాంచి నాదేవుని గదలక బట్టుకొనుం డని నుడువగా వారట్లొనర్చిరి. జయదేవులు, అయ్యా మీ రిట్లు శ్రమనొంద నవసరము లేదు. నేను మృతుండగుట నిక్కము. నన్ను వదలు డని తిర్యఙ్ముఖుడయ్యెగాని మంత్రులు వదలినవారుగాక, రాజు తా నొనర్చున దేదియు గానక తన యిష్టదైవం బగు శంకరుని స్తుతింపందొడంగె. ఓ పరమేశ్వరా కరుణాకరా నీకు వందనము, జగదీశ్వరా నీకు వందనము, ఈ మహాత్ముండు మృతినొందెనేని యా పాపంబు నేనొక్కడనే గాక నా వంశమువారి నెల్లరను బాధింపక మానదు గదా! ఈ మహాత్ముని పట్టుదప్పింప నా తరముగాదు, నింద ప్రాపకుడ నైతి. గురువరా! తమ మరణంబునకు మునుపే నే శరీరంబు వీడెద నని యందున్న గవిలో బడబూనెను. అంత సేవకులు, అకటా ఇక నేమి జేయుదము యని నృపతిని గౌగిటం జేర్చి గట్టిగా బట్టుకొని కోయని మొఱలిడసాగిరి. అంత నృపతి జయదేవుల దేహంబెల్ల రక్తమయంబుగా నుండుటం గాంచి భో యని యేడ్వసాగెను. అదిగాంచి జయదేవులు కటకటా నావలన పరమసాధులు పాతాళంబున కేగినదేగాక యీ రాజున్ను ప్రాణవియోగంబునకు సిద్ధంబై యున్నవారు, ఇందు కేమి జేయుదు. ఇక నే జీవితుండనై యుండుట వలన ననంతకష్టంబులకు పాత్రుండ నగుటకు సందియంబు లేదు. ఇక నా ప్రాణంబు బోకార్చుటే యుక్తం బని శిరంబును భూమిపై బాదుకొనినంతనే విగతప్రాణుం డాయెను. అది గాంచి రాజు కటకటా నా సద్గురువరుండు ప్రాణంబులు గోల్పోయిన ట్లున్నది, ఇక నే నిందు కేమి జేయుదు? ఓం శంభో శంకరా జటాధరా గంగాధరా నిటలాక్షా నీలకంఠా ఉమా

మహేశా లోకనాయకా శూలపాణీ కైలాసవాసా స్వయంప్రకాశా ఆపన్నరక్షకా ఈ యాపత్కాలంబున నన్ను రక్షించువా రెవరును గాన రారైరి రక్షింపుము రక్షింపుము యని తన యిష్ట దైవంబును స్తుతించి మూర్ఛనొందె. కొంతదడవునకు స్మృతిగలిగి గురువరా? దాసుని విడచి మీరుమాత్రము పర మందుట ధర్మమా? మీ వియోగమును నాతల్లి పద్మావతి కేమని యెఱింగింతును వినినంత నాదేవి సహగమనము జేయుట నిక్కము. ఆమెను సమాధానపఱచుటకు నా తరముగాదు, నా ప్రాణంబును తమపాదంబులపై విడుచుటయే యుక్తంబని తన మస్తకంబును భూమిపై బాదుకొన బూనెను. అంత మంత్రిప్రముఖులు నృపతిని గట్టిగా బట్టుకొనిరి. అంత రాజు అకటా? యీ ఆపత్సమయంబున న న్నాదరించువా రెవరును గానకున్నారు, గురుని జంపిన పాతకుండ నైతి నని తనయిష్టదైవం బగు శంకరుని హృత్పద్మంబున నిలుపుకొని, యిట్లని స్తుతింపం దొడంగె.

1. శ్లో. హేచంద్రచూడ మదనాంతక శూలపాణే
స్థాణో గిరీశ గిరిజేశ మహేశ శంభో
భూతేశ భీతి భయసూదన మా మనాథం
సంసారదుఃఖ గహనా జ్జగదీశ రక్ష.

2. హేపార్వతీవల్లభ చంద్రమౌళే। భూతాధిప ప్రమథనాథ గిరీశచాప। హేవామదేవ భవ రుద్ర పినాకపాణే। సంసారదుఃఖ గహనాజ్జగదీశ రక్ష.

3. హేనీలకంఠ వృషభధ్వజ పంచవక్త్ర। లోకేశ శేషవలయ ప్రమథేశ శర్వ। హేధూర్జటే పశుపతే గిరిజాపతే మాం। సంసార దుఃఖగహనా జ్జగదీశ రక్ష.

4. హేవిశ్వనాథ శివ శంకర దేవదేవ। గంగాధర ప్రమథనాయక నందికేశ। బాణేశ్వ రాంధకరిపో హర లోకనాథ। సంసారదుఃఖ గహనాజ్జగదీశ రక్ష.

5. వారాణసీపురపతే మణిఃకర్ణికేశ। సర్వజ్ఞ సర్వహృదయైక నివాస నాథ। మానిశపుత్రపరిరక్షణమోదచిత్త। సంసారదుఃఖ గహనాజ్జగదీశ రక్ష.

6. శ్రీమన్మహేశ్వర కృపామయ హేదయాళో। హేవ్యోమకేశ శితికంఠ గణాధినాధ। భస్మాంబరాగన్నృకపాల కలాపమాల। సంసార దుఃఖ గహనా జ్జగదీశ రక్ష.

7. కైలాసశైల వినివాస వృషాంకవాహ। మృత్యుంజయ త్రిణయన త్రిజగన్నివాస। నారాయణ ప్రియమదాపహ శక్తినాధ। సంసారదుఃఖగహనా జ్జగదీశరక్ష॥

8. విశ్వేశ విశ్వభయనాయక విశ్వరూప। విశ్వాత్మక త్రిభువనైక గుణాభివేశ। హేవిశ్వబంధు కరుణామయ దీనబంధో। సంసార దుఃఖగహనా జ్జగదీశరక్ష॥

9. గౌరీవిలాసభవనాయ మహేశ్వరాయ। పంచాననాయ శరణాగతకల్పకాయ। సర్వాయ సర్వజగతా మధిపాయ తస్మై। దారిద్ర్యదుఃఖదహనాయ నమశ్శివాయ.

అని ప్రార్థించియు మహేశ్వరుండు రానందులకు వగచి ఇంకయు ప్రార్థించుచున్నాడు. ఓవుమాపతే అచంచలబుద్ధితో నిన్నుపాసించుపురుషుడు అపగతపాపుండై సుఖాస్పదుం డగును గదా, నేను నిశ్చలభక్తితో నిన్ను ధ్యానింపలే కున్నను ప్రస్తుతము సంభవించి యున్న యీ గొప్పయాపదనుండి దప్పించుటకు దయాశీలుడవగు నీవు భక్తిహీనుడనైన నాస్తుతిని యంగీకరింతువని సత్యముగా నమ్మియున్నాను. దీనబంధో యింతకాలము రాజభోగంబులం దగిలి నీపదధ్యానంబును మఱచియున్న నేరంబును క్షమించి కాపాడుటకు నిన్ను దక్క మఱెవ్వరును లేరు, యేవిధంబైనను నన్ను రక్షించవలసిన భారము నీదయ్యే యున్నది. ఓపరమేశ్వరా! పూర్వము దేవాసురులు క్షీర సాగరము మధించినపుడు అందు మహాఘోరముగా ప్రవేశించిన హాలాహలమును దేవతల ప్రార్థన మంగీకరించి మ్రింగివేసితివి యట్టి ప్రభావంబుగల నీవు యీ దీనుని రక్షించుటకు రావా, మృకండుని సుతుడు యమపాశంబులచే జిక్కుపడి నిన్నే పరమగతి యని ప్రలాపించినప్పుడు ప్రసన్నుడవై పాశంబుల ద్రుంచి యముని కాలదన్ని మార్కండేయునికి సదా చిరంజీవిపదం బొసంగిన పరమదయానిధివగు వామదేవా నన్నీ ఆపత్సమయంబున నుద్ధరింపుమూ. భక్తితో నిన్ను భజించిన బాణాసురుని ప్రార్థన నంగీకరించి వానిద్వారంబున కావలి

యుండి పార్థుతో సమరమొనర్చిన సత్యశీలుడా సహింపరాని వేదనచే మొరలిడుచున్న నన్నాదరించుము. హరహరా వామదేవా నీసతియగు పార్వతి ప్రేమతో వేడికొన్న నీయర్ధశరీరం బొసంగిన నీలకంఠా దురవస్థా పీడితుడ నగు నన్ను రక్షింపుము. నాగభూషణా, భగీరథుని గోర్కె నీడేర్చుటకు గగనమునుండి గంగను రప్పించి మహాప్రవాహంబుతో వచ్చిన నీరమును నీజటాజూటమున ధరించిన గంగాధరా నా యార్తినిబోగొట్టి నాగురుని బ్రతికింపుము. ఓ ముక్కంటీ, చకోరపక్షులు చంద్రుని గాంక్షించినట్లును చాతకము మేఘమును యపేక్షించినట్లును చక్రవాకములు సూర్యుని నెదురుచూచునట్లును నాచిత్తము నిన్నెదురుచూచుచున్నది. ఇకతడవు సేయక వచ్చి మమ్ముల యీయాపదనుండి తప్పింపుము. పాపహరా యని యెంతవేడినను యీశ్వరుడు రానందున నింకయు వినుతింపుచున్నాడు. అనాథనగు నన్నీసమయంబున రక్షింపకుండుట ధర్మమా, పినాకపాణీ నీవు కరుణారసదృష్టితో నన్ను వీక్షింపవేని ఇదో నాశిరంబును నీకర్పించెద, దేవేశా నీకు వందనము, పరంజ్యోతి స్వరూపా నీకు వందనము, నే నీలోకంబునం బుట్టి పడరాని యిడుములం బడితిని నేనిక నెవ్వరికి విన్నవింతును. దీనశరణ్యా నీకన్యంబుగా నింకెవ్వరిని గానకున్నాను. ఇక నాప్రాణంబు నిల్వదు, వేగిరంబుగా రమ్మని నన్ను రక్షింపుము యని దీనాలాపంబుతో మొరలిడుచు తన శిరంబును జయదేవుల పాదంబులవద్ద బగులగొట్టుకొనుటకు బూనుకొనెను. అంత కైలాసాధిపతి తనభక్తుండైన రాజుయొక్క గురుభక్తికిని జయదేవుల జీవకారుణ్యంబునకు పరమాశ్చర్యంబు నొంది వృషభవాహనారూఢుండై పార్వతీసమేతంబుగా భూతగణంబులు పరివేష్టించి వచ్చుచుండ భూలోకంబునం బ్రవేశించి రాజు ముంగిల సేవనొసంగి దివ్యగుణశీలుడా నీ సుగుణసంపదకును జయదేవుల జీవకారుణ్యమునకు మెచ్చితి నీకు వరం బిచ్చెద వేడుము యని శంకరుం డానతిచ్చిన విని నరేంద్రుడు శివునకు ప్రదక్షిణనమస్కారంబులుజేసి దేవా తమ దివ్యపాదారవిందంబుల సేవ గాంచిన దాసునికి మరేమి వరములు గావలసిన పనిలేదు. ఇదో మృతినొంది యుండెడు నా గురువరుని జీవితుం జేయ వరం బొసగుము, లేకున్న నిపుడే నా ప్రాణంబు వదలుట నిక్కము. ఇందువిషయమై మిమ్మింతగా ప్రార్థించితి, నా గురునకు ప్రాణం బొసంగి నన్ను జీవితుంజేయుము దయానిధే

యని సవినయముగా ప్రార్థించెను. అంత శంకరుండు రాజోత్తమా జయదేవులు మృతినొందె నని దలంచితివిగాబోలు కాదుకాదు దామోదరుం డెంత కపటలీలలు గలవాడో యంత కపటము యాతని దాసుల యందును నుండు నని యెరుంగుము, ఇపుడు జయదేవులు ప్రాణవాయువును బ్రహ్మరంధ్రంబున కుంభించి దేహంబు ని గవిలో బడవైచి బ్రహ్మైక్యంబొందియుండ నిశ్చయించియున్న వాడు నీవీ కపటా మెరుంగక మృతినొందె నని దలంచి నీవును ఆత్మహత్య కుద్యమించితివి ఇక వెరువకుము యని రాజుతో ప్రియోక్తు లాడుచుండగా పతి శంకరుని గాంచి దేవ దేవా నన్నీయాపత్కాలంబున రక్షించుట కేతెంచిన కరుణాకరా జాగ్రత్త స్వప్నము సుషుప్తి తురీయము తుర్యాతీతము యను అయిదవస్థలను యారోక్తిప్రకారంబుగా నెరింగి జ్ఞానమార్గంబువం ప్రవర్తింపుచు భక్తి మహిమ వైరాగ్యము ధ్యానము మౌనము బూని సర్వకాలసర్వావస్థలయందు బ్రహ్మైక్యానుసంధానపరుడై అహంకార మమకారంబులను దలయెత్తనియ్యక ధ్వంసము జేసి పూర్ణవైరాగ్యంబు గలవాడై మనోసంకల్పంబులెల్లయు వీడి కామ క్రోధ లోభ మోహ మదమాత్సర్యంబులను యార్గురు దొంగలను దునుమాడి గృహాశక్తిని త్యజించి ఆనంద వారిధిలో నింద్రియకరణాదులను ముంచి సదా అంతర్ముఖదృష్టియందే నిర్గుణబ్రహ్మమాత్రుండై యొప్పుచున్న నా గురోత్తమునకు కరపాదంబులు ఖండింపంబడినందులకు కారణం బేకో నాకీ సంశయంబును నివర్తింపుము పరమేశా యని సవినయముగా ప్రార్థించెను. అందు కా శంకరుండు వినుము నరేంద్రా ప్రారబ్ధంబనునది బ్రహ్మాదిదేవతలకు సహా యవలంఘనీయము. ఈ జయదేవులు మాత్ర మెట్లు తరించగలడు. ఇతడు పూర్వజన్మంబున పరాశర పుత్రుండగు వేదవ్యాసమునీంద్రుండై యవతరించి యనేకమతంబుల నేర్పరచి విధినిషేధంబుల నియమించి యంత్యంబున భగీరథిలో దిగి సంధ్యావందనం బాచరించెడు సమయంబున నారాయణుం డొక్కడే పరదైవం బని ప్రతిజ్ఞాపూర్వకంబుగా నుద్ఘోషించి జెప్పెను. ఆ దోషంబువలన కరపాదంబు లెంతవట్టుకు గంగలో మునిగి యున్నవో అంతవట్టు కిపుడు ఛేదించుటకు కారణం బాయె నని యెరుంగుము. తాను సమస్తశాస్త్రంబు లెరింగియుండియు సర్వాత్మస్వరూపమే త్రిమూర్త్యాత్మకస్వరూపం బని దెలిసినవా డయ్యును

భేదంబుగా దలంచి బలుకనగునా, భేదదృష్టి గలవారికి మిక్కిలి సంకటంబులు గలుగక మానవు. కావున భూపతీ నీవును జాగరూకుడవై యుండుము యని సందియంబు బాపి జయదేవులమస్తకంబుపై తనహస్తం బుంచి ఓయి మహాత్మా నీకనులు విచ్చిజూచి యీ రాజు మనోవ్యథను మాన్పుము, లేకున్న ప్రాణత్యాగంబునకు బూని యున్నవాడు, సత్పురుషుల నాశ్రయించినవారు సంతతసుఖం బందవలయునేగాని దుఃఖప్రాప్తు లగుట ధర్మముగాదు, నీవేల నిరర్థకముగా ప్రాణము వదలుటకుద్యమించెదవు లెమ్ము, నీవు గోరెడు వరంబు లొసంగెద నని దయారసదృష్టిని వీక్షించెను. అంత జయదేవులు నిద్రనుండి లేచువానివలె లేచి పూర్వ మున్న యాతిబాధ లేవియులేక సంభ్రమచిత్తుడై యెదుట నున్న శంకరుని ప్రదక్షిణ నమస్కారంబులు జేసి దేవోత్తమా నాకు వలయువరం బొక్కటి యీపాతాళంబున కేగిన చోరులకు తమదివ్యసాయుజ్యంబొసంగవలయు నని వేడుకొనియెద ననుగ్రహింపుము యనవిని ఉమాపతి జయదేవా నీ యభీష్టం బీడేర్చితి యిక సంశయంబు వలదు చోరులు దుర్గతి కాసన్ను లగుటకు నీయొక్క సన్మానంబును పద్మావతి శాపంబును కారణం బగును, నీవు ఏదేని యొక నిందితవాక్యంబును నుడివియుంటివేని యా చోరుల కిట్టి దుర్గతి సిద్ధించనేరదు, నీ భూషణవాక్యంబులెల్లయు యమపాశంబులై వారిని పాతాళంబున ముంపివేసినవి కావునవారివారి కర్మధర్మంబులు వారివారికి ఫలరూపంబై పరిణమించునని దెలిసియుండియు నీవలన వారు మృతులైరని యాత్మహత్యకుద్యమించినదిజూడ విపరీతగుణంబుగా గాన్పట్టుచున్నది. మహాపాతకులగు యాచోరులకు నాపదవి యొసంగుటకు నీవలనగదా సంభవించినది యనిన శివవాక్యంబులను విని జయదేవులు శివునకు నమస్కరించి మహాదేవా నీకు వందనము, దేవాదిదేవా నీకువందనము, పాపినగు నా మస్తకంబుపై తమ దివ్యహస్తం బుంచినందులకు నాభాగ్యం బిట్టిదని గానకున్నాను. పాతాళంబున కేగిన పరమసాధులకు తమపదవి నొసంగెనవిషయము నిస్సందేహమే గదా, ఆనంద మానందము. మహేశా వారీ భూమిలో గ్రుంగుటయు మేమందు వచ్చుటయు ధరపాలుడు మిమ్ము ప్రార్థించుటయు తమ దివ్యదర్శనం బగుటయు మాయొక్క దురవస్థలెల్ల దీరుటయు జ్ఞానప్రకాశుల మగుటయు మున్నగు శుభంబులకెల్ల పాతాళంబున కేగిన పరమసాధువులే గదా కారణభూతులు. అట్టి

మహానుభావుల నెట్లు పాపు లని చెప్పనగును, వారు పవిత్రులు గాకున్న తమపదవి సిద్ధించనేరదు గదా యని శంకరునిపదంబుల బ్రణమిల్లి ఆనందమూర్తుండై నిలుచుండెను. అంత నుమాపతి ఓయి జయదేవ కవిసార్వభౌమా భూతదయను ముఖ్యవ్రత మని నవలంబించి వర్తించువారిలో బ్రథమగణ్యుసిగా నెన్నదగిన నీసుగుణసంపద నింతింతయని కొనియాడ నేరికి తరముగాదు, నీవు మందిరంబున కేతెంచిన రెండుముహూర్తములలో కరపాదంబులు తనంతట పెరిగివచ్చుటేగాక శ్రీమన్నారాయణుండు ప్రత్యక్షం బగును, నిన్ను స్మరించెడు వారు పవిత్రు లగుదురు గాత యని వరంబు ప్రసాదించి నృపతిని గాంచి గురుసేవాతత్పరులై వెలయు వారిలో ప్రథమగణ్యుండ వగు నరేంద్రా నీ కెన్నండును యఘంబు లంటనేరవు. ఎల్లపుడు శుభమంగళప్రదుడవై వెలయుదువు, బ్రహ్మానందవారిధిలో మునింగి మోక్షసామ్రాజ్యుండ వగుదువు గాత యని యాశీర్వదించి తిరోహితుం డయ్యెను. అంతట సురులు పుష్పవర్షంబు గురిపించిరి. మహర్షులు జయదేవుల జీవకారుణ్యంబునకును నరేంద్రుని గురుభక్తిని గాంచి మిక్కిలికొనియాడి ప్రసన్నులై మరిగిపోయిరి. రాజు జయదేవుల చరణంబులకు ప్రణమిల్లి గురువరా ఇక మనరాజ్యంబున కేగుద మని రథారూఢులై గురుసంకీర్తనంబుల బాడుచు నానందంబుగా వచ్చుచుండిరి.

ఆఱవయధ్యాయము ముగిసెను.

---

# ఏడవ అధ్యాయము.

## పద్మావతి మరణించుట.

శ్రీజయదేవులు రాజు చతురంగ సైన్యసమేతంబుగా నరణ్యంబున యచ్చటచ్చట విడుదులు జేయుచు వచ్చుచుండెడు సమయంబున రాజసౌధంబుననుండి రాజసతి జయదేవుల మందిరంబున కేతెంచి పద్మావతినిగాంచి ఓదేవీ మూర్ఖురాల నగు నేను సన్మార్గం బెరింగి మోక్షం బందగోరితిని గాన తా మేదేని యుపదేశించి తమదాసురాలి నగు నన్ను రక్షింపుము తల్లీ యని సవినయంబుగా ప్రార్థించెను. అంత పద్మావతి

ఓరాజ్ఞీ నేనును యేమెరుంగనిదాననే అయినను పరమునకొఱకనిశ్చయుం బొనర్చియున్న దాన జెప్పెద నాకర్ణింపుము. పతిదైవము పతిపరమేశ్వరుండు పతికిసేవజేయుటేపూజ పాతివ్రతంబును గాపాడుటేజ్ఞానము పతినామమును భజించుటే బ్రహ్మధ్యానము పతినివెంటబాయకుండుటే మోక్షము పతిమరణించినవెంటనే జీవంబువిడుచుట మోక్షమందుటకు సూక్ష్మము పతివ్రతము ననుష్ఠించెడు వనిత నూనవస్త్రీ యని వచింతురు. అట్లొనర్పనివారి గార్దభసమానం బని నుడువుదురు. పతివ్రతహీనురాలు జేసెడు సర్వధర్మంబులు నిరర్థకంబులే యగును. పతివ్రతలవల్లనే ప్రపంచంబు నిలిచియున్నదనియు త్రిమూర్తులు వారిని గాంచిన సంతసించుదురనియు పెద్దలు జెప్పుటేగాక సకలశాస్త్రంబు లుద్ఘోషింపుచున్నవి. సావిత్రి యముని జయించి పతిని పునర్జీవితుం జేసెననియు, దమయంతి తనవ్రతభంగంబు గలుగ కుండుటకు బోయవాని దహించె ననియు, చంద్రమతి అగ్నిని శీతలంబు గావించె ననియు, రేణుక ఇసుకపాత్రయందు జలంబు గొనివచ్చె ననియు, అనసూయాదేవి నారదు డిచ్చిన ఇనుపసెనగల పాకం బొనర్చె ననియు, జానకి రావణుని తనచెంతకు రానియ్యక అగ్నిని ప్రయోగించె ననియు, నళాంగిని యేడుదివసంబులు సూర్యోదయంబు గాకుండున ట్లొనర్చెననియు, అరుంధతి ఇసుకను పాకము జేసిననియు, మహాలక్ష్మి శంకరుని బ్రహ్మహత్యదీర్చెననియు, పార్వతి ఈశ్వరుని యర్ధాంగంబు గొనెననియు, ఇంకయు ననేకమహిమలు పాతివ్రత్యంబువల్లనే గదా యొనర్చిరి. ఓ రాజపత్ని! అరుంధతి నీచస్త్రీయై యుండియు పాతివ్రత్యంబువలన నక్షత్రరూపంబున ప్రకాశింపుచున్న యది, అహల్య ఉత్తమకులజయై యుండియు వ్రతహీనతచే పతిశాపంబువలన పాషాణంబై యుండవలసె, పతివ్రతలకు ఆచారము పూజధ్యానము మున్నగునవి అనవసరము బృహస్పతిసతి తార చంద్రునిపై మోహించి లోకంబెల్లయు నిందించంబడు చున్న యది, రేణుక గగనంబున బోవుచున్న కార్తవీర్యార్జునునిరూపంబును తటాకజలంబునం గాంచి వానిని మోహించినందున నిసుకపాత్రయందు జలంబుగొని వచ్చుట కసాధ్యంబై పరశురామునివలన ప్రాణంబులు గోల్పోయెను, ద్రౌపది కర్ణునియందు కన్నుంచినందునగదా తపోధనుని కాహారంబైన ఫలంబును వృక్షంబున కెక్కించుట కసాధ్యమై సిగ్గొందినది, కావున పాతివ్రత్యం

బును బహుజాగరూకతగా గాపాడవలయును. అట్లుండుటే స్త్రీలకు ముఖ్యకర్తవ్యము. మృతినొందినవారిని బ్రతికించుటయు త్రిమూర్తుల స్వాధీనము జేయుట మున్నగునవి యంతప్రాముఖ్యంబుగాదు. పతివ్రతంబును గాపాడుట మిక్కిలి దుస్తరము. ఏకాంతంబున నేకాసనంబున తనసుతునితోనైన గూర్చుండుటకు కులభామినికి యుక్తముగాదు, పతి తనకేమియొసంగినను సంతసించవలెనేగాని దుఃఖించరాదు, పతి యేవస్తువుల నిచ్చినను భద్రపరచి అడిగినప్పుడు నిష్కపటముగా నొసంగవలెను, భిక్షు మెప్పుడు లేదనక బెట్టుచుండవలెను, దేవపితృపూజాకాలంబులయందు పతికి సర్వశుభంబులు చేకూరునట్లు ప్రార్థింపుచుండవలెను, పురుషులు మోక్షం బందుటకు బ్రహ్మవిద్య జేయవలయును. స్త్రీలకు పతిభక్తిసలుపుటే సాధనము. పురుషులకు పరమేశ్వరుండు దైవము. స్త్రీలకు దైవము పురుషు డని యెరుంగుము యని పతివ్రతాధర్మంబు నుపన్యసించినదెల్లయు వినుచున్న రాజసతీదేవీ! పద్మావతీ! తమ రానతిచ్చినయట్లు సర్వక్రియలును జేయనగును గాని పతి మరణించినవెంటనే తానును మరణించుట దుస్తర మని దలంచుచున్నాను. యీలోకంబునం దొకానొకరు సహగమనము జేయవా రున్నను యుందురుగాని ప్రాణంబువిడుచువారు గలరా, మాటమాత్రము జెప్పువారేగాని అట్లెవరును బూనుకొనరు యని మందలించెను. అంత పద్మావతి పక్కున నవ్వి, ఓరాణీ! సీతాదేవి దలంచినంత భూమి వోటిచ్చెను. వ్రతము గల శకుంతల దలంచినంత యాకాశవాణి వాక్కుచ్చెను, జీవంబు విడుచుటమాత్ర మంతదుస్తరమనియా దలంచెదవు, పక్షులు కొన్ని తనపతి మరణించిన తానును ప్రాణాంబు వదలుచున్నవే, వుత్తమ మగు మానవజన్మంబున పతినిగూడియుండి పతిమరణంబునకు పిదప స్త్రీలయొక్క జీవితము వ్యర్థమే గావున పతిమరణంబునకు పిదప జీవితమైయుండెడు వనిత అధమస్త్రీయనియు పతివెంట మరణించుట కుద్యమించునది మధ్యమస్త్రీయనియు పతివెంట జీవంబు విడుచునది ఉత్తమస్త్రీయనియు వేదంబులు నుడువుచున్నయవి, స్త్రీయైనది తనప్రాణంబుకన్నను పతిని మిక్కుటముగా దలంపవలెను, తద్వత్తుగా నేనును అనుష్ఠింపుచున్నాను గావున నీవును అట్లొనర్పుటే యుక్తమనుని జెప్పగా విని రాజసతి అవివేకులలో శిఖామణి గావున పద్మావతినిగాంచి దేవీ అమానుషకృత్యంబైన వాక్యంబు నుడివితిరి బహుచోద్యముగానే

యున్నది. మంచిది కానిమ్ము యని తనమందిరంబున కేగి చెలులం గాంచి ఆహా పద్మావతి తానుమాత్రము పతివ్రతయనియు మనమెల్ల రము పలగాకు లనిగదా దలంచియున్నది. పూర్వ మొకసమయంబున పొరుగింటిపురుషుడు మృతిబొందిన వానిసతి సహగమనము జేసె నని విని నేను దుఃఖంపుచుండగా తాను సంతసచిత్తయై యుండెను. అందుకు కారణమడుగగా పతివెంట మరణించక సహగమనము జేయుట యొకవిషయముగాదని పరిహసించెను, దుఃఖించువారిని నూ రార్చవలెనేగాని కఠినముగా బలుకుట యాపద్మావతికే దగియున్నది. తన కసాధ్యంబగు కృత్యంబును వారుల కుపదేశించునట్లుగదా యామె మందలింపుచున్నయది గాంచుడు చెలులారా ఇట్టిచోద్యంబు నెందైనం గని విని యుందురా యని ద్వేషభాషిణియై బలుకుచున్న చేడెలు విని, ఓరాజేశ్వరీ! లోకంబున పతివెంట సహగమనముజేయుటేఅరుదు అటు గాక ప్రాణంబువిడుచునా రెందును ఏకాలంబునను నుండరనియే దలంచుచున్నాము. పూర్వయుగంబులయం దెవరేనియుండినను వారికి జీవము స్వాధీనంబై యుండవలయు. అట్లున్నవా రెవరును గాన్పింపలేదు. అనేకశాస్త్రంబులుజదివి వారట్లొనర్పనేరక యన్యులకుమాత్ర ముపదేశించుట లోకంబునవాడుక గావున పద్మావతీ తమకును తద్విధంబుగా నుపదేశించెను గాబోలు. ఈ నిరర్థకంబైన వాక్యంబులవలన సార్థకంబేదియు నుండనేరదని దలచుచున్నామనిరి. అంతరాణి చేడెలారా ఇంతయెందుకు ఒకవిధముగా నామెను యిపుడేపరీక్షించి అవమానించుదము. యెట్లంటిరేని మీరిపు డొక పక్షిని జంపి యారక్తంబు నొకవస్త్రంబునకుబూసి పద్మావతికిజూపి అమ్మా నీపతి రాజుగారితో నరణ్యంబున వచ్చుచుండగా పులి హింసించెనని భటులుయానవాలుగా నిదోనున్నవస్త్రంబును గొనివచ్చిరి యని చెప్పుడు. అందుల కామె మరణించునా జాలిము యని రాణి వక్కాణించెను. అంత దాదులు రాజేశ్వరీ వొకవేళ మరణించిన మరణించును. ఇట్టి దుష్ప్రవర్తన జేయుట మనకు యుక్తముగాదు యని భయపడుచుండిరి. అంతరాజ్ఞి చెలులారా మీ రేల యూరక భీతినొందెదరు, పూర్వము కౌసల్య కైక సుమిత్ర కుంతి మున్నగువారు వారి భర్తృవియోగంబునకు పిదప జీవితులై యుండిరేగాని జీవత్యాగంబుజేసినవారుగారు. స్త్రీలకు పురుషులయందు ప్రీయము, అంతేకన్నను భూషణాంబరములయందు ప్రీతి అంతకుమిక్కిలి

ప్రాణమునందు ప్రీతియు, యీపద్మావతి యిన్ని చెప్పుచున్నదే జయ
దేవులకాలుసేతులు ఖండించినప్పుడు తాను విని భర్తవియోగంబున
కెట్లు సహించి ప్రాణం బుంచుకొనియుండెను. చెలులారా! మీరెంత
బుద్ధిహీనులరే, రామలక్ష్మణులు మృతినొందిరని విని జానకి వారిని
జూడ గోరినదే గాని ప్రాణాంతకంబున కుద్యమించలేదు. మీరేల
వెఱ్ఱి తలంపు దలంచెదరు ఈశ్వరాజ్ఞలేక ప్రాణవియోగం బెంతటివారి
కైనా గలుగనేరదు. అట్లుండ యీ పద్మావతిమాత్రము ఈశ్వరాజ్ఞ
నతిక్రమించుట కెట్లు సాధ్యంబగును మీ రెరిగియున్న జెప్పుడని మంద
లించెను. అంత చెలులు తల్లీ? పూర్వము నళాంగిని యేసు దివసంబులు
సూర్యోదయంబు గాకుండున ట్లొనర్చె ననియు సావిత్రి మృతినొందిన
పతిని పునర్జీవితుం జేసె ననియు పురాణంబు లుద్ఘోషింపుచున్నయవి.
పద్మావతి మహాపతివ్రత యని లోకు లెల్లరు నుడువుచుండుటే గాక
తనపతిని విడిచినది మొదలు మనపట్టణంబున గాంచువరకు ఒకవత్స
రము ఆహారంబులు గొనక స్నానాదు లొనర్పక తైలంబు త్యజించక
కృశీభూతయై యున్న విషయము మనమెల్లరము గాంచినవారమే.
ఇదియే చాలినంత సాక్ష్యముగా నున్నది గావున మే మీ దోషకృత్యం
బున కొడంబడుటలేదని చెప్పిరి. ఈ విధముగా భయ మందుచున్న చెలు
లంగాంచి, మీ రెందు కూరకే భయ మందెదరు, నేనొక్క పద్మావతితో
సంభాషింపు చుండెద, కొంత యాలస్యంబుగా మీరు నే జెప్పినట్లు రక్త
వస్త్రంబును గొని వచ్చి జయదేవులను పులి హింసించె నని వచింపుడు
తక్కిన వెల్లయు నే జూచుకొనియెద నని తాను పద్మావతి మేడకేగి
యుచితాసనంబున గూర్చొని దుఃఖచిహ్నంబు లగుపరచి తల్లీ పద్మా
వతీ? యరణ్యంబున కేగిన జయదేవస్వాములును రాజును వచ్చు
చుండెడి మార్గంబున యాకస్మికముగా జయదేవులను పులి హింసించె
నని భటులు జెప్పగా విని నిజమెఱింగివచ్చుటకు భటులవెంట చెలుల
నంపియున్నాను, వారువచ్చినగాని నిజం బెఱుంగజాలము. అమ్మా!
అరణ్యంబున కేగునప్పుడే వలదని మరలించితిని గాని రాజు నా
వాక్యంబును సరకుగొనక వెడలిపోయెను. ఇంతకు భగవదనుగ్రహ
మేలా గున్నదో యెవరెఱుంగుదురు యని మిక్కిలి దీనత్వంబుగా
నభినయించెను. అంత నా కఠోరంబు లైన వాక్యంబులు పద్మావతి

పీనులకు ములుకులై నాటి సత్యం బని నమ్మి అకటా పాపి యగు నేను నా పతివెంట నంటి జననైతిని గదా, మునుపొకపరి యీలాగు ననే మోసపోయి నానాయిడుములం బడి యున్న నేను బుద్ధిహీనతచే యజాగ్రత్తగా నుండి యిపుడున్ను దుఃఖంబుల పాలైతిని. అయినను నాస్వాములు సర్వభూతదయాపరుండు గావున పులిమాత్ర మెట్లు క్రోధించి హింసించును యని దలపోయు చుండెడు సమయంబున దాదులు రక్తవస్త్రంబును దీసుకవచ్చి పద్మావతి యెదుట నిలుచుండిరి గాని యామెతో నేది జెప్పుటకు నోరాడక తొట్రుపడుచు యనృతంబు నకు భయమందుచు దుష్కృతంబువలన నేమి అపాయము సంభవించునో యని వెఱగంది కలతజారినహృదయులై రక్తవస్త్రంబు నందుంచి పద్మావతిముఖం బవలోకించి కన్నీరు కుసుస్నిరై యెక్కెక్కి-యేడ్చుచు నిలుచుండిరి. అంత రాణి యేమే! చెలులారా మీరు గొని వచ్చిన వస్త్రము జయదేవులవస్త్రంబువలె గాన్పించు చున్నది. ఓహో? స్వామివారిని పులిగొట్టినది నిశ్చయమా? నిజ మెఱింగింపుడు యనిన దాదులు దేవీ మృతినొందినది వాస్తవ్యమే యని దుఃఖాంధో లనులై నుడివిరి. అంత పద్మావతి హా నిశ్చయమా, అకటా యిక నేమి జేయుదు నని నేలపై బడి బొరలుచు రోదనంబు జేయుచు తన మస్తకంబుపై కరంబులెత్తి మోదుకొనుచు హా నాప్రాణనాయకా, ప్రాణస్నేహా, పుణ్యపురుషా, పురుషశిఖామణి యని జెప్పుచు మూర్ఛనొందెను. పిదప కొంతదడవునకు మూర్ఛదెలిసి నాప్రాణవిభో నిన్నువిడిచి యిక నిమిషంబైనను యుండనోర్వను. ఓ పరమేశ్వరా, అల్పంబైన మృగంబుచే నావిభుకు వియోగంబు జెందుచుండ మీరెట్లోర్చియుంటిరి. ప్రాణేశా దుఃఖంబునకు యిక నే సహింపజాల కున్నాను. మీరేగిన లోకంబున కిదో నేనును వచ్చెద నని శంకరుని ప్రార్థించబూనెను. ఓం హరహర మహాదేవా వామదేవా నిటలాక్షా గంగాధరా సాంబశివా శ్మశానవాసా కైలాసవాసా ఉమాపతీ పశుపతీ త్రినేత్రా త్రిపుర దహనా సర్వేశా సర్పాభరణా కాలకాలా కపాలధారీ విశ్వనాథా భూతగణనాథా శశిధరా జటాధరా భవహరా శివశివా నీకు అనంత వందనములు, ఓం హరిహరి నరహరి మురహరి అంబుజాక్ష అచ్యుతా పంచాయుధ లక్ష్మీసమేతా లీలావినోదా కమలాసనా ఆదిమధ్యాంత

రహితా అనాథరక్షకా, అఖిలాండకోటిబ్రహ్మాండనాయకా పరమానంద ముకుందా వైకుంఠవాసా గోవిందా నీలమేఘశ్యామా కమలనయనా జనార్దనా కాళింగమర్దనా శేషశయనా మధుసూదనా సర్వకారణా వేంకటరమణా సంకటహరణా శ్రీధరా తులసీధరా దామోదరా పీతాంబరా మత్స్యకచ్ఛపవరహావతారా బలభద్రా పరమేశ్వరా సర్వేశ్వరా రాధామనోహరా శ్రీరంగా పాండురంగా లోకనాయకా పద్మనాభా పుణ్యపురుషా పురుషోత్తమా శ్రీరామా పరంధామా పరశురామా భక్తవత్సలా దేవానుకూలా నృసింహా త్రివిక్రమ ఆదిమూల వేణుగానలోలా మాధవా యదుకులతిలకా కేశవా గజపతీ రఘుపతి సీతాపతీ వేంకటాచలపతీ విష్ణూ పరాత్పరా నీకు అనంతవందనములు, నన్ను యీ ఆపత్సమయంబున రక్షించువా రెవరిని గానకున్నాను. నా జీవం బీశరీరంబును విడిచి నాపతి జనియున్న పరంబున జేర్చుము పుండరీకాక్షా యని యేకగ్రీవంబుగా ప్రార్థించెను అంత పద్మావతి ప్రాణంబు జ్యోతిమయంబుగా దేహంబును విడిచి గగనంబున బోవుచుండెను. యాప్రకాశంబును వీథులలో నున్న జనులందరు గాంచి ఆశ్చర్యభరితులై ఆహా ఇట్టి చోద్యంబును నెందైన గాంచితిరా యని యొకరికొకరు జెప్పుకొనుచు నీ తేజం బెందుండి బయలువెడలె నని యూహించి పద్మావతిమేడకుం జని యుండిరి చెలులవలన జరిగినదెల్లయు తెల్లంబుగా దెలిసి యకటా యింత విపరీతంబున కెంతవారైనను తృణీకరింతురా యని రాణిని నిందింపుచు వీథులలో గుములు గూడి మందలింపుకొను చుండిరి. ఇచట పద్మావతి చెంతనున్న రాజసతి విభ్రమము జెంది స్తంభీభూతయై నిలుచుండెను, చెలులు మూర్ఛితులై పడియుండిరి. రాజసతి స్మృతి దెచ్చుకొని ఆహా మోసమువచ్చినది యిందు కిక నేమి జేయుదు, ప్రపంచంబున నింతటి మహిమగల పతివ్రతామణు లుందురని యెఱుగనైతినే యీ మహాత్మురాలి ప్రాణవియోగంబునకు కారణభూత నైతినిగదా, ఇక నా జీవితము వ్యర్థమేగావున ప్రాణవియోగంబున కుద్యమించెదనని తనమస్తకంబును భూమిపై బాదుకొనబూనగా చెలులు కదలక పట్టుకొనిరి. రాణి పద్మావతిని గదలించి జూచి చెలులారా పద్మావతి నిక్కముగా మరణించినది ఇక నేమి జేయుదును నాపతికేమని యెఱిగింతును, రాజధర్మంబునకు కీడుదెచ్చి పెట్టితినిగదా

స్త్రీహత్య సంభవించెను, రా జీమాటవిన్నంతనే ప్రాణంబు విడుచుట దప్పదు. ఒక్కవికటప్రయత్నము మొదలె కెన్నివిధములు బాధలు కల్పించినది దైవమా ఆచంద్రార్కస్థాయిగా అపకీర్తిపాలైతినిగదా, ఇందు కెవరిని నిందింతును. చెలులారా! విషమైనను దీసుకరందు ప్రాణం బువదలెదను, లేకున్న పాతకి నగు నామోమును జయదేవస్వాముల కెట్లు జూపగలను, ఇకనిమేషంబైనను ప్రాణంబుంచుటతగదు యని భూమిపై తనశిరంబును మోదుకొనుచుండెను. అంత చెలులు రాణిని గదలక పట్టుకొని దేవీ? నీవు దుఃఖింపవలదు మీమొక యుక్తిజెప్పెద మట్లొన ర్పుము. జయదేవులు దలంచెనేని యీపద్మావతి బ్రతుకుట యొకవిష యము గాదు, నీవు జరిగినదెల్లయు నిజంబు జెప్పితివేని జయదేవులు పద్మావతిని బ్రతికించుటే గాక నిన్నును పవిత్రురాలినిగా జేయును, ఈ విషయమై నీకొంతమాత్రము సందియుంబువలదు యని చెప్పగా విని రాణి సుంతధైర్యం బవలంబించి జయదేవులరాక కెదురు జూచు చుండెను.

ఏడవయధ్యాయము ముగిసెను.

---

# ఎనిమిదవ అధ్యాయము.

## జయదేవుఁలు పద్మావతిని బ్రతికించుట.

వినండి సిద్ధులారా! మందిరంబున వీరలిట్లుండగా,జయదేవులును రాజును యరణ్యంబు గడచి పురంబున బ్రవేశించి రాజ్యలక్ష్మివిహీ నంబై ప్రజలు దీనభావంబుగా మెలంగుచుండుటను రాజుగాంచి, గురువరా! మన పట్టణంబున కళావిహీనంబై గాన్పించుటే గాక ప్రజలు నన్నుగాంచుటకు వెఱపొందుచున్నారు, ఇందులకు కార ణంబేకో గాన్పింపకున్న యది యని మందలించెను. అంత జయ దేవులు నరేంద్రా? నాకును తద్విధంబుగనే దోచుచున్నయది, వేగ ముగా మేడకరుదెంచి విచారించి దెలియుము యనగా రాజు మంత్రుల కెఱింగించెను. వారు పద్మావతిమందిరంబునకేగి అందున్న పరిచారి కలవలన వర్తమానంబెల్ల నెఱింగి రాజసమ్ముఖంబున కేతెంచి,

రాజేశ్వరా! ఇందు నేదో యొక దుష్కృత్యంబు జరిగినట్లుగనే దెలియుచున్నది. చెలులు జెప్పుటకు వెఱపొందుచున్నారు గాన తామె దయచేసి రాణిగారిపాలికిం జని విచారించినగాని విషయం బెల్లయు నామూలాగ్రముగా దెలియనేర దని విన్నవించిరి. అది విని రాజు మిక్కిలి తొందరపాటుగలవాఁడై రాణిమేడకుం జని అందు తన సతిని గానక పద్మావతిమేడయం దున్నదని చెలులవల్ల నెఱింగి వడివడిగా జయదేవులమందిరంబున కేఁగి అచట మిగుల దీనత్వంబుగా దుఃఖం పుచున్న తనసతియొక్క రోదనశబ్దంబు విని భయచిత్తుఁడై చెలులవలన జరిగినదెల్లయు సవిస్తరంబుగా విని తత్తరపడి ఓ నాదైవమా! ఈ నిందకు నేనేమి జేయువాడ నే నెట్లు జీవితుడనైయుందును, యని దుఃఖానలజ్వాలలకు సహింపజాలక భూమిపై బడి మూర్ఛితుం డాయెను. అదిగాంచి రాజసతి మిక్కిలి రోదనంబు జేయుచుండెను. ఇంతలో జయదేవులు పల్లకీలో నెక్కి తనమందిరము జేరి యచట రాణి దుఃఖించుటను చెలులు తెచ్చువడి నిలుచుండుటను గాంచి, చెలులారా! రాజసతికి గలిగిన యాపద యేమని యడిగెను. దాదులు జరిగినదెల్లయు సవిస్తరంబుగా జెప్పి పద్మావతిప్రాణము జ్యోతిమయంబుగా బోయె నని దుఃఖాందోళనులై నుడివిరి. అదెల్లయు విని జయదేవులు అహా? నేను అరణ్యంబున మృతినొందితి నని విన్నమాత్రంబుననే నాసతిప్రాణంబు జ్యోతిమయంబుగా నేతెంచినదిగదా ఏమియాశ్చర్యము, యామెకు నాకు నింతమట్టుకే సంబంధమున్నట్టున్నది, లేకున్న నింతటి యపూర్వకార్యము నెవరికి సాధ్యమగును. హా! ఇది యెంత అనురాగము, చెలీ నేను మృతినొందితినని విన్నంతనె యెంతగావిలపించితివో నీప్రాణం బెంత తల్లడించినదో నీ మనోవ్యథకు అంతం బుండదు, ప్రాణేశ్వరీ! ఇంత మహిమగల నిన్ను విడిచి యెట్లు జీవితుడనై యుందును. హా దైవమా! పతివ్రతారత్నంబును విడిచి యొంటరినై యుండవలసి వచ్చెనుగదా యని ప్రలాపించుచుండెను. అది విని రాజు మూర్ఛదెలిసి జయదేవులపాదంబులపై బడి కోయని పెనురోదనంబు జేయుచు క్రోధానలం బతిశయించి దంతంబుల పెటపెటగొరుకుచు దేహం బెల్లయు దద్దరించి చంద్రాయుధంబుచే బూని రాణియున్న గదిలోనికి రాగసి దేహంబుమరచి మూర్ఛితుం డాయెను. అంత రాజసతి మిక్కిలి భయకంపితయై దీనాలాపంబుల నాడుచు గదిలోనుండి జయదేవుల చెంతకు పరువిడి వచ్చి వారి

పాదంబుల బంధించుకొని శరణార్థినై దేవా నా నేరంబును క్షమింపుము. నా తల్లి పద్మావతీదేవికి ప్రాణంబొసంగి మమ్ములను మావంశంబును దోషరహితంబు జేసి రక్షింపుము. మహాత్మా యని రోదనంబు జేయుచుండగా యాశబ్దంబును విని రాజు గదిలోనుండిలంఘించి సతిని సిగబట్టియీడ్చి ఓసీ పంచమహాపాతకీ పతివ్రతనుజంపినఘాతుకీ యిదో నిన్నును నీచెలులను ఛేదించి ఖండతుండములుగా జేసి మీమాంసమును గ్రద్దలకు వేయించెద. విడువ నా ప్రాణంబును వదలెదనని జయదేవులను బంధించియుండెడు కరంబులను వీడదీయ నుద్యమించెను. అంత రాణి జయదేవులంగాంచి మహాత్మా! నేను మాత్రము నేరమొనర్చినదాన గావున నన్ను శిక్షించుట న్యాయమేగాని నిర్దోషులైన యీ దాదులును రాజును మృతిబొందుట ధర్మముగాదు. గురువరా! ఈ ఆపత్సమయంబున మీరూరకుండుట తగునా? ఓదీనదయాళో దీనబంధూ మీపై శత్రుత్వమే ప్రతిపాదింపుచుండిన వారలను దయతో రక్షించితివి యట్టి కరుణ యీ సమయ మెందేగి యున్నది. సర్వశక్తులుగల సిద్ధుండవని పేరొందియున్న తమ రిప్పుడు పక్షపాతంబుగా యుండు టొదుకో శీఘ్రముగా పద్మావతీదేవిని బ్రతికించి మమ్ము రక్షింపుము యని యెంత వేడినను జయదేవు లేమియు దోచక స్తంభీభూతులై యుండగా రాణి నే నెంత ప్రార్థించినను నాదుష్కర్మము మిమ్ముల నోరెత్తనియకున్నదే ఇందు కేమిజేయుదును యని దుఃఖంపుచుండెను. అంత జయదేవులు నృపతినింగాంచి, ఓయి రాజోత్తమా నిదానించుము, కోపమును క్షమించుము, తొందరవలదు, ఆతురగానికి బుద్ధిమట్టు యనునట్లు బుద్ధిహీనతగా జేసికొనకుము, నీ సతిని రక్షించుము, ఓరాణి! ఇపుడు పద్మావతి మరణించుటకు దైవయత్నమేగాని నీవలన గాదు, జీవులు జన్మించినప్పుడే మరణము సిద్ధమే గదా! వారివారి మరణకాలము నిటస్థించిన విదప బ్రహ్మాదిదేవతలకైనను తప్పించు తరముగాదు, లోకంబున యేదేని యొకనింద మోపక బొందికోదు, అనునట్లు నీయందు నిందగలిగినదే గాని దోషం బేమాత్రము లేదు, నీవిందుకై దుఃఖంపవలదు భయంబు మానుముయని రాజునుంగాంచి అప్ప భూపాలా! వృథాగా నెందు కామెను వధించెదవు. ఇక నీకోపంబును శమింపుము, పద్మావతికి దహనాదిసత్కారములు జేయించుము. చంద్రాయుధంబును దిగువనుంచుము యని

జయదేవులు జెప్పిన శాంతవాక్యంబులకు, గురువరా తాము బోధించు విషయమంతయు మీబోటి మహనీయులకు దగియుండును గాని క్షాత్ర ధర్మంబుగాదు, నృపాలుండు దండార్హులను వధించక వదలెనేని యమ దండనకు పాత్రుడగు నను విషయము తా మెఱుంగనిది గాదు. కావున నాదు కులధర్మప్రకారము యీ దురాత్ముల నందరిని ఖండములుగా ఛేదించి పిదప నేనును ప్రాణంబువదలి నాతల్లి పద్మావతీదేవి జనియుండెడు నిత్యపదంబు జేరెద, అప్పుడు తామే పద్మావతీదేవిని మమ్మందరిని సంస్కరింపు డని మహాగ్రహచిత్తుండై తన సతిని బలీయంబుగా బట్టి యీడ్చి ఛేదించుటకు ఖడ్గంబు పైకెత్తెను. అంత రాజసతి మహాభయంకర చిత్తయై జయదేవులం గాంచి, దేవా మమ్ము రక్షింపుము, రక్షింపుము. నిన్నే పరమగతియని నమ్మిన నన్నీ యాపత్సమయంబున చేయి విడుచుట ధర్మముగాదు. గురువరా యని ప్రార్థింపగా జయదేవులు భూతదయాపరుండు గావున, భూపాలా నిదానించుము యని రాజును బట్టుకొన యత్నించునప్పటికి భగవదనుగ్రహమువలన చేతులు కాళ్లు తనంతట తానే పెరుగగా నృపతి శిరంబును బట్టుకొని మైమరచి భగవంతుని స్తుతించందొడంగెను. శ్రీజ్ఞానస్వరూపుండవై దేవదేవుడవై సర్వాంతర్యామివై భక్తులస్వాధీనుండవై వెలయుచుండు జగన్నాథ మూర్తీ నీకు నమస్కరింపుచున్నాను.

శ్లో॥ ౧. కదాచి త్కాళిందీ తటవిపిన సంగీతకవరో। ముదా గోపీ నారీ వదనకమలాస్వాదమధుపః। రమాశంభు బ్రహ్మామరపతి గణేశార్చితపదో। జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే.

౨. భుజేసవ్యే వేణుం శిరసి శిఖిపింఛం కటితటే। దుకూలం నేత్రాంతే సహచరకటాక్షం విదధతే। సదా శ్రీమద్బృందావన వసతి లీలాపరిచయో। జగన్నాథస్వామీ.

3. మహాంభోధేస్తీరే కనకరుచిరే నీల శిఖరే। వసన్ప్రాసాదాంత స్సహజ బలభద్రేణబలినా। సుభద్రామధ్యస్థ స్సకలసుర సేవా సముదితో। జగన్నాథస్వామీ.

౪. కదా పారావార స్సజల జలద శ్రేణిరుచిరో। రమావాణీ సోమస్ఫురదమల పద్మోద్భవముఖైః। సురేంద్రై రారాధ్యః। శ్రుతిగణ శిఖా గీతచరితో। జగన్నాథస్వామీ.

౫. రథారూఢోగచ్ఛ న్పథిమిళితభూదేవపటలైః। స్తుతిప్రాదుర్భావం ప్రతిపద ముపాకర్ణ్య సదయా। దయాసింధుర్బంధు స్సకల జగతాం సింధుసుతయా। జగన్నాథస్స్వామీ.

౬. పరబ్రహ్మాపీడః కువలయదళోత్ఫుల్లనయనో। నివాసీ నీలాద్రౌ నిహితచరణోఽనంత శిరసి। రసానందో రాధా సరసవపురాలింగనసుఖో। జగన్నాథస్స్వామీ.

౭. నవై ప్రార్థ్యం రాజ్యం నచకనకయుతం భోగవిభవం। నయాచేఽహం రమ్యాం నిఖిలజనకామ్యాం వరవధూం। సదా కాలేకాలే ప్రమథపతినా గీతచరితో। జగన్నాథస్స్వామీ.

౮. హరత్వం సంసారం ద్రుతతరమసారం సురపతే। హరత్వం పాపానాం వితతి మపరాం యాదవపతే। అహోహీనాలక్ష్మీనాథం నిహితమచలం నిశ్చితపదం। జగన్నాథస్వామీ నయనపథగామీ భవతు మే.

అని జగన్నాథుని ప్రత్యక్షుండగునట్లు ప్రార్థించియు రానందులకు దుఃఖించి కన్నీరు దేహంబెల్ల దడియ, పరమేశ్వరా! నావలన గదా యీ పట్టణంబెల్ల పాడైయుండవలసెనని విలపించుచు పద్మావతి నిగాంచి, ఓనాప్రాణేశ్వరి? నన్ను పరలోకంబున జూడనేగితివి గాబోలు నా కరపాదంబులు వచ్చినవి. నీసుందర నయనారవిందంబులతో జూడుము. నాయందమితానురాగంబుతో వివాహంబైన దాదిగా భక్తి సలుపుచున్న నివెట్లు నన్ను విడనాడి పరంబున కేగితివి? నాయందు నీ కంతవిశ్వాస ముండునపుడు నేనుమాత్రము నిన్ను విడచి యెట్లు జీవించియుందును. రాజు ప్రాణంబుత్యజించుట కుద్యమించియున్నవాడు, నీవు కనుదెఱచి చూచి నా ప్రాణంబుల నిలుపగూడదా? అయ్యో! యెంత స్తుతించినను భగవద్దర్శనముగూడ గాకయున్నది ఇంకు కేమి జేయుదు శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకా? నేనింతగా వేడుచున్నను నా మొరవినకుండుటకు కారణంబేమి గజేంద్రుడు మకరిచేజిక్కి శ్రమనొందుచు మిమ్ము వేడుచున్నాడు గాబోలు లేక ప్రహ్లాదుని మొరాలించి అచటి కేగెంచియున్నారో అట్లు గాకున్న ద్రౌపది సభలో భంగమొందుచు మిమ్ము ప్రార్థించెనని చీరలిచ్చుచున్నారేమొ, లేక గోపికల వలంజిక్కి వారి గోష్ఠివలన నీ వీనులకు నా మొఱవినకున్నదో? ఆర్త శరణ్యా, అనాథనగు నేను దిక్కుదియుగానక అగాధమగు దుఃఖసాగర

మునబడి దరిగానక తడబడుచు మిణుకరించుచున్న నన్నుద్ధరింప నీవు దప్ప మఱెవ్వరు సమర్థులు లేరు. ఈ సమయమున నా ప్రార్థన నంగీకరించక యుపేక్షించితివేని పుణ్యలోకభ్రష్టుడనై నరకప్రాప్తుడ నగుటకు సందియంబు లేదు వేగముగా వచ్చి మమ్ము ధన్యులం జేయుము యని యెన్నివిధంబుల స్తుతించినను భగవంతుడు ప్రత్యక్షంబు గానందులకు మఱొకవిధంబుగా ప్రార్థించం దొడంగెను. ఇంద్రియనిగ్రహుండై భ్రూమధ్యంబున చూపునిలిపి మనస్సును రాధాదేవిసన్నిధికి రాయబారముగా బంపి భగవద్లీలలను తరంగంబులుగా బాడ నారంభించెను.

## అష్టపదీ తరంగములు.

౮॥ శ్లో॥ దరవిదళిత మల్లీవల్లి చంచత్పరాగ ప్రకటితపటవాసైర్వాసయన్ కాననాని। ఇహ హి దహతి చేతః కేతకీగంధబంధుః ప్రసరదసమబాణ ప్రాణవద్గంధవాహః॥ ౯॥ ఉన్మీలన్మధు గంధలుబ్ధమధుప వ్యాధూతచూతాంకుర క్రీడత్కోకిల కాకలీకలకలై రుద్గీర్ణకర్ణజ్వరాః। నీయంతే పథికైః కథంకథమపి ధ్యానావధానక్షణ ప్రాప్తప్రాణసమా సమాగమరసోల్లాసై రమీ వాసరాః॥ ౧౦॥ అనేకనారీపరిరంభసంభ్రమస్ఫురన్మనోహారి విలాసలాలసమ్। మురారిమారా దుపదర్శయంత్యసౌ సఖీసమక్షం పునరాహ రాధికామ్॥

## చతుర్థాష్టపదీ.

రామక్రియా రాగము. ౧॥ చందనచర్చిత నీలకళేబర పీతవసనవనమాలీ। కేళిచలన్మణి కుండలమండిత గండయుగస్మితశాలీ॥ ప॥ హరిరిహ ముగ్ధవధూనికరే - విలాసిని విలసతి కేళిపరే - హరిరిహ ముగ్ధవధూనికరే॥ ౨॥ పీనపయోధర భారభరేణ హరిం పరిరభ్య సరాగం - గోపవధూరనుగాయతి కాచి దుదంచితపంచమరాగం హరిరిహ ముగ్ధవధూనికరే॥ ౩॥ కాపి విలాసవిలోల విలోచన ఖేలన జనితమనోజం - ధ్యాయతి ముగ్ధవధూరధికం మధుసూదన వదన సరోజం - హరిరిహ ముగ్ధవధూనికరే॥ ౪॥ కాపి కపోలతలే మిలితా లపితుం కిమపి శ్రుతిమూలే - చారు చుచుంబ నితంబవతీ దయితం పులకై రనుకూలే - హరి॥ ౫॥ కేళికలాకుతుకేన చ కాచి దముం యమునావనకూలే - మంజులవంజుళకుంజగతం విచకర్ష కరేణ దుకూలే॥ హరిహరి॥ ౬॥ కరతలతాళతరళవలయావళికలిత కలస్వనవంశే - రాసరసే సహనృత్యపరా హరిణా యువతిః ప్రశ

శంసే॥ హరిహరి॥ ౭॥ శ్లిష్యతి కామపి చుంబతి కామపి-రమయతి కామపి రామాం-పశ్యతిసస్మితచారుపరామ పరామనుగచ్ఛతి వామాం॥ హరి హరి॥ ౮॥ శ్రీజయదేవఫణిత మిదమద్భుత కేశవ కేళిరహస్యం- బృందా వనవిపినేచరితం వితనోతుశుభానియశస్యం॥ హరిరిహ ముగ్ధవధూనికరే॥

౧౧॥ శ్లో॥ విశ్వేషా మనురంజనేన జనయ న్నానంద మిందీవర శ్రేణీశ్యామల కోమలై రుపనయ న్నంగై రనంగోత్సవమ్। స్వచ్ఛందం వ్రజసుందరీభిరభితః ప్రత్యంగమాలింగితః శృంగార స్సఖిమూర్తి మా నివమధౌ ముగ్ధోహరిః క్రీడతి॥ ౧౨॥ అద్యోత్సంగవ సద్భుజంగకబళ క్లేశాదివేశాచలం ప్రాలేయ ప్లపనేచ్ఛయానుసరతి శ్రీఖండశైలానిలః। కించిత్స్నిగ్ధ రసాలమౌళి ముకుళా న్యాలోక్య హర్షోదయా దున్మీలంతి కుహూః కుహూరితి కలోత్తాలాః పికానాంగిరః॥

౧౩॥ శ్లో॥ విహరతివనేరాధా సాధారణప్రణయే హరౌవిగళిత నిజోత్కర్షా దీర్ష్యావశేనగతాన్యతః। క్వచిదపిలతా కుంజేగుంజన్మధు వ్రతమండలీ ముఖరశిఖరే లీనాదీనాప్యు వాచరహస్సఖీమ్॥

పంచమాష్టపదీ.

దేశాక్షి రాగము. ౧॥ సంచలదధరసుధా మధురధ్వనిముఖ రిత మోహనవంశం - చలితదృగంచల చంచలమౌళి కపోలవిలోల వితంసం॥ ప॥ రాసేహరిమిహ విహితవిలాసం స్మరతిమనోమమ కృత పరిహాస్యం॥ రాసేహరిమిహ విహితవిలాసం॥ ౨॥ చంద్రకచారు మ యూరశిఖండ మండలవలయిత కేశం- ప్రచురపురంధర ధనురనురంజిత మేదురముదిరసువేషం॥ రాసే॥ ౩॥ గోపకదంబనితం బవతీముఖ చుం బనలంబితలోభం - బంధుజీవమధురాధర పల్లవకలిత దరస్మితశోభం॥ రాసే॥ ౪॥ విపులపులక భుజపల్లవవలయిత వల్లవయువతి సహస్రం - కరచరణోరసి మణిగణభూషణ కిరణవిభిన్నతమిస్రం॥ రాసే॥ ౫॥ మణి మయమకర మనోహరకుండల మండితగండముదారం - పీతవసనమను గతమునిమనుజ సురాసుర వరపరివారం॥ రాసే॥ ౬॥ విశదకదంబతలే మిళితం కలికలుషభయం శమయంతం-మామపికిమపి తరంగదనంగదృ శామనసారమయంతం॥ రాసే॥ ౭॥ జలదపటలచలదిందువినిందకచంద నబిందులలాటం-పీనపయోధర పరిసరమర్దన నిర్దయహృదయకవాటం॥ రాసే॥ ౮॥ శ్రీజయదేవఫణితమతి సుందరమోహన మధురిపురూపం -

హరిచరణస్మరణం ప్రతిసంప్రతి పుణ్యవతామనురూపం॥ రాసేహరి
మిహ విహితవిలాసం - స్మరతిమనోమమ కృతపరిహాసం॥ రాసేహరి॥

౧౪॥ శ్లో॥ గణయతిగుణగ్రామం భ్రామంభ్రమాదపినేహతేవహ
తిచ పరితోషంరోషం విముంచతిదూరతః॥ యువతిషు వలత్తృష్ణేకృష్ణే
విహారిణిమాంవినా పునరపిమనోవామం కామంకరోతికరోమికిం॥

## ష ష్ఠా ష్ట ప దీ

గుణక్రియారాగము. ప॥ సఖికేశిమథనముదారం - రమయ
మయా సహమదనమనోరథభావితయా సవికారం॥ ౧॥ నిభృతనికుంజగృ
హంగతయానిశిరహసినిలీయవసంతం- చకితవిలోకితసకలదిశారతిరభస
వశేనహసంతం॥ సఖికేశిమథనముదారం॥ ౨॥ ప్రథమసమాగమలజ్జితయా
పటుచాటుశతైరనుకూలం - మృదుమధురస్మితభాషితయాశిథిలీకృతజ
ఘనదుకూలం॥ స॥ ౩॥ కిసలయశయననివేశితయాచిర మురసిమమైవశయా
నం-కృతపరిరంభణచుంబనయాపరిరభ్యకృతాధరపానం॥ సఖి॥ ౪॥ అలస
నిమీలితలోచనయాపులకావళిలలితకపోలం- శ్రమజలసకలకళేబరయా
మదనమదాదతిలోలం॥ సఖి॥ ౫॥ కోకిలకలరవకూజితయాజిత మనసిజ
తంత్రవిచారం - శ్లథకుసుమాకుల కుంతలయా నఖలిఖితఘనస్తన
భారం॥ సఖి॥ ౬॥ రతిసుఖసమయరసాల సయాదరముకుళితనయన
సరోజం - నిస్సహనిపతితతను లతయామధుసూదన ముదితమనోజం॥
సఖి॥ ౭॥ చరణరణితమణినూపురయా పరిపూరితసురతవితానం -
ముఖరవిశృంఖలమేఖలయాసక చగ్రహచుంబనదానం॥ సఖి॥ ౮॥ శ్రీ
జయదేవఫణితమిదమతిశయ మధురిపునిధువనశీలం - సుఖముత్కంఠిత
రాధికయా కథితంవితనోతుసలీలం॥ సఖికేశిమథనముదారం॥

౧౫॥ శ్లో॥ హస్తస్రస్త విలాసవంశమనృజుభ్రూవల్లిమద్వల్లవీ
బృందోత్సాహ దృగంతవీక్షితమతి స్వేదార్ద్రగండస్థలమ్। మాముద్వీ
క్ష్యవిలజ్జితస్మిత సుధాముగ్ధాననంకానన గోవిందంవ్రజ సుందరీగురివృతం
పశ్యామిహృష్యామిచ॥ ౧౬॥ దురాలోకస్తోక స్తబకనవకాశోకలతికా
వికాసః కాసారోపవన పవనోయం వ్యథయతి। అపిభ్రామ్యద్భృంగీ
రణితరమణీయానముకుళప్రసూతి శ్చూతానాం సఖి శిఖరిణీయం సుఖ
యతి॥

౧౭॥ శ్లో॥ కంసారిరపిసంసార వాసనాబద్ధశృంఖలామ్। రాధా
మాధాయహృదయేతత్యాజవ్రజసుందరీ॥ ౧౮॥ ఇతస్తతస్తామనుసృత్య

రాధికా మనంగ బాణవ్రణఖిన్న మానసః । కృతానుతాపస్సకళిందనం
దినీ తటాంతకుంజేవిష సాదమాధవః॥

స ప్త మా ష్ట ప దీ.

భూపాలరాగము॥ ౧॥ మామియం చలితా విలోక్య వృతం
వధూనిచయేన - సాపరాధతయామయాపిన వారితాతిభయేన॥ ప॥
హరిహరి హతాదరతయా సాగతాకుపితేవ॥ హరిహరి హతాదర
తయా॥ ౨॥ కింకరిష్యతి కింవదిష్యతి సాచిరంవిరహేణ - కింజనేన
దనేన కింమమ భూషణేన గృహేణ॥ హరిహరి॥ చింతయామితదాననం
కుటిలభ్రుకోపభరేణ - శోణపద్మమివోపరిభ్రమ తాకులంభ్రమరేణ॥
హరిహరి॥ ౪॥ తామహం హృది సంగతామనిశంభృశంరమయామి -
కింవనేమి సరామితామిహా కింవృథావిలపామి॥ హరిహరి॥ ౫॥ తన్వివిఖి
న్నమసూయయా హృదయంతవాకలయామి - తన్నవేద్మి కుతోగతా
సినతేన తేనునయామి॥ హరిహరి॥ ౬॥ దృశ్యసేపురతోగతాగత మేవ
మేవిదధాసి - కింపురేవ ససంభ్రమం పరిరంభణంనదదాసి॥ హరి॥ ౭॥
క్షమ్యతా మపరంకదాపిత ఈదృశంనకరోమి - దేహిసుందరి దర్శనం
మమ మన్మథేనధునోమి॥ హరిహరి॥ ౮॥ వర్ణితం జయదేవకేన హరేరి
దంప్రవణేన - తిందుబిల్వసముద్రసంభవగోహిణీరమణేన॥ హరిహరి
హతాదరతయా॥

౧౯॥ శ్లో॥ హృదిబిసలతాహారో నాయంభుజంగ మనాయకః
కువలయదళశ్రేణీకంఠేనసాగరళద్యుతిః । మలయజరజోనేదం భస్మ
ప్రియారహితే మయిప్రహరనహరభ్రాంత్యానంగ క్రుధాకిముధావసి॥
౨౦॥ పాణౌ మాకురు చూత సాయకమముం మాచాప మారోపయ
క్రీడానిర్జితవిశ్వమూర్ఛితజనాఘాతేనకిం పౌరుషమ్। తస్యాఏవమృగీదృ
శోమనసజప్రేంఖత్కటాక్షాశుగ శ్రేణీజర్జరితం మనాగపి మనోనా
ద్యాపి సంధుక్షతే॥ ౨౧॥ భ్రూచాపేనిహితః కటాక్షవిశిఖో నిర్మాతు
మర్మవ్యథాం శ్యామాత్మా కుటిలః కరోతు కబరీ భారోపి మారో
ద్యమమ్। మోహంతావనముంచ తన్వితనుతాం బింబాధరోరాగవా
నద్వృత్తస్తనమండలం తవకథం ప్రాణైర్మమ క్రీడతే॥ ౨౨॥ తాని
స్పర్శసుఖాని తేచ సరళా స్నిగ్ధాదృశోర్విభ్రమా । స్తద్వక్త్రాంబుజసౌ
రభం సచసుధాస్యందీ గిరాం వక్రిమా । సా బింబాధరమాధురీతి వి

షయా సంగేపిచేన్మానసం తస్యాం లగ్న సమాధిహంత విరహవ్యాధిః కథంవర్తతే॥ ౨౩॥ భ్రూపల్లవం ధనురపాంగతరంగితాని బాణాగుణ శ్రవణ పాళిరితిస్మరేణ। తస్యామనంగజయజంగమ దేవతాయా మస్త్రాణి నిర్జితజగంతికిమర్పితాని॥ ౨౪॥ శ్లో॥ యమునాతీరవానీరనికుంజే మందమాస్థితమ్। ప్రాహప్రేమభరోద్భ్రాంతం మాధవం రాధికాసఖీ॥

అష్టమాష్టపది.

సౌరాష్ట్రిరాగము. ౧॥ నిందతిచందన మిందుకిరణ మనువిందతిఖేదమధీరం - వ్యాళనిలయమిళనేన గరళమివ కలయతిమలయసమీరం॥ ప॥ సావిరహేతవదీనా కృష్ణసావిర హేతవదీనా - మాధవ మనసిజ విశిఖభయాదివ భావనయా త్వయిలీనా - సావిరహేతవదీనా కృష్ణసావిరహేతవదీనా॥ ౨॥ అవిరళనిపతిత మదనశరాదివ భవదవనాయవిశాలం - స్వహృదయమర్మణి వర్మకరోతిసజలనళినిదళజాలం॥ సావిరహేతవదీనా॥ ౩॥ కుసుమవిశిఖశరతల్పమనల్పవిలాసకళాకమనీయం। వ్రతమివతవపరిరంభ సుఖాయకరోతి కుసుమశయనీయం॥ సావిరహేతవదీనా॥ ౪॥ వహతిచ గళిత విలోచన జలధర మాననకమలముదారం - విధుమివవికట విధుంతుద దంత దళన గళితామృతధారం॥ సావిరహేతవదీనా॥ ౫॥ విలిఖతిరహసి కురంగ మదేన భవంతమ సమశరభూతం - ప్రణమతిమకరమధోవినిధాయకరేచశరంనవచూతం॥ సావిర॥ ౬॥ ప్రతిపదమిదమపినిగదతిమాధవ తవచరణే పతితాహం - త్వయి విముఖేమయి సపదిసుధానిధిరపితనుతేతనుదాహం॥ సావిరహే॥ ౭॥ ధ్యానలయేనపురః పరికల్ప్య భవంతమతీవదురాపం - విలపతిహసతి విషీదతి రోదతి భ్రమతివిముంచతితాపం॥ సావిరహే॥ శ్రీజయదేవభణితమిదమధికం యదిమనసానటనీయం - హరివిరహాకుల వల్లవయువతీ - సఖివచనం- పఠనీయం॥ సావిరహేతవదీనా కృష్ణసావిరహేతవదీనా॥

౨౫. శ్లో॥ ఆవాసోవిపినాయతే ప్రియసఖీమాలాపిజాలాయతే తాపోనిశ్వసితేన దావదహన జ్వాలాకరాళాయతే। సాపిత్వద్విరహేణ హంతహరిణీ రూపాయతేహాకథం కందర్పోపియమాయతే విరచయన్ శార్దూలవిక్రీడితమ్॥

నవమాష్టపది.

దేశాక్షి రాగము॥ ౧॥ సనవినిహితమపి హారముదారం సామనుతేకృశ తనురివభారం॥ పల్లవి॥ రాధికా కృష్ణరాధికా - రాధికా

విరహేతవకేశవ - రాధికాకృష్ణరాధికా॥ ౨॥ శ్వసితపవనమను పమ పరిణాహం- మదనదహనమివవహతిసదాహం॥ రాధికాకృష్ణరాధికా॥ ౩॥ సరసమసృణమపి మలయజపంకం- పశ్యతివిషమివ వపుషిసశంకం॥ రాధికా॥ ౪॥ దిశిదిశికిరతిస జలకణజాలం నయనసళినమివ విగళితనాళం॥ రాధికా॥ ౫॥ నయనవిషయమివ కిసలయతల్పం కలయతివిరహహుతాశనకల్పం॥ రా॥కా॥ ౬॥ త్యజతినపాణితలేనకపోలం - బాలంశశిమివ సాయమలోలం॥ రాధికా॥ ౭॥ హరిరితిహరిరితి జపతిసకామం విరహివిహిత మరణేవనికామం॥ రాధికా॥ ౮॥ శ్రీజయదేవ భణితమితి గీతం-సుఖయతుకేశవ పదముపసీతం॥ రాధికాకృష్ణరాధికా॥

౨౬॥ శ్లో॥ స్మరాతురాం దైవతవైద్యహృద్య త్వదంగసంగామృత మాత్రసాధ్యామ్। నివృత్తబాధాంకురుషేనరాధా ముపేంద్ర వజ్రాదపిదారుణోసి॥ ౨౭॥ కందర్పజ్వరసంజ్వరాకులతనో రాశ్చర్య మస్యాశ్చిరం చేతశ్చందనచంద్రమః కమలినీ చింతాసు సంతామ్యతి। కింతు క్లాంతివశేనశీతలపరం త్వామేక మేవప్రియాం ధ్యాయంతీ రహసి స్థితంకథమపి క్షీణాక్షణంప్రాణితి॥ ౨౮॥ క్షణమపివిరహః పురానసేహే నయననిమిలిత ఖిన్నయాతయా తే। శ్వసతికథమసౌరసాలశాఖాం చిరవిరహేణ విలోక్యపుష్పితాగ్రామ్॥

౨౯॥ శ్లో॥ అహమిహనివసామి యాహిరాధా మనునయ మద్వచనేనచానయేథాః। ఇతి మధురిపుణా సఖీనియుక్తా స్వయమిద మేత్య పునర్జగాదరాధామ్॥

దశమాష్టపదీ.

పంతువరాళి రాగము॥ ౧॥ వహతిమలయసమీరే మదనముపనిధాయస్ఫుటతికుసుమనికరే విరహిహృదయదళనాయ॥ ప॥ తవవిరహేవనమాలీ సఖిసీదతిరాధేతవ విరహేవనమాలీ॥ ౨॥ దహతిశిశిరమయూఖే మరణమనుకరోతి - పతితమదనవిశిఖవిలపతివికలతరోతి॥ తవవిరహేవనమాలీ॥ ౩॥ ధ్వనతిమధుపసమూహే శ్రవణమపిదధాతి - మనసివలిత విరహే నిశినిశిరుజముపయాతి॥ తవవిరహే॥ ౪॥ వసతివిపినవితానే - త్యజతిలలితధామలుఠతిధరణిశయనే - బహువిలపతితవనామ॥ తవవిరహే॥ ౫॥ రణతిపికసమవాయే-ప్రతిదిశమనుయాతి

హసతిమనుజనిచయే విరహమపలపతి నేతి॥ తవ॥ ౬॥ స్ఫురతికలరవరావే స్మరతి మణితమేవ - తవరతసుఖవిభవే - గణయతి సుగుణమతీవ॥ తవవిరహే॥ ౭॥ త్వదభిధశుభదమాసం-వదతిపరిశృణోతి - తమపిజపతి సరసంయువతిషు నరతిముపైతి తవవిరహే॥ ౮॥ భణతికవిజయదేవే విరహివిలసితేన - మనసిరభసవిభవే - హరిరుదయతు సుకృతేన॥ తవవిరహే వనమాలీ॥

౩౦. శ్లో॥ పూర్వంయత్ర సమంత్వయా రతిపతే రాసాదితాస్సిద్ధయ స్తస్మిన్నేవ నికుంజమన్మధమహాతీర్థే పునర్మాధవః। ధ్యాయంస్త్వామనిశం జపన్నపితవై వాలాపమంత్రావళిం భూయ స్త్వత్కుచకుంభ నిర్భరపరీరంభామృతం వాంఛతి॥

ఏకాదశాష్టపదీ.

పాడిరాగము. ౧॥ రతిసుఖసారే గతమభిసారే మదనమనోహరవేషం - నకురునితంబిని గమనవిళంబన మనుసరతంహృదయేశం॥ ప॥ ధీరసమీరే యమునాతీరే వసతివనేవనమాలీ- గోపీపీనపయోధర మర్ధన చంచలకరయుగశాలీ॥ ధీరసమీరే యమునాతీరే వసతివనే వనమాలీ॥ ౨॥ నామసమేతం కృతసంకేతం వాదయుతే మృదువేణుం- బహుమనుతే నను తేతనుసంగత పవనచలిత మపిరేణుం॥ ధీరసమీరే॥ ౩॥ పతతిపతత్రే విచలతిపత్రే శంకితభవదుపయానం - రచయతిశయనం సచకితనయనం - పశ్యతితవపంథానం॥ ధీరసమీరే॥ ౪॥ ముఖరమధీరం త్యజమంజీరం రిపుమివకేలిషులోలం- చలసఖికుంజం సతిమిరపుంజం శీలయనీలనిచోళం॥ ధీరసమీరే॥ ౫॥ ఉరసిమురారే రుపహితహారే ఘనఇవతరళబలాకే - తటిదివపీతే రతివిపరీతే రాజసిసుకృతవిపాకే॥ ధీరసమీరే॥ ౬॥ విగళితవసనం పరిహృతరసనం ఘటయజఘనమపిధానం - కిసలయశయనే పంకజనయనే నిధిమివహర్షనిదానం॥ ధీర॥ ౭॥ హరిరభిమానీ రజనిరిదానీ మియముపయాతివిరామం- కురుమమవచనం సత్వరరచనం పూరయమధురిపుకామం॥ ధీరసమీరే॥ ౮॥ శ్రీజయదేవేకృతి హరిసేవే భణతి పరమరమణీయం - ప్రముదితహృదయం హరిమతి సదయం నమతసుకృత కమనీయం॥ ధీరసమీరే యమునాతీరే వసతివనేవనమాలీ॥

౩౧. శ్లో॥ సామాంద్రక్ష్యతి వక్ష్యతి స్మరకథాః ప్రత్యంగమాలింగనైః ప్రీతింయాస్యతి రంస్యతే సఖిసమాగత్యేతి చింతాకులః।

సత్వాంపశ్యతి వేపతేపులకయత్యానందతిస్వేదతి ప్రత్యుద్గచ్ఛతి మూర్ఛతిస్థిరతమః పుంజేనికుంజేస్థితః॥ ౩౨॥ వికిరతి ముహుర్శ్వాసా శ్వాసాన్పురో ముహురీక్షతే ప్రవిశతి ముహుః కుంజం గుంజన్ ముహుర్బహుతామ్యతి। రచయతి ముహుశ్శయ్యాం పర్యాకులం ముహురీక్షతే మదనకదనక్లాంతః కాంతే ప్రియస్తవ వర్తతే॥ ౩౩॥ త్వద్వామ్యేనసమం సమగ్రమధునా తిగ్మాంశురస్తంగతో గోవిందస్య మనోరథేన చ సమం ప్రాప్తం తమస్సాంద్రతాం। కోకానాం కరుణస్వనేన సదృశీ దీర్ఘా మదభ్యర్థనా తన్ముగ్ధేవిఫలం విలంబనమసౌ రమ్యోభిసారక్షణః॥ ౩౪॥ ఆశ్లేషాదనుచుంబనాదనునఖోల్లేఖాదనుస్వాంజత ప్రోద్బోధాదను సంభ్రమాదనురతారంభాదనుప్రీతయోః। అన్యార్థంగతయోర్భ్రమాన్మిలితయోస్సంభాషణైర్జానతోర్దంపత్యోరిహ కోనుకోనుతమసి క్రీడాపిమిశ్రోరసః॥ ౩౫॥ అతిచకితం విన్యస్యంతీం దృశౌతిమిరే పథి ప్రతితరు ముహుస్స్థిత్వామందం పదానివితన్వతీం। కథమపిరహః ప్రాప్తామంగైరనంగతరంగిభిః సుముఖిసుభగః పశ్యన్ సత్వాముపైతు కృతార్థతామ్॥ ౩౬. అథతాంగంతు మశక్తాంచిరమనురక్తాం లతాగృహేదృష్ట్వా। తచ్చరితంగోవిందే మనసిజమందేసఖీప్రాహ.

## ద్వాదశాష్టపదీ.

శంకరాభరణరాగము॥ ౧॥ పశ్యతి దిశిదిశి రహసి భవంతం తదధరమధుర మధూనిపిబంతం॥ ప॥ నాథహరే జగన్నాథహరే సీదతి రాధా వాసగృహే॥ నాథహరే జగన్నాథహరే॥ ౨॥ త్వదభిసరణరభసేనవసంతీ - పతతిపదాని కియంతిచలంతీ॥ నాథహరే జగన్నాథహరే॥ ౩॥ విహితవిశదబిసకిసలయవలయా - జీవతి పరమిహ తవరతికలయా॥ నాథహరే॥ ౪॥ ముహురవలోకిత మండనలీలా - మధురిపురహమితి భావనశీలా - నాథహరే॥ ౫॥ త్వరితముపైతి న కథమభిసారం- హరిరితి వదతిసఖీమనువారం॥ నాథహరే॥ ౬॥ శ్లిష్యతిచుంబతి జలధరకల్పం- హరిరుపగత ఇతితిమిరమనల్పం॥ నాథహరే॥ ౭॥ భవతివిలంబిని విగళితలజ్జా-విలపతి రోదితి వాసకసజ్జా॥ నాథహరే॥ ౮॥ శ్రీజయదేవకవేరిద ముదితం- రసికజనంతనుతామతిముదితం॥ నాథహరే జగన్నాథ॥

౩౭. శ్లో॥ విపులపులకపాళిః స్ఫీతసీత్కారమంతర్జనితజడిమకాకూరాకులం వ్యాహరంతీ। తవకితవవిధత్తే మందకందర్పచింతాం రస

జలధినిమగ్నా ధ్యానలగ్నా మృగాక్షీ॥ ౩౮॥ అంగేష్వాభరణంకరోతి బహుశః పత్రేతిసంచారిణి ప్రాప్తంత్వాం పరిశంకతే వితనుతే శయ్యాం చిరంధ్యాయతి। ఇత్యాకల్ప వికల్పతల్పరచనా సంకల్పలీలాశత వ్యాసక్తా విపినాత్వయా వరతను ర్నైషానాం నిశాం నేష్యతి॥ ౩౯॥ శ్లో॥ అత్రాంతరేచ కులటాకులవర్త్మపాత సంజాతపాతక ఇవ స్ఫుటలాంఛనశ్రీః। బృందావనాంతర మదీపయ దంశుజాలై ర్దిక్సుందరీవదన చందన బిందురిందుః॥ ౪౦॥ ప్రసరతి శశధరబింబే విహితవిలంబేచమాధవే। విధుర రచిత వివిధవిలాపా పరితాపంచకారోచ్చైః॥

## త్రయోదశాష్టపదీ.

మాళవరాగము॥ ౧॥ కథితసమయేపిహరిరహహానయయావనం - మమవిఫలమిద మమలరూపమపి యౌవనం॥ ప॥ యామి హేకమిహశరణం-సఖీజన వచనచింతాహం యామి హేక మిహశరణం॥ ౨॥ యదనుగమనాయ నిశిగహన మపిశీలితం - తేనమమహృదయమిదమ సమశరకీలితం॥ యా॥ ౩॥ మమమరణమేవ వరమతివితథకేతనా - కిమిహవిషహామి విరహానలమచేతనా॥ యామి హే॥ ౪॥ మామహహవిధురయతి మధురమధుయామిని-కాపిహరి మనుభవతి కృతసుకృతకామినీ॥ యామి హే॥ ౫॥ అహహకలయామివలయాది మణిభూషణం - హరివిరహదహన వహనేన బహుదూషణం॥ యామి॥ ౬॥ కుసుమసుకుమార తనుమతను శరలీలయా - స్రగపిహృదిహంతి మామతివిషమశీలయా॥ యామి॥ ౭॥ అహమిహనివసామి నవగణితవేతసా - స్మరతిమధుసూదనోమా మపినచేతసా॥ యామి హే॥ ౮॥ హరిచరణశరణ జయదేవ కవిభారతీ-వసతుహృది యువతిరివ కోమలకళావతీ॥ యామి హేకమిహశరణం - సఖీజన వచనచింతాహం॥

౪౧॥ శ్లో॥ తత్కింకామపి కామినీమభిసృతః కింవాకళాకేళిభిర్బద్ధో బంధుభిరంధకారిణివనా భ్యర్ణే కిముభ్రామ్యతి। కాంతఃక్లాంతమనామనాగపిపథి ప్రస్థాతుమేవాక్షమః। స్సాంకేతీకృత మంజువంజుళలతాకుంజేపియన్నాగతః॥ ౪౨॥ అథాగతాం మాధవమంతరేణ సఖీమియం వీక్ష్య విషాదమూకాం। విశంకమానారమితం కయాపి జనార్దనందృష్టవదేతదాహ॥

### చతుర్దాష్టపదీ.

వసంతరాగము॥ ౧॥ స్మరసమరోచిత విరచితవేషా - గళిత
కుసుమదర విలులితకేశా॥ ధ్రువపదం॥ కాపిమధురిపుణా - సహావిహా
రతి యువతిరధికగుణా - కాపిమధురిపుణా॥ ౨॥ హరిపరిరంభణ చలిత
వికారా-కుచకలశోపరి తరళితహారా॥ కాపిమధురిపుణా॥ ౩॥ విచల
దలకలలితాననచంద్రా - తదధరపానరభసకృతతంద్రా॥ కాపిమధు॥
౪॥ చంచలకుండల లలితకపోలా - ముఖరితరశనజ ఘనగతిలోలా॥
కాపిమధు॥ ౫॥ దయితవిలోకిత లజ్జితహసితా-బహువిధకూజిత రతిరస
రసితా॥ కాపిమధు॥ ౬॥ విపులపులకపృథు వేపథుభంగా-శ్వసితనిమీ
లితవికసదనంగా॥ కాపిమధు॥ ౭॥ శ్రమజలకణభర సుభగశరీరా - పరి
పతితోరసి రతిరణధీరా॥ కాపిమధు॥ ౮॥ శ్రీజయదేవ ఫణితహరిచరితం-
కలికలుషం జనయతు పరిశమితం॥ కాపిమధురిపుణా॥

౪౩॥ శ్లో॥ విరహపాండు మురారిముఖాంబుజ ద్యుతిరయంతిర
యన్నపి వేదనాం। విధురతీవతనోతి మనోభువస్సుహృదయే హృదయే
మదనవ్యథామ్॥

### పంచదశాష్టపదీ.

గూర్జరరాగము॥ ౧॥ సముదిత మదనే రమణీవదనే చుంబన
లలితాధరే - విలిఖతితిలకం ప్రవిలసదలకం - మృగమివరజనీకరే॥ ప॥
రమతే యమునాపులినవనే- విజయీమురారిరధునా-రమతేయమునా
పులినవనే॥ ౨॥ ఘనచయరుచిరే రచయతిచికురే - తరళితతరుణాననే-
కురవకకుసుమం - చపలాసుషమం - రతిపతి మృగకాననే॥ రమతే
యమునాపులినవనే॥ ౩॥ ఘటయతి సుఘనే కుచయుగగగనే - మృగ
మదరుచిరూషితే-మణిసరమమలం తారకపటలం - నఖపద శశిభూషి
తే॥ రమతేయమునాపులినవనే॥ ౪॥ జితబిసశకలే మృదుభుజయుగళే-
కరతలనళినీదళే - మరకతవలయం మధుకరనిచయం - వితరతిహిమ
శీతలే॥ ర॥ ౫॥ రతిగృహజఘనే విపులాపఘనే - మనసిజ కనకాసనే-
మణిసరరశనాం తోరణహాసనాం - వికిరతికృతవాసనే॥ రమతే॥ ౬॥
చరణకిసలయే కమలానిలయే- నఖమణిగణభూషితే - బహిరపవరణం
యావాభరణం జనయతిహృదియోజితే॥ రమతే॥ ౭॥ ధ్యాయతిసదృ
శం కామపిసుదృశం- ఖలుహలధరసోదరే - కిమఫలమవశం చిరమిహా

విరసం-వదసఖవిటపోదరే॥ రమతే॥ ౮॥ ఇహరసభణనే కృతహరి గుణనే - మధురిపుపదసేవనే - కలియుగచరితం నవసతు దురితం- కవి నృపజయదేవకే॥ రమతేయమునా పులినవనే॥

౪౪॥ శ్లో॥ నాయాతస్సఖి నిర్దయోయదిశఠ స్త్వం దూతికిందూయసే స్వచ్ఛందం బహువల్లభ స్సరమతే కింతత్ర తేదూషణం। పశ్యాద్యప్రియసంగమాయ దయితస్యా కృష్యమాణంగుణై రుత్కంఠార్తి భరాదివ స్ఫుటమిదం చేతస్స్వయంయాస్యతి॥

షోడశాష్టపదీ.

వరాళిరాగము॥ ౧॥ అనిలతరల కువలయనయనేన - తపతిన సా కిసలయశయనేన॥ ప॥ యారమితావనమాలినా॥ సఖియారమితా వనమాలినా॥ ౨॥ వికసితసరసిజ లలితముఖేన - స్ఫుటతినసా మనసిజ విశిఖేన॥ యారమితా॥ 3॥ అమృతమధుర మృదుతరవచనేన-జ్వలతిన సామలయజరచనేన॥ యారమితా॥ ౪॥ స్థలజలరుహరుచికరచరణేన - లుఠతినసాహిమకరకిరణేన॥ యారమితా॥ ౫॥ సజలజలద సముదయ రుచిరేణ-దళతినసాహృది విరహభరేణ॥ యారమితా॥ ౬॥ కనకనిచయరుచి శుచివసనేన- శ్వసతినసా పరిజనహసనేన॥ యారమితా॥ ౭॥ సకలభువన జనవరతరుణేన-వహతినసారుజ మతికరుణేన॥ యారమితా॥ ౮॥ శ్రీజయదేవ భణితవచనేన - ప్రవిశతుహరిరపి హృదయమనేన॥ యారమితా వనమాలినా॥

౪౫॥ శ్లో॥ మనోభవానందన చందనానిల ప్రసీదహేదక్షిణముంచవామతామ్। క్షణంజగత్ప్రాణనిధాయ మాధవం పురో మమ ప్రాణహరో భవిష్యసి॥ ౪౬॥ బాధాంవిధేహి మలయానిల పంచబాణ ప్రాణాన్ గృహాణ నపునర్గృహమాశ్రయిష్యే। కింతేకృతాంతభగినీక్షమయాతరంగై రంగానిసించ మమశామ్యతు దేహదాహః॥ ౪౭॥ అథ కథమపి యామినీం వినీయ స్మరశరజర్ఝరితాపి సాప్రభాతే।అనునయ వినయం వదంతమగ్రే ప్రణతమపి ప్రియమాహ సాభ్యసూయమ్॥

సప్తదశాష్టపదీ.

భైరవిరాగము॥ ౧॥ రజనిజనితగురు జాగరరాగకషాయితమల సనిమేషం - వహతినయనమనురాగమివస్ఫుట ముదితరసాభినివేశం॥ ప॥ యాహిమాధవ యాహికేశవ మావదకైతవవాదం- తామనుసర

సీరుహలోచన యాతవహరతివిషాదం- యాహిమాధవ యాహికేశవ మావదకైతవవాదం॥ ౨॥ కజ్జలమలిన విలోచనచుంబన విరచితనీలిమ రూపం - దశనవసనమరుణం తవకృష్ణతనోతితనోరనురూపం॥ యాహిమాధవ॥ ౩॥ వపురనుసరతితవస్మరసంగర ఖరనఖరక్షతరేఖం - మరకతశకలకలితకలధౌతలిపేరి వరతిజయారేఖం॥ యాహిమాధవ॥ ౪॥ చరణకమలదళ లక్తకసిక్త మిదంతవ హృదయముదారం-దర్శయ తీవబహిర్మదనద్రుమ నవకిసలయ పరివారం॥ యాహిమాధవ॥ ౫॥ దశనపదంభవ దధరగతంమమ రచయతిచేతసిఖేదం - కథయసికథమధు నాపిమయా సహతవవపురేతదభేదం॥ యాహి॥ ౬॥ బహిరివమలిన తరంతవకృష్ణ మనోపిభవిష్యతినూనం-కథమనువంచయసే జనమనుగత మసమశరజ్వలమానం॥ యాహిమాధవ॥ ౭॥ భ్రమతిభవానబలాకబ ళాయవనేషు కిమత్రవిచిత్రం - ప్రథయతిపూతన కైవవధూవధ నిర్దయ బాలచరిత్రం॥ యాహిమాధవ॥ ౮॥ శ్రీజయదేవభణిత రతివంచిత ఖండి తయువతి విలాపం - శృణుతసుధామధురం విబుధావదతాపిసుఖం దుర వాపం॥ యాహిమాధవ యాహికేశవ॥

౧౭॥ శ్లో॥ మమేదం పశ్యంత్యాః ప్రసరదనురాగం బహిరివ ప్రియాపాదాలక్తచ్ఛురిత మరుణచ్ఛాయహృదయం। మమాద్యప్రఖ్యాతిప్రణయభరభంగేన కితవ త్వదాలోకశ్శోకాదివకిమపి లజ్జాంజనయతి॥
౧౮॥ శ్లో॥ తామథమన్మథఖిన్నాం రతిరసభిన్నాం విషాదసంపన్నామ్। అనుచింతిత హరిచరితాం కలహాంతరితా మువాదరహస్సఖీ॥

## అష్టాదశాష్టపది.

ఘూర్జరీరాగము॥ ౧॥ హరిరభిసరతివహతిమధుపవనే-కిమపరమధికసుఖంసఖిభవనే॥ ప॥ మాధవేరమాడవే- మాకురుమానిని మానమయే॥ మాధవేరవాధవే॥ ౨॥ తాళఫలాదపి గురుమతిసరసం-కిమువిఫలీకురుషే కుచకలశం॥ మాధవే॥ ౩॥ కతినకథితమిద మనుపదమచిరం-మాపరిహరహరిమతిశయరుచిరం॥ మాధవే॥ ౪॥ కిమితివిషీదసి రోదిషి వికలా-విహసతియువతి సభాతవసకలా॥ మాధవే॥ ౫॥ మృదులనళిన దళశీలితశయనే - మరిమవలోకయసఫలయనయనే॥ మాధవే॥ ౬॥ జనయసిమనసి కిమితి గురుఖేదం- శృణుమమ సువచన మవిహితభేదం॥ మాధవే॥ ౭॥ హరిరుపయాతు వదతుబహుమధురం - కిమితికరోషి

హృదయమతివిధురం॥ మాధవే॥ ౮॥ శ్రీజయదేవ ఫణితమతిలలితం - సుఖయతు రసికజనం హరిచరితం॥ మాధవేరమాధవే - మాకురు మానిని మానమయే॥

౫౮॥ శ్లో॥ స్నిగ్ధేయత్పరుషాసి యత్ప్రణమతి స్తబ్ధాసియద్రాగిణి ద్వేషస్థాసి యదున్ముఖే విముఖతాం యాతాసి తస్మిన్ప్రియే। తద్యుక్తం విపరీతకారిణితవ శ్రీఖండచర్చావిషం శీతాంశు స్తపనోహిమం హుతవహః క్రీడాముదా యాతనా॥ ౫౯॥ అత్రాంతరేమసృణరోషవశాదసీ మనిశ్వాసనిస్సహాముఖీం సుముఖీముపేత్య। సవ్రీడమీక్షితసఖీ వదనాందినాంతే సానందగద్గదపదం హరిరిత్యువాచ॥

ఏకోనవింశాష్టపదీ

దేశవరాళిరాగము॥ ౧॥ వదసి యదికించిదపి దంతరుచికౌముదీ హరతుదరతి మిరమతిఘోరం - స్ఫురదధరశీధవేతవ వదనచంద్రమా రోచయతులోచనచకోరం॥ ప॥ ప్రియేచారుశీలే ప్రియేచారుశీలే॥ ౨॥ ముంచమయి మానమనిదానంసపది మదనానలోదహతి మమమానసం - దేహిముఖకమలమధుపానం॥ ప్రియేచారుశీలే ప్రియేచారుశీలే॥ 3॥ సత్యమేవాసియది సుదతిమయికోపినీ- దేహిఖరనఖర శరఘాతం- ఘటయభుజబంధనం జనయరదఖండనం - యేనవాభవతుసుఖజాతం॥ ప్రియేచారుశీలే॥ ౪॥ నీలనళినాభ మపితన్వితవలోచనం ధారయతికోకనదరూపం - కుసుమశరబాణభావేన యదిరంజయతికృష్ణమిదమేతదనురూపం॥ ప్రియేచారుశీలే॥ ౫॥ త్వమసిమమభూషణం త్వమసిమమ జీవనం-త్వమసిమమభవజలధిరత్నం- భవతుభవతీహామయి సతతమనురోధినితత్రమమహృదయమతియత్నం॥ ప్రియే॥ ౬॥ స్ఫురతుకుచకుంభయోరుపరిమణి మంజరీరంజయతు తవహృదయదేశం - రసతురశనాపి తవఘనజఘన మండలే - ఘోషయతు మన్మథనిదేశం॥ ప్రియే॥ ౭॥ స్థలకమలగంజనం మమహృదయరంజనం- జనితరతిరంగపరభాగం- భణమసృణవాణికరవాణి చరణద్వయం - సరసదలత్తకసరాగం॥ ౮॥ స్మరగరళఖండనం మమశిరసిమండనం - దేహిపదపల్లవముదారం - జ్వలతిమయిదారుణో మదనకదనానలో - హరతుతదుపాహితవికారం॥ ప్రియే॥ ౯॥ ఇతి చటులచాటుపటు చారుమురవైరిణా - రాధికామధి వచనజాతం - జయతుపద్మావతీరమణ జయదేవ కవిభారతీ ఫణితమతిగీతం॥ ప్రియేచారుశీలే ప్రియేచారుశీలే॥

౧౨॥ శ్లో॥ పరిహరకృతాతంకే శంకాంత్వయా సతతంఘన స్తన
జఘనయా౽౽క్రాంతే స్వాంతే పరానవకాశిని । విశతివితనోరన్యాధన్యాన
కాపిమమాంతరం స్తనభరపరీరంభారంభే విధేహివిధేయతామ్॥ ౧౩॥
వ్యథయతి వృథామానం తన్వి ప్రపంచయపంచమం తరుణిమధురా
లాపై స్తాపం వినోదయదృష్టిభిః । సుముఖివిముఖీ భావంతావద్విముం
చనముంచమాం స్వయమతిశయస్నిగ్ధో ముగ్ధప్రియోయ ముపస్థితః॥
౧౪॥ ముగ్ధేవిధేహిమయి నిర్దయదంతదంశ దోర్వల్లిబంధనిబిడ స్తనపీ
డనాని । చండత్వమేనముదమంచన పంచబాణచండాలకాండ దళనా
దసవఃప్రయాంతు॥ ౧౫॥ బంధూకద్యుతిబాంధవోయమధరః స్నిగ్ధోమ
ధూకచ్ఛవిః గండేచండిచకాస్తినీలనళిన శ్రీమోచనం లోచనం । నాసా
న్వేతితిలప్రసూనపదవీం కుందాభదంతిప్రియే ప్రాయస్త్వన్ముఖ సేవ
యావిజయతే విశ్వంసపుష్పాయుధః॥ ౧౬॥ దృశౌతవమదాలసే వదని
మిందుమత్యుజ్జ్వలం గతిర్జనమనోరమా విధుతరంభ మూరుద్వయం ।
రతి స్తవకళావతీ రుచిరచిత్ర రేఖేభ్రువా వహో విబుధయౌవతం వహ
సిత్వం పృథ్వీంగతా॥ ౧౭॥ సుచిరమనునయేన ప్రీణయిత్వామృగాక్షీం
గతవతికృతవేషే కేశవేకుంజశయ్యామ్ । రచితరుచిరభూషాదృష్టిమో
షేప్రదోషే స్ఫురతి నిరవసాదాం కాపి రాధాం జగాద॥

వింశాష్టపదీ ప్రారంభః

మోహనవసంతరాగము॥ ౧॥ విరచిత చాటువచనరచనం
చరణేరచితప్రణిపాతం - సంప్రతి మంజుళవంజుళ సీమని కేళిశయన
ముపయాతం॥ ప॥ ముగ్ధేమధుమథనం - అనుగతమనుసరరాధే -
ముగ్ధేమధుమథనం॥ ౨॥ ఘనజఘన స్తనభారభరే దర మందగ చరణవి
హారం - ముఖరితమణిమంజీరముపైహివిధేహిమరాళవికారం॥ ముగ్ధే॥
౩॥ శృణురమణీయతరం తరుణీ జనమోహన మధుపవిరావం - కుసు
మశరాసన శాసనవందిని పికనికరేభజభావం॥ ముగ్ధే॥ ౪॥ అనిలతరళ
కిసలయనికరేణకరేణలతానికురుంబం - ప్రేరణమివ కరభోరుకరోతి
గతిం ప్రతిముంచవిలంబం॥ ముగ్ధే॥ ౫॥ స్ఫురితమనంగ తరంగవశాదివ
సూచితహరిపరిరంభం - పృచ్ఛ మనోహరహార విమలజలధార మముం
కుచకుంభం॥ ముగ్ధే॥ ౬॥ అధిగత మఖిల సఖీభిరిదంతవవపురపిరతిరణ
సజ్జం - చండిరసితరశనారవడిండిమమభిసరసరసమలజ్జం॥ ముగ్ధే॥ ౭॥
స్మరశరసుభగనఖేన సఖీమవలంబ్యకరేణసలీలం - చలవలయక్వణితై

రధిబోధయ హరిమపినిజగతిశీలం॥ ముగ్ధే॥ ౮॥ శ్రీజయదేవఫణితమధరీకృతహారముదాసితవామం - హరివినిహితమనసామధితిష్ఠతు కంఠతటీమవిరామం॥ ముగ్ధే॥

౯॥ శ్లో॥ అక్ష్ణోర్నిక్షిపదాంజనం శ్రవణయో స్తాపింఛ గుచ్ఛావళిం మూర్ధ్ని శ్యామసరోజదామకుచయోః కస్తూరికాపత్రకమ్। ధూర్తానామభిసారసత్వరహృదాం విష్వఙ్నికుంజే సఖి ధ్వాంతంనీలనిచోళచారుసుదృశాం ప్రత్యంగమాలింగతి॥ ౧౦॥ కాశ్మీరగౌరవపుషామభిసారికాణామాబద్ధరేఖ మభితో రుచిమంజరీభిః। ఏతత్తమాలదళనీలతమం తమిస్రం తత్ప్రేమహేమనికషోపలతాం ప్రయాతి॥ ౧౦॥ హారావళీతరళకాంచన కాంచి దామ మంజీరకంకణ మణిద్యుతిదీపితస్య। ద్వారేనికుంజనిలయస్యహరింనిరీక్ష్య వ్రీడావతీమథసఖి మియ మిత్యువాచ॥

ఏకవింశాష్టపదీ.

బంగాళవరాళి రాగము॥ ౧॥ మంజుతరకుంజతలకేళిసదనే ఇహవిలసరతిరభసహసితవదనే॥ ప్రవిశ రాధే మాధవసమీపం॥ ౨॥ నవభవదశోకదళశయనసారే - ఇహవిలసకుచకలశతరళహారే॥ ప్రవి॥ ౩॥ కుసుమచయరచిత శుచివాసగేహే - ఇహవిలసకుసుమ సుకుమారదేహే॥ ప్రవిశ॥ ౪॥ చలమలయపవన ఘనసురభిశీతే - ఇహవిలసవిలసదళిలలితగీతే॥ ప్రవిశ॥ ౫॥ మధుతరళపికనికరనినదముఖరే - ఇహవిలసదశనరుచిరుచిరశిఖరే॥ ప్ర॥ ౬॥ వితతిబహువల్లి నవపల్లవఘనే - ఇహవిలసపీనకుచకుంభజఘనే॥ ప్రవిశ॥ ౭॥ మధుముదితమధుపకులకలితరావే - ఇహవిలసమదనశరరభసభావే॥ ప్ర॥ ౮॥ విహితపద్మావతీసుఖసమాజే - ఫణతిజయదేవకవిరాజరాజే॥ ప్రవిశ రాధేమాధవ॥

౧౧॥ శ్లో॥ త్వాంచిత్తేన చిరంవహన్నయమతిశ్రాంతో భృశంతాపితః। కందర్పేణతు పాతుమిచ్ఛతిసుధాసంబోధబింబాధరమ్। అస్యాంకంసమలం కురుక్షణమిహభ్రూక్షేపలక్ష్మీలవక్రీతే దాసజనోపసేవితపదాంభోజేకుతస్సంభ్రమః॥ ౧౨॥ సాససాధ్వససానందం గోవిందేలోలలోచనా। శింజానమంజుమంజీరం ప్రవివేశనివేశనమ్॥

ద్వావింశాష్టపదీ.

మాళవరాగము॥ ౧॥ రాధావదన విలోకన విలసిత వివిధవికారవిభంగం - జలనిధిమివవిధు మండలదర్శన తరళితతుంగతరంగం॥

ప॥ హరిమేకరసంచిరమభిలషితవిలాసం - సాదదర్శగురుహర్షవశం
వద వదనమనంగవికాసం - హరిమేకరసంచిర మభిలషితవిలాసం॥ ౨॥
హారమమలతర తారమురసిదధతంపరిరభ్యవిదూరం - స్ఫుటతరఫేన
కదంబకరంబిత మివయమునాజలపూరం॥ హరిమేకరసం॥ ౩॥ శ్యామల
మృదులకళేబరమండన మధిగతగౌరదుకూలం - నీలనలినమివపీతపరాగ
పటలభరవలయితమూలం॥ హరి॥ ౪॥ తరళదృగంచల చలనమనోహర
వదనజనితరతిరాగం - స్ఫుటకమలోదర ఖేలితఖంజన యుగమివశరది
తటాగం॥ హరిమేకరసం॥ ౫॥ వదనకమలపరిశీలన మిళితమిహిరసమ
కుండలశోభం - స్మితరుచిరుచిర సముజ్జ్వలితాధర పల్లవకృతరతిలో
భం॥ హరిమేకరసం॥ ౬॥ శశికిరణచ్ఛురితోదర జలధరసుందర కుసు
మసుకేశం - తిమిరోదితవిధు మండలనిర్మల మలయజతిలకనివేశం॥ హరి
మేకరసం॥ ౭॥ విపులపులకదర దంతురితంరతికేళి కళాభిరధీరం - మణి
గణకిరణ సమూహసముజ్జ్వల భూషణసుభగశరీరం॥ హరి॥ ౮॥ శ్రీజయ
దేవభణితవిభవం ద్విగుణీకృతభూషణభారం - ప్రణమతహృదివినిధాయ
హరింసుచిరం సుకృతోదయసారం॥ హరిమేకరసం॥

౬౩॥ శ్లో॥ అతిక్రమ్యాపాంగం శ్రవణపథపర్యంత గమనప్రయా
సేనేవాక్ష్ణోస్తరళతరభావంగమితయోః। ఇదానీంరాధాయాః ప్రియ
తమసమాలోక సమయే పపాతస్వేదాంబు ప్రసరఇవహర్షాశ్రునికరః॥
౬౪॥ భజంత్యాస్తల్పాంతం కృతకపటకండూతివిహిత స్మితంయాతే గే
హాద్బహిరపిహితాళీ పరిజనే। ప్రియాస్యంపశ్యంత్యాః స్మరశరసమా
కూతసుభగం సలజ్జాలజ్జానైగమదివసుదూరం మృగదృశః॥

౬౫॥ శ్లో॥ గతవతిసఖీబృందే మందత్రపాభరనిర్భరస్మరశరవ
శాకూతస్ఫీతస్మితస్నపితాధరామ్। సరసమలసందృష్ట్వా హృష్టాం
ముహుర్నవపల్లవప్రసవశయనే నిక్షిప్తాక్షీమువాచ హరిః ప్రియామ్॥

త్రయోవింశాష్టపది

నాథనామక్రియ రాగము॥ ౧॥ కిసలయశయన తలేకురు
కామిని చరణనళినవినివేశం - తవపదపల్లవ వైరిపరాభవ మిదమను
భవతుసువేశం॥ ప॥ క్షణమధునానారాయణం-అనుగతమనుభజరాధే-
క్షణమధునానారాయణం॥ ౨॥ కరకమలేన కరోమిచరణమహ మాగమి
తాసివిదూరం - క్షణముపకురుశయనోపరిమామివనూపురమనుగతి

శూరం॥ క్షణమధునా॥ ౩॥ వదనసుధానిధి గళితమమృతమివ రచయ వచనమనుకూలం-విరహమివాపనయామి పయోధర రోధకమురసి దుకూలం॥ క్షణమధునా॥ ౪॥ ప్రియపరిరంభణ రభసరభసమివ పులకితమతిదురవాపం - మదురసికుచకలశం వినివేశయ శోషయ మనసిజతాపం॥ క్షణమధునా॥ ౫॥ అధరసుధారసముపనయ భామిని జీవయమృతమివదాసం-త్వయివినిహితమనసం విరహానలదగ్ధవపుషమవిలాసం॥ క్షణమధునా॥ ౬॥ శశిముఖిముఖరయ మణిరశనాగుణ మనుగుణకంఠనినాదం-శ్రుతియుగళేపికరుతవికలే మమ శమయ చిరాదవసాదం॥ క్షణ॥ ౭॥ మామతివిఫల రుషావికలీకృత మవలోకితమధునేదం - మీలతిలజ్జితమివనయనం తవ విరమవిసృజగతి ఖేదం॥ క్షణమధునా॥ ౮॥ శ్రీజయదేవ ఫణితమిదమనుపదనిగదితమధురిపుమోదం - జనయతురసికజనేషుమనోరమ రతిరసభావవినోదం॥ క్షణమధునారాయణం- అనుగతమనుభజరాధే॥

౬౬॥ శ్లో॥ ప్రత్యూహః పులకాంకురేణ నిబిడాశ్లేషే నిమేషేణచ క్రీడాకూతవిలోకనే ఽధరసుధాపానే కథానర్మభిః। ఆనందాధిగమేన మన్మథకళా యుద్ధేపియస్మిన్నభూ దుద్భూతస్స తయోర్బభూవ రమితారంభః ప్రియంభావుకః॥ ౬౭॥ దోర్భ్యాం సంయమితః పయోధరభరేణాపీడితః పాణిజై రావిద్ధో దశనైః క్షతాధరపుటః శ్రోణీతటేనాహతః। హస్తేనానమితః కచేఽధరసుధాస్యందేన సమ్మోహితః కాంతః కామపితృప్తి మాపతదహో కామస్య వామాగతిః॥ ౬౮॥ మారాంకే రతికేళి సంకులరణారంభే తయా సాహస ప్రాయం కాంతజయాయ కించిదుపరి ప్రారంభి యత్సంభ్రమాత్। నిష్పందాజఘనస్థలీ శిథిలితా దోర్వల్లిరుత్కంపితం వక్షోమీలితమక్షి పౌరుషరసః స్త్రీణాం కుతస్సిద్ధ్యతి॥ ౬౯॥ తస్యాః పాటలపాణిజాంకితమురో నిద్రాకషాయే దృశౌ నిర్ధౌతో ధరశోణిమా విలులితాః స్రస్తాః స్రజో మూర్ధజాః। కాంచీదామదరశ్లథాంచలమితి ప్రాతర్నిఖాతైర్దృశో రేభిః కామశరై స్తదద్భుతమహో పత్యుర్మనః కీలితమ్॥ ౭౦॥ అథకాంతం రతిక్లాంత మపి మండనవాంఛయా। జగాద మాధవం రాధా ముగ్ధా స్వాధీనభర్తృకా॥

చతుర్వింశాష్టపదీ.

రామక్రియారాగము॥ ౧॥ కురుయదునందన చందనశిశిరతరేణ కరేణపయోధరే - మృగమదపత్రక మత్రమనోభవ మంగళ

కలశ సహోదరే॥ ౧॥ నిజగాదసాయదునందనే - క్రీడతిహృదయానందనే - నిజగాదసాయదునందనే॥ ౨॥ అళికులగంజన మంజనకం రతినాయకసాయకమోచనే - త్వదధరచుంబన లంభితకర్బుర ముజ్జ్వలయ ప్రియలోచనే॥ నిజగాదసాయదు॥ 3॥ నయనకురంగతరంగ వికాస నిరాసకరే శ్రుతిమండలే - మనసిజపాశ విలాసధరేశుభ వేషనివేశయ కుండలే॥ నిజగాద॥ ౪॥ భ్రమరచయం రచయంతముపరి రుచిరం సుచిరంమమసమ్ముఖే - జితకమలేవిమలే పరికర్మయనర్మజనకమలకంముఖే॥ నిజగాద॥ ౫॥ మృగమదరసవలితంలలితం కురుతిలకమలికరజనీకరే - విహితకళంకకళంకమలానన విశ్రమితశ్రమశీకరే॥ నిజగాద॥ ౬॥ మమ రుచిరేచికురేకురుమానద మానసజధ్వజచామరే - రతిగళితేలుళితే కుసుమానిశిఖండిశిఖండకడామరే॥ నిజగాద॥ ౭॥ సరసఘనేజఘనే మమ శంబరదారణ వారణకంధరే - మణిరశనావసనాభరణానిశుభాశయవాసయసుందరే॥ ని॥ ౮॥ శ్రీజయదేవసుకవివచనేహృదయం సదయం కురుమండనే - హరిచరణస్మరణామృతకృతకలుష జ్వరసంజ్వరఖండనే॥ నిజగాదసాయదునందనే॥

౨౧॥ శ్లో॥ రచయకుచయో శ్చిత్రం పత్రం కురుష్వకపోలయోర్ఘటయజఘనే కాంచీ మంచస్రజంకబరీభరే। కలయవలయశ్రేణీం పాణౌపదే కురునూపురావితినిగదితః ప్రీతః పీతాంబరోపి తథాకరోత్॥ ౨౨॥ యద్గాంధర్వకళాసుకౌశలమనుధ్యాతంచ యద్వైష్ణవం యచ్ఛృంగార వివేకతత్త్వ మపి యత్కావ్యేషు లీలాయుతం। తత్సర్వంజయదేవపండితకవేః కృష్ణైకతానాత్మనస్సానందాః పరిశోధయంతు సుధియశ్శ్రీగీతగోవిందతః॥

శ్రీ జయదేవకృత గీతాగోవిందాష్టపదులు సంపూర్ణము.

---

రాధా! ఇపుడు నీపై మోహితుండై కృష్ణపరమాత్మ వ్యాకులచిత్తంబుతో పరుండియున్నవాడు, నీవీ సమయంబున గోపాలుని మోహంబు దీర్చి వేగిరముగా నిందరు దెంచి దీనులగు మమ్ముల రక్షింపుము యని ప్రార్థింపుచుండెను అంత వైకుంఠవాసుడు నాభక్తుండింక నేమి బాధనో యని పరమపదంబును విడిచి రాధాసమేతుడై జయదేవులమందిరంబున కేతెంచి ప్రసన్నుండై నిలిచియుండెను. అంత

సురులు పుష్పవర్షంబులు గురిపించిరి. నారదాదిమునీశ్వరులు వీణెలు మీటుచు గానంబు జేయుచుండిరి. సురులు సిద్ధులు భక్తులు అందేతెంచిరి. నృపతి అమందానందహృదయారవిందుండై రాధామాధవుల సందర్శించి కరంబులు జోడించి ప్రదక్షిణ నమస్కారంబులు జేసి నిలుచుండెను. జయదేవులు ప్రదక్షిణనమస్కారములు జేసి నిలుచుండగా శ్రీమన్నారాయణుండు దయారసపూరితములైన విలోకనములవీక్షించి జయదేవుల దేహం బెల్లయు నిమురుచుదువ్వి పుణ్యపురుషా! నీవలె జీవకారుణ్యవ్రతము సాధించువారు మరొకరు గాన్పింపరు. మహాత్మా! నీవు నన్నుద్దేశించి ప్రార్థించిన కారణంబేమి, నీ కోరికలేమిటో నెఱింగింపుము నా సంగెద నని భగవంతుం డానతిచ్చెను అంత జయదేవులు ఓపుండరీకాక్షా! పురాణ పురుషోత్తమా! పాపినగు నేను అప్రమేయంబగు తమయానందవిగ్రహంబును సందర్శించిన పిదప కోరదగిన వరం బొందుగలదా? కరుణాసముద్రా! సంతతము చిత్తశుద్ధికొఱకు నీదివ్యమంగళవిగ్రహ మొక్కటే స్మరించదగి యున్నది, భోగ్యప్రదం బగు సర్వరాజ్యంబున కభిషిక్తుండైన వానికినయితము నీవు మాత్రమే కోరదగియున్నావు గావున మిమ్ముల నేకార్యంబు నుద్దేశించి ప్రార్థించితినో యాకార్యంబు నీడేర్చి పిదప యీ రాజును నన్నును రక్షింపుము లోకేశా యని వేడుకొనెను. అంత పరమేశ్వరుండు ఓ సుశీలుడా! నీకసాధ్యం బగు కార్యం బొందుగలదా, నీవు దలంచిన పద్మావతి జీవించక మానునా? తానను యహంకారంబును జూపరాదనిగదా నన్నింతగా ప్రార్థించితివి. ఓయి జీవన్ముక్తుడా! అజ్ఞానాంధకారమున జిక్కువడి దారిగానక త్రిప్పలు బడుచున్న జీవులను రక్షించునిమిత్తము వ్యాసాంశంబున అవతరించిన పరమతపోధనుండవు నీవు. నిజన్మము పవిత్రమైనది. భగవద్భక్తులకు ముఖ్యముగా నుండవలసిన సత్యశౌచాదులును శమదమాదులును జపతపంబులును జ్ఞానవైరాగ్యంబులు భక్తిశ్రద్ధలు మున్నగు సుగుణసంపదల కునికిపట్టయి ఆశ యను శత్రువును దునుమాడి బ్రహ్మానందసాగరంబున నోలలాడుచున్న నిన్ను స్తుతింపుట కెట్టివారికైన నలవియగునా? భక్తశిఖామణీ నీచరిత్రము స్తుతిపాత్రము యని జయదేవులను కొనియాడి, జయదేవా! పద్మావతిని బ్రతికించుదునా? ఈ రాజునకు చిరంజీవత్వము నొసంగుదునా? ఏమి కావలెననెదవో వేగిరముగా నెఱింగింపుము యని జయదేవులకు జెప్ప

చుండగా విని నరేంద్రుడు భక్తవత్సలా, భవబంధవిమోచనా, కామి
తార్థప్రదా, రాధా మనఃప్రియా, సచ్చిదానందరూపా నీప్రభావ
మును వర్ణింప నెంతవాడను, నా తల్లియగు పద్మావతిని బ్రతికించుటే
మాకు సర్వైశ్వర్యంబు లొసంగిన ట్లని నమస్కరించెను. అంత
మాయావిలాసుడు మృతశరీరయై యున్న పద్మావతినిం గాంచి దేవీ పద్మా
వతీ ! కొఱకు నేను వచ్చి చాల తడవాయెను, నీ వింకయు నిద్రించు
చుండ నగునా లేలెమ్ము లెమ్ము యని జెప్పుచుండగా శ్రీకృష్ణమూర్తి
నోటినుండి జ్యోతి యొకటి బయలువడి యెల్లరును జూచుచుండగా పద్మా
వతి శరీరంబున బ్రవేశించెను. అంత నిద్రనుండి మేల్కనుదానివలె పద్మా
వతి లేచి హా ప్రాణనాయకా యని పూర్వస్మృతితో తనయెదుట సర్వాం
గసంపూర్ణుడై బ్రహ్మానందముఖవిలాసంబుతో ప్రకాశింపుచున్న తన
విభునిగాంచి ఆనందకందళితహృదయారవిందయై ప్రదక్షిణంబుగా బ్రణ
మిల్లి చెంతనున్న లక్ష్మీనారాయణులకు ప్రదక్షిణనమస్కారంబులు
జేసి అందున్న సమస్తదేవఋషులను కొనియాడి జయదేవుల చెంత
నిలుచుండెను. అంత భగవంతుడు జయదేవులను పద్మావతిని క్రౌంచ
రాజును గాంచి మీరుమువ్వురు బ్రహ్మజ్ఞానానుష్ఠానపరులై ఆనందం
బుగా సుఖజీవితులై వర్ధిల్లుగు రని ఆశీర్వదించి జయదేవులం గాంచి
ఓయి మహానుభావా నీవు నేర్చినవిద్యను నీవుమాత్ర మనుభవించుట
యుక్తముగాదు లోకోపకారార్థము భక్తిమార్గమును ముక్తిమార్గ
మును జెప్పి కొన్నిగ్రంథములు రచించి వెల్లడిజేసి జీవులకు బోధించి
యంత్యంబున నాపదవిని జేరు మని యాజ్ఞ యొసంగి సకలసురముని
సమేతుడై తిరోహితుం డయ్యెను. సురలు పుష్పవర్షంబు గురిపించిరి,
ఋషులు సిద్ధులు జయవిజయీభవ యని కొనియాడి యంతర్ధాన ము
ఋరి. అనంతరము క్రౌంచరాజు పద్మావతికి నమస్కరించి తల్లీ
నీకృపాకటాక్షంబువల్లగదా తాపసులకు సహితము దుర్లభం బైన
భగవద్దర్శనంబు మాకు సులభముగా సిద్ధించెను. నీకృప లేకున్న
మూర్ఖుడ నగు నాకు నారదాదిమునీశ్వరులసేవ లభించదుగదా పర
మేశ్వరీ మిమ్ముల గల్పితవాక్యంబుచే వంచించిన దురాత్మురాలగు నా
సతిని యేమియొనర్పవలెనో సెలవొసంగుము యని ప్రార్థించెను. అంత
నా పద్మావతి, ఓయి నరేంద్రా! నీసతికృపవల్లనేగదా నాపతికి కాలు
సేతు లవలీలం గలిగినవి. భగవద్దర్శనంబునకును నారదాదిమునీశ్వ

రులసేవ లభించినందులకు కారణము యీపరమపవిత్రురా లగు నీ సతి యని యెరుంగుము యని రాజసతిని తన చెంతకు బిలిచి మిగుల గారాబంబుతో ప్రియోక్తులాడి యన్యోన్యమైత్రి సలుపుచుండెను. నృపతియు జయదేవులపాదంబులకు నమస్కరించి ముద్దిడి దేవా! అతిసుందరంబైన తమదివ్యపాదంబు లిదివఱకెందు దాచియుంటిరి. ఇపు డనాయాసంబుగా జేరిగివచ్చినచోద్యంబున కేమని కొనియాడుదు నని స్తుతించి యానందరసావేశంబువలన తన్ను మఱచియుండెను. అనంతరము జయదేవులు భగవదాజ్ఞప్రకారము భక్తివిలాసములును బ్రహ్మజ్ఞానంబును జేర్చి నూతనముగా భాగవతంబు దేవభాషయందు రచింపుచుండెను.

యెనిమిదవ యధ్యాయము ముగిసెను.

---

# తొమ్మిదవ అధ్యాయము.

శ్రీజయదేవులు పాడిన నూతనభాగవతంబును భగవంతుండు బ్రాహ్మణరూపంబున వచ్చి సంతకంబు జేయుట.

వినండి సిద్ధులారా! జయదేవులు పాడుచున్న భాగవతంబు సంపూర్ణంబైన పిదప నొకనాడు రాజసమ్ముఖంబున సకలపండితసాధుజనపూరితంబై యొప్పుచున్న సమయంబున జయదేవులు భాగవతంబు దీసుకొని పాదచారియై ఆస్థానమంటపంబు జొచ్చెను. ఆర్యులరాక నెఱింగి నృపతి సింహాసనంబుడిగ్గి, గురువరా! తమమృదుపాదంబులు శ్రమనొందునట్లు పాదచారులై దాసుని సభాస్థలికి విచ్చేయుటకు కారణం బేమి, దాసునివలన నేకార్యంబు నుద్దేశించివచ్చితిరి యని నుచితాసనంబున గూర్చుండ నియోగించి ప్రార్థించెను. అంత జయదేవులు ఓయిరాజా! భగవదాజ్ఞప్రకారము నూతనభాగవతంబు రచించితి గాన యగ్రంథానిని పరిశీలించుటకు సభయందు దెవరేని పండితు లుందు రని యిందరు దెంచితి నని జెప్పుచుండగా నచ్చటికి శ్రీమహావిష్ణువు దనకు జయదేవులపై నున్న యనురాగంబును బయలుపఱచదలంచి అన్యదేశీయుని వలె బ్రాహ్మణరూపంబుగా సభలోనికివచ్చి, రాజా! నీకు శుభమంగళ

ములు కలుగుగాత యని యాశీర్వదించగా నారాజు మిక్కిలి వినయపూర్వకముగా నుచితాసనంబున గూర్చుండ నియోగించి యామాయాబ్రాహ్మణుని ముఖవిలాసంబును యాతని మృదుమధురగంభీరభాషణంబులను యాజానుబాహుత్వంబును గాంచి యచ్చట నున్న రాజును సభికులును యీతఁ డెవ్వఁడో మహానుభావుండని నిమీలననేత్రులై చూచుచుండిరి. అంత నారాజు విప్రునకు నమస్కరించి స్వామీ తమ దేశమెద్ది? ఎందుండి వచ్చితిరి? తామిచటికి వచ్చిన పనియేమి? తమకు వలయు కార్యం బెద్ది? సెలవొసంగు డని సవినయముగా బ్రార్థించెను. అంత మాయాబ్రాహ్మణుండు, ఓయి రాజేశ్వరా! నేను గోకులబృందావనంబున నుండువాడను, నానామంబు లక్ష్మీనారాయణుఁ డందురు, నేను ముల్లోకంబుల సంచరించుచుందును, నాజీవితం బంతయు వ్యాకరణభాషయందు గడుపుచు సమస్తవిద్యలలో గొప్పవాడ నని సకలవిద్యలయందును పేరంది యచ్చటచ్చట పండితులతో వాదించి జయమందుచు సర్వజ్ఞుడని బిరుద వహించి నాతో సమానం బగు పండితులెవరేని లోకంబున గలరా యని దేశంబెల్లయు దిరుగుచు మీపట్టణంబునకువచ్చి విచారించగా జయదేవులనెడి విద్వాంసుఁడున్నాడనియు, అతను నాతో సమానంబుగా వాదించ సమర్థుం డనియు విని యామహాత్ముని సందర్శింపగోరి యిందు వచ్చితి నని నుడివెను. అది విని జయదేవులు సింహాసనమునుండి చివాలున లేచి బ్రాహ్మణునిపాదంబులకు బ్రణామం బాచరించి, స్వామీ! నేను పండితుడను గాను, తమకు దాసత్వంబునకుగూడ యోగ్యత లేనివాడను, మహాత్మా! కరుణింపు మని మందలించెను అందుకు మాయాబ్రాహ్మణుండు జయదేవుల నాపాదమస్తకపర్యంతము నెగాదిగా జూచి, ఓరీ నీవేనా జయదేవుఁడు, ఇహభోగార్థంబైన సతిని బ్రతికించుటకు అష్టకష్టలు బాడిన జీవన్ముక్తుఁడవు నీవేనా, సతిమరణంబునకు దుఃఖించి పైబడి రోదనంబు జేసిన విరాగివి నీవే కాబోలు, ఔరా! నీబోటి మేటిసాధువులు భూమండలంబున నెవరు గాన్పింపగలరు, బ్రహ్మజ్ఞాని వని ప్రచండవిద్వాంసుడ వని మూర్ఖు లగు ప్రజలును నీ రాజును పేరుబెట్టినమాత్రంబున పండితుడ వగుదువా, ఇదొ యొకక్షణంబులో నీపాండిత్యంబును వాగ్గ్రంథణమును జూచెదను యని నుద్దండంబుగా బలికెను. ఆవితండ వాక్యంబులకు జయదేవుడు వెఱగంది

స్వామీ యెందుకింత వేగిరపడెదరు. మూర్ఖుడగు నేను హాఃఓం యనుటకు యర్థం బెఱుంగనివాడను, వ్యాకరణాదులు మున్నగునవి జదివినవాడను గాను, గజముఖకాంతన్యాయంబుగా నున్న నన్ను నెదురించి బలుకుట ధర్మముగాదు, యే మెఱుంగని మూర్ఖుడనగు నాతో తాము వాదించ బూనుకొనుటవలన కించిత్తోషదప్పు మతేమియు బ్రయోజనంబు గాన బోదు గావున నన్ను క్షమింపుము స్వామి యని మిక్కిలి దైన్యత్వంబుగా బ్రార్థించుకొనెను.

అంత నా కపటబ్రాహ్మణుండు కోపోద్దీపితుండై ఓరీ జయదేవా! పూర్వము కుమారస్వామి చతుర్ముఖుని అకార ఉకార మకారంబులు గూడిన ఓంకారంబున కర్థం బడిగి చెప్పనందున బ్రహ్మను శిక్షించి తనతండ్రి యగు శివునకు బ్రణవార్థంబు బోధించి పితార్యుం డని పేరొందినట్లు గదా నీవు నన్ను హాః ఓం యను బ్రణవార్థం బడిగి జయించవలె నని దలంచితివి, మొట్టమొదట మంచిపుట్టమునే దెచ్చిపెట్టితివి, భళిరా నీ సమర్థతను చూపకనే జూపితివి, బ్రణవార్థం బెఱింగినవాడు వేదాగమశాస్త్రంబులు జదువుటవలన నవసరము లేదు. బ్రణవార్థంబెఱింగిన వానిని జయించుట కెంతటివానికైనను సాధ్యంబగునా, వాని నెదిరించి నుత్తరము జెప్పుట దుస్తరము ఓరీ జయదేవా యిట్లనేకవిద్వాంసులను బ్రశ్నించి యోడించితివి, ఈ రాజసంస్థానంబున నీవే పండితుండ వని బ్రతిష్ఠ నొందితివి. మూర్ఖులలో నన్నొకనిగా జేర్చితివి, హాః ఓం యను వాక్యంబును యడిగితివి నాకు కోపాగ్ని నరగిలించితివి జూతము కానిమ్ము నన్ను జయించెద నని చేయి వేయుము లేకున్న నీ శిరంబును గోసియిమ్ము నిన్నూరకె విడుచువాడ నని దలపకుము యని రోమములు దద్దరింపుచు భుజంబు లదరుచు జయదేవుల కరంబుల బట్టి యీడ్చి యాగడంబు జేయ సాగెను. అంత జయదేవుం డకటా యిదేమి విపరీతముగా నున్నది. హాః ఓం యనుట కర్థంబు నేనెఱుంగ నని జెప్పగా నీ విప్రుండు వృధాగ్రహ మొందుచున్నాడు గూయనతో నేది మాట్లాడినను నేరముగానే యుండును కాబట్టి మౌనేన కలహం నాస్తి యను నట్లు నేదియు బలుకక నూరకుండుటే యుచితం బని మౌనముగా నిలుచుండెను. అదెఱింగి యా విప్రుండు ఓరీ జయదేవా! దుర్జనుని జూచి దూరముగా నుండుతానివలె సభలో వారు నన్ను దుర్జనుం డనుకొనుటకు గాబోలు దూరముగా నిలిచి

మానముగా నున్నావు, వంచకులలో ప్రథమగణ్యుడ వగుటకు నీవే దగియున్నావు, ఇట్టి కపటంబువల్లనా నన్ను జయింతువు, నీవు దూరముగా దొలగియున్నను లేక నన్ను జయించువాడవైనను నిన్ను విడచి జనువాడను గాను, నిన్ను పరీక్షించక మానను, ఇదో నీవు ప్రశ్నించి నట్టి శ్రవణంబున కర్థంబు జెప్పెద వినుమని సభవారివంక జూచి, సభ్యులారా వినుండు యని ప్రణవార్థంబు జెప్ప నారంభించి హరి ర్హరతి పాపాని యనునట్లు భాగవతులపాపం బెల్లయు హరించెడు భగవంతుడే హరి యని జెప్పం దగును. అట్టి భగవంతునియందు నవవిధ భక్తులు సలిపి భగవజ్జాయమానకటాక్షంబు వడసి తద్వారా చిత్తాశ్రయంబై యుండు కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యంబు లను యరిషడ్వర్గంబుల వీడి శాంతాదిగుణంబులు గలవారై నిత్యానిత్యవస్తు వివేకము, ఇహాముత్రార్థఫలభోగవిరాగము శమాదిషట్కసంపత్తి, ముముక్షుత్వము యని జెప్పంబడెడి సాధనచతుష్టయసంపత్తి గలిగి యందలి నిత్యానిత్యవస్తువివేక మనునది బ్రహ్మ సత్యం జగన్మిథ్య యనునట్లు కానంబడుచున్న ప్రపంచం బెల్ల నశించున దనియు తత్సాక్షియగు బ్రహ్మము సత్య మనియు తెలియుట. ఇహాముత్రార్థఫల భోగవిరాగ మనగా ఇహవిషయములందును పరవిషయములందును అనగా స్రక్చందన వనితాదిభోగములందును వమనాన్న మలమూత్రాదులవలె జూచుచు నిరాశియై యుండుట. శమాదిషట్కసంపత్తి యనగా శమము దమము ఉపరతి తితీక్ష శ్రద్ధ సమాధానము అందు శమ మనగా అంతరేంద్రియనిగ్రహము, దమ మనగా బాహ్యేంద్రియ నిగ్రహము, ఉపరతి యనగా మనస్సున జనించెడు సర్వసంకల్పములను యాత్మయందు మరల్చుట, తితీక్ష యనగా సుఖదుఃఖములను మానావమానములను క్షుత్పిపాసలును శోకమోహములను భేదముగా జూడక సమముగా దలచుట, శ్రద్ధ యనగా వేదాంతశాస్త్రమునందును తనయొద్దకు ఆకలి బోగొట్టుకొనుటకు వచ్చెడు యతిథియందును శ్రద్ధ గలిగి యుండుట, సమాధాన మనగా గురువులు జెప్పెడు వేదాంత వాక్యములను శాస్త్రంబులయందు జూచి అనుభవయుక్తంబుగా సమాధానపడుటే సమాధానము. ముముక్షుత్వమనగా ద్వివిధంబు, అందు మంద మని తీవ్ర మని జెప్పుదురు. మంద మనునది యుచితకాలంబున తాను జేయవలసిన సాధనంబుల జేయక సద్గురు నాశ్రయించి ఆత్మాను

భవంబు దెలియక యెపుడేని తటస్థించినపుడు జేయుద మని దలంచు చుండుట, తీవ్రేచ్ఛయనగా బోయవాని వలలో జిక్కుపడిన లేడి దప్పించుకొనుటకు సమయము వేచియుండి యేదేని యుపాయంబుచే పురిదప్పి బయలువెళ్లినపుడు యద్దానిమనం బెట్లుండునో యట్టివలె సంసారం బను వలలో జిక్కుపడిన పురుషుడు వైరాగ్యమును జెంది విషయంబులనుండి విడివడి లేడివిధంబుగా సంతసహృదయుడై ఫల పుష్పంబుల గొని గురుసాన్నిధ్యంబు జేరి ప్రదక్షిణ నమస్కారం బులు సలిపి గురునియనుగ్రహము వడసిన మోక్షాధికారికి దిగువ వివరించెడు ప్రణవార్థంబు గోచరం బగును, తీవ్రమోక్షేచ్ఛ లేని వానికి ప్రణవార్థంబు దెలియనేరదు. ఇందుకు కారణము మొట్ట మొదట ఈశ్వరభక్తి తద్వారా ఈశ్వరానుగ్రహము తన్మూలముగా దుర్గుణరహితము సద్గుణసంపత్తి తదనంతరము మోక్షేచ్ఛ పిదప ప్రణవార్థశ్రవణాధికారము గలుగు నని దెలియుము. ఓం యనునది అకార ఉకార మకార అర్ధమాత్రయు జేరి యాభగవంతుడే ఓంకారం బగును. ఈ ప్రణవార్థము పరిపూర్ణబ్రహ్మజ్ఞానులే యెఱిగియుందురు గాని అన్యుల కెఱుంగుట దుస్తరము. ప్రణవమే బ్రహ్మమని వేద వేదాంతంబు లుద్ఘోషించుచున్నవి, ప్రణవార్థం బెఱుంగనివాడు సకల వేదాగమపురాణంబు లెఱిగినవాడైనను దెలియనివాడే యగును. ప్రణవార్థం బెఱుగనివాడు తప్పక భ్రమకు లోనగును. బ్రహ్మసాక్షా త్కారము బొందిన మహానుభావుని కటాక్షమునదప్ప మఱెవరివల్లను ప్రణవార్థంబు జెప్ప శక్యముగాదు. వేదాగమపురాణము లెల్లయు ప్రణ వముయొక్క ఆధారమువల్లనే ప్రకాశించుచున్నయవి. వేదసారము ప్రణవమే యని జెప్పదగియున్నది సర్వసృష్టికి ఆధారంబైనదియు ఆదే యంబైనదియు ప్రణవమే యని యెఱుంగుము. ప్రణవార్థం బెఱింగిన వాడే సుజ్ఞాని, దెలియనివాడే అజ్ఞాని యని జెప్పనగును. సర్వమంత్రం బులకు జీవరూపమైయుండెడు ప్రణవంబును దెలియక జేసెడి జప తప యోగ యాగ ధ్యాన వేదాధ్యయన వేదాంతశాస్త్రశ్రవణ మనన నిధిధ్యాసన సమాధి మున్నగునవి జేయు టెల్లయు నిరర్థకము లని పెద్ద లు వక్కాణింతురు. ఓంకారము సాగరమువంటిది యదియె లవణము గాను యున్నది. ప్రణవమర్మం బెఱింగినవాడే భూతభవిష్యద్వర్తమా నంబు లెఱింగినవాడని జెప్పుదురు. ప్రణవానుసంధానము జేయువానికే

అజ్ఞాన సందేహ విపరీత దేహవాసన లోకవాసన శాస్త్రవాసన మున్న గునవి వీడి దృఢప్రజ్ఞ గలుగును. అష్టాక్షరంబునకును పంచాక్షరంబున కును స్థిరమైన బలిమి నిచ్చునది ఓంకారమే యగును. వృక్షంబులకు నీరు ను స్త్రీలకు పాతివ్రత్యంబును పురుషులకు వివేకంబును యెటువలె ప్రశ స్తనీయములై యుండునో అటువలె సర్వమంత్రంబులకు ప్రణవము ప్రశస్తంబై యొప్పుచుండును. ఎవనికి నేనే బ్రహ్మము, బ్రహ్మమే నేను, జగత్తు బ్రహ్మమనెడి దృఢప్రజ్ఞ గలిగియుండునో అట్టివాఁ డొక్కడే ప్రణవస్వరూపంబు నెఱుంగదగినవాఁడు, వానినే బుద్ధిమంతు డనియు, శ్రేష్ఠుడనియు, పండితుడనియు, సిద్ధు డనియు, భక్తుడనియు, బ్రహ్మజ్ఞాని యనియు నార్యులు ప్రశంసింతురు. ప్రణవభావం బెఱింగినవాడే బ్రహ్మ మం దైక్యమై యుండును. అనుభవైకవేద్యం బగు ప్రణవమును సమర్థ కముగా గురుముఖాంతరంబున దెలిసినవానినే భ్రాంతిరహితు డనియు సద్బ్రాహ్మణుడనియు అట్లెఱుంగనివాడు మాయాబద్ధుండనియు స్వప చుండనియు జెప్పనగును. తిలలయందు నూనెవలెను పాలయందు వెన్న వలెను పరిపూర్ణమైయుండెడు బ్రహ్మమునకు వ్యతిరిక్తుడై యుండువాడు బ్రహ్మహత్య జేసినవా డని పెద్దలవల్ల జెప్పందగును. పరబ్రహ్మంబునం దైక్యంబు నొందలేక నేనను యహంకారబద్ధుండై యుండెడు యపరాధి యగు పురుషుడు విపరీతగుణసహితుడై బ్రహ్మవిరోధియై క్రోధమే రూపంబైన జీవుడు తానై జరామరణంబు లను తరంగంబులలో జిక్కి భవసాగరంబున నణుమాత్రుడై యలయుచు గట్టెక్కుటకు దరిగానక కల్పాంతయుగంబు లెన్నిగడచినను తనకు విముక్తిగానక కర్మవశుడై పుట్టిపుట్టి గిట్టుచు సుఖంబుగానక యేమియు దోచక అంధకారమున మునింగియుండును. అట్టి సమయంబున మాయయను కన్నియ చేజిక్కి మోహబాధములచే కట్టువడి జ్ఞానస్మృతిచెడి మోక్షమార్గంబు గానక తెంపులేక బ్రహ్మప్రళయపర్యంతము సుడిగాలిలో జిక్కువడిన బూరుగ దూదివలె యెటుబోవుటకు దరిగానక నరకప్రాప్తులై యుందురు. ఓ జయదేవా! మూడున్నరమాత్ర యగు ఓంకారముయొక్క అంశము అకార ముజాగ్రదావస్థ అధిదైవము చతుర్ముఖుడు సృష్టి నాదము ఋగ్వేదము మర్త్యలోకము మన స్సని జెప్పంబడును, ఉకారము స్వప్నావస్థ అధిదైవము విష్ణువు స్థితిబిందువు యజుర్వేదము స్వర్గ లోకము బుద్ధి యనియు జెప్పంబడును, మకారము సుషుప్త్యవస్థ

యనియు అధిదైవము రుద్రుడనియు సంహార కళయనియు అహంకారము సామవేదమనియు పాతాళలోకమనియు జెప్పంబడును. అర్ధమాత్రయగునది తురీయమనియు అధిదైవము ఆదిశక్తియనియు జ్ఞానమనియు సాక్షి అధర్వణవేదమనియు మోక్షలోకమనియు చిత్తమనియు జెప్పంబడును. ఇంతియేగాక యీ ఓంకారమే అండాండపిండాండ బ్రహ్మాండంబులనియు సత్త్వరజస్తమోగుణములనియు ఇచ్ఛాశక్తి క్రియాశక్తి జ్ఞానశక్తు లనియు ఇడాపింగళసుషుమ్నానాడు లనియు గంగా యమునా సరస్వతు లనియు మనోవాక్కాయంబులనియు వాణీ లక్ష్మీభవానులనియు ఆదిమధ్యాంతంబులనియు ఆగామిసంచిత ప్రారబ్ధంబులనియు మాతాపితాగురువులనియు అధ్యాత్మిక ఆధిభౌతిక అధిదైవికతాపంబు లనియు చంద్రసూర్యాగ్నులనియు జెప్పుటేగాక మనస్సునందు అను తమోగుణమును నమ యనురజోగుణమును సు అను సాత్త్వికగుణమును యణగియున్నవి. వీటివల్లనే బొంబై యీరుతత్త్వములైన యొక్కొకతత్త్వమునందును త్రయాక్షరాభిమానులగు త్రిమూర్తులు నహితపడి తత్త్వకార్యంబులను సలుపుచుందురు. త్రయాక్షరసంబంధము లేనివస్తువు యేదేశంబునను యేకాలంబునను యుండనేరదని జెప్పంబడును. ఇదిగాక, అకారము స్థూలదేహము, ఉకారము సూక్ష్మదేహము, మకారము కారణదేహము, అర్ధమాత్ర మహాకారణదేహ మనియు జెప్పంబడును, మూడుదేహములకు సాక్షి యగు మహాకారణదేహమే ప్రత్యగాత్మ యనియు ఆనంద మనియు అనాది కారణ మనియు అసి యనియు ఐక్యభావంబానంగునది యనియు నిత్య సత్య వస్తు వనియు నిర్వాణ పద మనియు యోగీశ్వరులు జెప్పుదురు. అట్టి స్వానుభవము గల మహనీయులు తురీయరాణితో గూడి సుఖంపుచుండుటంబట్టి వారినే ఆత్మారాముడనియు తురీయాతీతు డనియు పరమాత్ముం డనియు పరిపూర్ణు డనియు జెప్పందగి యుండును. అర్ధమాత్ర యగు మాయయందు తక్కిన అర్ధమాత్ర గూడి బలపడనందున ఓంకారంబునకు చోటిచ్చినది, నిశ్శబ్దమైన బ్రహ్మమునుండి మొట్టమొదట ఓంకారము జనించెను, తన్మూలంబుగా శ్లోకము వేదాగమపురాణంబు లేర్పడినవి, ఇవెల్ల వాచ్యార్థంబు లనియు ఓంకారమే లక్ష్యార్థ మని మహాత్ములు జెప్పుదురు. వాచాజ్ఞానులు జాగ్రత్స్వప్న సుషుప్తు లను జెప్పుదురు గాని తురీయాను

భవము జెప్ప నేరరు. అకారంబున నరులును ఉకారంబున సురులును మకారంబున అసురులును అర్ధమాత్రయందు జ్ఞానులును జనించి రని వేదంబులు నుడువుచున్నవి. త్రిమూర్తు లగుట దుర్లభము గాదు గాని బ్రహ్మజ్ఞాను లగుట దుస్తరం బని యెరుంగుము. మఱియు నా యోంకారమే సగుణ బ్రహ్మముగాను నిర్గుణబ్రహ్మముగాను యున్నది. ఎట్లనగా, ఓం నమో నారాయణాయ ఓం నమఃశివాయ యను మంత్రరాజంబులకు ప్రథమంబున ఓంకారమే యుచ్చరింపబడుచున్నవి. ఓంకారంబును యుచ్చరించువాడు త్రిమూర్తులను ఆదిశక్తిని పరబ్రహ్మమును యుచ్చరించినవా డగును. నిర్గుణ మర్మ మగు హంస స్సోహం యను అజపామంత్రమే నీవు జపించ దగినది అర్జునా యని కృష్ణభగవానులున్ను, శ్శివోహం బను అద్వైతమంత్రమే నీవు అనుష్ఠించదగినది శ్రీరామా యని వసిష్ఠులున్ను బోధించిన మహావాక్యములకున్ను ఓంకారమే ప్రాముఖ్యంబై యుండగా ప్రణవముయొక్క మహిమను జెప్పుట కెట్టి వారికైనను అసాధ్యంబై యుండును. ఓయి జయదేవా! ఓం యను అక్షరంబున కింకయు నర్థంబు విన గోరితివేని జెప్పెద వినుము. ఓ అదియనియు మ్ బ్రహ్మమే నేననియు నిర్గుణ బ్రహ్మైక్యము నొసంగెడు అద్వైతమై యున్నది. శరీరంబునకు ప్రధానంబుగా శిరస్సెట్లున్నదో అటువలె సర్వంబునకు ప్రణవ మాధారంబుగా యున్నది. ఓయి జయదేవా! ఓంకారమర్మంబు నింకయు విస్తరించి జెప్పవలయునా? ఇంతకన్నను విశేష యుక్తులతో జెప్పుటకు నీకు శక్తియుండెనేని జెప్పి నన్ను జయించుము యని బలికెడు భూసురునికి జయదేవులు ప్రదక్షిణనమస్కారంబులుజేసి మహాత్మా సూర్యునిముందు దివ్వెవలెను చంద్రుని ముందు నక్షత్రంబువలెను అరుంధతిముందు అహల్యవలెను తమ దాసుడ నగు నన్ను సమత్వంబుగా దలంచి తర్కించుట కుద్యమింప న్యాయముగాదు. దేవా ఇదో నే నొనర్చిన విద్య యని తాను రచించి యుండెడు భాగవతంబును మాయాబ్రాహ్మణునిచేత నొసంగి యంగీకరించుము మహాత్మా యని నమస్కరించి భక్తితో నిలుచుండెను. అంత నా బ్రాహ్మణుండు భాగవతంబును కొంత జదివి చూచి జయదేవునికర్ణంబుల బట్టి యీడ్చి యియ్యది పూర్వ మొనర్చిన భాగవతంబుగా నుండ నీవొనర్చితివని యెట్లు జెప్పెదవు, ఓరీ నీవు యీ పట్టణంబున కేతెంచెడు సాధులను యీవిధంబుగా వంచించిగదా పేరొంది యున్నావు

యని కిలకిల నవ్వసాగెను. అపుడు రాజు అయ్యా విప్రోత్తమా! ఈ గ్రంథము భగవదాజ్ఞానుసారము నా సద్గురుస్వాములు రచించినదే గాని ప్రాకృతగ్రంథంబుగాదు యని బలికెను. అందు కా బ్రాహ్మణుండు పక్కున నవ్వి ఓయి, రాజా! నీవును యొక గొప్ప యబద్ధీకుడవే మీ రిద్దరును తోడుదొంగలవలె గాన్పించుచున్నారు. భగవదాజ్ఞ యను విషయము నొకటి కల్పించుకొని పూర్వగ్రంథము గా దని దృఢముగా సాధింప జూచెదరు గాని నా వద్ద మీ సాధన నిరర్థకమే నని జయదేవుల గాంచి, ఏమయ్యా పండితులుగారు యీ గ్రంథము నీవు నూతనముగా రచించినదే గదా మంచిది, నే నొసర్చిన గ్రంథంబున నుండెడు శ్లోకంబులను తప్పులేక జూచుచుండుము, పురాతనభాగవతంబును నేను జెప్పుచూ వచ్చెదను రెండును సమానంబుగా నున్నవా? లేక భేదంబుగా నున్నవా? గ్రహింపుము యని భాగవతంబును జయదేవులచేతి కొసంగి తన దివ్య వాక్యంబులతో జెప్ప నారంభించి తాను జెప్పుచున్న శ్లోకంబులే జయదేవకృతులుగా యుండుటను గాంచి జయదేవు లచ్చెరువంది యేమియు దోచక పుస్తకంబు చేత బట్టుకొని నిశ్చేష్టితుండై నిలుచుండెను. అదెఱింగి యా బ్రాహ్మణుండు ముసిముసి నగవులు నగుచు నవరసాలంకారములై విద్వజ్జనసమ్మతములై మృదుమధురములై సలలితచతురములై నిజవిలాసప్రకాశములై యున్న జయదేవకవి సార్వభౌముని కృతియందలి ప్రశంసనార్హము లైన యంశములకు మెచ్చుకొని స్వస్వరూపదర్శన మాతనికి ప్రసాదింప దలంచి నిరవధికానందమున నోలలాడుచు తన్నెఱుంగక నే తనమాయారూపంబు వొలంగి శంఖచక్రపీతాంబరధారియై స్వస్వరూపంబుతో సభవారెల్లరికిని సేవ సాధించి జయదేవకృతుల గానంబు జేయుచు మైమఱచి నృత్యము జేయుచుండెను. నభంబునుండి సురులు పుష్పవర్షంబు గురిపించిరి, తుంబురు నారదు లం దరుదెంచి వీణ మీటుచు భగవద్గుణాభివర్ణనము జేయుచుండిరి, రంభాదియప్సరస లందు వచ్చి నటనమాడిరి, ఋషులు సిద్ధులచట కేతెంచి సభవారు సహితముగా దేహంబులు మఱచి జయదేవకృతులను గోష్ఠింపుచు నాలుగుజాముల పర్యంతము నృత్యంబులు జేయుచుండిరి. అపుడు మహేశ్వరుడు నుమాసహితుడై సభకు నరుదెంచి తన్ను మఱచి నృత్యము సలుపుచుండెడి గోవిందుని కరంబుల బట్టుకొని, ఓయి జనార్దనా రాక్షసమర్దనా మీ యొక్క-

మాయ మీరే దెలియక దేహంబుమరచి యానందసాగరంబున మునింగి మిమ్ము మీరే స్తవము జేసుకొనుచుండుట న్యాయమా, జయదేవకవిసార్వభౌముని గ్రంథమునందలి సారస్యమనెడి మహామంత్ర శక్తిచేత నీమాయవదలిపోయి తనంతటనే స్వస్వరూపము బయలుపడినది. కాబట్టి నిన్ను జయదేవుడే జయించినాడు యని మున్నూలు ఘోషించిజెప్పి యిక నీ యానందనృత్యమును జాలింపు మని ప్రార్థించెను, అది విని భక్తవత్సలుడు కనువిచ్చిజూచి తననిజస్వరూపము తనకు వచ్చినందు కచ్చెరువంది కృతులు పాడుటను చాలించి జయదేవులను గాఢాలింగనము జేసుకొని, ఓయి భాగవతోత్తమా ! నీవు రచించిన భాగవతంబును నేను మొట్టమొదట జదివి సంతోక మొనరింపవలె నని బ్రాహ్మణుండనై వచ్చి నీకృతులను జదివి నన్ను మరచితి, అరుదైన సేవ నొసగితి, పూర్వమున్న వ్యాసప్రోక్తం బగు భాగవతంబును నియతితో పారాయణంబు జేసిన నెంతిఫలం బుండునో యంతఫలంబు నీ వొనర్చిన భాగవతంబున నొక యధ్యాయంబు పారాయణంబు జేయువారికి గలుగుగాత యని వరంబొసంగి దేవమునిసమేతంబుగా అంతర్ధానం బాయెను.

తొమ్మిదవయధ్యాయము ముగిసెను.

---

# పదియవ అధ్యాయము.

శ్రీ జయదేవులు పాడిన అష్టపదులను గంగలో విడిచి పరీక్షించుట.

వినుండు సిద్ధులారా ! యీ విధంబుగా భగవంతుం డానందసముద్రమున మునిచి అంతర్ధానం బైన పిదప శ్రీ జయదేవులు పూర్వము భగవల్లీలలను అష్టపదులుగా బాడియుండెనుగదా వానియందు రాధపాదంబులు కృష్ణపరమాత్మకు శిరోభూషణంబుగా నున్నట్లు ఛందో లక్షణయుక్తంబుగా నుండుటను గాంచి యందుకు జయదేవులు నెఱిగంది యష్టపదులను బయలిడక సంశయచిత్తుడై పండితులను విచారించి తెలియవలె నని దలంచి కాశీయాత్ర జేయ నుద్యమించగా నదెరింగి పద్మావతియు రాజును రథగజతురగసేనాసమేతంబుగా

ప్రయాణంబు కాగా శ్రీ జయదేవులు రాజునుం గాంచి, నరేంద్రా! మా త్రిస్థళతీర్థయాత్ర కేగునపుడును, మహాత్ముల సందర్శనమునకు జనునపుడును పాదచారియై జనవలెనేగాని వాహనారూఢుండై జనుట యుక్తంబుగాదు, పాదచారియై జనువానికే తత్ఫలంబు సిద్ధించును గాన సర్వంబును త్యజించి యేకాంతంబుగా బోవుటకు యాజ్ఞ యొసంగి తానేగుచుండెను. పద్మావతియు పతివెంట నేతెంచెను. నృపతి మంత్రులం గాంచి మీరు పట్టణంబును జాగరూకతగా పాలింపుచుండుడు, నేను తీర్థయాత్రకేగి వచ్చెద నని మంత్రుల కాజ్ఞాపించి జయదేవులును పద్మావతియు రాజును రాజసతియు వీరు నల్వురును పాదచారులై జనుచుండగా మఱికొందరును వారివెంట బోవుచుండిరి. వీరలు కొన్నిదినంబులకు కాశీపట్టణంబు జేరి అం దొకమఠంబున విడిది జేసికొని గంగాస్నానంబు జేసి విశ్వేశ్వరుని యాలయంబున కేగి యందు పూజావిధు లెల్లయు దీర్చుకొని జయదేవులు తనకుం గల సంశయంబును విశ్వేశ్వరుని కెఱింగించి మఠంబున ప్రవేశించి భోజనకృత్యంబు లెల్లయు దీర్చుకొని యారేయి జయదేవులు పరుండి నిదురించెడుసమయంబున కాశీవిశ్వేశ్వరుండు జయదేవులస్వప్నంబున బ్రాహ్మణరూపంబునం బొడగాంచి, జయదేవా! నా యొక్క లీలావిభూతులం జెప్ప అయిదు యష్టపదులు పాడితివేని నీకుం గల సందియంబు దీర్చెద నని జెప్పి తిరోహితుం డయ్యెను. పిదప జయదేవులు మేల్కని విశ్వేశ్వరునివాక్యంబులకు సంతసించి సూర్యోదయం బగునంతలో శివాష్టకంబు రైను బాడెను, ఇంతలో శంకరుండు పండితునివలె బ్రాహ్మణరూపంబు ధరించి తనపరివారంబు లగు నందీశ్వర, భృంగీశ్వర, గణేశ్వరాది శివగణంబులయందు కొందరిని శిష్యగణంబులుగా జేసికొని సూర్యోదయం బైన వెంటనే జయదేవు లున్న మఠమువాకిట నిలిచి జయఘంట వాయింపుచు సర్వవిద్యానైపుణ్యాసమర్థుండ వగు జయదేవకవిసార్వభౌమా! పరాక్ యని ఘోషించినంతనే జయదేవు లావాక్యంబులు విని మఠములోనుండి బైటవచ్చి అందున్న బండితజనంబుల గాంచి రాత్రి నాకలలో వచ్చిన మహానుభావుం డితడుగానే యుండవచ్చును. యీతనివలననే నాసందియంబు దీరవలెను గాబోలు జూతము యని వారికి యుచితాసనంబులొసంగి గూర్చున్నపిదప, అయ్యా మహాత్ములారా! తా మెవ్వరు యెందుండివచ్చితిరి తమ వృద్యమం జెప్పుటకు సెలవొసంగుం డని సవినయముగా ప్రార్థించెను. అంత

వారిలో నొకడు అయ్యా జయదేవా అదో నున్న జటాధరుడు గూఢారపండితు డని ప్రసిద్ధికెక్కి లోకంబున పండితుల కెట్టి సంశయంబులున్నను నివర్తించగల సర్వజ్ఞమూర్తియై సాక్షాత్పరమేశ్వరుం డని పేర్కొనియున్నవాడు యని జెప్పెను. అంత జయదేవులు ప్రచ్ఛన్నశంకరునకు శిరఃసాష్టాంగదండం బర్పించి నిలుచుండెను. పిదప పండితుడు ఓయి జయదేవా నేను నిన్నుజూడవలె నని చాలాకాలముగా జూచుచుంటిని. ఇపు డాకోరిక యాదృచ్ఛికముగా లభించినందులకు మిక్కిలి సంతసింపుచున్నాను నీవిపు డిందు వచ్చిన కార్య మేమిటో జెప్పు మనెను. అందుకు జయదేవులు స్వామీ నేను కొన్నిదినంబుల క్రిందట విష్ణులీలలను అష్టపదులుగా బాడితిని. వాటియందు కొన్ని తప్పు లుండునని దలంచి యెవ్వరేని పండితులకుజూపి సందియంబు బాపుకొనుట కిందు వచ్చితిని. అందుకు తాము మహేశ్వరులవలె గాన్పించితిరి గాన నాదుసందేహంబు మాన్పుదురని ప్రార్థింపుచున్నాననెను. అంత నా పండితుడు సమ్మతించి వారణాశిలోనున్న పండితుల నెల్ల రావించి సభ జేర్చి జయదేవులు రచించియున్న అష్టపదులను సభలో నుంచి గూఢారపండితుని వెంట వచ్చియుండెడు శిష్యులలో నొక్కని జదువుటకు నియమించి సభవారి యనుజ్ఞబొంది అష్టపదులను చేతికి దీసికొని మొదటితరంగము చదివిచూచి, ఓయి జయదేవా నీకవిత్వము బహురసవంతంబుగా నున్నది, నిన్నుజూడ గురుముఖాంతంబున విద్య నేర్చిన వాడవుగా గన్పట్టలేదు, నీనోటవచ్చినట్టు కవిత్వము జెప్పితివి గాబోలు, భగవద్దూషణ జేయుట యొకకవిత్వ మని సభలోనికి దేవలెవా? నాదుష్కర్మఫల మీదినము యీతరంగంబుల జూచుటకు సమకూరినది యని రోయుచు దూషింపసాగెను. అంత రాజు, అయ్యా యెందు కూరకె తొందరపడెదవు, యీ అష్టపదులలో నుండెడు దోష మేమిటో సుంత విమర్శించుడి జూతమనెను, ఔనయ్యా మీరడుగుట న్యాయమే, యీతరంగములలో దోష మేమని గదా యడుగుచున్నావు, సర్వలోకశరణ్యుండును సమస్తలోకాధారుండును చరాచరలోకంబులెల్లయు తనకుక్షిలో నుంచుకొని రక్షించువాడును అగు కృష్ణమూర్తి వక్షఃస్థలము శ్రీమహాలక్ష్మికి వాసస్థానంబై యుండగా రాధపాదంబులతని యురమున ప్రకాశింపుచున్నవని వ్రాసియుండడము నీకు యుక్తముగా దోచుచున్నదా జెప్పు మని రాజు నడుగగా నంత నృపతి యీ విమ

యము నాకొక్కనికే గాదు లోకంబుననున్న పండితుల కెల్లరకు సమ్మతమే యని జెప్పెను. అందు కా పండితుడు పకపక నవ్వి యెందుకయా నిర్దుష్టంబైన వాక్యంబులు ప్రేలుచున్నావు చాలుచాలు, ఇక నివృథా ప్రశంసమును జాలింపుము యని ధిక్కరించి పలుకగా జయదేవులు ఆహా విశ్వనాథుడు రాత్రి నా స్వప్నంబున సందియంబు బాపెద నని జెప్పి యిపుడు రచ్చలో బెట్టి వేసెనుగదా యికనేమి జేయవచ్చును. నీలకంఠా, గజచర్మాంబరధరా, నన్నిట్లు యీరడి బెట్టుట ధర్మమా దయా సముద్రా యని స్తుతించి సిగ్గుతో నొకమూలగూర్చుండెను. అపుడందున్న పండితుని శిష్యులలో నొకడు జయదేవులవంక దిరిగి యేమయ్యా జయదేవా పూర్వము జగన్నాథమూర్తి నీవు రచించిన భాగవతంబునకు సంతకము జేసినట్లు జెప్పుచున్నారే, యీ భగవంతుడు యిపుడు లేడా శంకరుని ధ్యానింపుచున్నావు యని పరిహాసించెను. ఆ వాక్యంబులు వినినంతనే క్రౌంచరాజు యెందుకయ్యా నృథాగా యిట్లు పరిహాసింపుచున్నావు, నిర్దోషంబైన అష్టపదులకు దోషారోపణ జేసి నోటికివచ్చినట్లు వదరుట న్యాయముగాదు. నీకు సందియంబున్న యో యీ సభానాయకులుగా నెన్నుకొనియున్న గూడార్థపండితుల నడిగి తెలిసికొనరాదా యని జెప్పెను. అందు కందున్న శిష్యులలో నొకడు ఓయి నీవు రాజువను గౌరవబుద్ధితో పండితసభయందుగూడా గర్వపు మాటలాడుచున్నావు, యీ గ్రంథము దోషయుక్తమైనదే యని పండితులచే మెప్పించితినేని నీ వేమిజేసెదవు జెప్పుమనగా రాజు సరి యట్లు మెప్పించితివేని నా రాజ్యంబున సగము రాజ్యము నీ కిచ్చెద నని ప్రతిజ్ఞా పూర్వకముగా నుడివెను. వెంటనే జయదేవులు రాజా యెందుకు తొందరపడెదవు, ఒకవేళ దోషంబున్నను నుండవచ్చును, మన మేమి సర్వజ్ఞులమా, దోషమున్నప్పటికిని పండితులవలన చక్కబెట్టుకొనదము సహజమేగదా! ఇంతమాత్రమున కంత ప్రతిజ్ఞ గావలయునా? వీరందరు సర్వజ్ఞమూర్తులు, వారితో మాటలాడుటకే యర్హులము కాని మనము వాదించుటకెట్లు దగియుందుము యూరకుండు మని జెప్పెను. అందుకు రాజు గురువరా మీ రేల సంశయించెదరు, పూర్వము రెండుమార్లు తమ వాక్యంబుల నంగీకరించిన భగవంతుం డిపుడుమాత్రము లేకపోవునా జూతము, అయ్యా పండితులారా నే జెప్పినమాట దప్పుటలేదు, గ్రంథంబును సభానాయకులచేత యివ్వండి

వారెట్లు జెప్పెదరో అట్లు వొప్పుకొందము యని జటిలునిచేతి కిచ్చి పండితోత్తమా యీ గ్రంథంబు దోషయుక్త మైనదా? లేక నిర్దోషంబైనదా విమర్శించి మా వివాదము దీర్పుం డని మనవి జేసిరి. అంత గూడారపండితులు అష్టపదుల నామూలాగ్రముగా జదివి చూచి దోషం బున్నటుల గ్రహించి యయినను ఇంకయు కొంతమంది పండితుల విచారించి తీర్మానింత మని సభలో నున్న పండితులకు తద్వివరం బంతయు జెప్పి యేమండి పండితులారా శ్రీమన్నారాయణుని దివ్యపాదంబులు వేదశిరోభూషణంబై యున్న వని సమస్తగ్రంథంబులు బలుకుచుండ నీ జయదేవులు రచించిన గ్రంథంబున రాధపాదంబులు కృష్ణమూర్తి యురంబున బ్రకాశింపుచున్న వని రచించి యున్నాడు, ఈ విషయము మీ కెల్లరకు సమ్మతమేనా జెప్పండి యని యడిగెను. అంత సభాసదులు యసహ్యపడి యెంతమూర్ఖుం డైనను యీవిధంబుగా వ్రాయనేర డని జయదేవుని దూషింపసాగిరి. అంత జయదేవుడు మిగుల చింతాక్రాంతుడై పండితోత్తములారా నేను మఱుపుచే నిట్లు వ్రాసితిని గావున దయచేసి మన్నింపుదు రని ప్రార్థించెను. అందుకు పండితులు జయదేవా మఱుపుచే వ్రాసిన వొకగీతము నందు గదా నుండవలయును యిరువదినాలుగు గీతంబులందును యుండ నగునా? మఱచి తల్లిని భార్య యందురా? ఇంతటి మూర్ఖుడ వగు నీవు పూర్వ మొక భాగవతము రచించినదానిని భగవంతుడే సరిచూచినా డని జెప్పుకొనుట జూడగా వోగు వోగును మెచ్చు నన్నట్లు యెవరో కొందరు అవివేకులు నీ కవిత్వమును మెచ్చుకొనిరే గాని విద్వాంసుల కంగీకారమై యుండ దని తిరస్కారంబుగా బలికిరి. అంత సభానాయకులు, అయ్యా పండితోత్తములారా యూరకే కాలయాపన జేయుట వలన ప్రయోజనము లేదు, యీ జయదేవులు సామాన్యు డనుటయు మంచిది కాదు, యెందు కనగా పూర్వ మితని గ్రంథంబులను భగవంతుడే సరిచూచి యంగీకారము జేసినా డని సర్వజనులు యేకవాక్యంబుగా జెప్పుకొను చున్నారు, కావున మనముమాత్ర మాతని గ్రంథంబును సామాన్యం బని త్రోసివేయరాదు. ఇందు కొకపరీక్ష నిరూపించుదము, యెట్లనగా జయదేవులు రచించియున్న విష్ణుపరం బైన అష్టపదులు యిరువదియైదున్ను, శివాష్టకదులు అయిదున్ను గంగాప్రవాహంబున బడవేయుదము యవి ప్రవాహంబు నెదుర్కొని నెను

రీడుచుండగాక గంగాభవాని ప్రసన్నంబై తా నంగీకరించితి నని యొప్పు
కొని నాచేత యొసంగనేని మనమెల్లరము యొప్పుకొందము లేకున్న
గంగయందే బారవైచెద మని తీర్మానించి పండితు లందరు గూడి
గంగాతీరంబున కేగుచుండగా కాశీపురవాసులు యావ ర్తమానం
బంతయు విని అయారె ఇది బహుచోద్యంబుగా నున్నది. ఇదివఱకే
కాశీపట్టణంబున నెందఱో పండితులు వివాదపడి తీర్మానించుకొనిరి
గాని యీవిధంబుగా నెప్పుడు పరీక్షించినవారు లేరు, జయదేవుల
పక్షంబున తనశిష్యు డగు రాజుదప్ప మఱెవ్వరు సహాయంబు గాన్పింప
లేదు, యీ బాపలందరు నొక్కపట్టుగా నీ రాజు రాజ్యంబును అపహ
రించవలె నని దుర్ఘటంబైన యుక్తిపన్ని యున్నారు జూతము జయదే
వులపక్షంబున నైవముగూడా లేకపోవునా, అతను జ్ఞానాది షడ్గుణై
శ్వర్య సంపన్నుడు గావున నతనికే జయం బగు నని ప్రజలు నొకరి
కొకరు జెప్పుకొనుచు గంగాతీరంబునకు బోయిరి. పిదప గూడారపండి
తుడు యష్టపదులు చేతబట్టుకొని ఓ గంగాభవాని యిదో నీయందు వే
యుచున్న గీతంబులు నిర్దోషంబైన వైతే ప్రవాహంబు నెదురీదుచు గాక
నీవు ప్రత్యక్షంబై నంగీకరించితి నని యీపత్రంబుల నా చేత నొసంగి
వలెను యని అష్టపదులు రచించియున్న తాళపత్రంబులను గంగలో
వదలిపెట్టెను. అంత నా పత్రంబులు ప్రవాహంబు నెదుర్కొని అతివే
గంబుగా జనుచుండ గంగ వానినెల్లయు తనకరంబున బట్టుకొని ప్రస
న్నంబై దరిని నిలిచి ప్రచ్ఛన్నశంకరుం డగు గూడారపండితునిం గాంచి,
పండితోత్తమా యీ గీతంబులు నాకు సమ్మతంబైనవే యని నొక్కొ
క్కటి యతనిచేత నియ్యసాగెను. అంత నా పండితుడు గంగను గాంచి
ఓ భవాని నీవు యుక్తాయుక్తంబు లెఱుంగక శివుని జటాధరంబున నివ
సించుదానవు గావున నీ వెట్లు సమ్మతించకపోదువు ఛీ ఛీ మా కెవ్వరికి
సమ్మతించనేర వని నుడివెను. అందు కాభవాని ఔనయ్యా యీ గ్రంథ
మునకు నోషారోపణ జేసినవాడు పుట్టుబ్రహ్మచారి, న్యాయతీర్పు జెప్ప
వచ్చిన నీవు పుట్టుసన్న్యాసివి, యీ గ్రంథమన్ననో యాలంకారికమత
ము, దీనిలోనున్న రసజ్ఞత మీ రెట్లు తెలియగలరు, ఆ కృష్ణమూర్తి
దప్ప మఱెవ్వరును యిందలియర్థంబును దెలియుటకు సర్హులుగా రని
మున్మార్గురుజెప్పగలను యని తాను శివునివిడిచి చాలాకాలమైనందున
మఱికొంతసేపు తన విభునితో సంభాషించవలెనన్న కోరికగల దైనం

దున కాలయాపనజేయుచు గీతగోవిందములు యిరువదియైదున్ను వొక్కొకటిగా తనపతి కరంబును స్పృశింపుచు నొసంగి శివాష్టపదులు యయిదున్ను తనకు కావలె నని చేత నుంచుకొనెను. అంత పండిత వేషంబుతోనున్న వుమాపతి యీగీతంబులు నీకు సమ్మతంబైనను నాకు సమ్మతిలే దని యొక్కొక్క పత్రంబును గంగలో బడునట్లు గగ నంబున కెగర వేయుచుండెను. అప్పుడు శ్రీమహావిష్ణువు లక్ష్మీసహి తంబుగా గరుడవాహనారూఢుండై నభంబున నిలిచి యాపత్రంబు లను గంగలోబడనియక పట్టుకొనుచు జయదేవకృతంబైన యీగీతం బులు నాకు సమ్మతంబైనవే యని మేఘగంభీరమృదుమధుర భాష ణంబులతో జెప్పి యీనామర్మము నాభక్తుడు జయదేవకవిసార్వ భౌమునికిదప్ప మత్తెవ్వరికి దెలియ సాధ్యముగా దనెను. అంత నందున్న ప్రచ్ఛన్నరూపు లగు శంకరుడు భూతగణంబులు వారివారి నిజరూపం బులంబొంది ప్రజలెల్లరకు సేవ యొసంగిరి. జయదేవుడు భగవత్సేవా విశేషంబువలన ఆనందం బుప్పొంగి భగవంతుని మహిమాభివర్ణనంబు బాగడ నారంభించెను. ఎట్లనగా, అంతము లేని సంసారసాగరంబున నుండి యావలిగట్టు జేర్చువాడవు, ఉపదేశపరంపరలవల్ల నెఱుగ దగిన వాడవు, అనంత శక్తియుక్తుడవు, దేశ కాల వస్తువుల వలన నెఱుగ దగని వాడవు, నిశ్చయ భక్తి సాధించువారికి ఫలప్రదాతవు, బ్రహ్మాది యాత్మ కోట్లకు మేలైన వాడవు, నిరతిశయానంద స్వరూపుడవు, బ్రహ్మాదుల వలె కాలవశుడవు గాక సర్వశక్తి యుక్తుండవై నిత్యుడవై జ్యోతి స్వరూపుడవై ప్రకాశింపుచుండెడు దివ్యమంగళవిగ్రహుండవు, ప్రధా నంబునకు మొదటిభూమి యైనవాడవు, వేదవిదితంబులను పాలించు వాడవు, ప్రధానంబును జీవుడును ప్రళయకాలంబున లయించెడు స్థానం బును నీవై యున్నావు, కారణత్వ శేషత్వాది యుక్తుండవును ఆకాశాది విభుద్రవ్యంబులలో నిండియుండువాడవు నగు ఓ విష్ణుదేవా ప్రపంచం బునకు కారణంబగు విరాట్పురుషుండును వానికి కారణ మగు యహం కారంబును దానికి కారణ మగు మహత్తత్త్వంబును తత్కారణ మగు ప్రకృతియునై పై తత్వంబులకు ముఖ్యకారణ మగు కార్యకారణ రూపముగా బద్ధపడియుండెడు స్వభావంబు లనంతంబులు గాన జ్ఞానా నందైశ్వర్య శక్తిరూప సుశీల వాత్సల్య శౌర్య ధైర్యాది సకలకల్యాణ గుణంబుల కునికి స్థానంబై క్రియాస్వరూపంబువల్లను కర్తృత్వంబు

వల్లను చేతనాచేతనంబుల నన్నింటిని రక్షించుచున్నావు, వేదముల కధిపతియు వేదవేద్యుండును వేదాంతస్వరూపుండవు నీవేగాని వేఱుగాదు, ఓ మహానుభావా ఇటువంటి అప్రాకృతస్వరూపుడ వగు నీవు భక్తపాలనార్థము అంబరవీథిలో నారాయణస్వరూపంబుగా ప్రకాశించుచున్నావు, నిను గాంచి భజించి శరణాగతుండ నైన నాయొక్క సత్క్రియాయోగంబునకు శత్రు లగు రాగద్వేషాది దుర్గుణంబుల నుపశాంతి జేయుము కృష్ణా యని ప్రార్థించి శంకరుని యందున్న నారదాది మునీశ్వరుల నందరిని కొనియాడి ఆనందావేశుండై తన్ను మఱచి నిలుచుండెను. అపుడు భగవంతుడు తనచేత నున్న అష్టపదులను జయదేవులచేత నొసంగి, ఓయి జయదేవకవిసార్వభౌమా నాయొక్కమర్మము నీవొక్కడవే యెఱుంగుదువు గాని అన్యు లెఱుగుట దుస్తరము. భక్తాగ్రగణ్యుడ వగు నీవు పున్నదే రచించితివి, నీవు రచించిన అష్టపదులను శ్రద్ధతో పఠించువారి హృదయంబున నే నెల్లప్పుడు నివసించి యుందు నని జెప్పి యంతర్ధానం బాయెను. ఉమాపతి ఓయి జయదేవా నీవొనర్చిన శివాష్టకంబు లైదును నిన్నును శ్రద్ధతో పఠించువారికి అష్టయిశ్వర్యంబు లొసంగెదను యిది సత్యము యని తిరోహితుం డయ్యెను. మునీశ్వరు లెల్లరు జయదేవులం గాంచి మహాత్మా నిన్ను శ్రద్ధతో దలంచువారికి సర్వత్ర విజయమే గలుగు గాత యని వారివారి స్వస్థానంబుల కేగిరి. అంత వారణాశియం దుండెడు పండితు లెల్లరును జయదేవులను భగవదంశం బని నిశ్చయించి సకలోపచారంబులతో బూజించి కొనియాడు చుండిరి. జయదేవులు హరిహరాదుల సందర్శించిన పరవశత్వమువలన నిర్మలాంతఃకరణుండై వచనగమనాది రహితుడై యానందసాగరంబున మునింగి దిగ్దేశాదు లేవియు దోచక యున్మత్తునివలెను బాలునిమాడ్కి యరణ్యంబని నగరంబని భేదంబు లేక దిరుగుచు కొన్ని వేళల జనులకు విష్ణుస్వరూపంబుగా గాన్పించుచు నియతస్థానరహితుడై దిరుగుచుండెను. అపుడు పద్మావతి రాజునుంగాంచి, అయ్యా నృపాలా స్వాములు దేహస్మృతి జెడి దృఢాపరోక్షసాక్షాత్కారం బగు నరిష్ఠస్థితిని బొందెనుగాన యిక మనతో మాటలాడుట దుస్తరమే యగును, కావున నీవు నీరాజ్యంబున కేగి నీతితో రాజ్యపాలనం బొనర్చుము, నేను స్వాములవెంటనుండి శుశ్రూష లొనర్చు చుండెద నని మందలించగా రాజు విని దురంతచింతాక్రాంతుండై పద్మావతిపాదం

బులకు బ్రఁణమిల్లి తల్లీ వమనాన్నంబు మిక్కిలి రుచి గల పదార్థం బైనను ఆశించువాడుండునా తద్వత్తుగా తుచ్ఛంబగు రాజభోగంబులను అనిత్యంబని దెలిసి త్యజించిన పిదప కలనైన దలప నగునా? గృహదార పుత్త్రధనాదులు సత్యం బని యుండువానికి యుగాంతంబులయందైనను విముక్తి గలుగ నేరదు గదా, సత్యం బగు మోక్షంబును గోరి తమ్ము నాశ్రయించి యున్న దాసుడ నగు నన్ను తిరస్కరించుట ధర్మమా మోక్షాసక్తు లగువారు విషయభోగంబుల గోరరు సద్గురుసేవయందే కాలము గడుపుచుందురు, గురునాజ్ఞ మీఱక మనోవికారంబులం దగులక వైరాగ్యంబును సంతతం బనుష్ఠింపుచుందురు. ఆవిధంబుగా నేనును సంసారవ్యాపారంబు లతిహేయంబుగా దలంచి గురుసేవా తత్పరుండనై యున్న దాసునియెడ ననుగ్రహించుదు రని ప్రార్థింపుచు పద్మావతి పాదంబులకు నమస్కరించి జయదేవులకు ప్రదక్షిణనమస్కారంబులు జేసి పాదంబుల బట్టుకొని కో యని నేడ్వసాగెను. అంత జయదేవులకు రాజాయం దున్న వాత్సల్యంబువలన అతిమోదంబుతో నృపతిని చుంచుదువ్వి వెరువకు మని స్థైర్యోక్తులు గఱపి రాజా నీ కోరిక యెద్దియో నెఱింగింపు మని దయతో సెలవొసంగెను.

పదవయధ్యాయము ముగిసెను.

---

# పదునొకండవ అధ్యాయము.

## క్రౌంచరాజుకు జయదేవులు బ్రహ్మోపదేశంబు జేయుట.

అనంతరము రాజు జయదేవునిం గాంచి ఓం నమో సద్గురు పరాత్పరా సర్వవ్యాపకా నిర్వికారా ఆనందము నొసంగు యార్యోత్తమా తమ దాసుడనగు నన్ను రక్షించుటకు దేవరవారి కరుణ కన్యం బేదియు గాన్పింప లేదు, దాసునికి వలయునది బ్రహ్మజ్ఞానమే కావున ననుగ్రహించి కృతార్థునిం జేయుము దీనబంధూ దినేదినే నా యాయుష్యము యమునిపా లగు చున్నది యెప్పుడో యేవేళనో ప్రాణము బోవునది నిశ్చయము లేక నీటిపై బుడమునలె అశాశ్వతమై యున్నది. ఇటువంటి అనిత్యశరీరమును నమ్మి దారా పుత్రాది వాంఛలం దవిలి మితిలేని

గర్భవాసంబులం బుట్టి పుట్టి జచ్చుచు సుడిగాలిలోఁ జిక్కుపడిన బూరగదూదివలె పడరాని యిడుములం బడితిని బాధ మను త్రాళ్లచే కట్టుపడి సుఖ మిసుమంతైనను గానక యనుభవించున దెల్లయు దుఃఖమయముగా నున్నవి, భూమికి భారంబుగా మృగసమానుడనై తిని, మృగమైనను కొంతప్రయోజనకారియై యుండును నే నంత మాత్రమును లేని శవస మానుడనై తిని నిజజ్ఞాన మెఱుగ దగిన మానవుడనై పుట్టి యఖండానందము నొసంగెడు తమపాదారవిందంబులకు శరణాగతుడనై యుండియు భవంబును దీర్చు శివంబునగలియు మార్గం బెరుగక నైతిని, ఇక నేజన్మంబున నాకొక్క నిజస్వరూపంబును దెలిసి జరామరణంబుల దొలగించుకొందును. గురువరా! శిశువులకు తల్లియు వృక్షంబులకు నీరును భక్తులకు దైవము జీవుల కాహారము ప్రజలకు రాజు దరిద్రునకు ద్రవ్యంబును పగలునకు సూర్యుడు రేయికి చంద్రుడు ధర్మమునకు శాంతము వీరులకు ధైర్యము రాజునకు రాణువయు శక్తికి భక్తియు భక్తికి శక్తియు తపస్సుకు వైరాగ్యము దృఢంబునకు శ్రవణము జన్మపావనంబునకు నిరాశయు స్త్రీలకు పాతివ్రత్యంబును పురుషులకు విద్యయు విద్యకు జీవకారుణ్యము మంత్రులకు యుక్తియు వ్యాపారులకు ద్రవ్యంబును లోకంబునకు వర్షంబును యెటువలె తోడై యున్నవో అటువలె తమదాసుడ నగునాకు దేవరవారే తోడని నమ్మియున్న వాడను. నే ననేకశాస్త్రంబులుజదివియు నిష్టదైవంబును బూజించియు పెద్దల నాశ్రయించియు పరీయుపివలె యనుష్ఠించియు నొక్క నిమిషంబైనను చిత్తచలనం బుడిగి నిశ్చలుడనై యుండి నే నెరుగను గావున బ్రహ్మాకృతితోఁ జెలంగుచున్న తాము నన్ను యానందసముద్రంబున రమించునట్లనుగ్రహింపుము. దేవా! యని కన్నీరు వెట్టుచు దీనత్వంబుగా నిలుచుండెను. అంత జయదేవులు రాజునుం గాంచి వీ డతితీవ్రపరిపక్వుం డని గ్రహించి, ఓయిరాజా పంచదార యని మాటమాత్రము జెప్పుటవలన మధురము దెలియనేరదు, అన్నమహిమ వర్ణించుటవలన క్షుత్తు జల్లార నేరదుగదా తద్విధంబుగా వాచాజ్ఞానము బలుకుచున్న వారికి నానందజనకముగాదు. మోక్షాపేక్షగల ముముక్షువునకు వైరాగ్యములేని జ్ఞానము నిరర్థకమని యెఱుంగుము. అయినను వైరాగ్యంబు లనేకవిధంబులుగా నున్నవి జెప్పెద విను మని జెప్పఁదొడంగెను. ఎట్లనగా, శాస్త్రంబులు జదువునప్పుడు వినునప్పుడు భగవద్ధ్యానంబు

జేయుచుండవలె ననియు పుణ్యకార్యంబులే జేయవలెననియు జెప్పు కొనుచు మరల వారి స్వకృత్యంబులే జేయుచుండుట పురాణవైరాగ్యము, స్త్రీలు ప్రసూతిసమయంబున పురుషసంయోగ మిక నెన్నటికి జేయరా దని దలంచి పిదప వారి కిష్టము వచ్చినట్లుండుట ప్రసూతివైరాగ్యము, సంసారంబున కలహము సంభవించినప్పుడు యిక సంసారంబున నుండరా దని యన్యదేశంబులకు వెళ్ళుట చలనవైరాగ్యము, ఇష్టమైన పదార్థంబుల భుజింపుచు భోగభాగ్యంబులలో మునింగి సోమరితనములేక తన కెదు రెవ రని యహంకారసహితుడై దిరుగుచుండుట అసురవైరాగ్యము, విష్ణుకే పరత్వము శివునికే పరత్వము యని యనేక దేవదూషణంబుల జేయుట మతవైరాగ్యము, కారణాచార్యులనువదలి కార్యగురువుల జేరి మంత్రభ్రమలలో జిక్కువడియుండుట అజ్ఞానవైరాగ్యము, ఎల్లప్పుడు శరీరము నశింపక యుండవలె నని కాయకల్పంబుల భుజించుట హారవైరాగ్యము, సద్గురుసాన్నిధ్యంబున జ్ఞానశాస్త్రవిచారణ జేసి చిజ్జడభేదంబు దెలియంగక దారాపుత్త్రాదుల వదలి దేశంబుల ద్రిమ్మరుచు వ్యర్థముగా కాలము గడుపుచుండుట అఫలవైరాగ్యము, ఇట్టి అజ్ఞానవైరాగ్యంబులవల్ల యుగాంతంబులయుం డైనను నిజానందము ననుభవింపనేరరు. ఎట్లనగా, నే నను అహంకార సంబంధమగు విషయాదులు మమతను బుట్టించునే గాని నిత్యసుఖంబును నొసంగజాలవు, జ్ఞానవంతుండగువాడు సర్వజనసమ్మతంబగు జ్ఞానమార్గంబునే బోధింపవలయును, ఎట్లంటివేని శూరుడగువాడు రణరంగమున తన్నెదిరించువానితో పోరి జయమందునట్లును న్యాయాధిపతి దరిద్రుడైనను ధనికుడైనను శత్రుడైనను పక్షపాతములేక తీర్పు జెప్పునట్లును, జ్ఞానిపక్షపాతములేక జెప్పవలెను. మూర్ఖునివలె శైవమే శ్రేష్ఠమని వైష్ణవమే శ్రేష్ఠమని జెప్పరాదు. ఎట్లనగా, జన్మరాహిత్యమును గోరువాడు జాగ్రత్త స్వప్నము సుషుప్తి తుర్యము తుర్యాతీతము యను పంచఅవస్థలను గురుసాన్నిధ్యంబున శ్రుతియుక్తి యనుభవపూర్వకంబుగా విచారించి దెలియునంతవరకు జ్ఞానమార్గంబు దెలియనేరడు. జ్ఞానహీనునకు భక్తి, మహిమ, వైరాగ్యము, ధ్యానము, మానము, మున్నగునవి నిరర్థకంబులే నని యెరుంగుము. మోక్షాధికారి యగువానికి వైరాగ్యబోధోపరతు లత్యావశ్యంబులు. పిపీలికము మొదలు బ్రహ్మపర్యంతము ఆత్మస్వరూపమేయని దెలియుట పూర్ణ

వైరాగ్యము. ఎండమావులు నీరనుని భ్రమించునటువలె సర్వాత్మస్వరూపంబైన పరమాత్మయందు జగద్భ్రాంతి మిథ్యయని దెలిసి స్రక్చందన వనితాదిభోగంబులయందు వమనాన్నమలమూత్రాదులయందువలె ఆశలేనివాడై మనోసంకల్పములెల్ల రూపుమాపుచు కామక్రోధాదులను తలయెత్తనియ్యక మండూకంబును మ్రింగు సర్పంబుమాడ్కి సంసారవ్యాపారంబులను త్యజించి ఆనందసముద్రమున నింద్రియకరణాదుల ఝొక్కింపజేసి సర్వదా సజ్జనసంగంబున గూడి తానే బ్రహ్మమని మననము జేయుచు శరీరభావంబును రోయుచు పామరత్వమును పాడుజేసి అంతర్ముఖంబున బ్రహ్మమందు గలసి అఖండానందసాక్షియై యుండుట సద్భావవైరాగ్యము, కర్మంబులెల్ల గుణంబులవల్లనే ప్రవర్తింపుచున్నవనియు నేను గుణాతీతుండనియు కర్మము భక్తి యోగములవలన నించుకైన ప్రయోజనము లేదనియు నిశ్చయచిత్తుడై నిర్హేతుకముగా మాటలాడకుండుట వాఙ్మౌనము యేదియు దలంపకుండుట అత్మమానము సంకల్ప వికల్పములులేక నిర్వికల్పుడై యుండుట కాష్ఠమౌనము జెంది సమాధినిష్ఠాపరుడై యుండుట అభావవైరాగ్యము జగంబెల్లయు స్వప్నద్రవ్యముగా దలంచి ద్వైతభావంబు జెడి తానే తానై యదృచ్ఛాలాభసంతుష్టుడై ప్రపంచవ్యవహారంబులు వీడి పారమార్థిక వ్యవహారంబులే జేయుచుండుట స్థాపనవైరాగ్యము, సుఖదుఃఖమయమగు శరీరము ప్రారబ్ధాధీనం బనియు ప్రారబ్ధమే సుఖదుఃఖములకు కారణమనియు దేహమందు ప్రియముమాని విధినిషేధాతీతుడై సుఖదుఃఖములు గలిగినపుడు సమానముగా జూచుచు తుర్యదృష్టియందుండుట దృఢవైరాగ్యము, ప్రారబ్ధం బను పీఠంబుపై గూర్చుండి అజ్ఞానయావరణవిక్షేపాదులనుధ్వంసము జేసి మృత్యుభయంబును దలపక బాలునివలెను పిశాచంబుమాడ్కి ఉన్మత్తునిచందంబున నిర్ద్వంద్వుడై యుండుట విశ్రమవైరాగ్యము, ఆలస్యము నిద్ర నిందాస్తుతులను వీడి దేహస్మృతిచెడి అఖండశ్రవణమననాదులవల్ల పరిపూర్ణుడై మౌనియై యుండుట సమ్మతవైరాగ్యము, తనకు యేవ్యాకులంబులును లేక బ్రహ్మము నిర్వచనుడు నిర్బంధుడు నిశ్చింతుడు అట్టి బ్రహ్మమే నేనని యైక్యభావంబున నిలిచి నాకు యేవికారములు లేవని స్వయంబువై కల్పిత నామరూపములను మఱచి నిర్వాతస్థలదీపంబునవలెను నిస్తరంగసముద్రంబుమాడ్కి యుండుట నిర్వాణవైరాగ్యము యని యింక ననేక

వైరాగ్యంబులు శాస్త్రంబులయం దుద్ఘోషింపుచున్నవైనను యింత టితో విరమించుకొన్నాఁడను. ఓయి సుశీలుఁడా! పై జెప్పిన జ్ఞాన వైరాగ్యంబు లెల్లయు అతులితం బగు భాగ్యంబును వస్తులాభంబును శ్లాఘ్యంబును నొసంగదగినవి గావున యోగ్యులకే జెప్పదగియుండును. ఇదిగాక, మహావాక్యానుసంధానము పై జెప్పిన జ్ఞానవైరాగ్యంబులు గలవానికిదప్ప ఉద్దండము విడంబము కల్పితము మున్నగు వైరాగ్యం బులవలన తన్మయత్వము సిద్ధించనేరదు, మనోవాక్కాయములకు దృ శ్యంబై యుండెడు జగమంతయు కల్పితమే యని యెఱుంగుము, మనో వాగాతీతంబై వేదాతీతమై త్రిమూర్తులు దేవతలు తక్కంగలవారెల్లరు యెవనిసిస్మరించి మానభావమొందెదరో యదియే సత్యజ్ఞానానందనిత్య నిర్మలమైయుండు పరబ్రహ్మము, స్వప్రకాశ మనియు యిందైక్యమైన వారికే ఆనందమనియు ఆనందమే మోక్షమనియు జెప్పంబడును, చంద్ర కిరణములను భుజించెడు చకోరపక్షివలె జ్ఞానరసం బగు బ్రహ్మానంద మనుభవించి తుర్యభూమియందు నివసింపుచు నే ననునది నశించి దేహా దులు కృశించి బ్రహ్మమం దైక్యమై యాయాసంబుదీరి చకోరపక్షుల కాహారం బగు చంద్రకిరణసమానం బగు శీతలంబున తనలో తానే స్నానంబు జేసి దేహేంద్రియాంతఃకరణంబులకు శీతసమృద్ధి గావించి చంద్రబింబసమానుఁడవై యెల్లప్పుడు పరిపూర్ణస్వరూపముతో ప్రపం చాభిముఖుండవు గాక యతిగుప్తుఁడవై యుండుము పుత్రా యని జయ దేవు లుపన్యసించిన పిదప నరేంద్రుఁ డార్యులపాదంబులకు నమస్క రించి గురువరా తామిపు డుపదేశించినదంతయు దాసునిమనంబున కీర కాయపీచువలె చిక్కులుగా దోచుచున్నయది. అతిగుప్తంబగు పరమా ర్థంబు నే నెరుగజాలకున్నాను గావున మఱేదేని యొకసూక్ష్మమార్గం బుపదేశింపుఁడు రని ప్రార్థించుచున్నా ననెను. అంత జయదేవులు ఓయి భూపతీ పైవివరించిన బోధయెల్లయు యతిసూక్ష్మగ్రాహులకే లభ్య మగును గావున నీకు మఱొకవిధంబుగా నుపదేశించెద నాకర్ణింపుము. ఎట్లంటివేని, ప్రథమంబున మోక్షం బపేక్షించువాడు త్రిమూర్త్యాదుల లో నేదేని యొకమూర్తి నుపాసింపవలెను, తదుపరి నిర్గుణోపాసన జేయవలయును, తదుపాసనాబలంబువలన సమస్త ఆగామికర్మంబులు స్తుతిపదాస్పదంబులవలన నశించి అనిత్యమగు సంసారము దుఃఖ మగా దోచుటగాక మోక్షాసక్తుఁడై గురుసాన్నిధ్యమున జేరి చతుర్వ

శుశ్రూష లొనర్చుచుండెనేని గాలిచే జెదరిన మేఘమువలె సంచిత కర్మంబెల్లయు ధ్వంసం బగుటకు సందియంబు లేదు, పిదప ఆస్యులుప దేశించెడు మహావాక్యంబు నేకాంతంబున జేరి తైలధారవలె అవిచ్ఛిన్నంబుగా ధ్యానింపుచు చలనరహితుడై నిర్వాతస్థలదీపంబువలె చిత్తైకాగ్రముగలిగి గురుసన్నిధానంబున దేహేంద్రియ మనఃప్రాణాదికర్త యగు జీవునిన్ని జీవాధారం బగు శుద్ధశూన్యమైన అజ్ఞానంబును జాగ్రదవస్థయందు సర్వేంద్రియచేష్టలున్ను స్వప్నావస్థయందు మానసాదికార్యంబులును సుషుప్త్యవస్థయందు శూన్యమును జూచుచుండెడు సాక్షియగు తాను చరాచరంబులందు సర్వసాక్షియైయుండెడు బ్రహ్మంబును అద్వైతంబుగా జూపెడు మహావాక్యశ్రవణము జేయవలెను. అట్లొనర్చినపిదప సూర్యునిగన్న యంధకారమువలె అజ్ఞానము నివృత్తి యగును, అనంతరము దేహమనిత్యము, తాను నిత్యము, ఇంద్రియాగలు దుఃఖమయుంబనియు తాను ఆనందమయుడనియు అంతఃకరణము చలనస్వభావమనియు తాను అచలస్వరూపుడనియు వాయువు దేహాధారమనియు తాను సర్వాధారు డనియు జీవుడు నేనను భావము గలవాడును తాను నేనను భావనిరసనుండును అజ్ఞానము శుద్ధశూన్యమనియు తాను పరిపూర్ణు డనియును మండూకకంఠంబువలెను శిశుకపాలమువలెను తెంపులేక సంతతమననము సలుపుచుండవలెను. ఇందుచే న్యాయతీరైన పిదప వాది తృప్తిజెందునట్లు సందేహములన్నియు నశించి దేహాదులు నేనుగాదు గావున నాకు ధర్మాధర్మబంధమోక్షజరామరణంబులు త్రికాలంబులందును లేవనియు స్వల్పనదులు జేరి పెనుప్రవాహమైనట్లు సకలసాక్షులు జేరి సర్వసాక్షియైనది బ్రహ్మమనియు అట్టి బ్రహ్మమే సాక్షిస్వరూపమగు నేననియు అయస్కాంతసూచికలచందంబుగా దేహేంద్రియాదిప్రపంచం బెల్లయు నా సన్నిధానంబున చలింపుచున్నదనియు యెప్పుడు నశించనిదగు బ్రహ్మమే నేనని యెడతెగక నిదిధ్యాసనము జేయుచుండవలెను. ఇట్లు జేయుటవలన త్రాడు పామని భయమందియున్న పురుషునికి దీపంబు వెలిగించినపిదప సర్పభ్రాంతిపోయి త్రాడని యెఱింగినయట్లు దేహము తానని బంధమోక్షంబు లున్నవని దలచుచుండిన విపరీతభావము నశించి ఆత్మస్వరూపం బెఱుంగును. అనంతరము దేహాభిమానము వదలి పురంబుననున్నను యరణ్యంబున నున్నను ప్రారబ్ధాధీనం బీదేహంబునకు గలి

గెడు సుఖదుఃఖంబులెల్లయు నని రానివస్తువులకోరక రానున్నవస్తువులవద్దనక యాశారహితుడై యదృచ్ఛాలాభసంతుష్టుడై యుండుటే గాక సమస్తకోరికలను పుట్టనుండి వెడలెడు ఇసుళ్లను బట్టితిను పక్షి చందంబుగా మనస్సుననుండి జనించెడు కోరికలనెల్ల రూపుమాపు చుండవలెను, అటువలె నిగ్రహించి నిస్తరంగసముద్రంబువలె కూటస్థ బ్రహ్మమాత్రుడై యుండుటే సమాధి యని జెప్పంబడును. ఇటువంటి మితిలేని సుఖానందసాగరంబున మునింగి తన్నుమఱచి దిగ్దేశాదులు దోచక సర్వత్ర పరిపూర్ణమై నిండి శుద్ధాశుద్ధంబులను జూడక భుజించుట మాటలాడుట స్వప్నంబున గన్నట్లుగా గ్రహించి పిశాచము బట్టినవానివలెను యున్మత్తుఁ మూఢ్కు బాలునిచందంబుగను ద్రిమ్మరియై నియతస్థానరహితుడై హరిహరాదులు ప్రత్యక్షంబైనను మాయామయం బనిదలంచి యానందాతిశయుండై బ్రహ్మమాత్రుడై యుండుట సాక్షాత్కారమని జెప్పంబడును. ఇట్టి యనుభవమే సాలోక్యసారూప్య సామీప్యసాయుజ్యంబు లను నాల్గుపదవుల కతీతంబైన అయిదవపదవి యని జెప్పంబడును. ఓయినరపతీ! బ్రహ్మమే ఇష్టదైవ మనియు దైవమే గురుడనియు గురుసేవజేయుటే సర్వసత్క్రియలనియు వేదాంతశ్రవణమే మోక్షమార్గమనియు మోక్షాపేక్షయే తపోబలమనియు తపోబలమే మననమనియు మననమే నిధిధ్యాసనమనియు నిష్ఠయే సాక్షాత్కారమనియు సాక్షాత్కారమే బ్రహ్మమనియు బ్రహ్మమే ఆనందమనియు ఆనందమే ముక్తియనియు దృఢముగా నెఱుంగవలెను యని జెప్పి ఇంకయు జెప్పుచున్నాడు, భూపతీ! పరమాచార్యునియందును ఇష్టదైవమునందును శ్రవణార్థమునందును శ్రద్ధ పూర్ణముగా నుండవలయును, పరమాచార్యునియందున్నశ్రద్ధ పరజ్ఞానంబు నొసంగను, ఇష్టదైవమునందుండెడు శ్రద్ధ పాపహరంబు జేయును, శ్రవణార్థశ్రద్ధ లేనివానికి జ్ఞానము లభించదు. ఎట్లంటివేని మాచకమ్మ యగు వనితకు పురుషసంయోగి మున్నను పిండోత్పత్తికి హేతువు గానట్లు శ్రద్ధలేనివానికి జ్ఞానార్థంబులు మనస్సున తరింపవు, శ్రద్ధయే ఋతువు ఆచార్యోపదేశమే బింద్వు ఆనందజనకమే పుత్రజనకం బని జెప్పందగును, గురుకృపలేకున్నను జ్ఞానము లభించదు. పై జెప్పిన శ్రవణ మనన నిదిధ్యాసంబులు సలిపినవాని కొక్కనికే బ్రహ్మానంద ముదయించును, ఎపుడు ఆర్యుల పరిపూర్ణానుగ్రహంబు గలుగునో యపుడే జ్ఞానోదయం

బగును, అట్టి సంపూర్ణజ్ఞానప్రకాశంబువల్ల తన్నుమఱచెడు స్థితి గలుగ వలయును. పుత్త్రా! బ్రహ్మోపదేశము సకలబాధములఁద్రెంచివేయును, సజ్జనసాంగత్య మెంత మేలైనదో జూడుము, దేహము జడప్రాయము, నీవన్నచో నిత్యసుఖజ్ఞానచేతనము, దేహము ఖండరూపనామము, నీవు అఖండరూపనిర్నామము, దేహము వికారిఫలదుఃఖము, నీవు నిర్వికార నిర్మలానందము, ముక్తుఁడవైన నీకెందుకీ దేహాభిమానము నీయొక్క రూపమెప్పటికొక్కటే నిదానము నిన్నెవరుజేయుదు రింత సమాధానము నీరూపు మెట్టివారలకు జెప్పుట కరుదైన మౌనము ఇదియే వేదసారం బగు యథార్థజ్ఞానము మౌనమును ధరించియుండుటె బ్రహ్మధ్యానము తనదు స్వతంత్రంబును వీడియుండుటే ఆర్యుల కొసంగెడు దానము నేననునది విడచినవారికి గలగా హీనము నేననునది లేని వారుగదా త్రిమూర్తులకు సమానము దేహప్రాణ జీవుల ప్రకాశింప జేయునది ఆత్మస్వరూపమే గావున దేహాదులు నేగానని యుండుము. ప్రారబ్ధాధీనం బగు దేహంబునం దభిమానము తుచ్ఛమే నాకు వదలి వేయుము నీలో నిన్ను పరిశీలించి జూడుము తనలో తన్ను శోధించు వారికే మితిలేని యానందము దేహంబును పాన్పుపై కదలక పరుండ జేసిన నిద్రానంద మెటుల జనించుచున్నదో యటువలె తురీయశయ్యపై పరుండువానికే అఖండానంద ముదయించును. నిద్ర జీవులను మఱపింపజేయునట్లు తురీయనిద్ర నిన్ను మఱపింప జేయును నీవు త్రికాలములయందును ముక్తుఁడవై యున్నావు గాన ఇక సంశయించితివేని బాధమునకు లోనగుదువు. నీవు మిథ్యవలన బుట్టినవాఁడవని దలంతువేమొ అట్లుగాదు సర్వసాక్షివగు నీవు వీటినన్నింటిని జూచుచుండు వాఁడవు, నీకు ఎప్పుడును త్రిగుణంబులుగాని పంచభూతవికారంబులు గాని లేవు, నీవు పృథివ్యప్తేజోవాయువాకాశాదులయందు నిండియుండెడు బ్రహ్మమే యగుదువు గావున ఇటువంటి ఐక్యవిద్యాధానమువల్ల నేనను జీవభావంబు నశించు నని యనేక వేదాంతరహస్యంబులు జెప్పి శ్రుతిదృష్టం బగపఱచుచున్నాఁడు. ఎటులనఁగా, ఓ భూపతీ! పై జెప్పిన యనుభవమే చతుర్వేదములయందును వసిష్ఠసంహిత సూతసంహిత భగవద్గీత ఆత్మగీత రామగీత ఉత్తరగీత ఋభుగీత గురుగీత పాండవగీత బ్రహ్మగీత శివగీత అష్టవక్రగీతలయందును వ్యాసులు జెప్పియుండెడు పదునెనిమిది పురాణంబులయందును పూ

ర్వానుభవమే ప్రసిద్ధం బని దెలియును. మతభేదంబులవల్ల తప్పు యని జెప్పి రేని రౌరవాదినరకమే ప్రాప్తం బగు నను రాజా మహాలోక దృష్టాంతంబు జూపెద జూడుము యని కాశీ విశ్వేశ్వరుని సన్నిధి కేగి పురజను లెల్లరు పరివేష్టించి యుండగా జయదేవులు ఏకం బ్రహ్మం ద్వైతం నాస్తి యని సత్యము జేసినట్లుగా జయదేవులు బలికెను. అంత కాశీ











విశ్వనాథుడు విశాలాక్షీసమేతంబుగా నాలయంబున నుండి బయులు వెడలి సర్వజనులకు ప్రత్యక్షంబై జయదేవులు జెప్పెడు వాక్యమే

వేదసారం బైన యథార్థవాక్యం బని జెప్పి తిరోహితుం డయ్యెను. అనంతరము శ్రీవైకుంఠవాసుడు లక్ష్మీ సమేతుడై గరుడవాహనారూఢుడై జయదేవులకును యందున్న ప్రజలకును నిజసేవయొసంగి జయదేవులు జెప్పుచున్న వాక్యమే నే జెప్పియుండెడు భగవద్గీతాభిప్రాయ మని ముమ్మారు సత్యవాక్యం బుద్ఘోషించి అంతర్ధానమాయెను అంత నారదాది మునీశ్వరు లెల్ల రచట కేతెంచి జయదేవుల వాక్యమే వ్యాసులు జెప్పి యుండెడు భాగవతాభిప్రాయం బని జెప్పి, జయదేవులపై పుష్పవర్షంబు గురిపించి జయజయశబ్దంబుల ఘోషించి అంతర్ధానం బైరి. పిదప జయదేవులును రాజును పద్మావతియు రాజసతియు వీ రెల్లరు గూడి వారణాశిలో నున్న పండితులవల్ల సెలవు పొంది క్రౌంచదేశంబు జేరి అందు సుఖసమాధినిష్ఠాగరిష్ఠులై విరాజిల్లు చుండిరి. అని నాభాజిసిద్ధులు ఉత్తమసిద్ధులకు జెప్పిన విని మహాత్మా జయదేవులనిర్యాణంబు జెప్పనందులకు కారణం బేమని ఉత్తమసిద్ధులు ప్రశ్నించగా నాభాజిసిద్ధులు జెప్పు టెట్లన, సిద్ధులారా! జయదేవులచరిత్రంబు కబీరుదాసు మున్నగుచరిత్రంబులయందు కొన్నికొన్ని మహిమలు గలసి యుండుటవలన నిర్యాణము జెప్పుట కవకాశము సిద్ధించదాయెను, కావున వెనుక చరిత్రంబులయందు జెప్పెద ననిమందలించగా నుత్తమసిద్ధులు నాభాజీసిద్ధులకు నమస్కరించి దేవా యెంత యాశ్చర్యం బైన కథ జెప్పితిరి, మహాత్మా యీ చరిత్రంబును జదువువారును వినువారును బ్రహ్మానంద మనుభవింపక మానరని దలంచుచున్నాము. అని వారివారి నిజాశ్రమంబులకు వెళ్ళిపోయిరి.

గద్య. ఇది శ్రీ సర్వేశ్వర కరుణాకటాక్షవీక్షణాకలిత గద్య పద్య రచనాలలిత భవబాధవిమోచనోపాయ భక్తజనవిధేయ సుజనానుకూల సముద్భవ గ్రంది సుబ్బరాయతనూభవ ముముక్షుకాని రామలింగస్వామి ప్రణీతం బైన శ్రీ మహాభక్తవిజయమునందు జయదేవుల చరిత్రము సమాప్తము.

శ్రీ లక్ష్మీ నరసింహార్పణమస్తు,

---

అమెరికన్ డైమండు ముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడినది. 1926.

# ప్రకటన.

| | |
|---|---|
| హఠయోగప్రదీపిక | 2-8-0 |
| యోగవిద్య | 0-4-0 |
| శ్రీకృష్ణామృతబోధయను పంద్రెండురాజుల కథలు | 0-12-0 |
| శ్రీసీతారామహృదయంబను పదునారురాజులకథలు | 0-12-0 |
| సచ్చిదానంద బోధామృతమను రాజహంస పరమహంససంవాదము | 0 12 0 |
| వేదాంతసారప్రశ్నోత్తరరత్నావళియను గురుశిష్య సంవాదము | 1-0-0 |
| దృగ్దృశ్యవివేకము | 0-10-0 |
| బ్రహ్మజ్ఞానచింతామణి యను సుగుణాకరమహారాజుకథ | 0-8-0 |
| ఉపనిషత్సార రత్నావళియను శ్రీరామచంద్ర హనుమంత సంవాదము | 0-8-0 |
| పరమాత్మలక్షణబోధిని | 0-8-0 |
| శుకబ్రహ్మకైవల్యము అను శ్రీ శుకమహర్షి చరిత్రము | 0-12-0 |
| వేదాంతరహస్యదర్పణమను జ్ఞానసుందరి వివేకసుందరికిం జెప్పిన నూతనవిచిత్ర పతివ్రతలకథలు | 0-10-0 |
| బ్రహ్మవిద్యారహస్యము | 0-2-0 |
| పాతంజలయోగశాస్త్రము | 1-0-0 |
| పౌరుషపారమ్యమను పురుషార్థదీపిక | 0-2-0 |
| బ్రహ్మజ్ఞానసుధాలహరి | 0-8-0 |
| స్వస్వరూపప్రకాశిక తాత్ప | 0-4-0 |
| బ్రహ్మోపనిషత్తు | 0-1-0 |
| సనారివిశ్వేశ్వరసంవాదము | 1-0-0 |
| పంచదశ ప్రకరణార్థ సార సంగ్రహము | 1-0-0 |
| పరమార్థసారము | 0--2-0 |
| శ్రీమదుత్తరరామాయణము పద్య కావ్యము దళసరికాలికో | 2-0-0 |
| రాజయోగరత్నాకరము తాత్పర్యం దళసరి కాలికో | 2-0-0 |
| భాస్కరరామాయణము, పద్య కావ్యము దళసరి కాలికో | 2-8-0 |
| ఇంగ్లీషు తెలుగు భాషాబోధిని | 0-8-0 |
| షట్చక్రవర్తుల యింద్రజాలపు కథలు | 0-8-0 |
| అనుభవవైద్య శాస్త్రము | |
| 8 భాగములు | 4-0-0 |
| 4 భాగములు | 2-0-0 |
| నాల్గుభాషల ఒక్కబిలేరి | 0-4-0 |
| ఆరుభాషల ఒక్కబిలేరి | 0-4-0 |
| భగవద్గీత నోరి గురులింగశాస్త్రిల టీకాతాత్పర్యం విశ్వరూప పటములతో | 1-8-0 |
| అనుభవఆరోగ్యవైద్యశాస్త్ర | 1-8-0 |

వెస్టువార్డు అండు కో,

చాకలపేట, మదరాసు.